ఈనాడు

విజయవాడ 18-1-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 158 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఈనాడు



విజయవాడ 18-1-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 158
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కన్యాశుల్కం ఖాయం!

- ఆడపిల్లలకు ఎదురు కట్నమిచ్చే రోజు రానుంది
- విధి నిర్వహణలో అత్యున్నత ప్రతిభాశాలులు మహిళలే
- మహిళా సాధికారతే కీలకం
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు శ్రీకారం

ఈనాడు - విశాఖపట్నం

విధి నిర్వహణలో పురుషుల కన్నా మహిళలే అత్యున్నత ప్రతిభా పాటవాలు కనబరుస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళా సాధికారత అత్యంత కీలకమైన విషయమని గుర్తించి రెండు దశాబ్దాల కిందటే స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేశానని, 90 లక్షల మంది సభ్యులుగా చేరి చిన్నచిన్న వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకుంటూ ఆర్థికంగా బలోపేతమయ్యారని గుర్తు చేశారు. కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం కాకుండా సమాజ సేవా కార్యకలాపాలను, ప్రభుత్వానికి అవసరమైన సేవలను సమర్థంగా నిర్వహించారని తెలిపారు. అందుకే తానూ ఆర్థిక సంబంధ వ్యవహారాలన్నింటినీ భార్య, కోడలికే అప్పగించానని తెలిపారు. బుధవారం విశాఖపట్నంలో భారత మహిళా పారిశ్రామిక వేత్తల సమాఖ్య (ఎలీప్), దక్షిణాసియా మహిళాభివృద్ధి ఫోరం (ఎస్.ఎ.డబ్ల్యు.డి.ఎఫ్.) ఆధ్వర్యంలో ప్రారంభమైన అంతర్జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వయం సహాయక బృందాలను స్వయం వ్యాపార బృందాలుగా మార్చడానికి కృషి చేస్తామని తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఆడపిల్లలకు కల్పిస్తున్న రిజర్వేషన్ సౌకర్యాన్ని ఉపయోగించుకుని కొందరు, ప్రతిభను ఉపయోగించుకుని కొందరు కీలక బాధ్యతలు నిర్వర్తించే స్థాయికి ఎదిగారని వెల్లడించారు. అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న మహిళలను రాబోయే రోజుల్లో కట్నం ఎదురిచ్చి పెళ్లి చేసుకునే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. వచ్చే నెలలో విశాఖలోనే భాగస్వామ్య సదస్సు జరుగుతుందని, సుమారు 50 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని, ఆ సదస్సులో మహిళలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. మహిళల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో ఎలీప్ గత 25 సంవత్సరాలుగా విశేషంగా కృషి చేస్తోందని వివరించారు. విశాఖలో ఎలీప్‌కు ఐదెకరాలు ఇప్పటికే ఇచ్చామని, మరో 50 ఎకరాలను ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 21 రోజుల్లో పరిశ్రమలకు అన్ని రకాల అనుమతులు ఆన్‌లైన్లో ఇస్తున్నామని ఆ సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. తర్వాత కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ కార్యదర్శి బినయ్ కుమార్, సార్క్ సెక్రటరీ జనరల్ అంజాద్ హుస్సేన్ ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా విశాఖలోని గిడిజాలలో 'అంతర్జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల వ్యాపార, సాంకేతిక అభివృద్ధి కేంద్రం' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం, ఎలీప్, దక్షిణాసియా మహిళా అభివృద్ధి సంస్థలు ముఖ్యమంత్రి సమక్షంలో త్రైపాక్షిక అవగాహనా ఒప్పందాన్ని (మిగతా 2లో)


సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వేదికపై మంత్రులు, ఎంపీలు, ప్రతినిధులు.

'18 శాఖల పరిధిలో 1900 ఎంవోయూలు కుదుర్చుకున్నాం. వీటిద్వారా రూ.13.47 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 30 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ప్రస్తుతానికి 10 లక్షల మందికి ఉద్యోగాలొచ్చాయి. గత రెండున్నర సంవత్సరాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలద్వారా రూ.11వేల కోట్ల పెట్టుబడులొచ్చాయి. 2.85 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ప్రతి నియోజకవర్గంలోనూ ఒకటి చొప్పున 175 పారిశ్రామిక టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తున్నాం.'

ముందుకొచ్చిన నవయుగ



- పాత ధరలతో స్పిల్ వే, స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులకు సుముఖత
- పోలవరంలో టెండర్ల అవసరం లేకుండా కొలిక్కి తీసుకొచ్చే యత్నాలు
- టెండర్లు వారం పాటు వాయిదా

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో స్పిల్ వే, స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులు, మట్టిపనులు టెండర్లతో సంబంధం లేకుండానే కొత్త ఏజన్సీకి అప్పగించే ప్రయత్నాలు దాదాపు కొలిక్కి వచ్చాయి. విద్యుత్కేంద్ర మట్టి పనులు కూడా అప్పగించనున్నారు. రూ.1,483 కోట్ల విలువైన పనులకు పోలవరం అధికారులు టెండర్లు ఆహ్వానించగా నెలన్నర రోజులుగా ఈ వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. ఇప్పటికీ టెండర్ల ప్రక్రియ కొలిక్కి రాలేదు. కిందటి వారం విజయవాడలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశమై పాత ధరలతో ఈ పనులు చేపట్టేందుకు ఎవరైనా ముందుకు వస్తారేమో పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సూచించింది. వారం పాటు టెండర్ల ప్రక్రియను వాయిదా వేయాలని సూచించింది. ఆ తర్వాత టెండర్లు తెరిస్తే అప్పుడు ఏం చేయాలో ఆలోచిద్దామని పేర్కొంది. ఒక రకంగా పోలవరం అథారిటీ (మిగతా 2లో)

ఒక్క రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత కాదు

- కేంద్రం కూడా అభివృద్ధికి చేయూతనివ్వాలి
- ఆంధ్రప్రదేశ్‌కు సాయంపై చంద్రబాబు
- అరుణ్ జైట్లీతో భేటీ

ప్రపంచం చూపు.. ఏపీ వైపు

- కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు వెల్లడి
- వైద్య పరికరాల ఉత్పత్తి రాజధానిగా రాష్ట్రం: చంద్రబాబు

7లో



దిల్లీలో జరిగిన భాగస్వామ్య సదస్సులో కేంద్ర మంత్రి సురేష్ ప్రభును పలకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో సీఐఐ సెక్రటరీ జనరల్ చంద్రజిత్ బెనర్జీ

పంటల నమోదు తప్పనిసరి



- మద్దతు ధరకు అమ్ముకోవాలంటే మార్గమిదే
- ప్రాథమిక సహకార సంఘాల్లో రైతుల వారీ నమోదు
- ప్రతిపాదించిన మార్క్‌ఫెడ్.. పరిశీలిస్తున్న ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పంటల నమోదు తప్పనిసరి కాబోతోంది. ఇప్పటికే ఈ-పంట విధానంలో నమోదైతేనే కొనుగోలు చేయాలనే ఆదేశాలు అమలుచేస్తున్నారు. దీనికితోడు నిర్ణీత సమయమిచ్చి స్వచ్ఛంద నమోదుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. మార్కెట్లో పంట ఉత్పత్తుల ధరలు పడిపోయినప్పుడు మద్దతు ధర ప్రకారం రైతుల నుంచి కొనాలంటే ఇదే మార్గమని భావిస్తోంది. వ్యవసాయోత్పత్తుల సేకరణ ఏటా పెరుగుతున్న నేపథ్యంలో అక్రమాలూ అదే మాదిరి చోటు చేసుకుంటున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాలంటే ఇలాంటి విధానాలు అవసరమంటూ మార్క్‌ఫెడ్ చేసిన ప్రతిపాదన మేరకు కసరత్తు జరుగుతోంది.

ఈ-పంట ఉన్నా..

- ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఈ-పంట విధానం అమలవుతోంది. దీనిలో లోపాలతో అర్హులైన రైతుల పేర్లు నమోదవడం లేదు. ఒకచోట (మిగతా 2లో)

రికార్డు పరుగు



స్టాక్ మార్కెట్లలో సరికొత్త రికార్డులు నమోదవుతూనే ఉన్నాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ తొలిసారి 35000 పాయింట్ల ఎగువన ముగియగా.. నిఫ్టీ 10800 పాయింట్లను తాకి, మళ్లీ వెనక్కి వచ్చింది. డిసెంబరు 26న 34000 పాయింట్లకు చేరిన సెన్సెక్స్ 17 ట్రేడింగ్ దినాల్లోనే 1,000 పాయింట్లకు పైగా పెరగడం గమనార్హం. ద్రవ్యోలోటుపై మదుపర్లలో నెలకొన్న ఆందోళనను తగ్గించే ప్రయత్నంలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనపు రుణ పరిమితిని రూ.50,000 కోట్ల నంచి రూ.20,000 కోట్లకు కేంద్రం తగ్గించడం. సూచీలు కొత్త శిఖరాలను అధిరోహించేందుకు తోడ్పడింది. సెన్సెక్స్ 311 పాయింట్లు పెరిగి 35082 వద్ద ముగియగా.. నిఫ్టీ 88 పాయింట్ల లాభంతో 10788 వద్ద స్థిరపడింది. - వివరాలు బిజినెస్ పేజీలో


అహ్మదాబాద్‌లో గాలిపటాన్ని ఎగురవేస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సతీమణి సారా, చిత్రంలో నెతన్యాహు, మోదీ

నవ్యావిష్కరణల హితంగా వ్యవస్థలు: ప్రధాని మోదీ

10లో

అర్జీల దారి.. అయోమయం!

- ఇంటి స్థలం కోరితే హోం శాఖకు, మరుగుదొడ్డి అడిగితే రెవెన్యూకు..
- శాఖలతో సంబంధం లేకుండా వెళ్తున్న అర్జీలు
- తిరస్కరించాలంటే చాంతాడంత ప్రక్రియ
- నిబంధనలకు విరుద్ధమైనా అపరిష్కృత జాబితాలోనే..

ఈనాడు - అమరావతి



ఆంధ్రప్రదేశ్‌లో అర్జీల వ్యవహారం అధికారులకు కొత్త తలనొప్పులు తెస్తోంది. కుప్పలుగా వస్తున్న అర్జీలు ఓవైపు.. తమ పరిధిలోకి రాని, తమ శాఖకు సంబంధం లేని అర్జీల రాక మరోవైపు వస్తుండటంతో గందరగోళ పడుతున్నారు. 1100తో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌లో ఫోన్ చేసిన వ్యక్తి చెప్పిన సమస్యను నమోదు చేసుకుని సంబంధిత శాఖకు పంపించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం దీనికి ప్రధాన కారణం. ఇక తమ పరిధిలో లేని సమస్యకు సంబంధించిన అర్జీని తిప్పి పంపించాలన్నా బారెడు ప్రక్రియ ఉంటోంది. ఈ సమస్యలను పరిష్కరించలేదంటూ ప్రతి రోజూ లెక్కలు తీస్తుండటం, విశ్లేషిస్తుండటం, వివరణలు కోరడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. మండలాలు, జిల్లా స్థాయి అధికారులు తామెదుర్కొంటున్న ఈ ఇబ్బందులపై శాఖాధిపతులు, కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జన్మభూమి సమయంలో ఆర్టీజీతో ఎదురైన ఇబ్బందులను పలువురు జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు ప్రణాళికశాఖ దృష్టికీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికీ తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శులకూ ఈ సమస్యల్ని కొందరు వివరించారు.

ఇల్లు అంటే హోం అనుకున్నారేమో?

- రాయలసీమలోని ఓ జిల్లా నుంచి ఓ వ్యక్తి తనకు ఇంటి స్థలం కోరుతూ 1100కి ఫోన్ చేశారు. ఈ విషయాన్ని రెవెన్యూశాఖకు అప్పగించాలి. అయితే ఈ అర్జీని హోంశాఖ ఖాతాలో (మిగతా 2లో)

పింఛను ఉపసంహరణ నిబంధనల సడలింపు

దిల్లీ: జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) కింద నిధుల పాక్షిక ఉపసంహరణకు నిబంధనలను సడలిస్తూ, పింఛను నియంత్రణ సంస్థ పీఎఫ్‌ఆర్‌డీఏ ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రకారం.. మూడేళ్లపాటు ఎన్‌పీఎస్ చందా కడితే, కార్పస్‌లో 25 శాతం వరకు నిర్దిష్ట అవసరాలకు ఉపసంహరించుకోవచ్చు. తన చందాకాలంలో, ఈ విధంగా మూడుసార్ల వరకు అనుమతిస్తారు. పిల్లల ఉన్నత విద్య- వివాహం, ఇల్లు-ఫ్లాట్ కొనుగోలు, నిర్మాణం కోసం నిధులు ఉపసంహరించుకోవచ్చు. పూర్వీకుల నుంచి వచ్చింది మినహా ఏదేని నివాసం తనపేరిట, సంయుక్తంగా కలిగి ఉన్నా, కొత్తది కొనుగోలుకు ఈ నిధులు ఉపసంహరించలేరు. క్యాన్సర్, మూత్రపిండాలు విఫలం కావడం, హృద్రోగం, పక్షవాతం వంటి సందర్భాల్లోనూ తీసుకోవచ్చు.

ఇదీ సంగతి!



దక్షత.. వ్యాపార ఆపేక్ష

- ఇది ఆంధ్రుల రక్తంలోనే ఉంది
- ఇంటికో పారిశ్రామికవేత్త రావాలి
- ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి లోకేష్
- మంగళగిరిలో 16 ఐటీ కంపెనీల ప్రారంభం

3లో



మంగళగిరిలో ఐటీ కంపెనీని ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్. చిత్రంలో మంత్రి నక్కా ఆనందబాబు తదితరులు

నైపుణ్యం ఉండాలి.. ఆంగ్లం రావాలి

- ప్రతిభావంతులకే అమెరికా అవకాశం
- నూతన వలసల విధానంపై ట్రంప్ ప్రభుత్వ వర్గాల వెల్లడి

6లో

ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు ఎప్పుడు?

20 వేల మంది కోసం... 8.5 లక్షల మందిపై ప్రభావం!

2లో





ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ ● సదస్సులో పాల్గొన్న మహిళా పారిశ్రామికవేత్తలు

కన్యాశుల్కం ఖాయం!

(మొదటి పేజీ తరువాయి)
కుదుర్చుకున్నాయి.

శైలజా కిరణ్‌కు ముఖ్యమంత్రి ప్రశంస

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీగా శైలజా కిరణ్ అత్యద్భుత ప్రతిభా పాటవాలు కనబరుస్తూ సంస్థను విజయపథంలో నడిపిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఎలీప్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రమాదేవి కూడా మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు అమరనాథ్‌రెడ్డి, గంటా శ్రీనివాసరావు, ఎంపీలు హరిబాబు, మాగంటి మురళీ మోహన్, ప్రపంచ వాణిజ్య సంస్థ ఈడీ రత్నాకర్ అధికారి, ఎస్.ఎ. డబ్ల్యు.డి.ఎఫ్. అధ్యక్షురాలు ప్రమీలా ఆచార్య రిజాల్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఆధునిక కళాక్షేత్రం

హుద్‌హుద్ తుపాను సమయంలో విశాఖలోని గురజాడ కళాక్షేత్రం పూర్తిగా ధ్వంసమైంది. కళాకారులకు ఇది తీరని లోటుగా అప్పటినుంచి మిగిలిపోయింది. పూర్తిగా పాడైపోయిన ఈ క్షేత్రాన్ని వుడా ప్రత్యేక శ్రద్ధ చూపి రూ.9.50 కోట్లతో ఆధునిక హంగులతో పునర్నిర్మించింది. దీన్ని బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు పునఃప్రారంభించారు. కళాక్షేత్రంఅందంగా ఉండటం చూసి అధికారుల పనితీరును మెచ్చుకున్నారు. ఇందులో 2300 మంది పట్టేలా కుర్చీలు ఏర్పాటు చేశామని, వారందరికీ చక్కటి గాలి వీచేలా కళాక్షేత్రం పైకప్పునకు 4 అతి పెద్ద ఫ్యాన్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అంతకుముందుగా గురజాడ విగ్రహానికి సీఎం పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు ఎప్పుడు?

- 20వేల మంది కోసం... 8.5 లక్షల మందిపై ప్రభావం!

ఈనాడు, అమరావతి: ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు కలగా మారుతున్నాయి. తొలి ఏడాది ఉద్యోగి భార్య లేదా భర్త; పింఛనుదారు భార్య లేదా భర్తకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని నెలల కిందట నిర్ణయించినా అమలవడంలేదు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ప్రకటించిన ప్రకారం సెప్టెంబరు నుంచే ఈ పథకం ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటికీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. జాప్యంపట్ల ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఖజానా శాఖ ద్వారా వేతనాలు అందుకుంటూ ఆరోగ్య కార్డులు కలిగిన ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి ఏడాది సుమారు 8.5 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు చేయించాలి. మొత్తం 230 కోట్ల రూపాయల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అయ్యే వ్యయంలో 50% ఉద్యోగులు, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరించేలా సూచనప్రాయంగా నిర్ణయించారు. తొలి విడత కింద ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.30 కోట్ల విడుదలకు సుముఖత వ్యక్తంచేశారు. అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వపరంగా నిధుల విడుదల జరుగుతుందని భరోసా ఇచ్చారు కూడా. కానీ ఇందుకు అనుగుణంగా చర్యలైతే కనిపించడంలేదు.

ప్రభుత్వ ఆదేశాల్ని అనుసరించి 'ఎన్టీఆర్ వైద్య సేవ' కార్యాలయం ఆసక్తి వ్యక్తీకరణ కింద ఆరోగ్య పరీక్షలను నిర్వహించే సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. వచ్చిన ఒకట్రెండు దరఖాస్తులను పరిశీలిస్తే... వాటికి అంత సామర్థ్యం లేదని భావించి పక్కనబెట్టారు. దీంతో కొత్త నిబంధనలను తయారుచేసి, ఏపీ వైద్య సేవల మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ద్వారా టెండర్లను ఆహ్వానించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. తదుపరి చర్యలు మందగించాయి.

గురుకుల విద్యాలయాలు, గ్రంథాలయాలు, ఏపీ వైద్య విధాన పరిషత్, ఇతర శాఖల ఉద్యోగులకు కూడా ఈ సౌకర్యాన్ని కల్పించాలన్న దానిపై ప్రభుత్వస్థాయిలో పరిశీలన జరిగింది. అందరికీ కలిపి ఎంతమేర నిధులవసరమవుతాయో కొత్త ప్రతిపాదనలు తయారుచేయాలని ఆర్థిక శాఖ సూచించింది. ఈ శాఖలకు చెందిన ఉద్యోగులు 20వేల మంది వరకు ఉంటారని తెలిసింది. వీరి విషయంలో తీసుకోవాల్సిన నిర్ణయ ప్రభావం సుమారు 8.5 లక్షల మందిపై కనిపిస్తోంది.

తొలి విడత పరీక్షల ద్వారా నివేదికలను అనుసరించి కనీసం 20% మందికి రెండో విడత పరీక్షలు అవసరం కావొచ్చునని అంచనావేశారు. 40 సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే ప్రతి ఏడాదీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. తొలివిడత ఆరోగ్య పరీక్షలు చేయించుకునే మగ వారికి రూ.2110, మహిళలకు రూ.2200 వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

బేరియాట్రిక్ శస్త్రచికిత్సతో ఊబకాయుల్లో తగ్గుతున్న మృత్యుముప్పు!

వాషింగ్టన్: బరువు తగ్గేందుకుగాను బేరియాట్రిక్ శస్త్రచికిత్స చేయించుకునే ఊబకాయుల్లో మృత్యుముప్పు.. దీర్ఘకాలంపాటు సంప్రదాయ చికిత్స తీసుకునే ఊబకాయులతో పోలిస్తే దాదాపు 50 శాతం తక్కువగా ఉంటున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇజ్రాయెల్‌లోని 33,540 మంది ఊబకాయులపై దాదాపు దశాబ్దకాలంపాటు పరిశోధనలు నిర్వహించడం ద్వారా అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ విషయాన్ని నిర్ధారించారు. అధ్యయనంలో భాగంగా తాము పరిశీలించిన ఊబకాయుల్లో 8,385 మంది బేరియాట్రిక్ శస్త్రచికిత్స చేయించుకున్నారని.. మిగతావారు సంప్రదాయ చికిత్స పొందుతున్నారని శాస్త్రవేత్తలు వెల్లడించారు. వారందరి సగటు వయసు 46 ఏళ్లు అని తెలిపారు. శస్త్రచికిత్స చేయించుకున్న వ్యక్తుల్లో 1.3 శాతం మంది.. చేయించుకోని ఊబకాయుల్లో 2.3 శాతం మంది తమ అధ్యయన కాలంలో మృతిచెందారని పేర్కొన్నారు.

నలుగురు సీనియర్లతో నేడు సీజేఐ భేటీ

- సుప్రీంకోర్టులో సమస్యల పరిష్కార దిశగా మరో అడుగు

దిల్లీ: సుప్రీంకోర్టులో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించడానికి అత్యంత సీనియర్లయిన నలుగురు న్యాయమూర్తులతో గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్ర సమావేశం కానున్నారు. నిజానికి బుధవారం ఉదయమే ఈ సమావేశం జరగవలసి ఉన్నా, అస్వస్థత కారణంగా జస్టిస్ చలమేశ్వర్ సెలవు తీసుకోవడంతో అది వాయిదా పడింది. అసమ్మతి గళమెత్తిన మరో న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్.. జస్టిస్ చలమేశ్వర్ నివాసానికి వెళ్లి దాదాపు 15 నిమిషాల పాటు సమావేశమయినట్టు తెలిసింది. సాయంత్రం మరో ఇద్దరు న్యాయమూర్తులు జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లు కూడా ఆయన నివాసానికి వెళ్లారు. జస్టిస్ చలమేశ్వర్ గురువారం కోర్టుకు వచ్చే అవకాశం ఉంది.

మిగిలినవారితో కాసేపు సమావేశం

కోర్టు ప్రారంభానికి ముందు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర... అసమ్మతి తెలిపిన జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లతో కొద్దిసేపు సమావేశమయ్యారు. భోజన విరామ సమయంలోనూ ఆయన మిగిలిన న్యాయమూర్తులతో కలిసి వారితో ముచ్చటించారు. చర్చల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదని, సమస్య పరిష్కారం కాలేదని అసమ్మతి తెలిపిన న్యాయమూర్తులకు సన్నిహితంగా ఉండే వర్గాలు తెలిపాయి. వ్యవస్థాగత మార్పులు కోరుతున్న ఆ న్యాయమూర్తులు చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. సమస్యలు పరిష్కరించడానికి ప్రధాన న్యాయమూర్తి కూడా ప్రణాళిక రూపొందించినట్టు వెల్లడించాయి. మంగళవారం సాయంత్రం కూడా జస్టిస్ చలమేశ్వర్ నివాసానికి మిగిలిన ముగ్గురు సీనియర్ న్యాయమూర్తులు వచ్చి సమావేశమయ్యారు.



సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్ర

కన్నీటిపర్యంతమైన న్యాయమూర్తి

కొంతమంది న్యాయమూర్తులతో సోమవారం సమావేశమయిన సందర్భంగా మరో న్యాయమూరి జస్టిస్ అరుణ్ మిశ్ర కన్నీటి పర్యంతమయినట్టు తెలిసింది. న్యాయమూర్తుల సీనియారిటీలో ఆయన పదో స్థానంలో ఉన్నారు. ప్రత్యేక జడ్జి బి.హెచ్.లోయా కేసు విచారణను తొలుత ఆయనకు కేటాయించారు. ఈ కేసును ఆయనకు కేటాయించడంపై విమర్శలు వచ్చాయి. తన సమర్థతను ప్రశ్నించేలా తనను లక్ష్యంగా చేసుకున్నారంటూ ఆయన ఆవేదన చెందారు. మంగళవారం జరిగిన విచారణలో ఈ కేసును 'నిర్దిష్ట ధర్మాసనం ముందుంచాలని' జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఎం.ఎం.శాంతను గౌండర్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించడం గమనార్హం.

దిల్లీ హైకోర్టు విధానం మేలు: వికాస్ సింగ్

ప్రధాన న్యాయయూర్తి జస్టిస్ దీపక్ మిశ్రతో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ సమావేశమయ్యారు. రోస్టర్ విధానంపై దిల్లీ హైకోర్టు అనుసరిస్తున్న విధానం బాగుందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

సీజేఏఆర్ వల్లనే ఇబ్బందులు

కాంపెయిన్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబిలిటీ అండ్ రిఫార్మ్ (సీజేఏఆర్) అనే స్వచ్ఛంద సంస్థ కారణంగానే ఇబ్బందులు తలెత్తాయని వికాస్ సింగ్ ఆరోపించారు. వైద్య కళాశాల వ్యవహారంలో ప్రధాన న్యాయమూర్తిపై తప్పుడు ఆరోపణలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు అసమ్మతి తెలిపిన నలుగురు న్యాయమూర్తులకు తన వ్యక్తిగత హోదాలో లేఖలు రాశారు. ఈ వ్యవహారంలో భారత వైద్య మండలి (ఎం.సి.ఐ) తరఫున సింగ్ వాదించారు. ప్రధాన న్యాయమూర్తిపై వచ్చిన ఆరోపణలపై అయిదుగురు సీనియర్ న్యాయమూర్తులకు లేఖ రాసినట్టు మంగళవారం సీజేఏఆర్ కన్వీనర్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చెప్పారు.

ఉప్పు ఎక్కువైతే మెదడుకు ముప్పు

న్యూయార్క్: ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల డిమెన్షియా (చిత్తవైకల్యం) ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనంలో తెలింది. మెదడుకు రక్తప్రవాహం తగ్గిపోవడమే ఇందుకు కారణమని వెల్లడైంది. అమెరికాలోని వీల్ కార్నెల్ మెడిసిన్ సంస్థ పరిశోధకులు ఈ అధ్యయనం చేపట్టారు. ఇందుకోసం వారు ఎలుకలపై ప్రయోగాలు నిర్వహించారు. 4 నుంచి 8 శాతం వరకు ఉప్పు (సోడియం) కలిగిన ఆహారాన్ని వాటికి 8 వారాలపాటు ఇచ్చి.. ఎమ్ఆర్ఐ స్కానింగ్ ద్వారా ఫలితాలను విశ్లేషించారు. మెదడులోని కార్టెక్స్‌కు 28%.. హిప్పోక్యాంపస్‌కు 25% రక్తప్రవాహం తగ్గినట్లు గుర్తించారు. ఈ రెండు ప్రాంతాలు అభ్యాసం, జ్ఞాపకశక్తికి సంబంధించినవని పరిశోధకులు పేర్కొన్నారు. కొన్ని ఎలుకలకు తిరిగి నాలుగు వారాలపాటు సాధారణ ఆహారం ఇవ్వగా.. రక్తప్రవాహం సాధారణ స్థితికి చేరుకుందని వివరించారు. ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం కొనసాగించిన ఎలుకలు డిమెన్షియాకు గురయ్యాయని.. వస్తువులను గుర్తుపట్టడం, గూడు నిర్మించుకోవడం, దారి గుర్తించడం వంటి పరీక్షల్లో విఫలమయ్యాయని పేర్కొన్నారు. రక్తపోటు పెరగని సందర్భాల్లోనూ ఎలుకలు ఈ వ్యాధి బారిన పడ్డాయని తెలిపారు.

'ఫోన్ సంభాషణల బహిర్గతంపై విచారణ జరిపించండి'

దిల్లీ: ఇద్దరు వ్యక్తులతో తాను జరిపిన టెలిఫోన్ సంభాషణలు బహిర్గతం కావడంపై దర్యాప్తు జరపాలని కోరుతూ ఒరిస్సా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఐ.ఎం.కుద్దుసీ బుధవారం స్థానిక ప్రత్యేక జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వైద్య కళాశాలకు అనుమతి వ్యవహారంలో లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలపై గత ఏడాది అరెస్టయిన ఆయన ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. తాను జరిపిన టెలిఫోన్ సంభాషణలను అత్యంత రహస్యమైనవిగా దర్యాప్తు సంస్థలు భావిస్తాయని, నిందితులకు కూడా వాటి వివరాలు చెప్పవని తెలిపారు. అలాంటప్పుడు మీడియాకు ఎలా తెలిశాయని ప్రశ్నించారు. దీనిపై ఈ నెల 22లోగా సమాధానం చెప్పాలంటూ దర్యాప్తు సంస్థ అయిన సీబీఐని ఆదేశించాలని కోరుతూ తన న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేశారు.

అర్జీల దారి.. అయోమయం!

(మొదటి పేజీ తరువాయి)
పడేశారు. పేదల గృహ నిర్మాణ పథకానికి సంబంధించి చెల్లించాల్సిన బిల్లులు, మరుగు దొడ్ల మంజూరుకు సంబంధించిన వాటిని రెవెన్యూశాఖకు పంపిస్తున్నారు.

- సీసీ రోడ్లు, మురుగు కాల్వలకు సంబంధించిన సమస్యలూ హోంశాఖకు వెళ్లాయి.
- రేషన్ కార్డు కావాలంటూ వచ్చిన సమస్యను పరిష్కరిద్దామని ఓ మండల తహసీల్దారు అర్జీదారుకు ఫోన్ చేశారు. ఆ నెంబరు బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుకు వెళ్లింది. అలాంటి అర్జీ ఏదీ ఇవ్వలేదని, ఏ కాల్ సెంటరుకు తాను ఫోన్ చేయలేదని ఆమె చెప్పారు. అలాగే కొందరు ప్రభుత్వ ఉద్యోగులకూ ఇలాంటి ఫోన్లు వచ్చాయని తెలిసింది.

సంతృప్తి చెందేవరకూ అపరిష్కృతమే

కొందరు నిబంధనలకు విరుద్ధమైన అంశాలపైనా 1100కి ఫోన్ చేసి సమస్యగా చెబుతున్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖకు ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. తనకు ఫలానా సర్వే నెంబర్లోని భూమికి సంబంధించి పట్టా ఇవ్వడం లేదంటూ ఫిర్యాదు వెళ్తుంది. దాన్ని సంబంధిత మండల తహసీల్దారుకు పంపిస్తారు. పరిశీలించిన తరవాత అది చెరువు శిఖం భూమిగానో, రోడ్డు పోరంబోకు గానో, డొంక పోరంబోకు అనో గుర్తిస్తారు. ఇలాంటి వాటికి పట్టాలు ఇవ్వడంగానీ, క్రమబద్ధీకరించడంగానీ చేయరు. అలా చేస్తే నిబంధనలకు విరుద్ధం. అర్జీ తిరస్కరిస్తారు. అర్జీదారుకు కాల్‌సెంటర్ నుంచి ఫోన్ చేసి సమస్య పరిష్కారమైందా? అని అడిగితే పరిష్కారం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేయగానే ఆ పిటిషన్ తిరిగి ఓపెన్ అవుతుంది. అపరిష్కృత జాబితాలోకి వెళ్తుంది. ఈ విషయాన్ని కలెక్టర్లు ఇప్పటికే భూపరిపాలన ప్రధాన కమిషనరు దృష్టికి తీసుకెళ్లారు.

ముందుకొచ్చిన నవయుగ

(మొదటి పేజీ తరువాయి)
కొత్త టెండర్ల విషయంలో సానుకూలత వ్యక్తం చేయలేదు. ఈ నేపథ్యంలోనే వారం రోజులుగా సాగిన పరిణామాల్లో నవయుగ కన్‌స్ట్రక్షన్ కంపెనీ తెరపైకి వచ్చింది. పోలవరం ప్రాజెక్టులో స్పిల్ వే, స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులు, మట్టి పనులు, విద్యుత్కేంద్ర మట్టి పనులు పూర్తి స్థాయిలో తాము పాత ధరలకే చేపడతామని ముందుకు వచ్చినట్లు తెలిసింది. ప్రధాన గుత్తేదారు ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ, నవయుగ ప్రతినిధులు, జలవనరులశాఖ అధికారులు కలిసి దీనిపై చర్చించారని సమాచారం. పాత ధరలకు తాము ఈ పనులు చేస్తామని నవయుగ మౌఖికంగా తెలపగా లిఖితపూర్వకంగా తెలియజేస్తేనే ఒక నిర్ణయం తీసుకుంటామని జలవనరులశాఖ అధికారులు వారికి తెలియజేసినట్టు తెలియవచ్చింది.

టెండర్లు మరో వారం వాయిదా

ఒక వైపు నవయుగ వ్యవహారం పూర్తిగా కొలిక్కి రాలేదు. మరో వైపు పోలవరం టెండర్లకు ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన గడువు గురువారంతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో టెండర్ల ప్రక్రియను మరో వారం పాటు వాయిదా వేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ లోపు నవయుగ కంపెనీ లిఖితపూర్వకంగా ఆమోదం తెలియజేస్తే విధివిధానాలు ఖరారు చేసి వారికే పాత ధరలతో పనులు అప్పగించే అవకాశం ఉంది. అప్పుడు టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తారు.

పంటల నమోదు తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)
కూర్చుని వేర్వేరు దిక్కుల్లో ఫొటోలు తీసి వాటినే వేర్వేరు రైతుల పేర్లతో చూపిస్తున్నారు. సాగుచేస్తున్న రైతుల పేర్లు, పంటలు అందులో కన్పించడంలేదు.

- గతేడాది మిర్చి, పసుపు కొనుగోళ్లతోపాటు ఈసారి పత్తి, మినుముల సేకరణ సందర్భంగా సాగుచేసిన రైతుల పేర్లు ఈ-పంటలో లేని విషయం వెల్లడైంది. పరిశీలించిన ప్రభుత్వం వ్యవసాయాధికారులు ఇచ్చే ధ్రువీకరణ పత్రాల ద్వారా కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించింది.
- మిర్చి, పసుపు, మినుములు, శనగలు, మొక్కజొన్న తదితరాలను మార్క్‌ఫెడ్, పత్తిని సీసీఐ, వేరుశనగను ఆయిల్‌ఫెడ్ కొనుగోళ్లు చేస్తున్నాయి. మార్కెట్లో ధరలు తక్కువగా ఉన్నప్పుడు వ్యాపారులే రైతుల పేర్లతో సరకులు విక్రయించి రూ.కోట్లలో దండుకుంటున్నారు. కొంతమంది ఇతర రాష్ట్రాల నుంచి పప్పుధాన్యాలు తక్కువ ధరకు తెప్పించి, వ్యవసాయాధికారులిచ్చే పత్రాల సాయంతో మార్క్‌ఫెడ్‌కు అధిక ధరకు విక్రయిస్తున్నారు. అక్రమాలు బయటపడేసరికే అమ్మకాలు జరిగిపోతున్నాయి.

గడువులోగా నమోదు చేసుకుంటే..

వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లకు మధ్యప్రదేశ్, హరియాణలో వివిధ పథకాల పేర్లతో మద్దతు ధర అందిస్తున్నారు. నిర్ణీత గడువిచ్చి.. పంటల వారీ నమోదు చేసుకునే వెసులుబాటు రైతులకు కల్పించారు. వారు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్దకు వెళ్లి ఏ పంట, ఎంత విస్తీర్ణం అనే వివరాలను సర్వే నంబర్లతోపాటు తెలియజేయాలి. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతాలు ఇవ్వాలి. మద్దతు ధర కంటే తగ్గినప్పుడు పంట సేకరణ సమయంలో వీరి నుంచి ఉత్పత్తులు సేకరిస్తున్నారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలుచేస్తే బాగుంటుందని అధికారులు ప్రతిపాదించారు.

పంటల నమోదుతో ఏంటి?

- రైతులు ఎవరనేది తెలుస్తుంది. గ్రామం, మండలాల వారీగా పంటల సాగు, దిగుబడులపై స్పష్టత వస్తుంది. కొనుగోలు లక్ష్యం, కేంద్రాల ఏర్పాటు జరుగుతుంది.
- కొనుగోలు సమయంలో రైతుల ఫోన్ నంబర్లకు సందేశాలు పంపి నిర్ణీత తేదీలో సరకు తెచ్చేలా చూస్తారు. అప్పటికప్పుడు దళారులు రంగంలోకి దిగే వీలుండదు.



కాన్పూర్‌లో స్వాధీనం చేసుకున్న రద్దయిన పాత నోట్ల కట్టలు

రూ.97 కోట్లకు పైగా పాతనోట్లు స్వాధీనం

- కాన్పూర్‌లో 16 మంది అరెస్టు
- అరెస్టయిన వారిలో ఓ తెలుగు వ్యక్తి

కాన్పూర్: సుమారు రూ.97 కోట్లకుపైగా పాతనోట్ల(రద్దయిన పెద్దనోట్లు)స్వాధీనం చేసుకున్న కేసులో దాదాపు 16 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ఆనంద్ ఖత్రి అనే ఓ బిల్డర్ కూడా ఉన్నారు. ఇంతభారీ మొత్తంలో ఉన్న ఈ నోట్లన్నిటినీ బిల్డర్ పూర్వీకుల నివాసం నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమికంగా ఈ డబ్బు విషయంలో తీవ్రవాదం కోణం ఏదీ లేదని కూడా వారు స్పష్టం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి కాన్పూర్‌లోని వివిధ ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం వరకూ దాడులను కొనసాగించినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న వారిని ప్రశ్నించిన అనంతరం మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం లేకపోలేదని ముఖ్యకార్యదర్శి(హోం)అరవింద్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు. అరెస్టయిన పదహారు మందిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోటేశ్వర రావు అనే వ్యక్తి కూడా ఉన్నట్లు తెలిపారు.

రూ.3లక్షల విలువైన దొంగనోట్ల స్వాధీనం: సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

దిల్లీ: సుమారు రూ.3లక్షల విలువైన దొంగనోట్లను కలిగి ఉన్న నరేందర్(45) అనే వ్యక్తిని ఈనెల 12న ఎర్రకోట వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు బుధవారం ఇక్కడ వెల్లడించారు. ఈ దొంగనోట్లన్నీ కూడా రెండువేల రూపాయలవేనని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని మాల్డా వెంబడి ఉన్న సరిహద్దు ప్రాంతాల నుంచి దొంగనోట్ల భారత్‌లోకి చేరవేస్తున్నట్లు తమకు సమాచారం అందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. రూ.3లక్షల దొంగనోట్లతో పట్టుబడిన నరేందర్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారన్నారు. 2016 నుంచీ తాను దొంగనోట్ల సరఫరాలో ఉన్నట్లు అతడు తెలిపారన్నారు.

బీహెచ్ లోయది సహజ మరణమే!

పుణె: ప్రత్యేక సీబీఐ జడ్జి బీహెచ్ లోయ నాడు గుండె సంబంధమైన ఇబ్బందితోనే మరణించినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి బుధవారం నాడిక్కడ ప్రకటించారు. మూడేళ్ల క్రితం నాగపూర్ ఆసుపత్రిలో నిర్వహించిన లోయ పోస్టుమార్టం నివేదికను ఆ అధికారి ఇక్కడ ఉటంకించారు. అధికారికంగా ఆ పోస్టు మార్టం నివేదిక అందిన తర్వాత లోయ హత్యకేసు దర్యాప్తును పూర్తిగా మూసివేసినట్లు ఆయన చెప్పారు. లోయ మృతి విషయంలో ఎలాంటి అనుమానించదగిన అంశమేదీ లేదన్నారు.

రాష్ట్రపతిభవన్‌లో సంగీత నాటక అకాడమీ అవార్డుల ప్రదానం

దిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో బుధవారం సంగీత నాటక అకాడమీ అవార్డుల ప్రదానం వైభవంగా జరిగింది. 2016కు సంబంధించి అయిదు విభాగాల్లో మొత్తం 43 మంది ప్రముఖులకు రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఈ పురస్కారాలను అందజేశారు. వీరిలో రంగస్థల ప్రముఖుడు రాంగోపాల్ బజాజ్, నృత్యకారులు సునీల్ కొఠారి, కర్ణాటక సంగీత ప్రావీణ్యులు ఆర్.వేదవల్లి.. సంగీత నాటక అకాడమీ రత్న అవార్డులను అందుకున్నారు. సంగీతం విభాగంలో కర్ణాటక సంగీత గాయకులు నీలా రాంగోపాల్, కె.ఒమనాకుట్టి, మృదంగ విద్వాంసులు జె.వైద్యనాథన్, వయోలిన్ వాద్యకారులు ఎం.మంజునాథ్; భరత నాట్యంలో గీతా చంద్రన్, కూచిపూడిలో ఏబీ బాల కొండలరావు, సమకాలీన నృత్యంలో అనితా ఆర్ రత్నం, యక్షగానంలో కె.గోవింద్ భట్; ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ రంగస్థల కళాకారులు అన్నాబత్తుల లక్ష్మీ మంగతయారు, లీలాసాయి (సంయుక్తంగా); ప్రముఖ సంగీత శాస్త్రజ్ఞులు పప్పు వేణుగోపాలరావు తదితరులు అకాడమీ పురస్కారాలను పొందారు.

బిడ్డకు ఆర్నెల్లపాటు స్తన్యమిస్తే.. తల్లికి తగ్గే మధుమేహం ముప్పు!

లాస్ ఏంజెలిస్: ఆరునెలలకు పైగా బిడ్డలకు స్తన్యమిచ్చే తల్లులకు టైప్-2 మధుమేహం వచ్చే ముప్పు సగానికిపైగా తప్పిపోతుంది. ఎంతకాలంపాటు బిడ్డకు స్తన్యమిస్తున్నారన్న అంశానికీ.... మధుమేహం ముప్పునకు గట్టి లంకె ఉన్నట్లు పరిశోధకులు వెల్లడించారు. ఒక్కమాటలో చెప్పాలంటే... తల్లీపిల్లలిద్దరికీ కూడా మధుమేహం ముప్పును తప్పించే శక్తిమంతమైన రక్షణకవచం స్తన్యమివ్వడమేనని వారు చెప్పారు. అంతేకాదు, తల్లిని రొమ్ము, అండాశయ క్యాన్సర్‌ల నుంచి కూడా కాపాడుతుంది. ప్రతి ప్రసవానంతరం బిడ్డకు తల్లిపాలే ఆరునెలలకంటే ఎక్కువ సమయం పాటు ఇచ్చే తల్లులకు మధుమేహం ముప్పు 47శాతం తగ్గిపోతుంది. అంతకంటే తక్కువ వ్యవధిపాటు బిడ్డకు స్తన్యమిచ్చిన తల్లులకు మధుమేహం ప్రమాదం 25 శాతం తగ్గుతుందని పరిశోధకులు తెలిపారు. స్తన్యమిచ్చే వ్యవధి పెరిగిన కొద్దీ మధుమేహం ముప్పుకూడా తగ్గుతూ పోయినట్లు తమ విశ్లేషణలో తేలిందన్నారు.

గ్రహం అనుగ్రహం

18–1–2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత ఋతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
పాడ్యమి: ఉ. 9-09 తదుపరి విదియ
శ్రవణం నక్షత్రం: రా. 12-09 తదుపరి ధనిష్ఠ
అమృత ఘడియలు: మ. 12-46 నుంచి 2-31 వరకు
వర్జ్యం: తె. 4-27 నుంచి 6-11 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-18 నుంచి 11-03 వరకు
తిరిగి మ. 2-45 నుంచి 3-30 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-39; సూర్యాస్తమయం: సా.5-43
చంద్రదర్శనం

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	9.2	30.1
తిరుపతి	13.8	27.6
గుంటూరు	15.0	31.5
శ్రీకాకుళం	15.5	32.0
హైదరాబాద్	15.8	31.3
అనంతపురం	17.8	32.8
విశాఖపట్నం	18.0	28.7
రాజమహేంద్రవరం	18.0	33.0
కడప	18.0	34.0
విజయవాడ	19.5	29.5
తాడేపల్లిగూడెం	20.0	31.0
కర్నూలు	20.0	33.7
నరసాపురం	20.5	29.5
ఒంగోలు	21.1	31.0
నెల్లూరు	22.0	30.0

దక్షత.. వ్యాపార ఆపేక్ష

- ఇది ఆంధ్రుల రక్తంలోనే ఉంది
- ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి లోకేష్
- మంగళగిరిలో 16 ఐటీ కంపెనీల ప్రారంభం

ఈనాడు - అమరావతి; ఈనాడు డిజిటల్, గుంటూరు: రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కో ఔత్సాహిక పారిశ్రామికవేత్త అయినా రావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి లోకేష్ అన్నారు. దక్షత... వ్యాపార ఆపేక్ష అనేది ఆంధ్రుల రక్తంలోనే ఉందన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన టై అమరావతి, ఆంధ్రా ఏంజెల్స్ శాఖలను ప్రారంభించారు. మంగళగిరిలోని ఆటోనగర్, ఎన్ఆర్‌టీ టెక్‌పార్క్‌లో 16 ఐటీ కంపెనీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక కొత్త ఉత్పత్తిపై దృష్టి సారిస్తే ప్రపంచాన్నే జయించవచ్చని అన్నారు. అంకుర సంస్థలకు వ్యాపారాభివృద్ధిలో పెట్టుబడి, మార్కెటింగ్, పర్యవేక్షణ కీలకమని చెప్పారు. పెట్టుబడి ఇబ్బందుల పరిష్కారానికి 'ఆంధ్రా ఏంజెల్స్' తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రభుత్వం కూడా రూ.వంద కోట్లతో నిధి ఏర్పాటు చేసిందన్నారు.

నాడు ముఖ్యమంత్రి సైబర్ టవర్ అంటే అంతా నవ్వారు..: 1996లో సైబర్ టవర్ ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే అందరూ నవ్వారని.. ప్రస్తుతం సైబరాబాద్‌లోని ఐటీ కంపెనీలలో దాదాపు 6లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారని మంత్రి లోకేష్ వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలనే కాకుండా ఫార్చ్యూన్ 500 కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావాలని ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి, అనంతపురంలో ఐటీ హబ్‌ల ఏర్పాటుతో రాబోయే పదేళ్లలో పది లక్షల ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2019కి మంగళగిరిలో పదివేల ఐటీ ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. దేశవ్యాప్తంగా తయారవుతున్న పది ఫోన్‌లలో రెండు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలనలో విరివిగా ఉపయోగిస్తున్నామని.. దీని వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో దస్త్రాలన్నింటినీ ఈ-ఆఫీస్‌లోనే నడుపుతున్నామన్నారు. ఇప్పటికే వివిధ అవసరాల కోసం 10 లక్షల ఐవోటీ పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. మిలిందా గేట్స్ ఫౌండేషన్ సాయంతో డ్రోన్ల ద్వారా భూసార పరీక్షలను చేపడుతున్నామన్నారు.

మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందాలు...: మంగళగిరిలో లోకేష్ సమక్షంలో ఐకేవ సంస్థ ఏపీ ఎన్ఆర్‌టీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది చిప్ డిజైనింగ్‌లో ఎం.ఎస్ కోర్సును అందిస్తుంది. ఇన్‌వెకాస్ అనుబంధ సంస్థ వేదా ఐఐటీ ఎన్ఆర్‌టీ, జేఎన్‌టీయూ కాకినాడతో అవగాహన ఒప్పందం చేసుకుంది. అమరావతిలో సెమీ కండక్టర్‌ల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తామని, అందులో శిక్షణ తీసుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇన్‌వెకాస్ సంస్థ తెలిపింది. మంత్రులు కొల్లు రవీంద్ర, నక్కా ఆనందబాబు, డీజీపీ మాలకొండయ్య, ఏపీ ఎన్ఆర్‌టీ అధ్యక్షుడు వేమూరి రవి, సీఈవో సాంబశివరావు, ఇన్‌వెకాస్, వేద ఐఐటీ ఛైర్మన్ దశరథ రామాంజనేయులు, నాగార్జున వర్సిటీ ఉపకులపతి రాజేంద్రప్రసాద్, జేఈఎన్‌టీయూ కాకినాడ ఉపకులపతి కుమార్ పాల్గొన్నారు. విజయవాడ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి విజయానంద్, ప్రభుత్వ ఐటీ సలహాదారు, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జేఏ చౌదరి, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో టై అమరావతి, ఆంధ్రా ఏంజెల్స్ శాఖల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకేష్

నీటి ట్యాంకుల్లో సెన్సార్లు

- నాణ్యత పర్యవేక్షణే లక్ష్యం: మంత్రి లోకేష్

ఈనాడు, అమరావతి: వాటర్ గ్రిడ్ మొదటి దశ పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ఆయన వాటర్‌గ్రిడ్, గ్రామీణ తాగునీటి సరఫరాపై సమీక్షించారు. నిధుల సమీకరణను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సూచించారు. 17 వేల ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో సెన్సార్లు ఏర్పాటుచేసి నీటి నాణ్యతను పర్యవేక్షించే ప్రయోగాత్మక ప్రాజెక్టును త్వరలో అమలు చేస్తామని ప్రకటించారు. 157 గ్రామాల్లో భూగర్భ మురుగునీటిపారుదల టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఇంజినీర్లకు సూచించారు. లింకు రోడ్లు లేని గ్రామాలకు కొత్తగా ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు అంబులెన్స్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ చేపట్టాలన్నారు. నెలాఖరులోగా గ్రామాల్లో 3.50 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అమర్చిన ప్రతి బల్బు సీసీఎంస్ విధానం(సెంట్రలైజ్డ్ కంప్యూటింగ్ సెంటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)తో అనుసంధానించాలన్నారు. డంపింగ్ యార్డుల నిర్మాణం పూర్తయిన 355 గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఆర్ఎఫ్ఐడీ(రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిటీ) కార్డులు అమర్చాలని సూచించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ పర్యవేక్షణకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అమెరికా గూఢచార సంస్థ సీఐఏ మాజీ అధికారి జెన్ చెంగ్ లీని.. ఆ దేశ అధికారులు అరెస్టు చేశారు. దేశ భద్రతకు భంగం కలిగించే రహస్య సమాచారాన్ని అతడు అక్రమంగా కలిగిఉన్నట్లు ఆరోపణలు మోపారు.

సుబాబుల్ మద్దతు ధర రూ.4200

- మినుముల కొనుగోలుపై త్వరలో నిర్ణయం
- మెగా సీడ్ పార్క్ డీపీఆర్ సిద్ధం
- మంత్రి సోమిరెడ్డి వెల్లడి

ఈనాడు, అమరావతి: సుబాబుల్ మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.4200గా, జామాయిల్, సరుగుడులకు రూ.4400గా నిర్ణయించినట్లు ఏపీ వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. ఈ ధర ప్రకారమే వ్యాపారులు కొనాల్సి ఉంటుందని, ఈ మేరకు నేడో రేపో అధికారిక గజిట్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ఆయన వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తర్వాత మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'బీటీ-3 పత్తిపంటకు వినియోగించే గ్లైపోసేట్ పురుగుల మందును వచ్చే జూన్ నుంచి నవంబరు వరకు నిషేధిస్తున్నాం. దేశంలో కేరళ తర్వాత ఈ మందును నిషేధిస్తున్న రెండో రాష్ట్రం మనదే. రాష్ట్రంలో మిగిలిపోయిన మినుములను మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయడంపై ఒకటి రెండ్రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నాం. మెగా సీడ్ పార్క్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమైంది. మూడో విడత రుణమాఫీ రూ.3,629 కోట్లకుగానూ ఇప్పటివరకూ రూ.2,875 కోట్లు పంపిణీ చేశాం' అని మంత్రి వివరించారు. భూసార పరీక్షల కార్డుల పంపిణీలో ఏపీ దేశంలో వరుసగా రెండో ఏడాది తొలిస్థానంలో నిలిచిందని, మామిడి, బొప్పాయి, పసుపు, నిమ్మ, టమాటా, మిర్చి వంటి పంటల ఉత్పత్తిలో రాష్ట్రంలో దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు.

శ్రీసిటీకి చైనా పరిశ్రమ

ఏపీఈడీబీతో ఒప్పందం

ఈనాడు, అమరావతి: చైనా ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీలో 18 ఎకరాల్లో సోలార్ పీవీసీ తయారీ పార్కును అభివృద్ధి చేయనుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలితో బుధవారం ఒప్పందం చేసుకుంది. బీజింగ్ కేంద్రంగా పనిచేసే ఈ సంస్థలో 1.50 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. దీనికి పలుచోట్ల పరిశోధనా సంస్థలున్నాయి. మన రాష్ట్రంలో ఏర్పాటు చేసే పార్కులో తొలి దశలో 300 మందికి, మొత్తంగా 1,500 మందికి ఉపాధి కల్పించనుంది. శ్రీసిటీకి ఇప్పటికే ప్రపంచ స్థాయి సంస్థలు వచ్చిన విషయాన్ని ఏపీఈడీబీ సీఈవో జె.కృష్ణకిషోర్ ఈ సందర్భంగా వివరించారు.

చురుగ్గా జీఎస్ఎల్‌వీ-ఎఫ్08 పనులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: జీఎస్ఎల్‌వీ-ఎఫ్08 అనుసంధాన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జీఎస్ఎల్‌వీ వాహకనౌకను షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి వచ్చే నెలలో నింగిలోకి పంపనున్నారు. ఇప్పటికే బెంగళూరు నుంచి ఎల్40 మోటార్లు షార్‌కు చేరాయి. ఇందులో మూడు మోటార్లు వినియోగానికి సిద్ధంగా ఉన్నాయి. మరొక దానికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 22 నుంచి ఎల్40లను అనుసంధానం చేయనున్నారు. వారం రోజుల్లో తమిళనాడులోని మహేంద్రగిరి నుంచి క్రయోస్టేజీ రానుంది. రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వ్యాబ్‌లో జీఎస్ఎల్‌వీ మొదటి దశ పనులు పూర్తి చేశారు. ఈ రాకెట్ ద్వారా జీశాట్-6ఎ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు.

పూత ఘనం.. ఆకు మాయం!



తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామం వద్ద ఆకులు కనబడనంతగా పూతపూసిన మామిడి చెట్టు. పూత కారణంగా తెల్లగా కనిపిస్తున్న ఈ మామిడి చెట్టు అటుగా వెళ్లే వారిని విపరీతంగా ఆకర్షిస్తోంది.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

దేశానికి '3జీ'ని పరిచయం చేశా..!

కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా ట్వీట్

ఈనాడు డిజిటల్, చెన్నై: దేశానికి '3జీ'ని పరిచయం చేసింది తానేనని '2జీ' స్పెక్ట్రం కుంభకోణం కేసులో ఇటీవల నిర్దోషిగా బయటపడ్డ కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా పేర్కొన్నారు. ట్విట్టర్‌లో ఖాతాను తెరిచిన ఆయన తొలి ట్వీట్ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న సామాజిక మాధ్యమాలు తాను పరిచయం చేసిన 3జీ స్పెక్ట్రంతోనే నడుస్తున్నాయని అందులో వ్యాఖ్యానించారు. ట్విట్టర్‌లో ఖాతా తెరవడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు 2జీ స్పెక్ట్రం కేసుకు సంబంధించి '2జీ సాగా అన్‌ఫోల్డ్స్' పేరుతో హర్ ఆనంద్ పబ్లికేషన్స్ రూపొందించిన ఓ పుస్తకాన్ని ఈ నెల 19వ తేదీన దిల్లీలో ఆవిష్కరించనున్నారు. టెలికం మంత్రిగా తాను తీసుకొచ్చిన సంస్కరణలు, కేసు సందర్భంగా ఎదుర్కొన్న ఇబ్బందులను రాజా ఆ పుస్తకంలో ప్రస్తావించినట్లు సమాచారం.

చట్టాలను గౌరవించని వారిని అనర్హులుగా ప్రకటించాలి

- కోడి పందేలపై శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్

రాయవరం, న్యూస్‌టుడే: శాసనసభల్లో చేసిన చట్టాలను ప్రజాప్రతినిధులే గౌరవించకపోవడం సహేతుకమూ సత్సంప్రదాయమూ కాదని శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం వెదురుపాకలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. చట్టాలను గౌరవించని వారిని ఎన్నికల సంఘం అనర్హులుగా ప్రకటించేలా నిబంధన వస్తేనే ప్రజాప్రతినిధులు చట్టానికి లోబడి నడచుకుంటారన్నారు. కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహించడమే సంప్రదాయమనుకుంటే తదనుగుణంగా పండుగ మూడు రోజులూ ప్రత్యేకంగా వెసులుబాటు కోరుతూ చట్టసభల్లో చట్టం చేసుకోవాల్సిందన్నారు. కత్తులు కట్టి కోళ్లతో పందేలు నిర్వహించడం జీవహింసేనని, వ్యక్తిగతంగా దీనికి తాను తీవ్ర వ్యతిరేకినన్నారు. పందేల పేరుతో నిర్వహించే ఆటలతో మధ్య, దిగువ తరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి నాశనమవుతోందన్నారు. కోళ్లతో ఫొటోలకు పోజులివ్వడం నాయకులకు ఫ్యాషన్‌గా మారిందని, దీనిని అందరూ వ్యతిరేకించాల్సిందేనని బుద్ధప్రసాద్ పేర్కొన్నారు.

కాలిన గాయాల బాధితులకు కేంద్రం ఆసరా!

- రాష్ట్రంలోని ఆరు వైద్య కళాశాలల్లో ప్రత్యేక వార్డుల ఏర్పాటు
- ఒక్కో దానికి రూ.6.57 కోట్లు మంజూరు


గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే

అగ్నిప్రమాద బాధితులకు అత్యవసర వైద్యం అందించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రతి కళాశాలకు రూ.6.579 కోట్లు మంజూరు చేశారు. ఈ మొత్తంలో కేంద్రప్రభుత్వం 75, రాష్ట్రప్రభుత్వం 25శాతం భరించనున్నాయి. కళాశాలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రిలో ఆరంభించే ప్రత్యేక వార్డులో 12 పడకలుంటాయి.

67 వైద్య కళాశాలలు.. రూ.450 కోట్లు: కేంద్ర సర్కారు గణాంకాల ప్రకారం మలేరియా, క్షయ బాధితుల కంటే కాలిన గాయాలతో మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దేశవ్యాప్తంగా అనేక ప్రభుత్వాసుపత్రుల్లో తక్కువ శాతం కాలిన వారికే చికిత్స సదుపాయం ఉన్నట్లు గుర్తించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ బర్న్ ఇంజురీస్(ఎన్‌పీపీఎంబీఐ) కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని అమలుకు రూ.450కోట్లు కేటాయించింది. దేశ వ్యాప్తంగా 67 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఎంపికచేసి అక్కడ వసతులను పరిశీలించేందుకు నిపుణులతో కమిటీని ఏర్పాటుచేసింది. దాని నివేదిక ఆధారంగా రాష్ట్రం నుంచి విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, కర్నూలు వైద్య కళాశాలలను ఎంపికచేశారు.

మరణాలు తగ్గించేందుకు..: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రత్యేక వార్డు లేనందున కాలిన గాయాలతో వచ్చిన రోగులకు అరకొర సదుపాయాలతో చికిత్స అందించాల్సి వస్తున్నట్లు కమిటీ పరిశీలనలో తేలింది. దీనివల్లే మృతుల సంఖ్య ఎక్కువగా ఉంటున్నట్లు కేంద్రం అంచనాకు వచ్చింది. మరణాలు తగ్గించడంతో పాటు, వైకల్యానికి గురికాకుండా ఈ బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు ప్రత్యేక వార్డుల ఏర్పాటుకు ముందుకొచ్చింది. వీటిల్లో మత్తుమందు నిపుణులు, జనరల్/ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగాల నిపుణులతో పాటు అనుభవజ్ఞులైన నర్సింగ్ సిబ్బంది సేవలందించనున్నారు. రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు(అకడమిక్) బాబ్జీ మాట్లాడుతూ ప్రత్యేక వార్డుల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ వాటాకు సంబంధించిన నిధులను విడుదల చేయాల్సిందిగా ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అవి రాగానే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.


విద్యాదీశతీర్థ


విశ్వేశతీర్థ

శ్రీకృష్ణుడి కొత్త సేవకుడిగా విద్యాదీశతీర్థ

ఉడుపి, న్యూస్‌టుడే: కర్ణాటకలోని ఉడుపిలో శ్రీకృష్ణుడి సేవకుడిగా పలిమారు మఠాధిపతి విద్యాదీశతీర్థ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ హోదాలో ఆయన రెండేళ్లపాటు ఉంటారు. తెల్లవారుజామున శ్రీకృష్ణ మఠంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రస్తుత పర్యాయ మఠాధిపతి విశ్వేశతీర్థ ఆయనకు బాధ్యతలు అప్పగిస్తారు. సంప్రదాయంగా మధ్వాచార్యుడి కాలం నుంచి వస్తున్న అన్నం గరిటె, అక్షయపాత్రను అప్పగించడంతో పర్యాయ ప్రక్రియ ప్రధాన ఘట్టం ముగుస్తుంది. మధ్వాచార్యుడు కూర్చున్న ఆసనంపై ఆసీనులై నూతన బాధ్యతను స్వీకరిస్తారు. అనంతరం మఠాధిపతుల సమక్షంలో పర్యాయ దర్బార్ నిర్వహిస్తారు. పర్యాయ ఉత్సవాల కోసం ఉడుపి పట్టణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు 'ఈఎస్ఐ'పై తేల్చండి

- విజయవాడ నగరపాలిక, కార్మిక రాజ్యబీమా అధికారులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: విజయవాడ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, స్వయం సహాయక బృంద సభ్యులకు కార్మిక రాజ్యబీమా చట్టం(ఈఎస్ఐ) వర్తింపజేసే వ్యవహారంపై విచారణ చేపట్టాలని హైకోర్టు స్పష్టంచేసింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్.. ఫిబ్రవరి రెండున ఈఎస్ఐ అధికారుల ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఆయన సమర్పించే పత్రాల్ని పరిశీలించి విచారణ జరపాలని ఈఎస్ఐ ఉన్నతాధికారులకు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సాధ్యమైనంత త్వరగా.. ఫిబ్రవరి 2 నుంచి 4 వారాల్లో తగిన ఉత్తర్వులు జారీచేయాలని ఈఎస్ఐ అధికారుల్ని ఆదేశించింది. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్ఐ చట్టం వర్తింపునకు విజయవాడ నగరపాలిక చెల్లించాల్సిన వాటా సొమ్ము విషయాన్ని పరిశీలించి చట్ట ప్రకారం తగిన ఆదేశాలు జారీచేయాలని ఈఎస్ఐ సహాయ డైరెక్టర్‌ను ఆదేశించింది. కార్మికులకు చెల్లించాల్సిన వాటా సొమ్ము విషయమై గతంలో ఈఎస్ఐ అధికారులు జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేసింది.

ఇదీ నేపథ్యం...: ఈఎస్ఐ చట్టం కింద పారిశుద్ధ్య కార్మికులకు విజయవాడ నగరపాలిక సొమ్ము చెల్లించాలంటూ ఈఎస్ఐ అధికారులు ఉత్తర్వులు జారీచేయడాన్ని సవాలు చేస్తూ ఆ నగరపాలక సంస్థ కమిషనర్ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్. వ్యవహారంపై వాదనలు వినిపించేందుకు మున్సిపల్ కార్పొరేషన్‌కు అవకాశం ఇవ్వాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈఎస్ఐ చట్టం సమగ్ర విచారణ జరపాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుందన్నారు. అపరిష్కృతంగా ఉన్న క్రమబద్ధీకరణకు నోచని పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్ఐ చట్టం వర్తింపుపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు.

22 నుంచి అఖిల భారత పులుల గణన

ఈనాడు–అమరావతి: అఖిల భారత పులుల గణన(ఏఐటీఈ)-2018 తొలిదశ ఈ నెల 22 నుంచి 27 వరకు జరగనుంది. ఇందులో భాగంగా విశాఖపట్నం, తిరుపతి, శ్రీశైలం రేంజిల పరిధిలో సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలను అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.మల్లికార్జునరావు జారీ చేశారు. ఫిబ్రవరి 6 నాటికి అంచనాలు పూర్తి చేసి వివరాలను సమర్పించాల్సి ఉంటుంది.

ఈనాడు

కుంగిపోయిన పునాదులు

అక్షరగంధం దక్కని, నైపుణ్యాలు ఒంటపట్టని ఏ పౌరుడైనా జాతి నిర్మాణ క్రతువుకు సంబంధించినంతవరకు- కేవలం, వట్టి ముడిసరకు. విద్యార్జనతో పదును తేలి, సరైన జీవికకు బాటలు నిర్మించుకోగలవారే సమర్థ మానవ వనరులుగా, భావి నిర్దేతలుగా వన్నె కెక్కుతారు. దేశంలోని 14-18 ఏళ్ల గ్రామీణ విద్యార్థుల అభ్యసన స్థాయి ప్రమాణాలపై తాజాగా వెలుగుచూసిన అధ్యయన నివేదిక, యువ భారతావని ఎంతటి దుస్థితిలో కూరుకుపోయిందో దిగ్భ్రాంతకర వాస్తవాలు వెల్లడించింది. వారిలో సగంమందికి పైగా మూడంకెల భాగహారాలు చేయలేకపోతున్నారు. 25 శాతం యువతీ యువకులు మాతృభాషలోని అంశాలనే తడబడకుండా చదవలేకపోతున్నారు. 36 శాతానికి దేశ రాజధాని పేరే తెలియదు. గడియారం చూసి సమయం చెప్పలేనివారు 40 శాతం, దేశ పటంలో సొంత రాష్ట్రాన్ని గుర్తించలేనివాళ్లు 58 శాతం... దేశార్థిక ప్రగతికి చోదకశక్తిగా ఈ మిడిమిడి జ్ఞానం సరకు ఎలా అక్కరకొస్తుంది? దేశవ్యాప్తంగా తరతమ భేదాలతో చదువుల పునాదులు గుల్లబారి, విద్యారంగం అధ్వానంగా తయారైందనడానికి దాఖలాలివి. పాఠ్యాంశాల ఎంపిక, విద్యాప్రణాళికల కూర్పు, బోధన సిబ్బంది పనిపోకడలు, అభ్యసన విధివిధానాలు... అన్నింటా కంతల్ని ప్రస్ఫుటీకరిస్తున్న చేదునిజాలివి. ప్రాథమిక విద్యాబోధనకు విశేష ప్రాధాన్యం సమకూరితే బాల్యంలో గట్టిపునాది ఏర్పడి అనంతర చదువుల్లో అవకాశాలు ఒడిసిపట్టడంలో విద్యార్థులు మెరుగ్గా రాణించగలుగుతారు. దశాబ్దాల దారుణ అలక్ష్యం కారణంగా సమకాలీన యువభారతంలో అసంఖ్యాకులు అటువంటి సౌభాగ్యానికి నోచుకోలేదని వార్షిక విద్యాస్థాయి నివేదిక (అసర్) ఎలుగెత్తుతోంది. తక్షణ దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను తెలియజెబుతున్న పెనుప్రమాద ఘంటికలను ఏ బాధ్యతాయుత ప్రజాప్రభుత్వమూ ఉపేక్షించజాలదు!

స్వచ్ఛంద సంస్థ 'ప్రథమ్' పర్యవేక్షణలో అసర్ విశ్లేషణలు, రాష్ట్రాల విద్యా పరిశోధన శిక్షణ మండళ్ల (ఎస్‌సీఈఆర్‌టీల) అధ్యయనాలు ఎప్పటికప్పుడు విద్యాప్రమాణాల పతనాన్ని కళ్లకు కడుతూనే ఉన్నాయి. అయిదో తరగతి విద్యార్థులు తమ పేరు సైతం సరిగ్గా రాయలేకపోతున్న దీనావస్థ, ఏడో తరగతి పిల్లల్లో నాలుగొంతుకు పైగా రెండో తరగతి పాఠాలనైనా చదవలేని దుర్గతి... గతంలో అలా బహిర్గతమైనవే. 2011 నాటి జనగణన ప్రకారం ప్రతి పదిమంది భారతీయుల్లో ఒకరు 14-18 ఏళ్ల వయస్కులే. ఆ లెక్కన సుమారు పన్నెండున్నర కోట్లుగా తేలే యుక్తవయస్కులపై 24 రాష్ట్రాలకు చెందిన 28 జిల్లాల్లో మొట్టమొదటిసారి 'ప్రథమ్' చేపట్టిన సర్వే, విద్యాప్రమాణాల క్షీణత మరింత ఆందోళనకరంగా ఉన్నట్లు స్పష్టీకరిస్తోంది. ఆ వయసు పిల్లల అభ్యసన స్థాయి అలా అఘోరిస్తుండబట్టే- వివిధ పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూల్లో సింహభాగం తప్పొతాలుగా వడపోతకు గురవుతుండటం చూస్తున్నాం. పదో తరగతి విద్యార్హతతో నిర్వహించే ఉద్యోగ పరీక్షల కోసం పట్టభద్రులు, స్నాతకోత్తర పట్టభద్రులు సైతం మళ్లీ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న బాగోతాలకు మూలాలు 'ప్రాథమిక' దశలోనే ఉన్నాయి! సుమారు మూడేళ్ల క్రితం ఐక్యరాజ్య సమితి తీర్మానించినట్లు 'యువత సాధికారతను, ఆత్మగౌరవాన్ని పెంపొందించడంలో నైపుణ్యాభివృద్ధి పాత్ర ఎనలేనిది! చిన్నపాటి లెక్కలు చేయడంలో, కనీస లౌకిక పరిజ్ఞానం ఆర్జించడంలో విఫలమవుతున్న విద్యార్థులు- ఆ బలహీన పునాదులపై నైపుణ్యాల సౌధాన్ని ఎలా నెగ్గుకొస్తారు? కనుకనే వృథావనరులుగా బ్రహ్మపట్టీ తమకు తామే బరువై, జాతికి గుదిబండలుగా తయారవుతున్నవాళ్ల సంఖ్య చిలవలు పలవలు వేసుకుపోతోంది.

సర్ కెన్ రాబిన్‌సన్ అనే బ్రిటిష్ విద్యావేత్త లోగడ అభిప్రాయపడినట్లు- 'ప్రకృతి వనరుల్లాగే మానవ వనరులూ ఎక్కడో దాగి ఉంటాయి... వాటంతట అవి వెలుగులోకి వచ్చే పరిస్థితుల్ని ప్రభుత్వాలు కల్పించాల్సి ఉంటుంది'. మానవ వనరులపై పెట్టుబడులు పెంచితేనే జాతి ఉత్పాదకత ఇనుమడిస్తుందంటూ- సుశిక్షిత, వృత్తి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులెంత కీలకమో నిరుటి కేంద్ర ఆర్థిక సర్వే విశదీకరించింది. ఉపాధ్యాయుల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోనట్లయితే తరాలకు తరాలే నష్టపోతాయని ఆ మధ్య డెబ్బైఏడో ఐపీఎస్‌సీ (ఇండియన్ పబ్లిక్ స్కూల్ కాన్ఫరెన్స్) తన వంతుగా ఉద్బోధించింది. వాస్తవానికి ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, బెల్జియం, సింగపూర్, నెదర్లాండ్స్ ప్రభృత దేశాల్లో ప్రాథమిక చదువులు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ప్రశంసలందుకోవడానికి పాఠ్యప్రణాళికలు, బోధన సిబ్బంది ఎంపిక శిక్షణల్లో తీసుకుంటున్న జాగ్రత్తలదే నిర్ణాయక భూమిక. దేశీయంగా అందుకు విరుద్ధ స్థితిగతులు ఏళ్ల తరబడి వేళ్లూనుకున్నాయి. కొత్త సవాళ్లకు దీటుగా విద్యార్థుల అవగాహన, నైపుణ్యాలను ఇనుమడింపజేయడంపై నూతన జాతీయ విద్యావిధాన దృష్టి కేంద్రీకరించనుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. 2022 నాటికి భిన్న రంగాల్లో 40 కోట్లమందిని పటుతర నిపుణ శక్తులుగా తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ అభిలషిస్తున్నారు. అందుకు సన్నాహకాలు ప్రాథమిక దశ నుంచీ ఊపందుకోవాలి. అట్టడుగు నుంచి పైదాకా విద్యావ్యవస్థను పరిపుష్టీకరించి, సమధిక కేటాయింపులు ప్రసాదించి, నాణ్యమైన బోధన సిబ్బందిని కొలువు తీర్చాలి. దక్షిణ కొరియా, ఫిన్లాండ్ వంటి దేశాలకు దీటుగా భారత్‌లో అత్యుత్తమ ఉపాధ్యాయ విద్య గరపడానికి- ఐఐటీలు, ఐఐఎమ్‌ల స్థాయి విశిష్ట సంస్థనొకదాన్ని సత్వరం నెలకొల్పాలి. సుదృఢ విద్యాసౌధ నిర్మాణం పునాది స్థాయి నుంచీ సవ్యంగా పట్టాలకు ఎక్కితేనే మానవాభివృద్ధి సూచీల్లో భారత్ తేరుకొంటుంది; పురోగామి దేశాలతో పోటీపడగలుగుతుంది!



దారితప్పిన వ్యవస్థలు ప్రవాసులకు అవస్థలు

'వారికి ఏ అర్హతలూ ఉండవు. బోగస్ కంపెనీల పేరు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఉపాధి కల్పిస్తామంటారు. ఇలా అమాయక ప్రజలను మభ్యపెట్టి విదేశాలకు తీసుకెళ్లి మోసం చేస్తున్న నకిలీ ఏజెంట్లు ఎందరో. ప్రభుత్వపరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇది చాలా తీవ్ర సమస్య. దేశంకాని దేశంలో చిక్కుకున్నవారికి కష్టాలు, బాధిత కుటుంబాలకు మానసిక క్షోభ మిగులుతున్నాయి. దేశానికీ దౌత్యపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి'- ఈ నెల పదో తేదీన కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ అన్ని రాష్ట్రాల మంత్రుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలివి. దొంగ ఏజెంట్ల నిర్వాకాలను తీవ్రంగా ఎండగట్టారు. వలసల్లో జరుగుతున్న మోసాల నిరోధానికి తక్షణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకతను కేంద్ర మంత్రి వ్యాఖ్యలు ప్రస్ఫుటీకరించాయి.

అవగాహనా లోపమే శాపం

భారత్ నుంచి విదేశాలకు ఏటేటా వలసలు అధికమవుతున్నాయి. నిరుడు దాదాపు రెండు కోట్లమంది మెరుగైన ఉపాధి అవకాశాలు వెదుక్కొంటూ విదేశాలకు పయనమయ్యారు. గల్ఫ్ వంటి పశ్చిమాసియా దేశాలకు వెళ్లేవారిలో అనేకులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. అమెరికా వంటి దేశాల్లో నిబంధనలు కఠినంగా ఉంటాయి. కాబట్టి అక్రమ వలసలు తక్కువగా ఉంటున్నాయి. గల్ఫ్ దేశాలకు మాత్రం అడ్డదారి వలసలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఏజెంట్ల మాయాజాలం, వలసదారుల అవగాహన లోపాలే ఇందుకు ప్రధాన కారణాలు. గల్ఫ్ దేశాల్లో ఏటా 20 లక్షల మందికి పైగా అక్రమ వలసదారులను గుర్తిస్తున్నారు. నేరుగా పాస్‌పోర్టు, వీసాను పొంది విదేశాలకు వెళ్లడం కష్టమనే తప్పుడు భావన ప్రచారంలో ఉంది. ఏజెంట్ల ఆగడాలకు ఇదే కారణమవుతోంది. చాలా మంది ఏజెంట్లకు గుర్తింపు లేదు. అయినా గ్రామస్థాయి నుంచి నగరాల వరకు వారు నేరుగా కార్యాలయాలు తెరిచి దందా సాగిస్తున్నారు. 1983నాటి కేంద్ర ప్రభుత్వ వలసల చట్టం ప్రకారం ఏజెంట్లు తమ వివరాలను విధిగా నమోదు చేసుకోవాలి. రూ.50 లక్షల బ్యాంకు పూచీకత్తు, రూ.25 వేల రుసుమును చెల్లించాలి. విచారణ అనంతరం కేంద్రం వారిని ఏజెంటుగా నమోదు చేస్తుంది. ఈ గుర్తింపు అయిదేళ్లపాటు ఉంటుంది. ఏజెంట్లుగా చెప్పుకొంటున్నవారు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ఎనిమిదివేలకు పైగా అనధీకృత ఏజెంట్లు ఉన్నారు. వారి గుర్తింపు వ్యవహారం కేంద్ర పరిధిలోని అంశమంటూ రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చినా పోలీసులు స్పందించడం లేదు. చట్టాల్లోని లోపాలు, యంత్రాంగాల వైఫల్యాలను ఆసరా చేసుకొని ఏజెంట్లు అక్రమాలకు పాల్పడుతున్నారు.

విదేశాల్లో ఉద్యోగాల కోసం ముందుగా వీసా పొందాలి. ఆయా సంస్థలు నేరుగా వచ్చి ఎంపిక చేసుకున్న తరవాత వీసాలు జారీచేయడం ఒక విధానం. ఏజెంట్లే సంస్థల పేరిట వీసాలు ఇవ్వడం మరో పద్ధతి. ఇక్కడే లేని సంస్థల పేర్లు చెప్పి ఏజెంట్లు ఉద్యోగార్థులను నమ్మిస్తారు. రెండు లక్షల నుంచి అయిదు లక్షల రూపాయల వరకు వసూలు చేస్తారు. పర్యాటక, సందర్శక, వైద్యచికిత్సల వీసాలను తీసుకొని వాటి ద్వారా ఉద్యోగాలు వస్తాయని నమ్మిస్తున్నారు. తీరా విదేశాలకు వెళ్లిన తరవాత అసలు నిజాలు తెలుస్తాయి. అప్పటికి ఏజెంట్ల జాడ ఉండదు. ఫోన్లను ఆపేస్తారు. కొన్ని రోజులు కార్యాలయాలు మూసేస్తారు. ఏం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. కుటుంబీకులు ఆందోళన చెందుతారనే కారణంతో చాలామంది దాన్ని దాస్తారు. అవకాశం ఉన్నప్పటికీ, భయం వల్ల రాయబార కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు సైతం చేయరు. గల్ఫ్, ఇతర పశ్చిమాసియా దేశాల్లో పెద్దయెత్తున మోసాలు జరుగుతున్నా ఫిర్యాదులు అతి తక్కువగా వస్తున్నాయి. నిరుడు భారతీయుల నుంచి కేవలం 92 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. కొందరి వీసాల గడువు ముగిసినా, టకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. అక్కడ రాయబార కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుల కంటే, మన దేశంలోని కుటుంబీకులు ఇక్కడి ప్రభుత్వాలకు చేసే ఫిర్యాదులే అధికంగా ఉంటున్నాయి.

రాయబార కార్యాలయాల నిస్సహాయత

మోసాలను నియంత్రించడంలో రాయబార కార్యాలయాలు నిస్సహాయంగా ఉండిపోతున్నాయి. ఆంగ్లం, హిందీ తెలిసినవారే రాయబార కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. ప్రాంతీయ భాషలు తెలిసినవారు ఉండటం లేదు. హిందీయేతర భాషల్లో బాధితులు చెప్పే విషయాలను వారు అర్థం చేసుకోలేకపోతున్నారు. యాజమాన్యాల నుంచి వేతనాలు ఇప్పించే సాహసం చేయడం లేదు. ప్రమాదాల సమయంలో అండగా నిలవడం లేదు. శవాలను పంపించడానికి సైతం చొరవ చూపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న సందర్భాల్లోనే రాయబార కార్యాలయాలు స్పందిస్తున్నాయి. గల్ఫ్ దేశాల్లో క్షమాభిక్షల సందర్భంగానూ రాయబార కార్యాలయాల తీరు సరిగ్గా ఉండటం లేదు. క్షమాభిక్షల సమయంలో అక్కడ అక్రమంగా కొనసాగుతున్నవారిని గుర్తించి తిప్పిపంపడానికి అవకాశాలున్నాయి. బాధితుల వద్ద వీసాలు, పాస్‌పోర్టులు లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. విమానాల టికెట్ల కోసం సాయం అందజేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు వారిని సంప్రతించి, డబ్బులు చెల్లించేందుకు ముందుకు వచ్చినప్పుడే రాయబార కార్యాలయాల్లో కదలిక వస్తోంది. అక్రమంగా ఉన్నవారిని గుర్తించేందుకు రాయబార కార్యాలయాలు ప్రయత్నించడం లేదు. విదేశాల్లో కేవలం ఉద్యోగార్థులే కాకుండా వివిధ విశ్వవిద్యాలయాల్లో చదివేందుకు వెళ్లే విద్యార్థులు సైతం మోసపోతున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ వంటి దేశాల్లో ఇవి జరుగుతున్నా ఆయా రాయబార కార్యాలయాలు విద్యార్థులను అప్రమత్తం చేయడానికి ముందుకు రావడం లేదు. ఖతార్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించినప్పుడు అక్కడి బాధితులు తమ సమస్యలను నేరుగా ఫిర్యాదు చేశారు. రాయబార కార్యాలయాల వైఫల్యాలకు ఇదో ఉదాహరణ.



సౌదీలో రాయబార కార్యాలయం వద్ద భారతీయులు పడిగాపులు (పాతచిత్రం)

దళారుల మోసాలు అడ్డుకునే తీరిది...

చేతుల్లో డబ్బులు లేక, స్వదేశానికి రావడానికి మొహం చెల్లక, అప్పులవాళ్లు వేధిస్తారనే భయంవల్ల అక్కడే భయభయంగా రహస్యంగా జీవిస్తున్నారు. తిండి దొరక్క పస్తులుంటున్నారు. ప్రమాదాల బారినపడి మరణించేవారి సంఖ్యా ఎక్కువగానే ఉంటోంది. ఎడారుల్లో, ఇళ్లల్లో, సంస్థల్లో చాలీచాలని వేతనాలతో బతుకులు నెట్టుకొస్తున్నవారు ఎందరో. వేతనాలు సకాలంలో అందవు. అడిగితే యాజమాన్యాలు వారిని బయటికి గెంటేస్తున్నాయి. నిలదీస్తే జైళ్లలో పెట్టిస్తున్నాయి. వీసాలు, పాస్‌పోర్టులను లాక్కుంటున్నాయి. పరిస్థితి విషమంగా మారిన తరవాతే కొందరు బయ

విదేశాలకు భారతీయుల వలసల తీరు(లక్షల్లో)

సంవత్సరం	వలసలు	సంవత్సరం	వలసలు
2006	83	2011	140
2007	98	2012	150
2008	109	2013	160
2009	110	2014	180
2010	130	2015	200
		2016	215

శాశ్వత పరిష్కారం అవసరం

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత అక్రమ వలసల నిరోధంపై దృష్టి సారించింది. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ శాశ్వత పరిష్కారాల కోసం కృషి చేస్తున్నారు. ఫిర్యాదులకు సత్వరం స్పందిస్తున్నారు. విదేశీ కార్మికుల వనరుల కేంద్రాల ఏర్పాటుతో పాటు బీమా యోజన, భారతీయ సమాజ సంక్షేమ నిధి వంటి పథకాలు చేపట్టారు. ఏజెంట్ల అక్రమాల నిరోధానికి అన్ని రాష్ట్రాల మంత్రులతో సమావేశం నిర్వహించారు. విదేశీ ఉద్యోగాల పేరిట జరిగే మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఎవరైనా విదేశాల్లో రెండుసార్లు మోసపోయినట్లు రుజువైతే అయిదేళ్లపాటు వారి పాస్‌పోర్టులను రద్దు చేయాలని నిర్ణయించింది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపాయి. పరిష్కారం కావాల్సిన సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా విదేశాల్లోని ప్రవాస భారతీయుల నమోదు ఇప్పటివరకు పట్టాలకెక్కలేదు. విమానాశ్రయాల్లో వలసల (ఇమ్మిగ్రేషన్) విభాగం నమోదు చేసే గణాంకాలే అందుబాటులో ఉన్నాయి. ఎంతమంది అక్రమంగా ఉన్నారు, వారి సమస్యలను ఎలాతీర్చాలనే అంశాలపై దృష్టి సారించాలి. ఏజెంట్ల నమోదు విధానాన్ని సరళీకృతం చేస్తే అందరూ దీనికి ముందుకు వచ్చే వీలుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరం. అన్ని రాష్ట్రాల్లో విదేశీ భవన్‌లు నిర్మించాలి. అక్కడే విదేశాలకు వెళ్లేవారి వివరాలను విధిగా నమోదు చేయాలి. వివిధ శాఖలకు సంబంధించి ఫిర్యాదుల కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు టోల్‌ఫ్రీ నంబర్‌తో సహాయక కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. విదేశాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం మరో టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తేవాలి. విదేశీ ఉద్యోగాల కోసం కేంద్ర ప్రభుత్వం తరఫున ఓ నియామక సంస్థను ఏర్పాటు చేయాలి. తెలంగాణలో టామ్‌కామ్ పేరిట విదేశీ మానవవనరుల సంస్థను ఏర్పాటు చేశారు. విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని, అభ్యర్థులకు తగు సమాచారం ఇచ్చి, అర్హతలు గలవారికి శిక్షణ అందజేసి విదేశాలకు పంపి ఉద్యోగాలను ఈ సంస్థ ఇప్పిస్తోంది. ఇందులో మోసాలకు తావులేదు. దళారుల బెడద లేదు. కేంద్రమే ఇలాంటి సంస్థలను ఏర్పాటు చేయాలి. పదే పదే మోసాలకు పాల్పడుతున్న ఏజెంట్లపై ముందస్తు నిర్బంధ (పీడీ) చట్టం ప్రయోగించడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. పశ్చిమ్ బంగ, మహారాష్ట్ర, తెలంగాణల్లో మానవ అక్రమణ రవాణా నిరోధానికి ప్రవాసుల శాఖ, మైనారిటీ, పోలీసు శాఖలు సంయుక్త బృందాలను ఏర్పాటు చేశాయి. ప్రవాసుల సంక్షేమానికి కేరళ ఆదర్శనీయమైన చర్యలు చేపట్టింది. వీటన్నింటిని కేంద్రం ప్రోత్సహించాలి. 'ప్రవాసులు మనదేశ ఘన చరిత్ర, సంస్కృతులను అంతర్జాతీయంగా చాటుతున్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తాం. అన్ని విధాలుగా అండగా ఉంటాం' అని ప్రధాని మోదీ ప్రవాసీ దినోత్సవం సందర్భంగా హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా పకడ్బందీ చర్యలకు సత్వరం ఉపక్రమించాలి.

- ఆకారపు మల్లేశం

భద్రత కరవైన బాల్యం

దత్తత పేరుతో పనివాళ్లను విక్రయించడం దారుణమని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా వ్యాఖ్యానించింది. దేశంలో అనాథాశ్రమాల నిర్వహణ, చిన్నారులను సంరక్షిస్తున్న తీరు దత్తత నిబంధనల అమలు సంబంధిత వివరాలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమకు అందజేయాలని ఆదేశించింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం (ఎన్‌సీపీసీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా, న్యాయమూర్తులు ఏఎం ఖాన్విల్కర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారించింది. పశ్చిమ్ బంగలో అనాథ బాలల హక్కుల ఉల్లంఘనకు సంబంధించి ఎన్‌సీపీసీఆర్ జారీచేసిన ఆదేశాలను కోల్‌కతా హైకోర్టు నిలుపుదల చేసింది. దీన్ని సవాల్‌చేస్తూ ఎన్‌సీపీసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై 'సుప్రీం' ఉత్తర్వులు వెలువరించింది. అనాథాశ్రమాల నిర్వాహకులు తమ ఇష్టప్రకారం చిన్నారులను దత్తతకు ఇచ్చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. కేసు పరిధిని పశ్చిమ్‌బంగకే పరిమితం చేయకుండా అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తూ ఆదేశాలు వెలువరించింది. ఈ నేపథ్యంలో దేశంలో చిన్నారుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ దత్తత చట్టానికి పదును పెట్టింది. దానిప్రకారం హిందూ దత్తత, నిర్వహణ చట్టం (హెచ్ఏఎమ్ఏ) కింద పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. హిందూ, బౌద్ధ, జైన, సిక్కులు దత్తత తీసుకున్నప్పుడు 'బాలల దత్తత వనరుల ప్రాధికార సంస్థ (కారా) వద్ద నమోదు చేస్తే, వారికి దత్తత ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. చిన్నారుల దత్తత సమయంలో తోబుట్టువులు ఉంటే వారిని వేరుచేసే అవకాశం ఉంది. చిన్నారుల మనోగతం మేరకే వారిని వేరుచేయాలి. వారికి ఇష్టం లేకపోతే, ఇద్దరినీ దత్తత తీసుకునేందుకు సన్నద్ధంగా ఉండే దంపతులకు అవకాశమిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో అవసరమైతే బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) సలహాలు తీసుకుంటారు. బాలలు, మహిళల అక్రమ రవాణా నిరోధానికి చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు నిర్ణయించాయి. బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా, వీరిని అక్రమ రవాణా చేస్తున్న దోషుల్లో చివరి వ్యక్తికి కూడా శిక్షపడేలా నిబంధనలు ఉండాల్సిన అవసరాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలూ గుర్తించాయి. దీనిపై అధ్యయనం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఒక సలహా సంఘాన్ని నియమించింది. అది రెండు నెలల్లోగా తన నివేదికను స్త్రీ శిశుసంక్షేమశాఖ కార్యదర్శికి అందజేయనుంది.

ఆదుకోని చట్టాలు

అక్రమ రవాణా ద్వారా బాలలను అసాంఘిక, అనైతిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని పలు అధ్యయనాల్లో తేలింది. వెట్టిచాకిరి నిమిత్తం బాలకార్మికులుగా మారుస్తూ వారి స్వేచ్ఛను హరిస్తున్నారు. ఇళ్లలో పని చేసేందుకు, భిక్షాటన కోసం కూడా బాలలను పంపుతూ భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెడుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. తీవ్రవాదం, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల విక్రయం వంటి అసాంఘిక కార్యకలాపాల్లో వీరిని పావులుగా వాడుకుంటున్నట్లు పోలీసు నివేదికలు కుండ బద్దలుకొట్టాయి. పిల్లల అక్రమ రవాణా ముఠాలు వారిని అమ్మకానికి పెడుతున్నాయి. అవయవాల మార్పిడికోసం కూడా అక్రమ వ్యవహారం సాగుతుండటం వెన్నులో వణుకు పుట్టిస్తోంది. మరోవంక దేశవ్యాప్తంగా దత్తత స్వీకారాలు తగ్గిపోవడంపై కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2015లోనే రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తరవాతి ఏడాది లక్ష్యం 20వేలు పూర్తిచేయాలని సూచించింది. 'జువైనెల్ జస్టిస్' (జేజే) చట్టం ఆధారంగా నూతన మార్గదర్శకాలు రూపొందించింది. వాటిపై అవగాహన కల్పించేందుకు దిల్లీలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో అప్పట్లోనే



దారితప్పిన దత్తతలు

ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించింది. అన్ని శిశు సంరక్షణ సంస్థల (సీసీఐ)ను 'జేజే' చట్టం కింద రాష్ట్రాలు నమోదు చేయాలి. ప్రతి జిల్లాలో కనీసం ఒక రాష్ట్ర దత్తత సంస్థను గుర్తించాలి. కేంద్ర దత్తత వనరుల సమాచార వ్యవస్థ (సీఏఆర్ఎన్‌జీఏస్)లో జిల్లా శిశురక్షణ విభాగం (డీసీపీయూ) నమోదును ధ్రువపరచాలి. చట్టవిరుద్ధంగా దత్తత ఇస్తున్న ఆస్పత్రులు, గుర్తింపులేని సీసీఐలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. గడచిన మూడేళ్లుగా దత్తత స్వీకారాల సంఖ్య అత్యంత స్వల్పంగా నాలుగైదు వేలు మాత్రమే ఉండటంపై ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది.

తెలుగు రాష్ట్రాల్లో బాలల అదృశ్యం కేసులు ఏటా పెరుగుతూనే ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. తెలిసీ తెలియక ఇళ్లుదాటినవారు కొందరు; తల్లిదండ్రుల నుంచి తప్పిపోయినవారు మరికొందరు; అక్రమ ముఠాల చేతికి చిక్కిపోయి ఇంకొందరు అదృశ్యమవుతున్నారు. తప్పిపోతున్నవారిలో సగం మంది ఆచూకీ కూడా లభ్యం కావడం లేదు. గత నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 20,140మంది అదృశ్యం కాగా, కేవలం 9,922మంది ఆచూకీయే లభ్యమైంది. అదృశ్యమవుతున్నవారిలో సగటున 63శాతం బాలికలే ఉండటం తీవ్రంగా కలవరపరుస్తోంది. ఇళ్లు వదలి బయటకు వచ్చేసేవారు, అదృశ్యమై బిక్కుబిక్కుమంటూ గడుపుతూ రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఇతర రద్దీప్రాంతాల్లో తిరిగేవారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా ముఠాలు పనిచేస్తున్నాయి. ఇలాంటి పిల్లల్ని గుర్తించి వెట్టిచాకిరి చేయించడం, యాచకవృత్తిలోకి దించటం, మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలు వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని పోలీసు నివేదికలు చెబుతున్నాయి. బాలనేరగాళ్ల సంఖ్య పెరగడానికి ఇది కూడా ఒక కారణమని తేలింది. పట్టణ వీధిబాలల కోసం హైదరాబాద్, ఖమ్మం, విజయవాడల్లో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు గతంలోనే కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. తెలంగాణ ప్రభుత్వం 2017-18 విద్యా సంవత్సరంలో ఖమ్మంతో పాటు అన్ని జిల్లాల్లో 30 గురుకుల పాఠశాలలు ప్రారంభించింది. విద్యాశాఖ నిర్వహణ మార్గదర్శకాలను రూపొందించకపోవడంతో నేటికీ పలు పాఠశాలల్లో పిల్లలు కరవయ్యారు. జాతీయ నేరగణాంక సంస్థ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా తప్పిపోతున్న బాలల్లో తిరిగి లభ్యమవుతున్నవారి సంఖ్య తక్కువగా ఉంది. 2014లో ఆచూకీ లభించినవారి జాతీయ సగటు 59.2శాతం, తెలుగు రాష్ట్రాల్లో అది 50.90శాతమే. 2015లో 55.3శాతం. తెలుగు రాష్ట్రాల్లో అది 47.44శాతం, 2016లో జాతీయ సగటు 56.9శాతం అయితే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి 49.60 శాతమే. 2014 నుంచి 2016వరకూ దేశవ్యాప్తంగా 2,27,763మంది బాలలు అదృశ్యం కాగా, వారిలో 1,30,102మంది ఆచూకీ లభ్యమైందనట్లు లెక్కలున్నాయి.

విష సంస్కృతికి విరుగుడు

భారత్‌లో గడచిన పదేళ్లలో మానవ అక్రమ రవాణా 14రెట్లు పెరగడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 12 లక్షలమంది అక్రమంగా రవాణా అవుతున్నట్లు ఐక్యరాజ్య సమితి సారథ్యంలో మాదకద్రవ్యాలు-నేరాలపై ఏర్పాటైన కార్యాలయ (యూఎన్ఓడీసీ) నివేదిక స్పష్టీకరించింది. దక్షిణాసియాలో ఏటా లక్షన్నర మంది అక్రమ రవాణా బారిన పడుతుండగా, వారిలో ఎక్కువమంది భారత్‌లోనే ఉండటం ఆందోళనపరుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఈ విష సంస్కృతిపై ప్రజల్లో అవగాహన పెంచాలి. దత్తత పేరుతో పిల్లల్ని విక్రయించడం, మభ్యపెట్టి అక్రమంగా తరలించడం వంటి నేరాలను అరికట్టే దిశగా సమాజంలో చైతన్యం తీసుకురావాలి. తరచూ అక్రమ రవాణా బారినపడుతున్న వర్గాలను అప్రమత్తం చేయాలి. సాధ్యమైనంత సత్వరం పేదరికం, అవిద్య, అవకాశాల లేమి వంటి సమస్యల నుంచి విముక్తి ప్రసాదించేందుకు కృషిచేయాలి. పౌరసమాజం, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ప్రైవేటు వ్యవస్థల మధ్య నిర్దిష్ట భాగస్వామ్యాలు నెలకొల్పి సమస్యను కలిసికట్టుగా ఎదుర్కోవాలి.

- నల్లాని రాజేశ్వరి

పవిత్ర మాఘం

పర్వదినాలు అంటే 'పూర్ణిమ' రోజులు. ఇవి దేవతలకు అత్యంత ప్రీతికరమని భక్తులు విశ్వసిస్తారు. మాఘమాసంలో పవిత్ర స్నానాలు చేసి, ఇష్టదైవాల్ని పూజిస్తారు. సాగర తీరాన నివసించేవారు అక్కడ స్నానాదులు ముగించి జపాలు, దానాల వంటి సత్కర్మలు ఆచరిస్తారు. నదీస్నానం చేసినా, అందుకు అవకాశం లేనివారు బావి లేదా చెరువు నీటితో గంగను స్మరిస్తూ స్నానం గావించినా అదీ పుణ్యప్రదమేనని ఓ నమ్మకం.

మాఘమాసంలో మరో నాలుగు పండుగలున్నాయి. మాఘ శుద్ధ అష్టమి మఘా నక్షత్రం నాడు- భీష్మాష్టమి. సప్తమి-సూర్య సప్తమి (రథ సప్తమి). మాఘ బహుళ చతుర్దశి- శివరాత్రి. మాఘ బహుళ అమావాస్య, మాఘ మాసాంతం- ద్వాపర యుగాది.

మాఘశుద్ధ అష్టమి తిథినాడు భీష్ముడు పరమపదించాడు. ఉత్తరాయణం ప్రవేశించిన తరవాత, మాఘ శుద్ధ అష్టమినాడు ఆయన స్వచ్ఛంద మరణం పొందాడని 'మహాభారతం' చెబుతోంది. శ్రీకృష్ణుడు ఆయన దగ్గరే ఉన్నాడు. తన మరణానంతరం వచ్చే ఏకాదశి పుణ్యదినాన్ని 'భీష్మ ఏకాదశి'గా లోకం గుర్తించేలా వరం కోరతాడు భీష్ముడు. కృష్ణుడు అనుగ్రహించాడని 'నారద పురాణం' విశదీకరిస్తోంది. భారత యుద్ధం ముగిశాక, అంపశయ్యమీద ఉత్తరాయణ పుణ్యకాలం వరకు ఉన్న భీష్ముడికి కృష్ణుడు తన వాగ్దానం ప్రకారం దర్శనమిస్తాడు. అప్పుడు భీష్ముడు చేసిన స్తుతి 'భీష్మ స్తవం'గా పేరొందింది. దాన్ని ఆయన 'కృష్ణాయ నమః' అని ముగిస్తాడు. అది శ్రీకృష్ణ మహామంత్రంగా నిలిచిపోయింది.

ఇదే మాసంలో స్మరించాల్సిన పౌరాణిక గాథల్లో మార్కండేయుడి చరిత్ర ఒకటి. అతడికి పరమేశ్వరుడు ప్రసాదించింది పదహారు సంవత్సరాల ఆయుర్దాయమే! అది పూర్తయిన వెంటనే భటుల్ని పంపుతాడు యముడు. ఆ సమయంలో అతడు శివ ధ్యానం చేస్తుండటంతో, భటులు ఆ దరిదాపుల్లకైనా వెళ్లలేకపోతారు. ఒక మహా తేజస్సు వారిని అక్కడి నుంచి తరిమేస్తుంది. విషయం తెలిసి, యమధర్మరాజే అక్కడికి చేరుకుంటాడు. పాశంతో మార్కండేయుడి ప్రాణాలు హరించడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు అతడు శివలింగాన్ని హత్తుకొని, ఆ స్వామిని ధ్యానిస్తాడు. పరమేశ్వరుడు ప్రత్యక్షమై, యముడి పైకి త్రిశూలాన్ని ప్రయోగించి, భక్త మార్కండేయుడికు



చిరంజీవత్వాన్ని ప్రసాదిస్తాడు. అన్నింటికీ మూలం మాఘంలో రోజూ ఉదయమే సాగిన గంగాస్నానం, ఈశ్వర ధ్యానం అని వివరిస్తుంది 'మాఘ పురాణం'.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో స్నానానికి ఎంతో ప్రాముఖ్యముంది. పలు విధాల స్నానాలుంటాయి. అవి- మంత్ర, వాయవ్య, ఆగ్నేయ, కాపిల, వారుణ, ముని మానస స్నానాలు. వేదమంత్రాలు చదువుతూ చేసేది మంత్ర స్నానం. గోధూళి పైన చల్లుకొని చేసే స్నానం వాయవ్యం. విభూతి రాసుకొని చేస్తే ఆగ్నేయం. శరీరం పైభాగాల్ని తడివస్త్రంతో తుడుచుకోవడం కాపిలం. ఎండలో స్నానం ఆచరించడం ఆతపం. సాధారణ స్నానం- వారుణం. విష్ణుస్తుతితో చేసే స్నానం మునుమానసం. ఇవన్నీ శారీరక, మానసిక పరిశుభ్రతకు దోహదపడతాయి. మాఘస్నానం చేసి, విష్ణువును పూజించి, దానం తరవాత పురాణ శ్రవణం నిర్వర్తించడం సంప్రదాయం.

అన్ని అంతరాలకూ అతీతంగా పాటించాల్సిన పద్ధతులివి. మాఘమాసం శివకేశవులిద్దరికీ ఇష్టమైనది. దేవతార్చనలో- శివుణ్ని, విష్ణువును, వారి అవతార మూర్తులను స్తుతించవచ్చు. మాఘ స్నానం వల్ల బుద్ధి, వికాసం, ఆరోగ్యం అభివృద్ధి చెందుతాయి. శరీరం ఉల్లాసభరితమవుతుంది. విష్ణువుకు ఇష్టమైన మాఘ శుద్ధ ఏకాదశి పరమ పవిత్రం. అఘం అంటే పాపం. దాన్ని పోగొట్టేది మాఘం. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే ఈ మాసం అత్యంత విశేషమైనది. ఇటువంటి పవిత్ర స్నానాల సంస్కృతి దేశంలో అతి ప్రాచీన కాలం నుంచీ ఉందని పురాణాలెన్నో తేటతెల్లం చేస్తున్నాయి.

- పి.భారతి

బెల్లం ఎంత మధురం.. ధర అంత దారుణం!


బెల్లం తయారు చేస్తున్న రైతులు

- రోజురోజుకు పడిపోతున్న బెల్లం ధర
- మరోపక్క తగ్గిపోతున్న దిగుబడి
- పెరిగిపోతున్న పెట్టుబడులు
- వాపోతున్న చెరకు రైతులు

అనకాపల్లి - న్యూస్‌టుడే

అందరికీ తీపి పంచుతున్న బెల్లం రైతుకు తగ్గిపోతున్న ధరలు చేదు పంచుతున్నాయి. దీంతో బెల్లం తయారీ అంటేనే రైతు హడలిపోతున్నాడు. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన విశాఖ జిల్లా అనకాపల్లి మార్కెట్‌లో సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తుంది. సీజన్ ప్రారంభం నుంచి ధరలు అంత ఆశాజనకంగా లేవని రైతులు వాపోతున్నారు. అనకాపల్లి మార్కెట్‌లో ఏటా రూ.140 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు వ్యాపారం సాగుతుంది. అక్టోబరు నెల నుంచి సీజన్ ప్రారంభమై మే వరకు కొనసాగుతుంది. గత సీజన్‌తో పోల్చితే తక్కువ సరకు రావడమే కాకుండా ధరలు కూడా తగ్గిపోయాయి. గత సీజన్‌లో మూడు నెలలకు రూ.33.31 కోట్ల వ్యాపారం సాగగా ఈ సీజన్‌లో కేవలం 25.19 కోట్ల వ్యాపారమే అయింది. మార్కెట్‌కు వచ్చే దిమ్మల సంఖ్య కూడా గత సీజన్‌తో పోల్చితే లక్ష వరకు తగ్గిపోయాయి. మార్కెట్‌కు ప్రస్తుతం రోజుకు 15 వేల నుంచి 20వేల దిమ్మలు అమ్మకానికి వస్తున్నాయి. 2017 జనవరిలో 100 కిలోల బెల్లం రూ.3,121 పలకగా ప్రస్తుతం(2018 జనవరి) రూ.2,485 మాత్రమే ఉంది. అదే 2016 అక్టోబరులో 100 కిలోల బెల్లం ధర రూ.3,735 పలకడం గమనార్హం.

తగ్గిపోతున్న విస్తీర్ణం

చెరకు సాగులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లాలో గత కొన్నేళ్లుగా విస్తీర్ణం తగ్గిపోతుంది. వాస్తవానికి జిల్లాలో చెరకు సాధారణ విస్తీర్ణం 39,408 హెక్టార్లు. ఈ సీజన్‌లో కేవలం 32,128 హెక్టార్లలోనే వేశారు. చెరకు దీర్ఘకాలిక పంట. ఏటా పెట్టుబడులు పెరుగుతుండగా అందుకు అనుగుణంగా ధరలు మాత్రం పెరగడంలేదు.

కొంపముంచిన పసుపు ఆకుతెగులు

చెరకు తోటలకు ఐదేళ్లగా పసుపు ఆకు తెగులు సోకింది. దీంతో తోటలు ఎదుగుదల లేక గిడసబారిపోతున్నాయి. శాస్త్రవేత్తలు ఇంత వరకు దీనికి నివారణ చర్యలు కనుక్కోలేకపోయారు.

బెల్లం తయారీ విడిచిపెడుతున్నాం

మా పూర్వీకులు నుంచి బెల్లం తయారీ ఆచారంగా వస్తుంది. ఉన్నభూమి అంతా చెరకుసాగు చేస్తాం. మా గ్రామంతోపాటు చుట్టుపక్కల పది గ్రామాల రైతులు కేవలం బెల్లమే తయారుచేస్తారు. అయితే చెరకు పంట దిగుబడులు తగ్గిపోవడం, ధరలు గిట్టుబాటు కానందున చెరకు పంట వేయడం విరమించుకుంటున్నాం. గతంలో నాలుగు ఎకరాల్లో చెరకు పంట వేసేవారం. ఇప్పుడు రెండు ఎకరాలకు తగ్గించాను. మిగిలిన భూమిలో వరి వేస్తున్నాం.

– భీశెట్టి నాయుడు, రైతు, మునగపాక

ఖర్చులు అయినా రావడం లేదు

నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఇటీవల ఎకరా పది సెంట్ల విస్తీర్ణంలోని కార్శి చెరకు తోటను గానుగాడి బెల్లం తయారీ చేశాను. దీని నుంచి బెల్లం తయారీ చేస్తే పది పాకాలు దిగుబడి వచ్చింది. అనకాపల్లి మార్కెట్‌లో పది పాకాల బెల్లం విక్రయిస్తే రూ.32వేలు ఆదాయం వచ్చింది. పెట్టుబడి మాత్రం రూ.36,500 అయ్యింది. అంటే చేతి సొమ్ము రూ.4,500 పడింది.

– బొడ్డేడ అప్పలనాయుడు, రైతు, మునగపాక

సాంకేతికాంశాలు తేలాలి

- ఆర్డీఎస్‌పై హరీశ్‌రావుకు లేఖ రాసిన మంత్రి దేవినేని

ఈనాడు, అమరావతి: ఆర్డీఎస్ ఆధునికీకరణ పనులకు సంబంధించి హైడ్రాలజీతోపాటు సాంకేతిక పరమైన అంశాలు తేలాల్సి ఉన్నందున తొలుత సాంకేతిక అధికారులు దీన్ని పరిశీలించాల్సి ఉందని జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ జలవనరులశాఖ మంత్రి హరీశ్‌రావుకు లేఖ రాశారు. 'మీరు కోరినట్లుగా త్రిపక్ష సమావేశం జరగడానికన్నా ముందు సాంకేతికాంశాలు పరిష్కారం కావాల్సి ఉంద'ని ప్రస్తావించారు. "ఆర్డీఎస్ ఆధునికీకరణకు సంబంధించి మీ నివేదికలో ఆనకట్ట ఎత్తు 15 సెంటీమీటర్ల మేర పెంచే విషయంలో స్పష్టమైన సమాచారంలేదు. ఆనకట్ట మొత్తం ఎత్తు పెంచుతారా లేక కేవలం ఎగువ, దిగువవైపు భాగాల ఎత్తు మాత్రమే పెంచుతారా అనేది స్పష్టత ఇవ్వడం లేదు" అని పేర్కొన్నారు.

దళిత యువకుడిపై దాడి

ముజఫర్‌నగర్: ఓ దళిత వ్యక్తిపై కొందరు దాడిచేసి కొట్టారన్న ఆరోపణలతో ముజఫర్‌నగర్ జిల్లాలోని కల్యాణ్‌పుర గ్రామంలో బుధవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. హెల్మెట్ ధరించి ఉన్న ఓ వ్యక్తి నేలపై పట్టు తప్పి పడిపోగా... అతడిని ముగ్గురువ్యక్తులు అదేపనిగా దారుణంగా కొడుతున్న దృశ్యాన్ని ఫోన్‌లో చిత్రీకరించారు.

ఫిబ్రవరి 21న కమల్ పార్టీ ప్రకటన

- అదే రోజు రామనాథపురం నుంచి రాష్ట్ర పర్యటనకు శ్రీకారం
- పార్టీ పేరు 'మక్కల్ మయ్యం' కావొచ్చని ప్రచారం
- కలిసి పనిచేయడంపై కాలమే నిర్ణయిస్తుంది: రజనీకాంత్

ఈనాడు డిజిటల్ - చెన్నై

ఎట్టకేలకు ఫిబ్రవరి 21వ తేదీన పార్టీ పేరు ప్రకటించడానికి విశ్వనటుడు కమల్‌హాసన్ సిద్ధమయ్యారు. సొంతూరు రామనాథపురం నుంచి రాష్ట్రవ్యాప్త పర్యటనకు కూడా అదే రోజున శ్రీకారం చుట్టనున్నారు. అక్కడి నుంచి మదురై, దిండుగల్, శివగంగై జిల్లాల మీదుగా ఆయన పర్యటన సాగనుంది. ఫిబ్రవరి 21న పార్టీ పేరు ప్రకటిస్తానని, రాష్ట్రవ్యాప్త యాత్రను ప్రారంభిస్తానని వెల్లడించారు. ఆయన పెట్టబోయే పార్టీ పేరు 'మక్కల్ మయ్యం' కావొచ్చని, జెండాలో అవినీతిపై ప్రజలు పోరాటం చేయాలనే నినాదం ఉంటుందని ప్రచారం సాగుతోంది.


చిత్ర ప్రారంభ కార్యక్రమంలో కమల్, రజనీకాంత్

ఆరు నెలల్లో ఎన్నికలొచ్చినా ఎదుర్కొంటాం

ఇదే సమయంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ స్పందిస్తూ... కమల్ తాజా ప్రకటనను స్వాగతించారు. ఆయనతో కలిసి పనిచేయడంపై కాలమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రజనీకాంత్‌ను ఆరు నెలల్లో ఎన్నికలొస్తే ఏం చేస్తారని విలేకర్లు అడిగిన ప్రశ్నకు 'ఎదుర్కొంటాన'ని ఆయన సమాధానం ఇచ్చారు. ఇదిలా ఉండగా చెన్నైలో జరిగిన ఓ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో కమల్‌హాసన్, రజనీకాంత్ ఒకే వేదికను పంచుకున్నారు.

ఫిబ్రవరి 24న 'నమదు అమ్మ' పత్రిక ప్రారంభం

కమల్‌హాసన్, టీటీవీ దినకరన్ సొంత పార్టీలు పెట్టుకున్నా తమకెలాంటి నష్టం లేదని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం స్పష్టం చేశారు. మరోవైపు ఇప్పటి వరకు అన్నాడీఎంకే అధికారిక పత్రికగా ఉన్న 'నమదు ఎంజీఆర్' ప్రస్తుతం శశికళ కుటుంబ నిర్వహణలో ఉంది. ఈ నేపథ్యంలో సొంత పత్రిక ప్రారంభించడానికి అధికార పార్టీ నిర్ణయించింది. ఫిబ్రవరి 24న 'నమదు అమ్మ' పత్రికను పళనిస్వామి, పన్నీర్‌సెల్వం ప్రారంభించనున్నారు. ఇదే సమయంలో బుధవారం పార్టీపై ప్రకటన చేస్తారనుకున్న ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ వెనకడుగు వేశారు. అంత అవసరం ప్రస్తుతం లేదని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం.

ఏకాభిప్రాయంతోనే అనుసంధానం!

- ఆరుగురు సీఎంలతో త్వరలో కేంద్ర మంత్రి గడ్కరీ భేటీ

ఈనాడు - అమరావతి

గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి నదుల అనుసంధానంపై అన్ని రాష్ట్రాల ఏకాభిప్రాయం వ్యక్తమైన తర్వాతే ముందడుగు వేస్తామని కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఇందుకోసం త్వరలో సంబంధిత ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ముఖ్యమంత్రులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి దీనిపై చర్చించి వారి అభిప్రాయాల మేరకు ముందుకు వెళ్తామన్నారు. దిల్లీలో బుధవారం జాతీయ జల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నదుల అనుసంధానంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ 14వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన గోదావరి కృష్ణా అనుసంధానంపై కేంద్ర మంత్రి ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు తాను వెళ్లినప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అనుసంధానంపై వివరించారని, పట్టిసీమ ఎత్తిపోతలతో గోదావరి జలాలను కృష్ణాకు మళ్లించడం వల్ల 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఈ ఏడాది నీరిచ్చి దాదాపు రూ.10వేల కోట్ల విలువైన పంటను కాపాడినట్లు తెలియజేశారని చెప్పారు. మహానదిలో మిగులు జలాలు ఎంతో ఇంకా తేలనందున ప్రస్తుతం తెలంగాణలోని అకినేపల్లి నుంచి నాగార్జునసాగర్ అక్కడి నుంచి పెన్నా ఆపైన పాలార్ కావేరికి అనుసంధానం చేసే ప్రతిపాదనపై దృష్టి సారించినట్లు కేంద్ర మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల నాలుగు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు అధికారులు హాజరయ్యారు. ఈ కొత్త ప్రతిపాదనపై ఆంధ్రప్రదేశ్ తన అభిప్రాయాలు వెల్లడించలేదు. అధికారులు హాజరైనా వారేమీ మాట్లాడలేదు. అంతర్రాష్ట్ర జలవనరుల చీఫ్ ఇంజినీరు బి.కె.నాగేశ్వరరావు, హైడ్రాలజీ చీఫ్ ఇంజినీర్ కుమార్, అంతర్రాష్ట్ర జలవనరుల సలహాదారు రామకృష్ణలు హాజరయ్యారు. ఈ ప్రతిపాదన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు 80 టీఎంసీల వరకు నీళ్లు లభిస్తాయని భావిస్తున్నారు. నాగార్జునసాగర్ కుడి కాలువకు, పెన్నాకు ఈ నీళ్లు దక్కనున్నాయి. ఈ మేరకు ఏపీకి ఈ అనుసంధానం వల్ల ప్రయోజనమే అన్న భావనతోనే అధికారులున్నా.. ప్రస్తుతానికి ఏ అభిప్రాయమూ వెల్లడించకూడదనే ఉద్దేశంతోనే కేవలం అధికారులను మాత్రమే ఈ సమావేశానికి ప్రభుత్వం పంపింది.

అకినేపల్లి ప్రతిపాదన ముందుకు కదలనట్లే?

- సందేహాలు లేవనెత్తిన తెలంగాణ

ఈనాడు, హైదరాబాద్: నదుల అనుసంధానంపై దిల్లీలో జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటే గోదావరిపై అకినేపల్లి వద్ద బ్యారేజి నిర్మించి కావేరినదిపై గ్రాండ్ ఆనకట్ట వరకు నీటిని మళ్లించే పథకం ముందుకు కదలనట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నదుల అనుసంధానానికి తాము అనుకూలమని చెబుతూనే నీటి లభ్యత, ముంపు ఇలా అనేక అంశాలపై సందేహాలు వ్యక్తం చేయడమేకాకుండా, మహానది-గోదావరి అనుసంధానం మొదట చేపట్టిన తర్వాత తాజా ప్రతిపాదన గురించి ఆలోచించాలని ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో తెలంగాణ సూచించింది. సమావేశంలో తెలంగాణ తరఫున మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ అకినేపల్లి అనుసంధానం చేపట్టడానికి ముందే మహానది-గోదావరి అనుసంధానాన్ని మొదట చేపట్టాలని సూచించారు. మహానది నుంచి నీటిని మళ్లించడానికి ఒడిశా అంగీకరించకపోవడం వల్లే ప్రత్యామ్నాయంగా ప్రస్తుత ప్రతిపాదనను ముందుకు తెచ్చినట్లు జాతీయ జల అభివృద్ధి సంస్థ తన నివేదికలో స్పష్టం చేసింది.

రాష్ట్రాల పరిధిలో అనుసంధానానికి కేంద్రం నిధులివ్వదు

నదుల అనుసంధానానికి కేంద్రం అధిక ప్రాధాన్యమిస్తున్నా, ఒకే రాష్ట్రంలో రెండు నదుల అనుసంధానం ద్వారా చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం నిధులివ్వదని జలవనరుల మంత్రి నితిన్‌గడ్కరీ స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నదుల అనుసంధానంలో మూడు, నాలుగు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగించేవాటితో పాటు ఒకే రాష్ట్రంలో అనుసంధానానికి (ఇంట్రాస్టేట్) సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన నివేదికలు పంపితే వివిధ ఆర్థిక సంస్థలకు పంపి రుణాలు వచ్చే ఏర్పాటు చేస్తామని, ప్రపంచబ్యాంకు, ఏడీబీ, జైకా తదితర సంస్థలు తక్కువ వడ్డీకి రుణాలిస్తున్నాయని పేర్కొన్నట్లు తెలిసింది. నదుల అనుసంధానానికి సంబంధించిన ప్రాజెక్టులకు కూడా కేంద్రం 90 శాతం ఇస్తే రాష్ట్రాలు పది శాతం భరించడమా, లేక 60:40 ప్రకారమా అన్నది ఆర్థిక శాఖ పరిశీలనలో ఉందని పేర్కొన్నట్లు తెలిసింది.

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలంటూ జలదీక్ష

మద్దతుగా పాల్గొన్న పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు


జలదీక్ష చేస్తున్న మత్స్య కారులు, మద్దతుగా పాల్గొన్న మల్లాడి కృష్ణారావు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తమను ఎస్టీల్లో చేర్చాలని డిమాండు చేస్తూ మత్స్యకారులు విశాఖ రామకృష్ణ బీచ్‌లో బుధవారం జలదీక్ష చేశారు. పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు మత్స్యకారులకు మద్దతుగా జలదీక్షలో పాల్గొన్నారు. తొలుత విశాఖ నోవోటెల్ హోటల్ ఎదురుగా వీరు నిరసన చేశారు. హోటల్‌లో జరుగుతున్న మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సుకు ముఖ్యమంత్రి రావడంతో పోలీసులు వీరిని నిలువరించారు. దీంతో తమ నిరసన దీక్షలను సాగరతీరానికి మార్చి అక్కడ కొద్దిసేపు జలదీక్ష చేశారు. ముఖ్యమంత్రి హామీ మేరకు మత్స్యకారులను ఎస్టీలుగా గుర్తించి జాబితాలో చేర్చాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తెడ్డు శంకర్, మాజీ కార్పొరేటర్లు బుద్ధా నీలకంఠం, పి.విజయ్‌చందర్, గిరికిన గౌరి, ఎం.శ్రీరామ్, కె.తాతారావు, చింతపల్లి పోతురాజు, టి.శాంతారావు, కదిరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన శిశు మరణాలు తగ్గించేందుకు కేంద్రాలు

- పీపీపీ విధానంలో కార్పొరేట్ వైద్య సంస్థ ద్వారా సేవలు

ఈనాడు - అమరావతి

గిరిజన ప్రాంతాల్లో నవజాత శిశువుల మరణాలు తగ్గించడంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. గిరిజన ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 25 నుంచి 30 మంది శిశువులు మరణిస్తున్నట్లు తెలుస్తోంది. రంపచోడవరం, చింతపల్లి, పార్వతీపురం, పాడేరు, సీతంపేట, కేఆర్‌పురం, శ్రీశైలం (ఐటీడీఏ) ప్రాంతాల్లో ఐదుచోట్ల మాత్రమే శిశువుల సంరక్షణకు వైద్య సేవలు అందుతున్నాయి. మిగిలిన 21 ఆస్పత్రుల్లో ఈ సౌకర్యం లేదు. దీంతో.. ఈ 21చోట్ల శిశువుల సంరక్షణ కేంద్రాలను పీపీపీ విధానంలో ఏర్పాటుచేయబోతున్నారు. ఈ కేంద్రాల్లో అవసరమైన వైద్యులు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బందిని టెండరు ద్వారా ఎంపికైన కార్పొరేట్ వైద్య సంస్థే నియమించాల్సి ఉంది. అనారోగ్యానికి గురైన శిశువులకు వైద్యం అందించేందుకు అవసరమైన ఆధునిక పరికరాలు కూడా కార్పొరేట్ వైద్య సంస్థ ద్వారా అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కేంద్రం నిర్వహణకు నెలకు రూ.7.5 లక్షల చొప్పున చెల్లించే అవకాశం ఉంది.

మోటారు బైక్ అంబులెన్సులు!

గిరిజన ప్రాంతాల్లో మోటారు బైక్ అంబులెన్సుల వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. గిరిజన ప్రాంతాలు మారుమూల ప్రాంతాల్లో ఉన్నందున ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారిని చేరుకుని 108 అంబులెన్సుల ద్వారా సమీప ఆస్పత్రులకు తరలించేందుకు అవరోధాలు ఎదురవుతున్నాయి. దీనివల్ల సకాలంలో వైద్య సేవలు అందక గిరిజనుల ప్రాణాలకు ముప్పువాటిల్లే పరిస్థితులు అడపాదడపా చోటుచేసుకుంటున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం 122 మోటారు బైక్ అంబులెన్సులు 108 అంబులెన్సులు వెళ్లలేని మారుమూల ప్రాంతాల్లో 24 గంటలు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. వీటిని 43 (108) అంబులెన్సులతో అనుసంధానం చేయనున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని మోటారు బైక్ ద్వారా 108 వాహనం వద్దకు తీసుకువస్తారు. 108 అంబులెన్సు సమీప ఆస్పత్రికి రోగిని తీసుకెళుతుంది.

పాక్‌లో ద్వంద్వ పౌరసత్వమున్న జడ్జీల సమాచారం కోరిన సుప్రీం

ఇస్లామాబాద్: ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్న పాకిస్థాన్ న్యాయమూర్తులు, సీనియర్ ప్రభుత్వ అధికారుల వివరాలు అందజేయాలని ఆ దేశ సుప్రీం కోర్టు సంబంధిత విభాగాలను కోరింది. కొందరు న్యాయమూర్తులు, వేలాది సంఖ్యలో సీనియర్ అధికారులు పాశ్చాత్య దేశాల పౌరసత్వం కలిగి ఉన్నట్లు వార్తలు రావడంతో.. తనకు తానుగా ప్రధాన న్యాయమూర్తి మియాన్ సాఖిబ్ నిసార్ ఈ ఆదేశాలు జారీ చేశారు. ద్వంద్వ పౌరసత్వమున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఇప్పటికే కోర్టు నిషేధించింది. ప్రస్తుతం న్యాయ, పౌరసేవల విభాగాలకు సంబంధించి.. ద్వంద్వ పౌరసత్వం ఉన్నవారిపై ఎలాంటి ఆంక్షలూ లేవు. అయితే సున్నితమైన సమాచారం వీరి చేతిలో ఉంటున్నందున.. తరుచూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కోర్టు కూడా ఈ అంశంలో ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నదానిపై స్పష్టత లేదు. ఇటు పాక్ మాజీ ప్రధానుల్లో ఇద్దరు ద్వంద్వ పౌరసత్వమున్నవారే.

డ్రోన్‌ను ఎగురవేసినందుకు నేపాల్‌లో భారతీయుడి అరెస్టు

కాఠ్‌మాండూ: నేపాల్‌లో డ్రోన్‌ను ఎగురవేసిన ఓ భారతీయుడిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. సిక్కిం రాష్ట్రానికి చెందిన టోప్టెన్ లామాగా అతడిని గుర్తించారు. కాఠ్‌మాండూ సమీపంలోని బూఢానీల్‌కంఠలో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్న లామా.. బుధవారం డ్రోన్‌ను ఎగురవేస్తూ పోలీసులకు చిక్కాడు. డ్రోన్లను గూఢచర్యం కోసం ఉపయోగించుకునేందుకు అవకాశముండటంతో.. ఇటీవల నేపాల్ భద్రత సంస్థలు వీటిని వాడుతున్నవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాయి.

వచ్చే నెల నుంచి 14 రాష్ట్రాల్లో ఇ-వేబిల్

ఈనాడు, బెంగళూరు: సరకుల తరలింపుపై నిఘా వేసే ఇ-వేబిల్‌ను వచ్చే నెల నుంచి 14 రాష్ట్రాల్లో అమలు చేయనున్నట్లు బిహారు ఉపముఖ్యమంత్రి, వస్తు సేవల పన్ను మండలి అధ్యక్షుడు సుశీల్‌కుమార్ మోది తెలిపారు. బుధవారం బెంగళూరులో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఐసీ తయారు చేసిన ఇ-వేబిల్ సాఫ్ట్‌వేర్‌ను గత సోమవారం నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. కర్ణాటకలో ఇది విజయవంతం కావటంతో ఏప్రిల్ నుంచి అమలు చేయదలచిన ఇ-వేబిల్‌ను రెండు నెలలు ముందుకు(ఫిబ్రవరి) తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం లోపల సరకు రవాణా ఇ-వేబిల్ అమలు గడువును వచ్చే జూన్ వరకూ పొడిగించామన్నారు. దీనివల్ల పన్ను చెల్లింపులో లొసుగులు సమసిపోతాయని అభిప్రాయపడ్డారు. కేంద్రం రూ.1,35,000 కోట్ల వస్తు సేవా బిల్లులు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సుశీల్‌కుమార్ మోది పేర్కొన్నారు.

గ్రహణం కారణంగా 31న భద్రాచలంలో దర్శనవేళలు మార్పు

భద్రాచలం, న్యూస్‌టుడే: సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా ఈ నెల 31న భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయం దర్శన వేళల్లో మార్పులుంటాయని వైదిక కమిటీ తెలిపింది. ఆ రోజు నిత్య కల్యాణం ఉండదు. ఉదయం 3గంటలకు ఆలయం తలుపులను తెరచి సుప్రభాతం నిర్వహించి నివేదన నిర్వహిస్తారు. మాసోత్సవాలలో భాగంగా జరగాల్సిన సహస్ర కలశాభిషేకాన్ని ఉదయం 6 నుంచి 8.30 వరకు, వార్షికోత్సవంలో భాగంగా జరగాల్సిన శ్రీరంగ నాయకస్వామివారి కల్యాణాన్ని 9 గంటలకల్లా ముగిస్తారు. ఉదయం 10 గంటలకు ఆలయం తలుపులు మూసి గ్రహణం వీడాక రాత్రి 9.15 గంటలకు తెరిచి ఆలయ సంప్రోక్షణ పూజలు చేస్తారు. శాంతిహోమం ఉంటుందని ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు తెలిపారు. ఆ రోజు దర్శనాలు ఉదయం 5.30 నుంచి 8 వరకు, 9.30 నుంచి 10 గంటల వరకేనని, తిరిగి మరుసటి రోజు ఉదయం నుంచి యథావిధిగా ఉంటాయని చెప్పారు.

నేడు, రేపు ధర్నా: ఎన్ఎంయూ

ఈనాడు, అమరావతి: సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని కోరుతున్నా ఎలాంటి చొరవ తీసుకోవడం లేదని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) ఆరోపించింది. సమస్యలపై గత నెలలో మెమోరాండం ఇచ్చామని, ఎలాంటి నిర్ణయం రాలేదని తెలిపింది. ఈ తీరుకు నిరసనగా గురు, శుక్రవారాల్లో ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నా చేయనున్నట్లు ఎన్ఎంయూ నాయకులు చల్లా చంద్రయ్య, వై.శ్రీనివాసరావు, ఆర్వీఎస్‌డీ ప్రసాద్ తదితరులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. "కొత్త పే స్కేళ్లను వెంటనే అమలు చేయాలి. సమైక్యాంధ్ర సమ్మె కాలాన్ని స్పెషల్ క్యాజువల్ సెలవుగా ఇవ్వాలి. ఆర్టీసీ ఆస్తుల్ని ప్రైవేట్ వ్యక్తులకు బీఓటీ విధానంలో ఇవ్వడాన్ని నిలుపుదల చేయాలి. అవుట్ సోర్సింగ్ విధానాన్ని ఆపాలి. అద్దె బస్సుల స్థానంలో కొత్త బస్సులు తీసుకురావాలి" అని కోరారు.


బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

చంద్రబాబువి.. కుల రాజకీయాలు

వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆరోపణ

పాపానాయుడుపేట (ఏర్పేడు), న్యూస్‌టుడే: కుల రాజకీయాలు చేయడంలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఎంతో దిట్ట అని... కులవృత్తులకు తీరని అన్యాయం చేస్తున్నారంటూ వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా బుధవారం చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో ఏర్పాటు చేసిన బీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కులవృత్తుల వారికి హామీలు గుప్పించి.. గెలిచాక వాళ్ల బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్ ప్రవేశపెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ విధానం ద్వారా ఎందరో పేద విద్యార్థులు చదువుకున్నారని.. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. దీంతో పిల్లల చదువు కోసం మధ్యతరగతి కుటుంబాలు అప్పులపాలయ్యాయని తెలిపారు. బోయలను ఎస్టీలుగా గుర్తిస్తామని తెదేపా హామీలిచ్చిందని, ఇప్పుడు దిల్లీకి పంపానంటూ తప్పించుకుంటున్నారన్నారు. తాము అధికారంలోకి రాగానే ఏ పాఠశాలలో చదివిన విద్యార్థులకైనా సంవత్సరానికి రూ.15వేలు ఉపకార వేతనంగా అందిస్తామని, 60 ఏళ్లకే ప్రతి నెలా రూ.2వేలు పింఛను అందిస్తామన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నవరత్నాలను తప్పక అమలు చేస్తామన్నారు.


సీసీఎల్ఏ అనిల్‌చంద్ర పునేఠకు ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కేకే రావు. చిత్రంలో సీసీఎల్ఏ అధికారులు రామారావు, తేజ్‌భరత్

రెవెన్యూ సేవలకు ఐఎస్ఓ ధ్రువీకరణ

గుర్తింపు పత్రం స్వీకరించిన సీసీఎల్ఏ పునేఠ

ఈనాడు అమరావతి: రెవెన్యూ శాఖ ద్వారా అందుతున్న సేవల్లో నాణ్యత నిర్వహణ, అందుకు అనుసరిస్తున్న ప్రమాణాలకు ఐఎస్ఓ ధ్రువీకరణ లభించింది. స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాల గుర్తింపు సంస్థ గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ సంస్థ (జీఎంసీఎస్) ఇటీవల భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయంలో రెవెన్యూ సేవలు, అందుకు అనుసరిస్తున్న విధానాలను అంతర్గతంగా పరిశీలించింది. వీటిని మదింపు చేసిన అనంతరం బుధవారం గొల్లపూడిలో సీసీఎల్ఏ అనిల్‌చంద్ర పునేఠకు జీఎంసీఎస్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.కె.రావు గుర్తింపు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పునేఠ మాట్లాడుతూ పౌరులకు అందిస్తున్న సేవలు, భూ రికార్డుల ఆన్‌లైన్, డిజిటల్ లావాదేవీలు, రియల్‌టైం గవర్నెన్స్ తదితరాలను దృష్టిలో ఉంచుకొనే ఈ గుర్తింపు అందజేశారన్నారు. రెవెన్యూ శాఖలో ఇ-గవర్నెన్స్ విధానాలు పెరిగాయని తెలిపారు. ఈ అంతర్జాతీయ గుర్తింపుతో ఉద్యోగుల బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీసీఎల్ఏ కార్యదర్శి బి.రామారావు, సీఎంఆర్ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ తేజ్‌భరత్ నంబూరి పాల్గొన్నారు.

ఉన్న దుస్తులన్నీ ధరించి అరెస్టయ్యాడు!

- సామాను రుసుము తప్పించుకునేందుకు ప్రయత్నించిన బ్రిటన్ ప్రయాణికుడు

లండన్: విమాన ప్రయాణంలో అదనపు సామాను(లగేజీ)కు రుసుము చెల్లించడం తప్పించుకోవాలన్న యోచనతో ఓ వ్యక్తి తన దుస్తులన్నింటినీ ధరించిన ఘటన ఇది. బ్రిటన్‌కు చెందిన ర్యాన్ హవాయి లండన్ వెళ్లేందుకు గాను ఐస్‌లాండ్‌లోని కెఫ్లావిక్ విమానాశ్రయానికి బుధవారం చేరుకున్నాడు. ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతి ఉన్న పరిమితి కంటే తన వద్ద ఎక్కువ సామాను ఉండటంతో.. అదనపు రుసుం చెల్లించడం తప్పించుకోవాలని భావించాడు. వెంటనే అందులోని 10 చొక్కాలు, 8 ప్యాంట్లను ధరించాడు. దీంతో బ్రిటిష్ ఎయిర్‌వేస్ అధికారులు అతడికి బోర్డింగ్ పాస్ నిరాకరించారు. అనంతరం అధికారులతో ర్యాన్ వాగ్వాదానికి దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేసి.. తర్వాత విడుదల చేశారు. అధికారులు తనపట్ల వ్యవహరించినతీరును ర్యాన్ ట్విటర్‌లో విమర్శించారు. తనకు బోర్డింగ్ పాస్ నిరాకరించడానికి జాత్యాహంకార అంశాలే కారణమా అని ప్రశ్నించారు. దీనిపై బ్రిటిష్ ఎయిర్‌వేస్ స్పందించింది. దురుసుగా ప్రవర్తించినందువల్లే అతడిని విమానంలోకి అనుమతించలేదని స్పష్టం చేసింది.

అబ్బురం

- చక్రకేళీకి 204 కాయలు



ఆలమూరు, న్యూస్‌టుడే: చక్రకేళీ రకం అరటి గెలకు సాధారణంగా నాలుగైదు అత్తాలకు కలిపి 50 నుంచి 70 కాయలు ఉంటాయి. వంద పండ్ల వరకూ అప్పుడప్పుడు కనిపిస్తాయి. అలాంటిది తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంకలో పడాల రాంబాబుకు చెందిన తోటలో మాత్రం ఓ గెల 204 కాయలతో అందరినీ అబ్బురపరుస్తోంది. ఆత్రేయపురం మండలం ర్యాలి నుంచి కొన్ని సంవత్సరాల కిందట ఈ విత్తనం తీసుకొచ్చామని అప్పటి నుంచి పెద్ద గెలలు వేసినప్పటికీ, ఇది బాగా పెద్దగా ఉందని రైతు తెలిపారు. దీనిపై ఉద్యానశాఖ సహాయ సంచాలకుడు కె.చిట్టిబాబు మాట్లాడుతూ.. చక్రకేళీ గెలలు చిన్నవిగా ఉండి 60 నుంచి 70 కాయలు కాస్తాయని, 204 కాయలు ఉండడం మాత్రం అరుదైన విషయమని చెప్పారు. పోషక పదార్థాలు మొక్క మొదలులో ఎక్కువగా కేంద్రీకృతమైనప్పుడు ఇలా జరిగే అవకాశం ఉందన్నారు.

అద్భుతం

- ప్రపంచంలోనే భారీ వాయు శుద్ధి యంత్రం నిర్మాణం

లండన్: పొగమంచు, వాయు కాలుష్యంతో నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఈ సమస్య నివారణకు కృత్రిమ విధానాల అమలులో చైనా దూసుకెళుతోంది. ఉత్తర చైనాలో అత్యంత కలుషిత నగరమైన గ్జియాన్‌లో ప్రపంచంలోనే పెద్దదైన వాయు శుద్ధి పరికరాన్ని నిర్మించింది. స్థూపాకారంలో వంద మీటర్ల ఎత్తు (328 అడుగులు) ఉండే ఈ నిర్మాణం 10 కిమీ పరిధిలో వాయు నాణ్యతను పెంచుతుందని చైనీస్ సైన్స్ అకాడమీ నిపుణులు చెబుతున్నారు. పొగమంచులో ఉండే అత్యంత హానికరమైన పీఎం 2.5 సహా ఇతర సూక్ష్మ రేణువులను 15 శాతం తగ్గిస్తుందని వివరిస్తున్నారు. పొగమంచుకు కారణమయ్యే నైట్రోజన్ ఆక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి వాయువుల్ని ఇది శుద్ధి చేస్తుంది. ఈ స్థూపాకార నిర్మాణం రోజుకు 10 మిలియన్ క్యూబిక్ మీటర్లను శుద్ధి చేస్తోందని పరీక్షల్లో వెల్లడైనట్లు ఈ కార్యక్రమ పరిశోధకుడు వెల్లడించారు. 2,580 చదరపు మీటర్లలో టవర్, సంబంధిత యంత్ర పరికరాలను ఏర్పాటు చేశారు. ఎక్కువ భాగం సోలార్ విద్యుత్‌తో ఈ యంత్రం పనిచేస్తుంది.



విషాదం



రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

పాణ్యం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగకు వచ్చిన ఆర్మీ జవాను ఇంట్లో విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో ఆయన భార్య, చిన్నాన్న కుమారుడు, స్నేహితుడు మృతి చెందారు. జవానుకు, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన జవాను చంద్రమౌళి, ఆయన భార్య పద్మావతి (25), మిత్రుడు హేమచంద్ర గౌడ్ (32), చిన్నాన్న కుమారులు హరిప్రసాద్ (22) రవికుమార్ సొంత పనుల కోసం తిమ్మాపురం నుంచి వాహనంలో కర్నూలు బయలుదేరారు. పాణ్యం సమీపంలో జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కడపకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొన్నారు. ప్రమాదంలో పద్మావతి (25) అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన రవికుమార్ (22), హేమచంద్ర గౌడ్ (32) చికిత్స పొందుతూ మృతి చెందారు. చంద్రమౌళి, హరిప్రసాద్‌లకు తీవ్రగాయాలయ్యాయి. చంద్రమౌళి అస్సాం ఆర్మీలో పనిచేస్తూ ఇటీవల సంక్రాంతి పండగకు వచ్చారు. ఇంతలోనే విషాదం చోటుచేసుకుంది.

ఇప్పటికింతే.. తర్వాత చూద్దాం!

- గ్రామీణ ఇళ్ల కేటాయింపులపై కేంద్రం స్పష్టత
- మంజూరైన ఇళ్లతో సరిపెట్టుకోవాలని సూచన

ఈనాడు – అమరావతి

ప్రజాసాధికార సర్వే ప్రకారం ఇళ్లు కేటాయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై కేంద్రం తెలివిగా స్పందించింది. సామాజిక, ఆర్థిక స్థూల గణన (ఎస్‌ఈసీసీ-2011) ప్రకారం కేటాయింపుల ప్రక్రియ పూర్తయ్యాక ప్రజాసాధికార సర్వే గణాంకాల గురించి ఆలోచిద్దామని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తాజాగా రాసిన లేఖలో పేర్కొన్నారు. దీంతో అదనపు ఇళ్లపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లినట్లే అయ్యింది. ఎస్‌ఈసీసీ సర్వే ప్రకారం మిగతా రాష్ట్రాలకు కేటాయిస్తున్న నిష్పత్తిలోనే ఆంధ్రప్రదేశ్‌కు 2018-19 సంవత్సరానికి మరో 1,45,271 ఇళ్లను కేంద్రం కేటాయించనుంది. ప్రధానమంత్రి ఆవాస యోజన(పీఎంఏవై)-గ్రామీణ్‌లో రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం 2016-17, 2017-18 సంవత్సరాలకు రెండు విడతలుగా 1,23,112 ఇళ్లను కేటాయించింది. గుజరాత్, బిహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌తో పోల్చిచూస్తే రాష్ట్రానికి తక్కువ కేటాయింపులు చేశారు. కేంద్రం 2011లో చేయించిన సామాజిక, ఆర్థిక స్థూల గణన సందర్భంలో రాష్ట్రంలో సొంతింటికి నోచుకోని నిరుపేద కుటుంబాలు 5.84 లక్షలుగా గుర్తించారు. దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ సర్వే ఆధారంగానే రాష్ట్రాలకు ఇళ్ల కేటాయింపులు చేశారు. 2015లో రాష్ట్ర ప్రభుత్వ ప్రజాసాధికార సర్వేలో సొంతింటికి నోచుకోని నిరుపేద కుటుంబాలు 19.07 లక్షలుగా తేల్చారు. ఇలా చూస్తే రాష్ట్రానికి పీఎంఏవై-గ్రామీణ్‌లో 10లక్షల ఇళ్లు కేటాయించాల్సి ఉంటుందని అధికారులు అంచనాగట్టారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసింది. ప్రజాసాధికార సర్వే ప్రకారం ఇళ్ల కేటాయింపులు చేయాలని కోరింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాది క్రితం దిల్లీ పర్యటన సందర్భంలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిని కలిసి ఇళ్ల కేటాయింపులు పెంచాలని సూచించారు. గత నెలలో రాష్ట్ర గ్రామీణ గృహనిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు దిల్లీ వెళ్లి కేంద్ర మంత్రిని కలిసి మరోసారి విజ్ఞప్తి చేశారు.



అదనపు కేటాయింపులు కష్టమే...

రాష్ట్ర వినతులపై కేంద్రం ఆచూతూచి స్పందిస్తూ చివరకు అదనపు కేటాయింపులు కష్టమేనని తేల్చి చెప్పింది. అన్ని రాష్ట్రాలకూ ఎస్‌ఈసీసీ-2011 ప్రకారమే పీఎంఏవై-గ్రామీణ్‌లో ఇళ్లు కేటాయిస్తున్నామని, కొత్తగా మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు అదనపు ఇళ్లు ఇవ్వలేమంది. ఇప్పటికే రెండు విడతలుగా 2,68,383 ఇళ్లు కేటాయించామని, 2018-19లో మరో 1,45,271 ఇళ్లు ఇస్తామని వెల్లడించింది. ప్రజాసాధికార సర్వే ప్రకారం ఇళ్లులేని పేద కుటుంబాలు 20.99లక్షలుగా రాష్ట్రప్రభుత్వం చెబుతున్నా, ఈ నిష్పత్తిలో కేటాయించాలంటే ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఈసరికి వీటితో సంతృప్తి సరిపెట్టుకోవాలని పరోక్షంగా సూచించారు. ఈ పరిణామాలపై అధికారులతో సమావేశమై రాష్ట్రావసరాల దృష్ట్యా అదనపు కేటాయింపుల కోసం కేంద్రానికి మరోసారి విజ్ఞప్తి చేయాలని రాష్ట్ర సర్కారు యోచిస్తోంది. గురువారం నాటి కలెక్టర్ల సమావేశంలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

20న మంత్రివర్గ సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 20వ తేదీన సచివాలయంలో సమావేశం కానుంది. తొలుత ఈ సమావేశాన్ని బుధవారం నిర్వహించాలని భావించారు. గురువారం నుంచి కలెక్టర్ల సమావేశం ఉండటం, ముఖ్యమంత్రి విశాఖ, దిల్లీ పర్యటనలున్న క్రమంలో సమావేశాన్ని వాయిదా వేశారు.

'రెరా' కోసం సెర్చ్ కమిటీ

సర్వీసులో ఉన్న ఐఏఎస్‌లకు భాగస్వామ్యం

ఈనాడు, అమరావతి: స్థిరాస్తి వ్యాపార నియంత్రణ సంస్థ(రెరా)కు ఛైర్మన్, మరో ముగ్గురి సభ్యుల నియామకం కోసం వచ్చిన దరఖాస్తుల వడపోత నిమిత్తం సెర్చ్ కమిటీని నియమిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులతో సెర్చ్ కమిటీని ఏర్పాటుచేయగా, తాజా ఆదేశాల ప్రకారం సర్వీసులో ఉన్న ఐఏఎస్‌లకు భాగస్వామ్యం కల్పించారు. సెర్చ్ కమిటీ ఛైర్మన్‌గా అనిల్‌చంద్ర పునీఠా, సభ్యులుగా మన్మోహన్‌సింగ్, ఆదిత్యానాథ్‌దాస్‌లను నియమించారు. రెరా ఛైర్మన్, ముగ్గురి సభ్యుల కోసం వచ్చిన దరఖాస్తులను సెర్చ్ కమిటీ ప్రతినిధులు పునఃపరిశీలించి 15రోజుల్లోగా ఎంపిక కమిటీకి సిఫార్సు చేయాలని ప్రభుత్వం సూచించింది.

గ్రూపు-2 పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన నేటి నుంచి

ఈనాడు, అమరావతి: గ్రూపు-2 (2016) ఉద్యోగాల భర్తీలో భాగంగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన గురువారం నుంచి విజయవాడలో ప్రారంభం కానుంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో ఫిబ్రవరి ఒకటి వరకు వీటి పరిశీలన జరుగుతుంది. రోజూ 200 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకానున్నారు. మరోవైపు.. మార్కులు తక్కువగా వచ్చిన వారికీ ధ్రువపత్రాల పరిశీలనకు అవకాశం లభించిందని ఎక్కువ మార్కులు పొందిన అభ్యర్థులు కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ఆచార్య ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ "జోన్లు, స్థానిక, స్థానికేతర, అర్హతలపరంగా అభ్యర్థుల వివరాలను సరిపోల్చుకోవడం లేదు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఐచ్ఛికాల(ఆప్షన్ల)ను పరిగణనలోకి తీసుకుంటున్నాం. అలాగే కొన్ని పోస్టులకు ప్రత్యేక అర్హతలున్నాయి. దీనివల్ల కొన్నిచోట్ల తక్కువ మార్కులు వచ్చిన వారికి అవకాశం లభించినట్లు కనిపిస్తోంది. కానీ నిబంధనల ప్రకారమే ఎంపిక జరుగుతోంది" అని పేర్కొన్నారు.

వచ్చే ఏడాది గన్నవరం నుంచే హజ్ యాత్ర

విజయవాడ, న్యూస్‌టుడే: ఏపీ హజ్ కమిటీ ద్వారా విజయనగరం, విశాఖపట్నం, అనంతపురం జిల్లాల హజ్ యాత్రికులను విజయవాడలోని ఉపకలెక్టరు కార్యాలయంలో బుధవారం ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మహ్మద్ అహ్మద్, ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలోని మిగిలిన పది జిల్లాల్లో డ్రా లేకుండా ఎంపికలు జరిగినట్లు తెలిపారు. 70 ఏళ్లు పైబడిన యాత్రికులను డ్రాతో సంబంధం లేకుండా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 2019లో గన్నవరం (విజయవాడ) విమానాశ్రయం నుంచే హజ్ యాత్రకు బయల్దేరేలా సీఎం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

కారకులను శిక్షించడమే రోహిత్‌కు నిజమైన నివాళి

రోహిత్ వేముల తల్లి రాధికమ్మ



రోహిత్ విగ్రహం వద్ద రోదిస్తున్న రాధికమ్మ

హైదరాబాద్, న్యూస్‌టుడే: రెండేళ్లు గడిచినా తన కుమారుడి మరణానికి కారణమైన వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం అన్యాయమని రోహిత్ వేముల తల్లి రాధికమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం హెచ్‌సీయూలోని డీఎస్‌టీ ఆడిటోరియంలో జరిగిన రోహిత్ రెండో వర్ధంతి సభలో ఆమె మాట్లాడారు. రోహిత్ మరణకారకులను శిక్షించకుండా కులం గురించి ప్రస్తావించడం ఏమిటని ప్రశ్నించారు. వారిని శిక్షించడమే తన కుమారుడికి నిజమైన నివాళి అన్నారు. అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యాసంస్థల్లో కుల వివక్షను ప్రతిఘటించాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులంతా ఏకమై విశ్వవిద్యాలయాల్లో పెరుగుతున్న కులవివక్షను తిప్పికొట్టాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కంచ ఐలయ్య, శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సుజాత సురేపల్లి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, లింగమార్పిడి ఉద్యమకారిణి గ్రేసిభాను, విద్యార్థి నేతలు ప్రశాంత్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రైలు మార్గం సర్వే పూర్తి

- ద.మ.రైల్వే జనరల్ మేనేజర్ వెల్లడి

మార్కాపురం, గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: అమరావతి రైలు మార్గం కోసం సర్వే పూర్తి చేసి రైల్వే బోర్డుకి పంపినట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో బుధవారం ఆయన రైలు ఇంజిన్ల మరమ్మతుల కేంద్రాన్ని ప్రారంభించారు. గుంటూరులో దివ్యాంగులు, వృద్ధులు బోగీలోకి ఎక్కడానికి, సీట్ల దగ్గరకు చేరుకోడానికి చేసిన ఆధునిక ఏర్పాట్లను ప్రారంభించారు. ఈ పరికరాలను తయారు చేయించిన డీఆర్‌ఎం వీజీ భూమా, సీనియర్ డీఎంఈ బాబూరావును అభినందించారు. డివిజన్‌లో నూరు శాతం ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేసినందుకు డీఆర్‌ఎం, సీనియర్ డీఈఈ శ్రీనివాసులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ద.మ. రైల్వేలో 200 కాలినడక వంతెనలను నిర్మించాలని ప్రతిపాదించామన్నారు. గుంటూరు - గుంతకల్ మార్గంలో విద్యుదీకరణ పనులు వచ్చే నెలాఖరుకు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గుంటూరు - తెనాలి డబ్లింగ్, విద్యుదీకరణ పనులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేస్తామన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి మార్గం పనులు రానున్న నాలుగేళ్లలో పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. నల్లపాడు - పగిడిపల్లి డబ్లింగ్ పనులకు సర్వే పూర్తి చేసి అనుమతి కోసం రైల్వే బోర్డుకు పంపామన్నారు. జగ్గయ్యపేట - జాన్‌పహాడ్ మార్గంలో ప్రయాణికుల రైళ్లను నడిపేందుకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం నుంచి పెద్ద దోర్నాల, దోర్నాల-ఒంగోలు రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. గుంటూరు-హైదరాబాద్ వయా మార్కాపురం, కంభం, గిద్దలూరు, నంద్యాల మీదుగా నూతన ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు.



ర్యాంపు ద్వారా చక్రాల కుర్చీలో ప్రయాణికుడిని బోగీలోకి తీసుకెళ్తున్న రైల్వే .జీఎం వినోద్ కుమార్

నిరక్షరాస్యతే ప్రధాన సవాలు: వెంకయ్యనాయుడు

చెన్నై: దేశంలో నిరక్షరాస్యత తీవ్రమైన సమస్యగా పరిణమించిందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు గడిచినా, మన విద్యావ్యవస్థను ఎంతగా విస్తరించినా, ప్రముఖ విద్యా కేంద్రాలను ఎన్నింటిని నెలకొల్పినా ఆ సమస్య సరైన పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరక్షరాస్య మహిళలు మనదేశంలో అధికంగా ఉన్నారని, నాలుగో వంతు చిన్నారులకు మాత్రమే పాఠశాల విద్య అందుతోందని పేర్కొన్నారు. 'న్యూఇండియన్ ఎక్స్‌ప్రెస్' దినపత్రిక నిర్వహించిన థింక్ఎడ్యూ కాంక్లేవ్‌లో బుధవారం ఆయన ప్రసంగించారు. చిన్నారులకు, యువకులకు సరైన శిక్షణ, విజ్ఞానం అందించలేనంత వరకూ మన దేశం అభివృద్ధి సాధించినట్లు కాదని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యను పూర్తి చేయకముందే చాలా మంది చిన్నారులు పాఠశాలలకు దూరమవుతున్నారని తెలిపారు. చదువును మధ్యలోనే మానేసిన చిన్నారులు మనదేశంలోనే అధికంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజ్ఞానవంతమైన, నైపుణ్యవంతమైన దేశాన్ని నిర్మించుకోవటం మన తక్షణ కర్తవ్యమని తెలిపారు.

రూ. 2.13 కోట్ల విలువైన బంగారం పట్టివేత

చెన్నై, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న రూ. 2.13 కోట్ల విలువైన బంగారాన్ని మదురై విమానాశ్రయంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్ నుంచి మదురైకి మంగళవారం మధ్యాహ్నం వచ్చిన ఎయిర్ ఇండియా విమానంలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్)కు సమాచారం అందింది. దీంతో డీఆర్ఐ అధికారులు, విమానాశ్రయం కస్టమ్స్ అధికారులు ప్రయాణికులపై నిఘా ఉంచారు. సింగపూర్ నుంచి వచ్చిన విమానంలో ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ప్రయాణికుల వద్ద 7 కిలోల బంగారం ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఒకరు నాలుగు కిలోల బంగారాన్ని తన రెండు కాళ్లకు కట్టుకున్న బ్యాండేజ్‌లో దాచి తీసుకురాగా... మిగిలిన ఇద్దరు తమ లగేజీలోని ఓ ఎలక్ట్రానిక్ పరికరంలో దాచి తీసుకొచ్చినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెప్పారు.

నైపుణ్యం ఉండాలి.. ఆంగ్లం రావాలి

- నూతన వలస విధానంపై ట్రంప్ ప్రభుత్వ వర్గాల వెల్లడి



వాషింగ్టన్: ప్రతిభావంతులకే తమ దేశంలో అడుగుపెట్టే అవకాశం కల్పించాలని అమెరికా కోరుకుంటోంది. సరైన నైపుణ్యాలు, ఆంగ్లంలో మాట్లాడగల సామర్థ్యం.. కొత్తగా తీసుకువచ్చే వారికి ఉండాలని ఆశిస్తోంది. ప్రతిభ ఆధారిత వలసల విధానంతో ఇవి నెరవేరుతాయని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానంతో భారత్ లాంటి దేశాలకు చెందిన అభ్యర్థులకు మేలు జరుగుతుందని ట్రంప్ సర్కారులోని ఓ ఉన్నతాధికారి అన్నారు. కొత్త విధానం ఎలా ఉండబోతుందన్నదానిపై వివరాలు వెల్లడించారు. వ్యక్తిగత నైపుణ్యాలు, ప్రతిభను బట్టి వలసదారులకు ప్రాధాన్యత ప్రకారం అవకాశమిస్తే. . ప్రస్తుతమున్న విధానం కన్నా మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. "అమెరికా, అమెరికా ప్రజలను ప్రేమించేవారు.. ప్రతిభ, నైపుణ్యాలున్నవారు.. ఆంగ్లంలో మాట్లాగలవారు.. అమెరికా జీవనశైలి, విలువలకు కట్టుబడి ఉండేవారు మా దేశానికి రావాలని కోరుకుంటున్నాం. వారు ఎక్కడివారైనా అయ్యుండొచ్చు. భారత్ లాంటి దేశాలకు చెందినవారిలో చాలా మంది ఈ అర్హతలున్నవారే. అమెరికా జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా వలసల విధానాన్ని సంస్కరించాలని ట్రంప్ సర్కారు భావిస్తోంది" అని అన్నారు. లాటరీ వీసా విధానం, గొలుసుకట్టు వలసల వల్ల అర్హతలులేని వారికి అవకాశాలు దక్కుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇటు దేశం, మతం, జాతితో సంబంధం లేకుండా.. ప్రతిభ ఆధారంగానే వలసల విధానం ఉండాలని ట్రంప్ ఆశిస్తున్నారని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ తెలిపారు. అర్థవంతమైన ఎంపిక ప్రక్రియ లేకపోవడంతో.. ప్రస్తుత వలసల విధానం దేశ భద్రతను సంక్షోభంలో పడేస్తోందని అభిప్రాయపడ్డారు.

'హెచ్-1బీతో అమెరికా కార్మికులకు నష్టం'

హెచ్-1బీ వీసాలతో అమెరికా కార్మికులకు నష్టం కలుగుతోందని రిపబ్లికన్ సెనేటర్, సెనేట్ జుడీషియరీ కమిటీ ఛైర్మన్ చక్ గ్రాస్లీ ఆరోపించారు. హోంల్యాండ్ సెక్యూరిటీపై చట్టసభ సభ్యుల విచారణలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. "హెచ్-1బీ కార్మికుల్లో ఎక్కువ మంది సాంకేతిక రంగంలో పనిచేస్తున్నవారే. దశాబ్దాలుగా ఈ రంగంలో వేతనాలు వృద్ధి చెందట్లేదు. విదేశీ కార్మికుల సంఖ్య మాత్రం అంతకంతకూ పెరుగుతోంది" అని అన్నారు. అమెరికా కార్మికులకు 'రక్షణ' కల్పించేందుకు తీసుకువచ్చిన హెచ్-1బీ ఆంక్షలను ఆయన ప్రశంసించారు.

ప్రపంచం చూపు.. ఆంధ్రప్రదేశ్ వైపు

ఈనాడు - దిల్లీ

ప్రపంచంలోని పెట్టుబడిదారులంతా ఆంధ్రప్రదేశ్‌వైపు ఆసక్తిగా చూస్తున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే వేగవంతమైన వృద్ధితో దూసుకెళ్తోందని వెల్లడించారు. అందుకే రష్యా, అబుదాబి... ఎక్కడికెళ్లినా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌లోని అవకాశాల గురించి ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే 24వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహంగా బుధవారం దిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. హాజరైన 30 దేశాల ప్రతినిధులనుద్దేశించి మాట్లాడారు. 'దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం కాబట్టే ఏపీలో ఆరోసారి సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగుతోంది. వ్యవసాయం, తయారీ, సేవారంగాల్లో అద్భుత ప్రతిభ చూపుతోంది. చంద్రబాబు దృఢమైన నాయకత్వంలో సాధ్యమైనంత తక్కువ సమయంలో పరిశ్రమలకు అనుమతులిస్తున్నారు. అందుకే అది ఇప్పుడు దేశ, విదేశీ పెట్టుబడిదారులకు ఇష్టమైన గమ్యస్థానంగా మారింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ దేశంలోని మిగతా రాష్ట్రాలు, జాతీయ సగటుకంటే వేగవంతమైన వృద్ధి రేటుతో ముందుకెళ్తోంది. నేను రష్యాకు వెళ్లినప్పుడు అక్కడివారు సింగపూర్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయబోతున్న నూతన రాజధాని అమరావతి గురించి ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారుల్లో ఆంధ్రప్రదేశ్‌పట్ల విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. వైద్య పరికరాల ఉత్పత్తికి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా మారుతోంది. ప్రస్తుతం దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి జరుగుతున్న ఈ రంగానికి ఆంధ్రప్రదేశ్‌లో అందరికంటే ముందు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రిని అభినందిస్తున్నా. నేను కొన్నిరోజుల క్రితం అబుదాబికి వెళ్లాను. అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీకి నేతృత్వం వస్తున్న అక్కడి రాజకుటుంబీకుడొకరు తమవద్ద ఉన్న 2, 3 ట్రిలియన్ డాలర్ల పించను ఫండ్ ద్వారా భారత్‌లో... ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపారు. ముఖ్యమంత్రి తన రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించారు. ఆ వృద్ధి ఫలాలు ప్రజలకు చేరాలని శ్రమిస్తున్నారు' అని సురేష్ ప్రభు పేర్కొన్నారు. పౌర విమానయాన మంత్రిగా అశోక్‌గజపతి రాజు పనితీరునూ అభినందించారు.

15 వృద్ధి మా లక్ష్యం: చంద్రబాబు

ప్రస్తుతం దేశంలో వరుసగా రెండంకెల వృద్ధి రేటుతో ముందుకుపోతున్న ఆంధ్రప్రదేశ్‌లో 15% వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు పెట్టుబడులు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించబోతున్న తీరు, అందులో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వెల్లడించారు.

ఇప్పటికే 2500 మంది పేర్ల నమోదు

సీఐఐ సెక్రటరీ జనరల్ చంద్రజిత్ బెనర్జీ మాట్లాడుతూ. . విశాఖ సదస్సుకు అద్భుత స్పందన వస్తున్నట్లు చెప్పారు. 1995లో సీఐఐ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా భాగస్వామ్య సదస్సులకు శ్రీకారం చుట్టామని, ఇప్పటివరకూ నిర్వహించిన 24లో ఆరు ఆంధ్రప్రదేశ్‌లోనే జరిగాయన్నారు. అందులో మూడు వరుసగా గత మూడేళ్లుగా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే సదస్సులో 50 ప్రపంచ దేశాల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వశాఖలు పాల్గొంటాయని తెలిపారు. ఇప్పటివరకూ 2500 మంది పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు.



బుధవారం దిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కలిసిన సందర్భంగా ఆయనకు శాలువా కప్పుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తానా సదస్సుకు ట్రంప్, చంద్రబాబు!

తానా అధ్యక్షుడు సతీష్ వేమన వెల్లడి

పుల్లడిగుంట, న్యూస్‌టుడే: అమెరికాలో త్వరలో నిర్వహించనున్న సదస్సుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని తానా అధ్యక్షుడు సతీష్ వేమన తెలిపారు. బుధవారం అమరావతి పర్యటనలో భాగంగా పుల్లడిగుంట గ్రామంలో ప్రవాసాంధ్రుడు ఉప్పుటూరి రామ్‌చౌదరి, తల్లి జడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మిని కలిసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రవాసాంధ్రుల తల్లిదండ్రులు ట్రంప్ విధానాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ చేస్తున్న జీవోలు, ఉత్తర్వులపై కోర్టులకు వెళుతున్నట్లు సతీష్ చెప్పారు. అమెరికాలో అత్యవసర సర్వీసులకు 911 నెంబర్ పని చేస్తుందని, తెలుగువారికి సేవలందించేందుకు తాము ప్రత్యేకంగా 1000(టీమ్ స్క్వయర్) నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మృతదేహాలను స్వదేశానికి పంపడానికి గతంలో 30 వేల డాలర్లు వెచ్చించాల్సి వచ్చేదని, తానా ప్రస్తుతం 6 వేల డాలర్లతోనే పంపిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల మొదటి వారంలో ఖమ్మం, విజయవాడలో సంపూర్ణ ఆరోగ్యం కోసం 5కె వాక్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత కాదు

- అరుణ్ జైట్లీతో చంద్రబాబు భేటీ

ఈనాడు, దిల్లీ: 'కొత్త రాష్ట్రానికి చాలా సమస్యలున్నాయి. ఇప్పుడిప్పుడే నిలదొక్కుకునే పరిస్థితి ఉంది. అన్ని రాష్ట్రాలతో సమానంగా పైకి వచ్చేవరకూ చేయూతనివ్వాలని ఇప్పటికే ప్రధాన మంత్రిని కోరాం. ఈ బాధ్యత ఒక్క రాష్ట్ర ప్రభుత్వానిదే కాదు. కేంద్ర, రాష్ట్రాలు కలిసి ప్రజలకు అన్ని విధాలా చేయూతనివ్వాల్సిన అవసరముంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు సన్నాహక కార్యక్రమంలో పాల్గొనడానికి దిల్లీకొచ్చిన ఆయన ఆ కార్యక్రమం ముగిసిన వెంటనే నార్త్‌బ్లాక్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిశారు. విభజన చట్టం ప్రకారం చేయాల్సిన ఆర్థిక సాయంపై విజ్ఞప్తి చేశారు. ఇటీవల ప్రధానితో జరిగిన చర్చల సారాంశాన్ని వివరించి నిధులను దేశీయ ఆర్థిక సంస్థల నుంచి ఇప్పించాలని కోరారు. తాను కొన్ని పెండింగ్ అంశాలను జైట్లీ దృష్టికి తీసుకెళ్లానని, ఆయన సానుకూలంగా స్పందించారని చంద్రబాబు సమావేశానంతరం పేర్కొన్నారు. 'ప్రత్యేక ప్యాకేజీ కింద రాష్ట్రానికి రూ. 16వేల కోట్ల దాకా రావాల్సి ఉంది. ఆ మొత్తాన్ని విదేశీ ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్టుల ద్వారా కాకుండా నాబార్డ్, హడ్కో, వాణిజ్య బ్యాంకుల ద్వారా ఇప్పించాలని కోరాం. దానికి ఆర్థిక మంత్రి సానుకూలంగా స్పందించారు. రెవెన్యూ లోటు గురించి పీఎంవోతో మాట్లాడుతున్నాం. ఆ రోజు 16వేల కోట్ల రూపాయలు తిరిగి చెల్లిస్తామన్నారు. ఇప్పటివరకూ రూ. 4వేల కోట్లు ఇచ్చారు. ఇంకా రూ. 7,500 కోట్లు ఇస్తామని అంగీకరించారు. ఆ మొత్తాన్ని ఇవ్వాలని కోరాం. పోలవరం ప్రాజెక్టు ఇప్పుడిప్పుడే పట్టాలెక్కింది' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు, అసెంబ్లీ సీట్ల పెంపు అంశాలూ పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తు చేశారు. వచ్చే బడ్జెట్‌లో పోలవరానికి నిధులు కేటాయించే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ... 'పోలవరానికి నాబార్డు నుంచే నేరుగా అనుసంధానం చేశారు కాబట్టి బడ్జెట్‌కు బదులు నాబార్డు నుంచే వస్తాయి' అని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన జాతీయ విద్యా సంస్థలకు ఇప్పటివరకూ నామమాత్రంగా నిధులిచ్చారని, ఈసారి పెంచాలని ఆర్థిక మంత్రిని కోరామని తెలిపారు. రాష్ట్రానికి కొత్త గవర్నరు కావాలంటూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు కేంద్రానికి రాసిన లేఖ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... 'ఇక్కడ విషయం అది కాదు. నాకు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం. వారి పార్టీ అంశం ఆయన చెప్పి ఉంటారు. ముఖ్యమంత్రిగా ఎప్పుడూ నేను అది ఆలోచించలేదు. చెప్పాల్సిన అవసరం లేదు' అని బదులిచ్చారు.

రూ.833.23 కోట్లతో కాపులకు స్వయం ఉపాధి

- ఎండీ సాయిశంకరరావు

ఈనాడు, అమరావతి: కాపు కార్పొరేషన్ నుంచి 2017-18లో రూ. 833.23 కోట్ల వ్యయంతో 58,213 మందికి స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందజేశామని సంస్థ మేనేజింగ్ డైరక్టర్ కె.సాయిశంకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 817 మంది విద్యార్థినీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం ఎంపిక చేసి పంపామన్నారు. ఇందుకోసం కార్పొరేషన్ తరపున రూ. 98.04 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. విద్యోన్నతి పథకంలో ఇప్పటివరకు 750 మందికి సివిల్ సర్వీసెస్ శిక్షణ ఇప్పిస్తున్నామని వివరించారు. వీరందరికీ శిక్షణ, స్టయిఫండ్ కోసం రూ. 14.25 కోట్లు ఖర్చు చేశామన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం మరో 14,872 మంది లబ్ధిదారులను గుర్తించామని, వీరందరికీ త్వరలో శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా కేంద్రాల్లో కాపు భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పేదలకు అన్నం పెట్టిన ఎన్టీఆర్

- తెలుగుజాతి యశస్సును దశదిశలా చాటారు
- నేడు ఎన్టీఆర్ వర్ధంతి నేపథ్యంలో స్మరించుకున్న చంద్రబాబు

ఈనాడు - అమరావతి

'రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ద్వారా పేదవారు తృప్తిగా అన్నం తినే అవకాశం కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. దేశంలోనే తొలిసారిగా నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించింది ఆయనే' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. ఆయనలోని పట్టుదల, స్ఫూర్తి తనకు తారకమంత్రమని పేర్కొన్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను ముఖ్యమంత్రి బుధవారం స్మరించుకున్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకునే తాము పక్కా ఇళ్ల పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. తెలుగు వారిపై మదరాసీల ముద్రను తుడిచేసి జాతి యశస్సును దశదిశలా చాటారని ప్రస్తుతించారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా 12 లక్షల మందికి వైద్య సహాయం, 6,700 మందికి శిక్షణ ఇచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. 15వేల మందికి తెదేపా కార్యకర్తలు రక్తదానం చేశారని వివరించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 18న తెలుగు రాష్ట్రాల్లో 120, ఇతర రాష్ట్రాల్లో 150 చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేయడానికి సేవా భావం ఉన్న వారంతా ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు.

273 చోట్ల నేడు రక్తదాన శిబిరాలు

ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ విష్ణు

ఈనాడు, హైదరాబాద్: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం దేశవ్యాప్తంగా 273 చోట్ల 'లెజెండరీ రక్తదాన శిబిరాలు' ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ విష్ణువర్ధన్ తెలిపారు. బుధవారం ట్రస్ట్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో 103, తెలంగాణలో 30, ఇతర రాష్ట్రాల్లో మరో 140చోట్ల ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్‌కు నివాళులర్పించడంతో పాటు సేవా స్ఫూర్తిని చాటేందుకు తెలుగువారంతా సమీపంలోని శిబిరాలకు వెళ్లి రక్తదానం చేయాలని ఆయన కోరారు. దేశ ప్రజలకు 50 కిలోమీటర్ల పరిధిలోనే సురక్షిత రక్తం అత్యవసర సమయంలో అందుబాటులో లభించేలా ఎన్టీఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు చేపడుతుందని ఆయన తెలిపారు.

విదేశీ విషయాల్లో మౌనానికి స్వస్తి

- మోదీ ఆధ్వర్యంలో చురుకైన పాత్ర
- భాజపా సీనియర్ నేత రాంమాధవ్

దిల్లీ: విదేశీ వ్యవహారాల్లో 'వ్యూహాత్మక మౌనం' పాటించాలన్న పాత విధానానికి మోదీ ప్రభుత్వం స్వస్తి చెప్పిందని భాజపా సీనియర్ నేత రాంమాధవ్ అన్నారు. ప్రపంచ వ్యవహారాల్లో చురుకైన, ఉన్నత స్థితికి చేరుకోగల పాత్రను పోషించాలని భావిస్తోందని చెప్పారు. గతంలో ఏ దేశం నాయకునితోనయినా మాట్లాడాలంటే, ఇతర దేశాల మనోభావాలను కూడా దృష్టిలో పెట్టుకునేవారని తెలిపారు. ఇప్పుడు ద్వైపాక్షిక సంబంధాలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. బుధవారం 'రైసినా సంభాషణలు' సదస్సులో భాగంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ ప్రాంతంలో అమెరికా దృష్టి కోణంలో కాకుండా ఆసియా ప్రాంతం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సంబంధాలు నెరుపుతామని చెప్పారు.

అమెరికాకు చెందిన జాతీయ భద్రతా మండలి అధికారి నాడియా షాడ్లో మాట్లాడుతూ తమ దేశ భద్రత వ్యూహాల్లో భారత్‌కు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ఆస్ట్రేలియా రక్షణ పరిశ్రమల శాఖ మంత్రి క్రిస్టోఫర్ పైన్ మాట్లాడుతూ ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని అన్ని దేశాలను తాము సమానంగానే పరిగణిస్తామని తెలిపారు. సింగపూర్ రక్షణ, విదేశీ వ్యవహారాల సీనియర్ సహాయ మంత్రి డాక్టర్ మహమ్మద్ మాలికి బిన్ ఉస్మాన్ ప్రసంగిస్తూ ఉగ్రవాదం, సైబర్ నేరాలపై దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

సదస్సులో కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి స్మృతిఇరానీ మాట్లాడుతూ ముద్ర యోజన కింద లబ్ధిపొందిన వారిలో 75శాతం మంది మహిళలు ఉన్నారని చెప్పారు. ఇది భారత మహిళల శక్తిసామర్థ్యాలకు నిదర్శనమన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి మాట్లాడుతూ 2030నాటికి దేశ జనాభాలో 30 శాతం మంది పట్టణాల్లో ఉంటారని అన్నారు.

ట్రంప్ మానసిక ఆరోగ్యమూ భేష్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఎలాంటి మానసిక, మేధోపరమైన సమస్యలూలేవని వైద్యులు ధ్రువీకరించారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని స్పష్టీకరించారు. ట్రంప్‌నకు మానసిక సమస్యలు ఉండొచ్చనే ఊహాగానాల నడుమ.. వైద్య పరీక్షల ఫలితాలను నావికాదళ వైద్యాధికారి డాక్టర్ రోనీ జాక్సన్ మంగళవారం వెల్లడించారు. అధ్యక్షుడైన అనంతరం ట్రంప్‌నకు తొలిసారి నిర్వహించిన వైద్య పరీక్షలు ఇవే. 'ట్రంప్ మేధో సామర్థ్యం లేదా మానసిక స్థితిపై నాకు ఎలాంటి అనుమానాలూ లేవు. పరీక్షల ఫలితాలన్నీ ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారనే నొక్కిచెబుతున్నాయి. ఆయన మిగతా పదవీకాలం అంతా చక్కగా పనిచేయగలుగుతారని వివరిస్తున్నాయి'అని జాక్సన్ చెప్పారు. చట్ట ప్రకారం మేధోపరమైన పరీక్షలు తప్పనిసరి కానప్పటికీ.. వీటిని నిర్వహించమని ట్రంపే సూచించినట్లు పేర్కొన్నారు.

జల రవాణాకు జవసత్వాలు..!

- రూ.1,30,762 కోట్లతో తాజా ప్రతిపాదనలు
- సాగరమాల ప్రతిపాదనలకు కొత్త రూపు

ఈనాడు - అమరావతి

జల రవాణాను అందుబాటులోకి తీసుకొచ్చే సాగరమాల ప్రాజెక్టు కోసం రూ. 1,30,762 కోట్లతో సవరించిన తాజా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ప్రాథమిక నివేదిక రూపొందించినా ఇందులో కొన్ని సవరణలు చేసి గురువారం నాటి కలెక్టర్ల సమావేశ అజెండాలో చేర్చారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వశాఖల భాగస్వామ్యంతో చేపట్టే ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలోని 974 కిలో మీటర్ల సాగర తీరం జల రవాణాకు కేంద్ర బిందువు కాగలదని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వస్తు రవాణాకు రోడ్డు, గగన మార్గం నానాటికీ ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో అందరికీ అందుబాటులో జలమార్గాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం తీరం పొడవునా ఇప్పటికే ఉన్న ఐదు ఓడ రేవుల్లో కార్యకలాపాలను విస్తృతం చేస్తోంది. వీటి నుంచి 2016-17లో 69.81 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను రవాణా చేశారు. 2017-18లో గత ఏడాది కంటే (2017 డిసెంబరు వరకు) అదనంగా 19.7 శాతం కార్గోను రవాణా చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కార్యకలాపాలను మరింత విస్తృతం చేసే క్రమంలో కొత్తగా మేఘవరం, నక్కపల్లి, నర్సాపూర్, దుగ్గరాజపట్నంలో ఓడరేవులను నెలకొల్పాలని భావిస్తున్నారు. విశాఖపట్నంలోని భారీ ఓడరేవు ఇప్పటికే సేవలను విస్తరించగా, భావనపాడు, కాకినాడ, మచిలీపట్నం ఓడరేవుల అభివృద్ధి కోసం పలు చర్యలు తీసుకుంటున్నారు. వీటితో రాష్ట్రం మీదుగా ఇతర రాష్ట్రాలకు, దేశాలకు సులువుగా రవాణా అయ్యే అవకాశం ఉంటుంది. సాగరమాల ప్రాజెక్టుతో అనుబంధ రంగాలైన మత్స్య, రోడ్డు, రైల్ రవాణా, పర్యాటకం వంటివి మరింత అభివృద్ధి చెందుతాయి.

- తీరం పొడవునా కొత్తగా 5 చేపల రేవులను రూ. 1,533.62 కోట్లతో అభివృద్ధి చేసేలా సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించారు.
- విశాఖలోని యారాడలో ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు సాంకేతికంగా వెసులుబాటుపై ఇంజినీర్ల బృందం ప్రస్తుతం సర్వే చేస్తోంది.
- సమగ్ర చేపల రేవు ఏర్పాటుపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.
- కాకినాడలో పర్యాటక పాసింజర్ జెట్టీని ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకుల కోసం నౌకలను తిప్పే క్రమంలో జెట్టీని ప్రతిపాదించారు.
- నెల్లూరు నుంచి కృష్ణపట్నం మధ్య 24 కిలో మీటర్ల పొడవునా నాలుగు వరుసలుగా రహదారిని అభివృద్ధి చేయనున్నారు.
- జాతీయ రహదారి-16కి అనుసంధానిస్తూ కాకినాడ పోర్టు నుంచి ఉప్పాడ బీచ్ రోడ్డును అభివృద్ధి చేసేలా ప్రతిపాదించారు. కాకినాడ డీప్ వాటర్ పోర్టు రోడ్డులో నాలుగు పైవంతెనలు ఏర్పాటు కోసం చర్యలు తీసుకోనున్నారు.
- కొవ్వూరు-భద్రాచలం మధ్య రైలు మార్గం అందుబాటులోకి వచ్చేలా ప్రతిపాదించారు.
- రాష్ట్రంలో కొత్తగా మారిటైం బోర్డు ఏర్పాటు కోసం ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. అంతర్వేది, మచిలీపట్నం మధ్య కార్గో, ప్యాసింజర్ కార్యకలాపాలు పెరిగేలా అభివృద్ధి చేయనున్నారు.

సాగరమాల పనులు వేగవంతం చేయాలి

- అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం

ఈనాడు, అమరావతి: సాగరమాల పథకంలో ప్రతిపాదించిన పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం కోస్టల్ ఎకనమిక్ యూనిట్ (సీఈయు), కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్, సాగరమాల ప్రాజెక్టుల పనుల ప్రగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పోర్టుల ఆధునికీకరణ, ఓడరేవులు-రహదారుల అనుసంధాన ప్రాజెక్టులు, పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణ తదితర అంశాలపై అధికారులతో దినేశ్‌కుమార్ చర్చించారు. నెల్లూరు-కృష్ణపట్నం రహదారి సమస్యను జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ, రోడ్లు, భవనాలశాఖ అధికారులు కూర్చుని నెలాఖరులోగా పరిష్కరించాలని కోరారు. వివిధ పనుల నిర్వహణపై లక్ష్యాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టింబర్ ప్రాసెసింగ్ జోన్ అంశాన్ని అటవీశాఖ అధికారులతో మాట్లాడి పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సర్వోన్నత న్యాయస్థానంలో ఆత్మీయ విందు



- సుప్రీం న్యాయమూర్తులకు జస్టిస్ ఎన్వీ రమణ ఏర్పాటు
- 'ఆ నలుగురు'లో ముగ్గురు హాజరు
- మెనూలో 30 రకాలు వంటకాలు
- సొంతూరి అరిసెలు, జున్ను

ఈనాడు, దిల్లీ: సుప్రీం కోర్టు న్యాయమూర్తుల మధ్య బుధవారం సుహృద్భావం, ఆహ్లాదం వెల్లివిరిశాయి. తెలుగు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సంప్రదాయ తెలుగు వంటకాలతో షడ్రసోపేత విందును ఏర్పాటుచేశారు. ఒకరి ఆహారపు అభిరుచులు మరొకరు తెలుసుకుంటూ వీరు మధ్యాహ్నం ప్రత్యేక విందును ఆరగించారు. ప్రతి బుధవారం మధ్యాహ్నం ఓ న్యాయమూర్తి మిగతా వారికి విందునిచ్చే ఆనవాయితీ కొనసాగుతోంది. తమ సొంత రాష్ట్రాల ఆహారపు అలవాట్లు, అభిరుచులను తోటివారికి పరిచయం చేయడం, సుహృద్భావం పెంపొందించుకోవడమే దీని లక్ష్యం. న్యాయమూర్తుల నడుమ వివాదాల సుడి రేగిన తరుణంలో తాజా కార్యక్రమం ప్రాముఖ్యం సంతరించుకొంది. జస్టిస్ రమణ 30 రకాల వంటకాలను సిద్ధం చేయించారు. ముఖ్యంగా అరిసెలు, జున్ను, పెరుగును తన స్వగ్రామమైన ఆంధ్రప్రదేశ్‌లోని పొన్నవరం నుంచి విమానంలో తెప్పించినట్లు తెలిసింది. మిగతా వంటకాలను ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇంట్లోనే చేయించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.40 వరకు సుప్రీం కోర్టు న్యాయమూర్తుల లాంజ్‌లో ఈ విందు సాగింది. దీనిలో 22 మంది న్యాయమూర్తులు పాల్గొన్నారు. సెలవు కారణంగా జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్‌లు హాజరుకాలేదు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర పనితీరుపై బహిరంగంగా విమర్శలుచేసిన జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లుకూడా ఇందులో పాల్గొని అందరితో కలిసి కూర్చొని ఆహ్లాదకర వాతావరణంలో భోజనం చేశారు. నేతి అరిసెలు, జున్నును చాలామంది ఇష్టపడి తిన్నారు. వాటి ప్రత్యేకతల గురించి అడిగి మరీ తెలుసుకుని.. జస్టిస్ ఎన్వి రమణను అభినందించారు.

పేద్ద కళాశాల.. ఇద్దరే విద్యార్థులు!

- ముక్కుతూ మూలుగుతూ నడుస్తున్న విజయనగరం సంస్కృత కళాశాల
- మరో రెండు నెలల్లో పూర్తికానున్న ఒకరి చదువు
- 158 ఏళ్ల చరిత.. ప్రశ్నార్థకం భవిత

ఈనాడు - విజయనగరం

ప్రపంచంలోనే అతి ప్రాచీన భాష సంస్కృతం.. భారతదేశ పూర్వ విద్య, వైద్య, విజ్ఞాన విషయాలన్నీ అందులోనే నిక్షిప్తమై ఉన్నాయి. అలాంటి దేవభాష అభివృద్ధికి విశేష కృషి చేసిన విజయనగరం సంస్కృత కళాశాలకు దక్షిణాదిన ఎంతో పేరుంది. విజయనగరం సంస్థానాధీశులు 1860లో ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో 21 గదులతో కళాశాలకు రూపమిచ్చారు. 1957లో సర్కారు అధీనంలోకి వచ్చిన ఈ కళాశాలలో వందలాది విద్యార్థులు సంస్కృతాన్ని అభ్యసించేవారు. సుమారు 17 మంది అధ్యాపకులు విద్య నేర్పేవారు. 158 ఏళ్లుగా నిర్విరామంగా సేవలందిస్తున్న ఇదే కళాశాల ప్రస్తుతం కేవలం ఇద్దరు విద్యార్థులతో ముక్కుతూ మూలుగుతూ నడుస్తోంది. ఆ ఇద్దరిలోనూ ఏరోజు ఎవరొస్తారో తెలియని పరిస్థితి.. మహారాజుల ప్రోత్సాహంతో కళకళలాడిన చదువుల గుడి నేడు వెలవెలబోతోంది.

ఉద్యోగవకాశాలు లేనందునే..

విద్యల నగరంగా వాసికెక్కిన విజయనగరంలో అప్పట్లో సంస్కృత భాషను నేర్చుకోవడానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది విద్యార్థులు వచ్చేవారు. అప్పట్లో రాచకుటుంబీకులే వారికి వసతి, భోజన సదుపాయాలు కల్పించేవారు. అప్పట్లో ఇక్కడ సంస్కృతంలో విద్యాప్రవీణ, భాషాప్రవీణ కోర్సులు నేర్పించేవారు. ప్రస్తుతం పూర్తి సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో అయిదేళ్ల బి.ఎ.(ఓరియెంటెడ్ లాంగ్వేజ్) ఇంటిగ్రేటెడ్ కోర్సు మాత్రమే నడుస్తోంది. సంస్కృతానికి ఆదరణ తగ్గిపోవడంతో పాటు వసతి సౌకర్యం సమస్యగా మారింది. ఉద్యోగవకాశాలూ లభించడం లేదు. అదే తితిదే ఆధ్వర్యంలో నడుస్తున్న వేద పాఠశాలల్లో అయితే.. వేదవిద్య అభ్యసనానికి చేరే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 3లక్షల ఇవ్వడంతో పాటు, చక్కని వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. చదువు పూర్తికాగానే ఉద్యోగావకాశాలూ బాగుంటున్నాయి. అందుకే అంతా అటువైపే మొగ్గుచూపిస్తున్నారు.



విజయనగరం సంస్కృత కళాశాలలో పరిస్థితి

పేరుకు మాత్రమే విద్యార్థులు..!

దాదాపు 2010 నుంచి సంస్కృత కళాశాలలో ప్రవేశాలు తగ్గుముఖం పడుతూ వచ్చి ప్రస్తుతం సున్నా దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఇందులో చదువుతున్న ఇద్దరిలో ఒక విద్యార్థిని అయిదో ఏడాది చదువుతోంది. మార్చితో ఆమె విద్యాభ్యాసం పూర్తికానుంది. ఇక మూడో ఏడాది చదువుతున్న మరొక్క విద్యార్థితోనే కళాశాల కొనసాగనుంది. ఈ క్రమంలో ఎందరో ఉద్దండుల్ని తీర్చిదిద్దిన సంస్కృత కళాశాలకు ఎలాంటి దుస్థితి వచ్చి పడిందోనని అంతా ఆవేదన చెందుతున్నారు. "ఏడేళ్లుగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కళాశాల పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నా"మని సంస్కృత కళాశాలలో ఏకైక అధ్యాపకురాలు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ స్వప్నహైందవి 'ఈనాడు'కు తెలిపారు.

డిసెంబరు 4నే జయ మరణించారు

శశికళ సోదరుడు దివాకరన్

ఈనాడు డిజిటల్, చెన్నై- చెన్నై, న్యూస్‌టుడే: జయలలిత 2016 డిసెంబరు 4వ తేదీనే మరణించారని శశికళ సోదరుడు దివాకరన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరువారూర్ జిల్లా మన్నార్గుడిలో బుధవారం జరిగిన ఎంజీఆర్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో వైద్యం పొందుతూ 2016 డిసెంబరు 5న జయలలిత మరణించారని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది ప్రభుత్వం అధికారికంగా అమ్మ వర్ధంతిని అదే తేదీన నిర్వహించింది. ఇంతకాలం జయలలిత మరణంపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో వాస్తవాలను వెల్లడించడానికి జస్టిస్ ఆర్ముగస్వామి నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ కూడా ఏర్పాటైంది. ఆ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మరంగా విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో శశికళ సోదరుడు దివాకరన్ మాట్లాడుతూ... జయలలిత 2016 డిసెంబరు 4 సాయంత్రం చనిపోయారని, శాంతి భద్రతల రీత్యా మరుసటి రోజు వైద్యులు ఈ విషయాన్ని ప్రకటించారని పేర్కొన్నారు. దివాకరన్ తాజా వ్యాఖ్యలతో మరో దుమారం రేగింది. జయలలిత మరణించినట్లు తమిళనాడులోని ఓ ప్రముఖ టీవీ ఛానెల్ 2016 డిసెంబరు నాలుగో తేదీనే ప్రకటించడం గమనార్హం. మరోవైపు ఈ వివాదంపై అపోలో ఆస్పత్రి ఓ ప్రకటనలో స్పందిస్తూ... జయలలిత మృతి చెందిన సమయంపై అనవసరమైన వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొంది.

రూ.10 నాణేలన్నీ చెల్లుతాయ్: ఆర్‌బీఐ

ముంబయి: చెలామణిలో ఉన్న రూ.10 నాణేలన్నీ చెల్లుబాటు అవుతాయని ఆర్‌బీఐ తెలిపింది. ప్రతి లావాదేవీకి వీటిని ఉపయోగించవచ్చని పేర్కొంది. 14 డిజైన్లలో ఈ నాణేలున్నాయి.



కొందరు వ్యాపారులు రూ.10 నాణేలు తీసుకోడానికి నిరాకరిస్తుండటంతో ఆర్‌బీఐ స్పష్టత నిచ్చింది. 'చెల్లుబాటు కావనే అపోహతో కొందరు వ్యాపారులు, ప్రజలు రూ.10 నాణేలు తీసుకోవడం లేదన్న విషయం మా దృష్టికి వచ్చింద'ని ఆర్‌బీఐ తెలిపింది. ప్రభుత్వ ముద్రణా సంస్థలు (మింట్‌లు) తయారుచేసిన నాణేలనే చెలామణిలోకి తెచ్చినట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విలువలను ప్రతిబింబిచేలా వీటిపై వివిధ చిత్రాలను ముద్రించారని తెలిపింది.

ద్విచక్ర వాహనాల్లో నావిగేషన్ వ్యవస్థ

మ్యాప్‌మై ఇండియా

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుతం కార్లలో వినియోగిస్తున్న నావిగేషన్ వ్యవస్థ తరహాలోనే ద్విచక్ర వాహనాల్లో కూడా త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు మ్యాప్‌మైఇండియా తెలిపింది. ఇప్పటికే తమ సాఫ్ట్‌వేర్‌ను 30 లక్షలకు పైగా కార్లలో వినియోగిస్తున్నారనీ, ద్విచక్ర వాహనాల్లో




దీన్ని ప్రవేశ పెట్టడానికి వాహన సంస్థలు ప్రయత్నిస్తున్నాయన్నాయని సంస్థ సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ రాకేశ్ వర్మ తెలిపారు. బుధవారం 'మ్యాప్ ఇంజిన్'ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మ్యాప్ ఇంజిన్‌తో సంస్థలు తమ సొంత మ్యాప్ పోర్టల్ తయారు చేసుకొని, తమ వినియోగదారులకు అందబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు. ఇంటర్నెట్ అవసరం లేకుండా కూడా ఈ వ్యవస్థ పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చిరునామాలు ఎంతో కీలకమైన నేపథ్యంలో ప్రతి భవంతికీ 'ఈలాక్'తో ఒక డిజిటల్ చిరునామా ఇస్తున్నామని, ఇప్పటికే 56 కోట్ల భవనాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

శ్రీశ్రీ తత్వ విస్తరణ ప్రణాళికలు

1000 విక్రయశాలలు, రూ.500 కోట్ల ఆదాయమే లక్ష్యం

ముంబయి: ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్‌కు చెందిన ఎఫ్‌ఎమ్‌సీజీ ఉత్పత్తుల బ్రాండ్ 'శ్రీశ్రీ తత్వ' విస్తరణ బాట పట్టింది. ఈ ఏడాది చివరకు 1000 విక్రయశాలలను ప్రారంభించి, రూ.500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడమే లక్ష్యమని కంపెనీ ఎండీ



అరవింద్ వార్చస్వీ పేర్కొన్నారు. ఫ్రాంచైజీ ఇండియా అనుబంధంతో ఫ్రాంచైజీ విధానంలో కొత్త విక్రయశాలలను తెరుస్తామని తెలిపారు. మూడు రకాల విక్రయశాలలు- శ్రీశ్రీ తత్వ మార్ట్, శ్రీశ్రీ తత్వ వెల్‌నెస్ ప్లేస్, శ్రీశ్రీ తత్వ హోమ్ అండ్ హెల్త్‌లను తెరవనుందని వివరించారు. శ్రీశ్రీ తత్వ మార్ట్‌లో ప్యాకింగ్ చేసిన ఆహారం, వ్యక్తిగత, గృహ సంరక్షణ ఉత్పత్తులను, శ్రీశ్రీ తత్వ వెల్‌నెస్‌లో జీవనశైలి ఉత్పత్తులు, ఆయుర్వేద ఔషధాలు, శ్రీశ్రీ తత్వ హోమ్‌లో నిత్యం వినియోగించే ఉత్పత్తులు, ఔషధాలను విక్రయించడంతో పాటు ఆయుర్వేద వైద్యులు ఉంటారని వెల్లడించారు. ఇప్పటి వరకు సొంత వెబ్‌సైట్ ద్వారానే ఆన్‌లైన్ ఉత్పత్తులు విక్రయించిన సంస్థ.. తాజాగా బిగ్‌బాస్కెట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.



దేశీయంగా రాబోయే బడ్జెట్‌పై బోల్డు ఆశలు..
సంస్కరణల బాట వీడబోమన్న ప్రభుత్వ హామీలు..
అంతర్జాతీయ సానుకూలత వల్ల ప్రపంచ మార్కెట్ల పరుగులు..
ఇలా అన్నీ శుభపరిణామాలు ఎదురవుతుంటే..
రికార్డుల మోత మోగకుండా ఉంటుందా మరి.
అందుకే 'కొత్త సంవత్సరంలో పాత రికార్డులు ఎందుకుండాలి'
అనుకుందేమో.. అన్నింటినీ బద్దలు కొట్టేసింది మన బుల్ మహారాజు..
ఫలితమే సెన్సెక్స్ తొలిసారి 35000 మైలురాయిని అధిగమించింది..
నిఫ్టీని 10800 తాకించి తీసుకొచ్చింది..
ప్రస్తుత దూకుడు చూస్తుంటే..
త్వరలో నిఫ్టీ 11000కు వెళ్లడమూ
ఖాయమేనని విశ్లేషకులు
పేర్కొంటున్నారు.

సెన్సెక్స్ చరిత్రలో మరో మైలురాయి

- 17 ట్రేడింగ్ రోజుల్లోనే 1000 పాయింట్లు పైకి
- నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీలూ కొత్త శిఖరాలకు

'ప్రతికూల వార్తలను పెద్దగా పట్టించుకోకు.. ఒక్క సానుకూల వార్త వినిపించినా దూసుకెళ్లు.'

- ప్రస్తుతం మన మార్కెట్ ధోరణి ఇలాగే ఉంది. ఎందుకంటారా..? రిటైల్ ద్రవ్యోల్బణం కొండెక్కి కూర్చున్నా.. చమురు ధరలు పెరుగుతున్నా మన మార్కెట్ పెద్దగా ప్రభావితం కాలేదు. అదే ప్రభుత్వం తరపున ఏదేని ఒక్క సానుకూల ప్రకటన వచ్చిందంటే చాలు.. ఎక్కడలేని ఉత్సాహాన్ని కనబరుస్తోంది. కొన్ని రోజులుగా ఇదే ధోరణి కొనసాగడం వల్లే సూచీలు ఒక్కో మైలురాయిని అధిగమించుకుంటూ వెళ్తున్నాయి. తాజాగా బుధవారంకూడా మళ్లీ ఇలాంటి పరిణామమే సంభవించింది. ద్రవ్యలోటు పెరుగుతున్నందున, మదుపర్లలో నెలకొన్న ఆందోళన తగ్గించేలా అదనపు రుణ పరిమితిని రూ.50,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్లకు తగ్గిస్తున్నట్లు ప్రభుత్వం చేసిన ఒకే ఒక్క ప్రకటన.. మార్కెట్‌ను భారీ లాభాలబాట పట్టించింది ఈ ప్రకటన వెలువడిన వెంటనే ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు ఉరకలెత్తాయి. ఈ ప్రభావంతో అప్పటివరకు స్వల్ప లాభాలతో కదలాడుతున్న సూచీల జోరు పెరిగింది. విదేశీ మార్కెట్ల సానుకూలతలు కూడా ఇందుకు దోహదం చేశాయి. బ్యాంకింగ్, ఐటీ షేర్ల జోరుతో సూచీలు కొత్త శిఖరాలను అధిరోహించాయి.

రికార్డులు బద్దలు..

ఉదయం సెన్సెక్స్ 34753.80 పాయింట్ల వద్ద స్తబ్దుగా ఆరంభమైంది. మధ్యాహ్నం తరవాత క్రమక్రమంగా లాభాలు పెంచుకుంది. ఆఖరుకు 310.77 పాయింట్ల లాభంతో 35,081.82 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 35000 పాయింట్ల ఎగువన ముగియడం ఇదే తొలిసారి. అంతేకాదు 17 ట్రేడింగ్ రోజుల్లోనే సెన్సెక్స్ 1000 పాయింట్లు పెరిగింది. డిసెంబరు 26న తొలిసారి సూచీ 34000 మైలురాయిని అందుకున్న సంగతి విదితమే.

10800కి వెళ్లి.. వచ్చి..

నిఫ్టీ తొలిసారి 10800 స్థాయిని తాకినా, ఆ స్థాయిని నిలబెట్టుకోలేకపోయింది. చివరకు 88.10 పాయింట్లు పెరిగి 10,788.55 వద్ద ముగిసింది. సూచీల లాభాల్లో కీలక పాత్ర పోషించిన బ్యాంకింగ్ షేర్ల సూచీ 'బ్యాంక్ నిఫ్టీ' కూడా కొత్త శిఖర స్థాయిని (26289) చేరింది. సెన్సెక్స్, నిఫ్టీ రెండింటికీ బుధవారం నాటి స్థాయిలే తాజా జీవనకాల గరిష్ఠ ముగింపులు. ఇంట్రాడే పరంగా కూడా నిన్న నమోదైనవే రికార్డు గరిష్ఠ స్థాయిలు.

అన్ని రంగాలూ కళకళే..

మీడియా షేర్లు మినహా నిఫ్టీలో అన్ని రంగాల సూచీలు కళకళలాడాయి. అత్యధికంగా నిఫ్టీ పీఎస్‌యూ సూచీ 4 శాతం పెరిగింది. నిఫ్టీ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్, ఫార్మా, లోహ సూచీలు 1 శాతం వరకు లాభపడ్డాయి. బీఎస్ఈలో అన్ని రంగాల సూచీలు రాణించడం విశేషం. ఎన్ఎస్ఈలో 77 షేర్లు 52 వారాల గరిష్ఠాన్ని చేరాయి.

ఐటీ షేర్లు అదరహో..

ఇన్ఫోసిస్, టీసీఎస్ ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఐటీ షేర్ల జోరు కొనసాగుతోంది. బుధవారం కూడా ఈ రెండు దిగ్గజాల షేర్లు 2.61% పెరిగాయి. బ్యాంకింగ్ షేర్లలో యాక్సిస్ బ్యాంక్ 4.65% పెరగగా. . ఎస్‌బీఐ 3.44% దూసుకెళ్లింది. ఐసీఐసీఐ బ్యాంక్, యెస్ బ్యాంక్ షేర్లు కూడా 2.6% వరకు రాణించాయి. ఇవే కాకుండా సెన్సెక్స్- 30లో టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు కూడా లాభాలపంట పండించాయి.

✦ నేటి మార్కెట్

సూచీలు నేడు కూడా జోరు కనబరచవచ్చు. ద్రవ్యోలోటు ఆందోళనలను తగ్గించేందుకు ప్రభుత్వం చేసిన ప్రకటనతో మార్కెట్ సెంటిమెంటు సానుకూలంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. బ్యాంకింగ్, ఐటీ షేర్లకు లాభాలు కొనసాగొచ్చు. దేశీయ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు కొనసాగుతుండటమూ కలిసొస్తుందని అభిప్రాయపడుతున్నారు. ఈ సంవత్సరం అర్ధభాగం వరకు సూచీల్లో దిద్దుబాటు రాకపోవచ్చునే విశ్లేషణను కొందరు చేస్తున్నారు. ఈ రోజు నిఫ్టీ 10755- 10845 శ్రేణిలో చలించే అవకాశం ఉంది. హిందుస్థాన్ యునిలీవర్ ప్రకటించిన ఫలితాలు కంపెనీ షేరుపై ప్రభావం చూపించొచ్చు. నేడు వెలువడే కంపెనీల ఫలితాలపైనా మదుపర్లు దృష్టి సారిస్తారు. నేడు జరిగే జీఎస్‌టీ మండలి సమావేశాన్ని కూడా గమనిస్తారు.

నిఫ్టీ 11800

- 2018-19 చివరికల్లా చేరే అవకాశం
- హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్

వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) చివరికల్లా నిఫ్టీ 11,800 పాయింట్లకు చేరొచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ అంచనా వేస్తోంది. నిఫ్టీ కంపెనీల ఆదాయాల్లో వృద్ధి పెరిగే అవకాశం ఉండటమే ఇందుకు కారణమని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ కంపెనీల ఆదాయాల్లో 13.5 వృద్ధి ఉండొచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ భావిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి 21.5 శాతానికి పెరగొచ్చని అంచనా వేస్తోంది. దేశ జీడీపీ వృద్ధి 7.3 శాతానికి పెరిగే అవకాశం ఉండటం, ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకుంటుండటం, జీఎస్‌టీ సమస్యలు పరిష్కారం అవుతుండటం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుండటం లాంటి అంశాలు మార్కెట్‌కు సానుకూలతను తెచ్చిపెడతాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ధీరజ్ రెల్లీ పేర్కొన్నారు.

శామ్‌సంగ్ గెలాక్సీ ఆన్7 ప్రైమ్

ధర: రూ.12,990 నుంచి




కొత్త గెలాక్సీ ఆన్7 ప్రైమ్‌ను విడుదల చేస్తున్న నటి కృతి సనన్

దిల్లీ: సరికొత్త స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఆన్7 ప్రైమ్‌ను శామ్‌సంగ్ ఆవిష్కరించింది. రూ.12,990 నుంచి ఈ ఫోన్ లభ్యమవుతుంది. దీనిలో కొత్తగా 'శామ్‌సంగ్ మాల్' సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. తమకు కావాల్సిన వస్తువును ఫోటో తీసి, ఈ మాల్ సాయంతో వేర్వేరు ఇకామర్స్ పోర్టళ్లలో ధర ఎంత ఉందో పరిశీలించుకోవచ్చని సంస్థ తెలిపింది. ఇందుకోసం అమెజాన్, టాటా క్లిక్, జబాంగ్, షాప్‌క్లూస్ పోర్టళ్లతో ఒప్పందం చేసుకున్నట్లు శామ్‌సంగ్ ఇండియా ఉపాధ్యక్షుడు సందీప్ సింగ్ అరోరా ప్రకటించారు. ఈ స్మార్ట్‌ఫోన్‌ను కూడా శామ్‌సంగ్ వెబ్‌సైట్‌తో పాటు అమెజాన్ డాట్ ఇన్ పోర్టల్‌లో మాత్రమే కొనుగోలు చేసుకునే వీలుంది.

5.5 అంగుళాల తెర, 1.6 గిగాహెర్ట్జ్ ఎగ్జినోస్ ఆక్టాకోర్ ప్రాసెసర్, వెనక-ముందు 13 మెగాపిక్సెల్ కెమేరాలు, 3,300 ఎంఏహెచ్ బ్యాటరీ కలిగిన ఈ ఫోన్ 3జీబీ ర్యామ్-32 జీబీ మెమొరీది రూ.12,990 కాగా, 4జీబీర్యామ్-64 జీబీ మెమొరీ కలిగినది రూ.14,990 అని ప్రకటించింది.

4 కెమేరాలతో హువావె స్మార్ట్‌ఫోన్లు

4 కెమేరాలతో సరికొత్త స్మార్ట్‌ఫోన్ హానర్ 9 లైట్‌ను హువావె ఆవిష్కరించింది. 5.65 అంగుళాల తెర, ముందు-వెనక 13 మెగాపిక్సెల్ కెమేరాలు రెండు చొప్పున ఉండే ఈ స్మార్ట్‌ఫోన్, ఈఎంయూఐ 8.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తాయి. దేశీయంగానే దీన్ని అభివృద్ధి చేసినట్లు సంస్థ తెలిపింది. దీనిలో ఉండే కృత్రిమ మేధ వల్ల స్మార్ట్‌ఫోన్ నెమ్మదించదని పేర్కొంది. దేశీయ భాషలను ఈ స్మార్ట్‌ఫోన్లలో వినియోగించుకోవచ్చు. 32జీబీ మెమొరీ ఫోన్ ధర రూ.10,999 కాగా, 64 జీబీ ఫోన్ ధర రూ14,999. ఈనెల 21 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో ఈ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసుకోవచ్చు.



పసిడి దిగుమతి 846 టన్నులు

దిల్లీ: అంతర్జాతీయంగా ధరలు తక్కువగా ఉండటానికి తోడు, దేశీయంగా గిరాకీ పెరగడంతో 2017లో దేశంలోకి 846 టన్నుల పసిడి దిగుమతి అయ్యిందని ఎంఎంటీసీ-పాంప్ ఇండియా తెలిపింది. 2016లో దిగుమతి చేసుకున్న 550 టన్నులతో పోలిస్తే, గతేడాది 53 శాతం అధికంగా జరిగింది. ఒక్క డిసెంబరులోనే 70 టన్నుల బంగారం దిగుమతి అయ్యిందని, 2016 డిసెంబరులో ఈ మొత్తం 49 టన్నులేనని తెలిపింది. గతేడాది మొత్తంమీద అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర 1,200-1,300 డాలర్ల మధ్యే ఉండటం కలిసి వచ్చిందని, ప్రస్తుతం 1,330 డాలర్లపైన కదలాడుతున్నట్లు ఎంఎంటీసీ-పాంప్ ఇండియా అధ్యక్షుడు (మార్కెటింగ్) విపిన్ రైనా తెలిపారు.

డేటా లేకున్నా చాటింగ్, చెల్లింపులు

హైక్ వినియోగదారులకే

దిల్లీ: మొబైల్ ఇంటర్నెట్ లేకున్నా, ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు చాటింగ్ చేసుకునేందుకు, వార్తలు చదువుకునేందుకు వీలుగా 'టోటల్' పేరిట కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు దేశీయ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ హైక్ తెలిపింది. క్రీడాపోటీల వివరాలు తెలుసుకునేందుకు, జ్యోతిష్యానికి, రైల్ టికెట్ల బుకింగ్‌కు, నగదు బదిలీకి, చెల్లింపులకు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని ప్రకటించింది. అయితే చిత్రాలను పంపుకునేందుకు మాత్రం వీలవ్వదు. వాట్సాప్‌నకు పోటీగా కార్యకలాపాలు సాగిస్తున్న హైక్, తన వినియోగదారుల సంఖ్యను 10 కోట్ల కంటే పెంచుకునేందుకు తాజా సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఎయిర్‌సెల్, బీఎస్ఎన్ఎల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు సంస్థ తెలిపింది. టోటల్ కోసం 20 ఎంబీ డేటా రూ.1కి లభిస్తుందని పేర్కొంది. ఇంటెక్స్, కార్బన్ తయారీ కొన్ని ఫోన్లలో టోటల్ యాప్‌ను ముందస్తుగా లోడ్ చేసి, విక్రయిస్తున్నట్లు తెలిపింది. ఈ ఫోన్ల కొనుగోలుదారులు టోటల్ యాప్‌లో సైన్ చేయగానే, హైక్ వాలెట్‌లో రూ.200 జమవుతుందని వివరించింది. మొబైల్ డేటా కొనుగోలుకు, స్నేహితులకు నగదు పంపేందుకు ఈ నిధులను వినియోగించుకోవచ్చు. ప్రతి జీఎస్ఎం ఫోన్‌లో ఉండే యూఎస్ఎస్‌డీ సాంకేతికత (121%) నే టోటల్ కోసం వినియోగించుకుంటున్నట్లు హైక్ మెసెంజర్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కావిన్ మిత్తల్ వెల్లడించారు. మిగిలిన ఫోన్ తయారీ సంస్థలతోనూ టోటల్ కోసం చర్చలు జరుపుతున్నామన్నారు. మొబైల్ వాలెట్‌ను ప్రారంభించిన 6 నెలల్లోనే, నెలకు కోటి లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు.

మంగంపేటలో బెరైటీస్ కర్మాగారం!

ఈనాడు-అమరావతి: తక్కువ నాణ్యత కలిగిన బెరైటీస్‌ని అధిక నాణ్యతగా మార్చగలిగే (బెనిఫిసియేషన్ ప్రక్రియ) కర్మాగారం ఏర్పాటుకు నీతి ఆయోగ్ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎండీసీ), కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ)లు సంయుక్తంగా దీనిని ఏర్పాటు చేయనున్నాయి. బెరైటీస్ గనులున్న కడప జిల్లా ఓబులవారిపల్లె మండలం మంగంపేటలో ఈ కర్మాగారం ఏర్పాటుకానుంది. దీనికి సుమారు రూ.150కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. ఇందులో తయారయ్యే బెరైటీస్ అంతటినీ మార్కెట్ ధరకి అనుగుణంగా ఓఎన్‌జీసీ కొనుగోలు చేస్తుంది. ఆయిల్ వెలికితీతలో బెరైటీస్ ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఏపీఎండీసీ వద్ద 65లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ నాణ్యత కలిగిన బెరైటీస్ ఉంది. తాజాగా నిర్మిస్తున్న కర్మాగారం ఏడాదికి 1.5లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ నాణ్యత కలిగిన బెరైటీస్‌ని మాత్రమే తీసుకోగల సామర్థ్యముంది. ఏపీఎండీసీ గనుల నుంచి ఏటా తవ్వుతున్న బెరైటీస్‌లో 30-40శాతం తక్కువ నాణ్యత ఉన్నదే వస్తుంటుంది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అధిక నాణ్యత కలిగినదిగా మార్చాలంటే ఓఎన్‌జీసీతో కలిపి ఏర్పాటుచేస్తున్న కర్మాగారం సామర్థ్యం సరిపోదు. ప్రైవేట్ సంస్థలతో కలిసి ఇంత కుమించిన సామర్థ్యంతో మరో రెండు కర్మాగారాలు ఏర్పాటుచేయాలని ఏపీఎండీసీ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. ఇవి కూడా మంగంపేట వద్దే ఏర్పాటుచేస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెంకయ్య చౌదరి తెలిపారు. మూడు కర్మాగారాలతో సుమారు రూ.500కోట్ల పెట్టుబడి, 400 వరకు ఉద్యోగాలు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు.

ప్రభుత్వ అదనపు రుణాలు రూ.20,000 కోట్లే!

- ముందస్తు ప్రణాళిక రూ.50,000 కోట్లు
- ఆర్‌బీఐ నుంచి అదనపు నిధులు రావడం వల్లే

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో మరో రూ.50,000 కోట్ల అదనపు రుణాలు తీసుకోవాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం 60% మేర తగ్గించుకుని, రూ.20,000 కోట్లకు పరిమితం చేసింది. ఆర్‌బీఐ నుంచి మరిన్ని నిధులు ఖజానాకు వస్తాయనే అంచనాలు, ప్రభుత్వరంగ సంస్థల నుంచి డివిడెండ్ అంచనాలకు అనుగుణంగా ఉండటం ఇందుకు కారణం. ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా సమీకరిస్తున్న మొత్తం కూడా బడ్జెట్ అంచనాలకు తగినట్లే ఉండటమూ దోహద పడింది. పన్ను ఆదాయాన్ని, వ్యయాలను సమీక్షించాక ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాశ్ చంద్ర గార్గ్ తెలిపారు. గత 3 వేలాల్లో రూ.15,000 కోట్ల మేర రుణాలను ప్రభుత్వం అంగీకరించలేదని, రాబోయే వారాల్లో రూ.15,000 కోట్లను తగ్గిస్తారని వివరించారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక, అక్టోబరు-నవంబరు నెలల్లో పన్ను ఆదాయం అంచనాల కంటే తగ్గడంతో, ద్రవ్యలోటు అధికమయ్యే పరిస్థితి ఏర్పడింది. తాజా నిర్ణయంతో ఇది తగ్గుతుంది. సెక్యూరిటీల జారీ ద్వారా 2017-18లోనే రూ.50,000 కోట్ల అదనపు రుణాలు చేస్తామని గత నెలలోనే ప్రభుత్వం ప్రకటించింది. 2017-18లో ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతానికి పరిమితం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

- ✦ 2017 జూన్‌తో ముగిసిన సంవత్సరానికి ఆర్‌బీఐ రూ.30,659 కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వానికి చెల్లించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నుంచి రూ.58,000 కోట్ల డివిడెండ్ లభిస్తుందన్నది ప్రభుత్వ అంచనా.
- ✦ బ్యాంక్ దగ్గర ఉన్న రూ.13,000 కోట్లను ఖజానాకు జమచేయాలని గత అక్టోబరులో ప్రభుత్వం ఆర్‌బీఐకు సూచించింది.
- ✦ ప్రస్తుత ధరల ప్రకారం జీడీపీ రూ.166 లక్షల కోట్లు అనుకుంటే, రూ.20,000 కోట్ల అదనపు రుణం వల్ల ద్రవ్యలోటు రూ.5.66 లక్షల కోట్లకు చేరుతుంది. అంటే జీడీపీలో వాటా 3.4 శాతం కావచ్చు.

పెట్టుబడులు పెట్టేముందు వందసార్లు ఆలోచించాలి

- అంకితభావంతో పనిచేస్తే విజయాలు ఖాయం
- బ్యాంకు రుణాలపై కట్టే వడ్డీ కన్నా చిట్‌ఫండ్ సంస్థల్లో వడ్డీ తక్కువ
- ☛ మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

ఈనాడు - విశాఖపట్నం



విశాఖపట్నంలో బుధవారం జరిగిన సదస్సులో మాట్లాడుతున్న మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్

ఏదైనా రంగంలో పెట్టుబడులు పెట్టే ముందు ఆ రంగంపై విస్తృత అధ్యయనం చేసి, అవగాహన పెంచుకోవాలని, వ్యాపారంలో ఒడుదొడుకులను జాగ్రత్తగా అంచనా వేశాక, వందసార్లు ఆలోచించి, ముందడుగు వేయాలని మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ సూచించారు. అంతర్జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో భాగంగా 'రోల్ మోడల్స్ టు ఎములేట్' అంశంపై చర్చలో ఆమె మాట్లాడారు. తాను 27 ఏళ్ల వయసులో మార్గదర్శి ఎండీగా బాధ్యతలు తీసుకుని సంస్థను రూ.300 కోట్ల టర్నోవరు స్థాయి నుంచి సుమారు రూ.10వేల కోట్ల స్థాయికి అభివృద్ధి చేశానని వివరించారు. 20 శాఖల నుంచి నాలుగు రాష్ట్రాల్లో 105 శాఖలు ఏర్పాటు చేయడానికి ఎంతో శ్రమించాల్సి వచ్చిందన్నారు. మామయ్య రామోజీరావు, భర్త కిరణ్, కుటుంబ సభ్యులందరి ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి ఎదగగలిగానని పేర్కొన్నారు. భార్య ఉద్యోగ, వ్యాపార కార్యకలాపాల్లో నిమగ్నమైతే కుటుంబ బాధ్యతల నుంచి దూరమవుతుందేమోనని చాలామంది భావిస్తుంటారని, మహిళలు అన్ని బాధ్యతలనూ సమర్థంగా నిర్వర్తించగలరన్న విశ్వాసం ఉండాలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధి చిట్టీలు వేసి పాడుకోగా వచ్చే మొత్తానికి చిట్టీదారులు కట్టే మొత్తం, బ్యాంకు నుంచి తీసుకున్న రుణంపై చెల్లించే వడ్డీకన్నా తక్కువగా ఉంటుందని, అందుకే చాలామంది చిట్ ఫండ్ సంస్థలను తమ ఆర్థిక అవసరాలను తీర్చే మార్గంగా భావిస్తున్నారని పేర్కొన్నారు. అమెరికాలోని వి.ఆర్.మైస్టిక్స్ సంస్థ సహ వ్యవస్థాపకురాలు ఉజాలీ కనేరియా, సార్క్ ఛాంబర్ మహిళా పారిశ్రామిక సమాఖ్య అధ్యక్షురాలు రిఫా ముస్తఫా మాట్లాడుతూ.. మహిళలు పారిశ్రామికంగా వృద్ధి చెందేందుకు తగిన అవగాహన కల్పించేలా పారిశ్రామిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి సంధానకర్తగా సెరెండిపిటి కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ ఎండీ మాగంటి రూప వ్యవహరించారు.

సెన్సెక్స్ ▲ 311 **35082**

నిఫ్టీ ▲ 88 **10788**

రూపాయి 63.88 ▲ (ఒక అమెరికా డాలరుకు) 16 పైసలు

బంగారం 30,225 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 15

వెండి 39,220 ▲ ముంబయిలో కిలో రూ.లలో 330

ముడి చమురు 69.33 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	26,029	+236
నాస్‌డాక్	7,275	+52
నిక్కీ 225 (జపాన్)	23,868	−83
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,542	−08
షాంఘై(చైనా)	3,445	+09
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,725	−31
డాక్స్ (జర్మనీ)	13,184	−62

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.29	67.59
పౌండ్ స్టెర్లింగ్	80.40	93.24
యూరో	71.50	82.92
జపనీస్ యెన్/100	52.67	61.08
ఆస్ట్రేలియా డాలరు	46.44	53.73
సింగపూర్ డాలరు	44.11	52.25
థాయ్ బాత్/100	182.64	218.44
బ్రహెయిన్ దీనార్	157.87	180.91
కువైట్ దీనార్	176.16	219.52
సౌదీ రియాల్	15.50	18.37
యూఏఈ దిర్హమ్	15.87	18.55
మలేషియా రింగిట్	14.45	17.77
చైనీస్ యువాన్	7.05	11.44

బుధవారం నిఫ్టీ కదలికలు



80% పెరిగిన జుబిలెంట్ లైఫ్‌సైన్సెస్ నికరలాభం

దిల్లీ: డిసెంబరు త్రైమాసికంలో రూ.212.84 కోట్ల నికరలాభాన్ని ఔషధ సంస్థ జుబిలెంట్ లైఫ్‌సైన్సెస్ నమోదు చేసింది. 2016-17 ఇదేకాల నికరలాభం రూ.118.11 కోట్లతో పోలిస్తే, ఈసారి 80.20 శాతం అధికం. ప్రత్యేక ఫార్మా-ఇన్‌జెక్టబుల్స్ విక్రయాలు బాగా జరగడం ఇందుకు కారణమని సంస్థ తెలిపింది. ఇదే సమయంలో కార్యకలాపాలపై ఏకీకృత ఆదాయం రూ.1,491.64 కోట్ల నుంచి రూ.2,067.76 కోట్లకు పెరిగింది. ఒక త్రైమాసికంలో ఇవే అత్యధిక ఆదాయం, లాభాలని సంస్థ ఛైర్మన్ శ్యామ్ ఎస్ భర్తియా, సహ ఛైర్మన్-ఎండీ హరి ఎస్ భర్తియా పేర్కొన్నారు.

బీఎస్ఈలో షేరు 13.64% లాభంతో రూ.921.25 వద్ద స్థిరపడింది.

హెచ్‌యూఎల్ లాభంలో 27% వృద్ధి

● **ఆదాయం రూ.8,742 కోట్లు**

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) రూ.1,326 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.1,038 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 27.74 శాతం అధికం. అమ్మకాలు పెరగడం, మార్జిన్లలో మెరుగుదల ఇందుకు కలిసొచ్చిందని కంపెనీ తెలిపింది. ఇక మొత్తం ఆదాయం రూ.8,400 కోట్ల నుంచి 4 శాతం వృద్ధితో రూ.8,742 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.7,067 కోట్ల నుంచి రూ.7,036 కోట్లకు తగ్గాయి. వ్యక్తిగత సంరక్షణ విభాగ ఆదాయం రూ.3,980 కోట్ల నుంచి రూ.4,090 కోట్లకు, గృహసంరక్షణ విభాగ



ఆదాయం రూ.2,741 కోట్ల నుంచి రూ.2,689 కోట్లకు చేరాయి. 'మూడో త్రైమాసికంలో అద్భుతమైన పనితీరు చూపాం. అన్ని విభాగాల్లో వృద్ధితో పాటు మార్జిన్లు మెరుగుపడ్డాయి' అని హెచ్‌యూఎల్ ఛైర్మన్ హరీశ్ మన్వానీ పేర్కొన్నారు. మధ్యకాల వ్యవధిలో పరిశ్రమ సానుకూలంగా కనిపిస్తోందని, ప్రధాన బ్రాండ్లపై, భవిష్యత్ విభాగాలపై పెట్టుబడులు కొనసాగిస్తామని వెల్లడించారు. ముడి వస్తువుల ధరలు పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయని, దీంతో వ్యయ నియంత్రణ కార్యక్రమాలపై దృష్టి పెడతామని తెలిపారు. ఇదే సమయంలో లాభదాయకత కొనసాగిస్తూ, పోటీతత్వాన్ని పెంచుకుంటామని తెలిపారు. డోవ్, పియర్స్ వంటి బ్రాండ్లు గణనీయ వృద్ధి సాధించగా, ఫెయిర్ అండ్ లవ్లీ వంటి చర్మ సౌందర్య ఉత్పత్తులు రాణించాయని మన్వానీ అన్నారు. గత త్రైమాసికంలో ప్యూరిట్ బ్రాండ్ కింద ఎయిర్ ప్యూరిఫైయర్లను విడుదల చేసినట్లు వివరించారు.

బీఎస్ఈలో షేరు 0.68 శాతం నష్టంతో రూ.1,371.85 వద్ద ముగిసింది.

రూ.6.5 లక్షల దిగువకు బిట్‌కాయిన్ విలువ



లండన్: ఊహాజనిత కరెన్సీ బిట్ కాయిన్ విలువ 10,000 డాలర్ల (రూ.6.5 లక్షల) దిగువకు వచ్చింది. 2017 డిసెంబరు ప్రారంభ స్థాయి ఇది. అదే నెల 18న నమోదైన రికార్డు గరిష్ఠ స్థాయితో (20,000 డాలర్లు) పోలిస్తే ఇప్పుడు 50 శాతం వరకు క్షీణించింది. 2017లో బిట్ కాయిన్ విలువ 25 రెట్లు పెరిగింది. దీంతో ఆ సమయంలో నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా.. బిట్ కాయిన్ బుడగ ఏ క్షణంలోనైనా పగులుతుందని, జాగ్రత్తగా ఉండమని మదుపర్లను హెచ్చరించిన సంగతి తెలిసిందే.

55 చమురు, సహజవాయువు క్షేత్రాల వేలం నేటి నుంచి

దిల్లీ: దేశంలోని 55 చమురు, సహజవాయువు (గ్యాస్) క్షేత్రాల వేలం ప్రక్రియను ప్రభుత్వం నేడు ప్రారంభించనుంది. హైడ్రోకార్బన్ ఆవిష్కరణ, లైసెన్సింగ్ నూతన విధానం ప్రకారం తొలిసారిగా ఈ వేలం నిర్వహించనున్నారు. ఈ వేలం ప్రక్రియ మార్చి 31 వరకు కొనసాగుతుంది. 59,282 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ క్షేత్రాల కేటాయింపులు జూన్‌లో ఉంటాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ (డీజీహెచ్) తెలిపింది. ప్రభుత్వరంగ ఓఎన్‌జీసీ, వేదాంతాలో విలీనమైన కెయిర్న్ ఇండియా సంస్థలు 41 బిడ్లు దాఖలు చేశాయి.

రాణించిన జీ ఎంటర్‌టైన్‌మెంట్

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మీడియా సంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ ఏకీకృత ప్రాతిపదికన రూ.321.72 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.250.80 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 28.3 శాతం ఎక్కువ. మొత్తం ఏకీకృత ఆదాయం రూ.1,691.58 కోట్ల నుంచి 11.50 శాతం వృద్ధితో రూ.1,886.11 కోట్లకు చేరింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ప్రకటనల ఆదాయం 25.8 శాతం వృద్ధితో రూ.1,202 కోట్లకు చేరింది. చందా ఆదాయం రూ.593.46 కోట్ల నుంచి రూ.501.69 కోట్లకు తగ్గింది. క్రీడా ఛానెల్ టెన్ స్పోర్ట్స్‌ను సోనీకి విక్రయించడం ఇందుకు కారణమైందని కంపెనీ తెలిపింది. దేశీయ చందాల ఆదాయం 7.5 శాతం వృద్ధితో రూ.403.6 కోట్లకు, అంతర్జాతీయ చందాల ఆదాయం రూ.98.1 కోట్లుగా నమోదైంది. 'మెరుగైన పనితీరు నమోదుచేశాం. గత నాలుగు త్రైమాసికాల్లో చోటుచేసుకున్న వివిధ పరిణామాల వల్ల ప్రకటనదార్ల వ్యయాలపై ప్రభావం పడింది. ప్రకటనల వ్యయాలు తిరిగి పుంజుకున్నాయి. ఫలితంగా భవిష్యత్ ఆశావహంగా ఉంది. వివిధ ఉత్పత్తులపై జీఎస్‌టీ రేటు తగ్గించడం కూడా మంచి పరిణామమే' అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ పునీత్ గోయెంకా తెలిపారు. కొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'జీ5'ను వచ్చే నెలలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

బీఎస్ఈలో షేరు 3.29 శాతం నష్టంతో రూ.592.95 వద్ద ముగిసింది.

మైండ్‌ట్రీ మధ్యంతర డివిడెండ్ రూ.2

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.141.5 కోట్ల నికరలాభాన్ని ఐటీ సంస్థ మైండ్‌ట్రీ నమోదు చేసింది. 2016-17 ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన రూ.103.1 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 37.2 శాతం పెరిగింది. ఇదే సమయంలో ఆదాయం రూ.1,295.3 కోట్ల నుంచి 6.4 శాతం వృద్ధితో రూ.1,377.7 కోట్లకు చేరింది. సమీక్షా త్రైమాసికంలో డాలర్ రూపేణ నికరలాభం 44.1 శాతం వృద్ధితో 22 మిలియన్ డాలర్లకు, ఆదాయం 11.5 శాతం వృద్ధితో 214.3 మిలియన్ డాలర్లకు చేరింది. ఎగ్జిక్యూట్ స్మార్ట్ పథకం కింద వేగంగా డెలివరీలు అందించడం ద్వారా తమ ఖాతాదారుల మన్ననలు పొందామని సంస్థ సీఈఓ రావణన్ తెలిపారు. ప్రతి షేరుకు మధ్యంతర డివిడెండ్‌గా రూ.2 చొప్పున ఇవ్వాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది.

బీఎస్ఈలో షేరు స్వల్పంగా లాభపడి, రూ.623.45 వద్ద స్థిరపడింది.

యాక్సిస్ బ్యాంక్ రుణ రేట్ల పెంపు

ముంబయి: రుణాలపై వడ్డీ రేట్లను ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ 0.05 శాతం చొప్పున పెంచింది. కొన్ని త్రైమాసికాలుగా మార్జిన్లపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది. ఎస్‌బీఐ 0.3 శాతం మేర బేస్ రేటు తగ్గించిన కొన్ని రోజుల్లోనే నిధులపై వ్యయానికి అనుగుణంగా రుణాలపై వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్)ను యాక్సిస్ బ్యాంక్ పెంచడం గమనార్హం. కొత్త రుణ రేట్లు నేటి నుంచి అమల్లోకి రానున్నాయని బ్యాంక్ తెలిపింది. ఏడాది కాలవ్యవధి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్‌ను 0.05 శాతం పెంచి 8.30 శాతం చేసినట్లు యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది.

గాయత్రీ ప్రాజెక్ట్స్‌కు రూ.923 కోట్ల పనులు

ఈనాడు, హైదరాబాద్: జాతీయ ప్రధాన రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నుంచి రూ.923 కోట్ల విలువైన రోడ్డు పనులను దక్కించుకున్నట్లు గాయత్రీ ప్రాజెక్ట్స్ తెలిపింది. ఒడిశాలో రెండు రహదారుల ప్రాజెక్టులు రూ.529 కోట్లు, రూ.394 కోట్ల విలువైనవి లభించాయని తెలిపింది. కటక్-అంగుల్ మధ్య ఉన్న జాతీయ రహదారి 42ను 60.200కిమీ నుంచి 112 కిమీ (ప్యాకేజీ 2) వరకూ నాలుగు వరుసల రహదారిగా మార్చడం, జాతీయ రహదారి 23లో రాజాముండ నుంచి బారాకోట్ వరకూ నాలుగు వరుసల రహదారి వేయడం ఈ పనుల్లో ఉన్నాయని తెలిపింది.

మార్కెట్ కబుర్లు

- ✦ అందుబాటు ధర గృహాలు, మౌలిక రంగ ప్రాజెక్టులకు రుణాలు ఇచ్చేందుకు దీర్ఘకాలిక బాండ్ల జారీ ద్వారా రూ.20,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతి ఇచ్చిందని **ఎస్‌బీఐ** వెల్లడించింది.
- ✦ నాలుగు గ్రూప్ సంస్థలను కంపెనీలో విలీనం చేయాలన్న ప్రతిపాదన అనుమతి కోసం వచ్చే నెల 19న వాటాదార్ల సమావేశం జరగనున్నట్లు **టాటా పవర్** తెలిపింది.
- ✦ విద్యుత్ వాణిజ్య వాహనాల కోసం ఇజ్రాయెల్‌కు చెందిన ఫినెర్జీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు **అశోక్ లేలాండ్** ప్రకటించింది.
- ✦ ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 10,000 మంది చోదకులకు **మహీంద్రా లాజిస్టిక్స్** శిక్షణ ఇవ్వనుంది.
- ✦ రెండు ప్రభుత్వ రంగ సంస్థలు **రైట్స్, మిశ్ర ధాతు నిగమ్ (మిథానీ)**లు పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి.
- ✦ 53 ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరా నిమిత్తం ఉత్తర్ ప్రదేశ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ నుంచి రూ.126 కోట్ల ఆర్డరును **ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ రెక్టిఫయర్స్** దక్కించుకుంది.
- ✦ అమెరికా ఆడియో ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ ష్యూరేతో వ్యాపార భాగస్వామ్యాన్ని ఐటీ దిగ్గజం **టీసీఎస్** విస్తరించనుంది.
- ✦ **అంబర్ ఎంటర్‌ప్రైజెస్** ఇష్యూకు తొలి రోజున 1.03 రెట్ల స్పందన లభించింది.
- ✦ **న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్** పబ్లిక్ ఇష్యూ రెండో రోజున 70% స్పందన లభించింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2017–18	2016–17	2017–18	2016–17
భారతీ ఇన్‌ఫ్రాటెల్(కన్సా)	585	620	3,655	3,401
అదానీ పవర్	(1,290.7)	(667.8)	4,916	5,491
టాటా స్పాంజ్(కన్సా)	36	10.97	226.12	166.17
జ్యోతీ ల్యాబ్స్(కన్సా)	32.92	20.66	431.21	398.26
స్టెరిలైట్ టెక్(కన్సా)	90	49.12	835.18	732.34
శ్రేయీ ఇన్‌ఫ్రా(కన్సా)	105.14	67.21	1,411.95	1,134.57
అదానీ ట్రాన్స్‌మిషన్	842.00	99.28	18,08.81	734.43

నేటి బోర్డు సమావేశాలు

★ భారతీ ఎయిర్‌టెల్ ★ అల్ట్రాటెక్ సిమెంట్ ★ యెస్ బ్యాంక్ ★ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ★ అదానీ పోర్ట్స్ ★ సైయెంట్ ★ డీబీ కార్ప్ ★ దీపక్ నైట్రేట్ ★ హిందుస్థాన్ జింక్ ★ జుబిలెంట్ ఇండస్ట్రీస్ ★ కిర్లోస్కర్ ఇండస్ట్రీస్ ★ మాస్టెక్ ★ జెన్సార్ టెక్నాలజీస్

రొమ్ము క్యాన్సర్ సూదిమందు సీసాలు వెనక్కి తీసుకున్న డాక్టర్ రెడ్డీస్

ఈనాడు, హైదరాబాద్: సీసాల మూతలకు సంబంధించిన లోపాలతో రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే సూదిమందు సీసాలను డాక్టర్ రెడ్డీస్ వెనక్కి తీసుకుంది. అమెరికా, ఉజ్బెకిస్తాన్, మయన్మార్‌లలో విడుదల చేసిన 20ఎంజీ/ఎల్ మోతాదులో ఉన్న 1,051 డొసెటాక్సెల్ వాయిల్స్‌ను కంపెనీ స్వచ్ఛందంగా ఉపసంహరించుకుందని అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) ఈనెల 17న విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సూదిమందు సీసాలు డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ విశాఖపట్నం యూనిట్‌లో తయారయినట్లు తెలిపింది.

దివాలా ప్రక్రియ పరిష్కార నిపుణుల ఫీజు సహేతుకంగా ఉండాలి

● **మధుకాన్ వ్యవహారంలో ఐఆర్‌పీపై క్రమశిక్షణ చర్యకు ప్రతిపాదన**

● **ఐబీబీఐ ఛైర్మన్‌కు హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ సూచన**

ఈనాడు, హైదరాబాద్: ఏదైనా కంపెనీ దివాలా ప్రక్రియ పరిష్కార నిపుణుల (ఐఆర్‌పీ/ఆర్‌పీ) ఫీజు సహేతుకంగా ఉండాలని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్, హైదరాబాద్ ధర్మాసనం అభిప్రాయపడింది. నిర్దిష్ట నిబంధనలు, మార్గదర్శకాలు లేకపోవడంతో ఐఆర్‌పీలు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొంది. మధుకాన్ దివాలా ప్రక్రియ వ్యవహారంలో ఐఆర్‌పీ ప్రతిపాదించిన ఫీజు చాలా ఎక్కువగా ఉండటంతో ఈ వ్యవహారాన్ని భారత దివాలా ప్రక్రియ బోర్డు (ఐబీబీఐ)కు సిఫారసు చేస్తున్నట్లు పేర్కొంది. ఐఆర్‌పీపై క్రమశిక్షణ చర్యతో పాటు తగిన పరిష్కారం నిమిత్తం ఐబీబీఐ ఛైర్మన్‌కు నివేదిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యులు రాజేశ్వరరావు విత్తనాల, సాంకేతిక సభ్యులు రవికుమార్ దురైస్వామి ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. వడ్డీతో సహా సుమారు రూ.4.17 కోట్ల రుణం చెల్లించకపోవడంతో ఖమ్మంకు చెందిన మధుకాన్ ప్రాజెక్ట్స్‌పై దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ ఎన్‌సీఎల్‌టీలో శ్రీ శ్రీకృష్ణ రైల్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దరఖాస్తు చేసింది. ఐఆర్‌పీగా నియమితులైన భావన సంజయ్ రుయా తన ఫీజును రుణదాతల కమిటీ మొదటి సమావేశం వరకు రూ.5 కోట్లు, అనంతరం నెలకు రూ.1.75 కోట్లు ప్రతిపాదించడంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రుణం వడ్డీతో సహా రూ.4.16 కోట్లు కాగా, ఐఆర్‌పీ తన ఫీజు రూ.14 కోట్లదాకా ప్రతిపాదించడాన్ని పరిశీలించాలంటూ బోర్డుకు నివేదించింది.

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT 433.40 (423.55) 6715953
AMBUJA CEMEN 277.15 (277.65) 2384660
ASIAN PAINTS 1193.75 (1188.75) 506648
AUROBIND PHA 657.25 (641.10) 2653386
AXIS BANK LT 585.20 (563.20) 8453944
BAJAJ AUTO L 3194.15 (3160.05) 224799
BAJAJ FINANC 1701.20 (1687.35) 1199501
BHARTI AIRTE 499.90 (497.25) 6150484
BHARTI INFRA 366.10 (367.95) 2996802
BOSCH LTD 19954.25 (19859.00) 10905
BPCL 479.85 (479.45) 3397744
CIPLA 607.15 (601.40) 883340
COAL INDIA L 290.95 (291.60) 4360706
DR. REDDYS 2491.85 (2468.70) 381788
EICHER MOTOR 28222.85 (27891.20) 47595
GAIL 480.55 (478.40) 3741888
HCL TECH 952.85 (949.25) 2749461
HDFC 1858.35 (1845.95) 3622589
HDFC BANK 1890.50 (1900.15) 2704776
HERO MOTOCOR 3566.85 (3586.10) 501484
HINDALCO IND 262.75 (260.55) 11037340
HINDUSTAN UN 1371.20 (1382.00) 1409691
HPCL 420.30 (410.40) 3634549
ICICI BANK 343.25 (334.10) 43305353
INDIABULLS H 1209.35 (1204.90) 2117550
INDIAN OIL 384.05 (384.15) 3946015
INDUSINDBANK 1657.45 (1664.60) 600044
INFOSYS LTD 1152.10 (1122.85) 13077044
ITC 266.05 (261.70) 16375659
KOTAK MAHIND 1027.10 (1033.25) 1603465
LARSEN & TOU 1353.35 (1326.20) 2724814
LUPIN 919.35 (906.75) 1479797
M&M 755.35 (746.70) 1940533
MARUTI SUZIK 9313.90 (9322.05) 390461
NTPC LTD 174.25 (173.25) 6330277
ONGC 195.70 (197.20) 6306388
POWER GRID C 197.40 (196.20) 7319498
RELIANCE IND 924.50 (922.95) 6036842
SBI 307.10 (296.15) 26277307
SUN PHARMA 583.75 (577.70) 4812606
TATA CONSULT 2888.95 (2850.85) 2140403
TATA MOTORS 422.95 (421.90) 10204447
TATA STEEL L 774.00 (765.75) 2988170
TECH MAHINDR 554.90 (557.65) 1636201
ULTRATECH 4544.25 (4545.10) 325182
UPL LIMITED 780.75 (766.85) 1188663
VEDANTA LIMI 334.90 (330.15) 9947827
WIPRO 325.70 (331.95) 3042506
YES BANK LTD 342.40 (334.85) 7985222
ZEE ENTERTAI 593.10 (613.40) 8594970

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1548.50 (1509.25) 91330
ACC 1840.50 (1850.25) 179153

ASHOK LEYLAN 124.45 (122.30) 10469892
AVENUE SUPER 1167.35 (1187.00) 518237
BAJAJ FINSER 4964.90 (4956.80) 140637
BANK OFBAROD 165.20 (156.95) 17556659
BEL 176.05 (173.20) 4931756
BHEL 99.90 (99.00) 12263755
BRITANNIA 4749.80 (4677.35) 102842
CADILA HEALT 440.25 (436.10) 552311
COLGATE PALM 1141.85 (1131.15) 216010
CONTAINER 1429.00 (1412.15) 236691
CUMMINS INDI 932.65 (935.90) 198038
DABUR INDIA 358.90 (358.40) 1599096
DLF LIMITED 262.60 (257.55) 7901148
EMAMI LIMITE 1236.65 (1274.10) 283175
GLAXOSMI CON 6523.25 (6507.05) 3651
GLAXOSM PHA 2486.35 (2469.75) 51696
GLENMARK PHA 630.90 (625.85) 819868
GODREJ CONSU 999.35 (1005.65) 311895
HAVELLS INDI 559.35 (556.70) 575557
HINDUSTAN ZI 323.15 (315.45) 933055
ICICI PRU LI 419.65 (412.25) 923257
IDEA CELLULR 103.50 (102.80) 10518549
INTERGLOBE A 1200.60 (1181.90) 316498
JSW STEEL LT 285.05 (281.20) 3574084
LIC HOUS.FIN 558.10 (553.70) 1310133
MARICO LIMIT 310.75 (313.65) 1510355
MCDOWELL 3684.60 (3693.50) 838332
MOTHERSON 384.10 (377.80) 1250957
MRF 70420.80 (70284.55) 4005
NHPC LTD 30.85 (30.30) 7243705
NMDC LTD 149.45 (148.35) 4733945
OIL INDIA 380.20 (378.60) 452639
ORACLE FIN S 4096.20 (4091.05) 14596
P&G HYG&HEAL 9309.10 (9374.30) 1918
PETRONET LNG 234.60 (238.65) 4966807
PIDILITE IND 896.50 (900.25) 549893
PIRAMAL ENTE 2853.15 (2794.15) 529611
PNB 175.55 (165.55) 25299752
POWER FIN CO 122.00 (121.00) 4157893
RURAL ELEC C 155.45 (153.95) 3825383
SAIL 96.50 (94.30) 11888951
SHREE CEMENT 18975.00 (19104.25) 13197
SHRIRAM TRAN 1505.10 (1510.95) 397757
SIEMENS 1315.05 (1291.55) 233756
SUN TV LTD 1058.15 (1079.15) 986876
TATA POWER 93.20 (93.65) 11511446
TITAN IND 893.10 (889.40) 2553841
TORRENT PHAR 1404.65 (1400.80) 41655

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 246.00 (258.55) 3753188
ADANI ENTERP 204.55 (194.60) 9472531
ADANI POWER 40.75 (42.25) 28185993
ALL BANK 71.85 (68.80) 3438476
AMARA RAJA 850.60 (856.85) 393219
ANANT RAJIND 75.85 (77.50) 2311693
ANDHRA BANK 56.95 (55.20) 2749025
APOLLO HOSPI 1125.70 (1147.20) 219833
APOLLO TYRES 273.85 (271.70) 2010538
APTECH 366.00 (370.80) 272730
BAJAJ ELECT. 538.10 (549.50) 321299
BAJAJ HIND 15.25 (15.40) 4208801
BAJAJ HOLDIN 2770.55 (2776.70) 6300
BALAJI TELE 157.10 (159.10) 174031
BALLARPUR IN 17.65 (17.25) 2707413
BALRAMPUR CH 131.25 (130.55) 1325436
BANK OF INDI 160.35 (152.75) 6300574
BANK OFINDIA 164.70 (156.90) 5006454
BATA INDIA 730.70 (727.60) 574970
BGR ENERGY S 142.85 (143.55) 128796
BHARAT FORGE 735.15 (715.20) 922960
BHUSHAN STEE 69.40 (68.15) 1635770
BIOCON LTD 551.30 (534.80) 1362333
BOMBAY DYE 267.35 (266.10) 6245524
CANARA BANK 354.75 (339.50) 3628272
CEAT LIMITED 1920.65 (1905.40) 389832
CENTRAL BANK 74.10 (73.60) 398230
CHAMBAL FERT 155.55 (152.60) 399065
CHENNAI PETR 446.65 (453.10) 704018
CITY UNIBANK 175.95 (174.60) 246275
CORP BANK 40.05 (39.40) 259976
COX & KINGS 262.05 (264.00) 66800
D B REALTY L 71.50 (72.05) 1269810
DELTA CORP L 332.15 (328.60) 4974738
DENA BANK 25.60 (25.40) 2119431
DHANALAKBANK 28.85 (28.45) 497011
DISH TV 107.55 (109.80) 7245050
EDELWEISS CA 274.40 (273.90) 6517688
EID PARRY 364.55 (366.55) 83715
EIH 205.55 (216.15) 379544
ESSAR SHIPPI 29.40 (29.75) 102679
ESTER INDUST 66.50 (65.65) 290259
EXIDE INDUST 226.50 (228.30) 1962999
FEDERAL BANK 105.10 (104.75) 15158325
FINOLEX CABL 717.85 (713.10) 25285
GE SHIP LTD 438.55 (438.15) 76137
GAMMON INFRA 4.50 (4.25) 19043606
GATI LIMITED 147.55 (149.00) 11462254
GAYATRI PROJ 214.95 (213.30) 930809
GITANJALIGEM 75.30 (76.35) 1821749
GMR INFRASTR 24.10 (22.50) 240175549
GODREJ IND 624.25 (616.05) 248152
GRASIM IND 1248.00 (1229.00) 715242
GUJ ALK&CHEM 905.45 (891.10) 297274
GUJ NRE COKE 1.40 (1.45) 6133682
HCL INFOSYS 58.50 (59.25) 2881298
HEXA TECH 357.75 (357.75) 1059478
HIMACHAL FUT 32.75 (32.35) 9623317
HINDU MOTORS 11.00 (11.45) 4560639
HOUSING DEV 64.95 (63.85) 31707866
IDBI 60.85 (59.60) 4145999
IDFC 61.70 (59.90) 12312793
IFCI 31.85 (31.25) 21432107
IL&FS TRANS 83.70 (84.30) 512629
INDBULLS REL 240.75 (241.85) 8168833
INDIA CEM 197.70 (195.40) 3763562
INDIAN BANK 386.20 (370.00) 3702989
INDO RAMA SY 53.25 (50.95) 565274
INDRAPRASTHA 314.75 (316.80) 2751245
INGERSOLL-R 846.35 (848.40) 8039
IOB 23.15 (22.95) 666435
IPCA LAB 584.00 (574.15) 244605
IRB INFRA DE 247.05 (241.75) 1629462
J&K BANK 77.75 (78.05) 1135027
JAI CORP 195.90 (200.95) 2279258
JAIN IRRIGAT 141.30 (138.50) 11642978
JAYPEE INFRA 17.40 (18.30) 12868147
JET AIRWAYS 821.30 (790.35) 3898154
JINDAL SAW 167.85 (169.35) 2207593
JINDAL STEEL 269.70 (270.70) 15100692
JK LAKSHMI C 447.70 (448.30) 258630
JK PAPER LIM 153.05 (156.40) 988378
JM FINANCIAL 165.80 (163.70) 911773
JP ASSOCIATE 22.80 (21.40) 94244334
JSW ENERGY L 94.60 (92.00) 8938754
JUBILANT FOO 1906.25 (1899.55) 657539
JUBILANT ORG 924.45 (810.85) 5468824
JUSTDIAL LIM 365.42 (369.35) 808656
JYOTHY LABS 374.00 (373.95) 579840
JYOTI STRUC 13.25 (13.30) 2630867
KARNATA BANK 162.25 (153.45) 8052335
KEC INTL LTD 366.45 (373.50) 240556
KOLTE PATIL 378.40 (374.10) 368883
KPIT CUMMINS 201.35 (201.65) 2371745
L&TFIN.HOLD 173.65 (173.80) 3828321
LAK VIL BANK 141.60 (137.15) 1685016
M & M FINANC 485.30 (480.75) 929702
MANAPPURAM G 119.50 (118.00) 6508060
MMTC LIMITED 66.40 (66.05) 1697650
MOSER-BEAR 5.75 (5.80) 1452291
MPHASIS LTD 762.10 (741.55) 288810
MRPL 128.55 (129.95) 1223608
MTNL 27.75 (28.15) 1903242
NAGARJUNA OI 4.65 (4.80) 942440
NCC LIMITED 129.75 (126.95) 5419049
NETWORK18 FI 57.50 (56.85) 1923392
NEULAND LAB 888.70 (893.40) 15176
NIIT LTD 110.00 (111.85) 727711
NIIT TECHNOL 706.05 (706.85) 759232
OMAXE LTD 230.10 (228.85) 246989
ONMOBILE GLO 63.30 (60.05) 1252244
ORIENTALBANK 123.40 (117.15) 3545315
PARSVNATH DE 27.50 (27.85) 197389
PATEL ENGG 84.35 (85.15) 657740
PFIZER 2096.25 (2028.50) 40891
POLARIS SOFT 408.90 (409.75) 131087
POWERTRADING 116.65 (116.40) 1205745
PRAJ IND 117.10 (117.55) 1392269
PRISM CEMENT 145.30 (148.65) 3967724
PUNJ LLOYD 25.00 (25.10) 2516610
PUNJAB & SIN 47.70 (47.60) 135021
PURAVANKARA 156.40 (156.80) 657348
PVP VENTURES 9.35 (9.80) 988308
PVR LIMITED 1474.30 (1438.20) 168845
RADICO KHAIT 341.85 (316.15) 6013437
RAJESH EXPOR 848.00 (852.15) 429143
RALLIS INDIA 275.85 (271.60) 920711
RAMCO IND 310.80 (309.05) 209753
RAMCO SYS 538.15 (537.15) 24692
RAMKY INFRA 231.20 (220.40) 336551
RAYMOND 1108.90 (1092.85) 331080
RELIANCE CAP 566.00 (578.15) 7978743
RELIANCE COM 32.35 (31.20) 111211776
RELIANCE INF 543.95 (536.50) 3994984
RELIANCE POW 52.30 (51.20) 27253834
ROLTA INDIA 74.35 (75.30) 1825080
SAGAR CEMENT 1044.75 (1058.15) 10578
SAREGAMA 809.80 (814.00) 110478
SHANTHI GEAR 161.85 (162.95) 27573
SHIPPNG CORP 92.95 (93.15) 666656
SHREE RENUKA 16.10 (16.15) 2662629
SINTEX IND 24.25 (24.65) 4137751
SOBHA DEVELO 567.90 (583.00) 242467
SOUTHINDBANK 32.20 (31.85) 8950201
SRS LIMITED 1.95 (1.90) 378733
STERLITE TEC 380.55 (363.30) 6649387
SUN PHARMA 508.80 (507.65) 240036
SUND FASTNER 556.80 (561.60) 96092
SUZLON ENERG 15.35 (15.25) 47486615
SYND. BANK 79.95 (74.80) 8292433
TATA CHEM 749.60 (740.95) 606200
TATA COFFEE 159.70 (162.60) 905470
TATA COMMUN 645.60 (651.85) 762166
TATA GLOBAL 313.55 (316.40) 3742677
TATA METALIK 910.90 (899.65) 243349
TATA MOT DVR 245.05 (243.70) 3271455
THE INDIAN H 148.65 (144.55) 2016950
TORRENT POWE 291.45 (281.55) 1434468
TRIVENI ENGG 74.10 (74.00) 573216
TV18 BROADCA 62.70 (62.45) 12365134
TV TODAY NET 475.25 (431.50) 1522847
TTK PRESTIGE 8522.00 (7979.60) 22380
TVS MOTOR 730.00 (722.55) 578686
UCO BANK 31.25 (30.85) 1226389
UNION BANK 140.50 (136.35) 4662669
UNITECH 9.40 (8.55) 92741552
UNITED BANK 17.95 (17.25) 539129
UNITED BREW 1131.15 (1087.05) 457964
USHA MARTIN 29.20 (27.45) 3988308
VADILAL INDU 937.40 (959.15) 29872
VENKYS 2515.90 (2553.50) 68694
V-GUARD IND 243.60 (233.00) 2919556
VIJAYA BANK 66.95 (65.50) 1745189
VIP 375.55 (360.75) 667272
VOLTAS 628.25 (623.05) 1119332
ZEE LEARN LI 46.85 (46.50) 1517035
ZUARI GLOBAL 225.10 (225.05) 117134
ZYDUS WELLNE 1140.40 (1105.85) 9844

ఘనం (+) / గ్రహణం (-)

నిఫ్టీ	17న	మార్పు %
AXIS BANK	585.20	3.91
SBI	307.10	3.70
ICICI BANK	343.25	2.74
INFOSYS	1152.10	2.60
AUROBINDO PHA	657.25	2.52
HPCL	420.30	2.41
ADANI PORT	433.40	2.33


నిఫ్టీ	17న	మార్పు%
ZEE ENTERTAINMENT	593.10	-3.31
WIPRO	325.70	-1.88
HUL	1371.20	-0.78
ONGC	195.70	-0.76
KOTAK MAHI BANK	1027.10	-0.60
HERO MOTOCORP	3566.85	-0.54
HDFC BANK	1890.50	-0.51

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 926.30 (942.90) 6099
AMAR RAJA BA 850 (854.85) 29598
ANDHRA BANK 56.95 (55.15) 201808
ANDHRA CEMEN 13.99 (13.77) 219936
ANDHRA PAPER 381.10 (375.65) 40641
ANDHRA SUGAR 664.20 (639.05) 18183
ANJANI PORTL 255.25 (251.45) 399
ASTRA MICROW 119.20 (121.75) 83074
AUROBINDO PH 658.70 (641.95) 535100
AVANTEL SOFT 526.05 (526.50) 12955
AVANTI FEEDS 2473.65 (2506.95) 10002
AVON ORG 18.11 (18.70) 38718
BALAJI AMIN 708 (714.35) 34169
BARTRONICS 14.93 (14.93) 20519
BHAGIRA CHEM 336.55 (345.05) 1785
BRILLIANT SE 17.87 (18.72) 107107
CONT COFFEE 293.35 (297.35) 11911
COROMAN FERT 556.80 (560.50) 3999
CYIENT LIMIT 589.50 (582.35) 5134
DECCAN CEMEN 623.20 (619.70) 230
DIVI'S LAB 1104.60 (1093.55) 31679
DR REDDY 2489.40 (2461.70) 47427
GATI CORPN 147.90 (148.95) 155421
GAYATRI PROJ 214.55 (212.75) 117595
GMR INFRASTR 24.10 (22.50) 16386853
GOLDST INFRA 228.80 (214.60) 60572
GOLDSTONE EN 18.65 (18.65) 47646
GRANULES (I) 139.05 (139.30) 350947
GVK POWER 24.30 (25.55) 336623
HBL NIFE POW 67.85 (68.45) 227736
HERITAGE FOO 808.55 (821.85) 4455
HYD INDUS 1599.10 (1628.10) 2862
IDL INDUSTRS 641.20 (657.40) 2161
INNAREDY CON 6.11 (6.43) 40479
IVRCL INFRAS 6.30 (6.44) 421118
KAVERI SEED 521.55 (514.45) 81991
KCP LTD 150.05 (150.60) 43400
KERNEX MICRO 63.20 (60.20) 172853
KNR CONSTRUC 310.70 (313.20) 8305
LANCO INDUS 407.90 (407.40) 31572
LANCO INFRAT 2.23 (2.34) 13554803
LAURUS LABS 547.15 (533.75) 40260
MADHUCON PRO 34.75 (35.50) 44659
MIC ELECTRON 9.44 (9.44) 66245
MOLD-TEK.TEC 74.90 (73.85) 10931
MOLDTK PLA 339.80 (331.40) 13112
NAGARJ. FERT 59.80 (58.10) 76709
NATCO PHARMA 1020.65 (1018.10) 23876
NAVA BH VENT 170.20 (171.35) 120573
NCC 272.55 (270) 18740
NCL IND 272.55 (270) 18740
NEHA INTER 8.75 (8.99) 365613
NEULAND LAB 887.75 (892.05) 1945
NIHAR INFO 14.49 (13.80) 1513
NILE 961.40 (948.70) 5844
OIL COUNTRY 57.75 (58.75) 35011
PENNER IND 66.95 (68.35) 241749
PIONEER DIST 211.30 (206.75) 8036
PITTI LAMIN 98.35 (99.60) 25831
POKARNA 230.60 (231.40) 18150
PRISM CEMENT 144.95 (148.30) 1108967
PRUDENTL PHA 5.42 (5.54) 244346
RAIN INDUSTR 440.95 (419.85) 907146
SAMKRG PIST 344.05 (356.80) 36895
SAMPRE NUTRI 84.40 (82.45) 6255
SATVAH. ISPA 34.25 (32.75) 31700
SMS PHARMA 102.30 (101.65) 8753
SREE RAYAL A 74.50 (75.35) 548029
STEEL EXCHAN 37.30 (36.20) 149695
SUJANA METAL 1.74 (1.83) 89037
SUJANA TOWER 4.96 (5.15) 10926
SUJANA UNIVE 1.22 (1.27) 855600
SURYALAKSH C 101.05 (102.10) 23817
SURYALATA SP 182.40 (185.55) 1921
SUVEN PHARMA 204.15 (199.35) 64003
TAJ GVK HOTE 174.25 (176.80) 6811
TANLA 40.35 (40.90) 277715
TRENDY KNIT 0.27 (0.26) 79658
VICEROY HOTE 19.65 (19.95) 72893
VIJAY TEXTIL 57.40 (55.15) 48020
VIMTA LABS 176.30 (174.65) 11208
VISAKA IND 795.55 (788) 18134
VISTA PHARMA 46.95 (45.40) 379458
VIVIMED LABS 101.75 (101.90) 132230
VBRANT DIGIT 7.66 (7.14) 2241145
ZENTECH 135.65 (135.60) 116498

17వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	412
బెంగళూరు	405	చెన్నై	405
18న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	412	నమక్కల్	395

నవ్యావిష్కరణల హితంగా వ్యవస్థలు

- ప్రధాని మోదీ వెల్లడి
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి 'ఐక్రియేట్' ప్రారంభం
- అహ్మదాబాద్‌లో రోడ్‌షో



ఐక్రియేట్ కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో అభివాదం చేస్తున్న ఇజ్రాయెల్, భారత్ ప్రధానులు బెంజమిన్ నెతన్యాహు, మోదీ

అహ్మదాబాద్: నవ్యావిష్కరణల దేశంగా భారత్‌ను నిర్మించేందుకు, అందుకు అనుకూలమయిన వ్యవస్థల ఏర్పాటుకు తన ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని మోదీ చెప్పారు. బుధవారం ఆయన ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహుతో కలిసి వ్యాపారాపేక్షత, సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాన్ని(ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆంత్రపెన్యూర్‌షిప్ అండ్ టెక్నాలజీ-ఐక్రియేట్)అహ్మదాబాద్‌కు సమీపంలోని దేవ్ ధోలెర గ్రామంలో జాతికి అంకితం చేశారు. అనంతరం మోదీ ప్రసంగిస్తూ. ''మన దేశంలో మొత్తం వ్యవస్థను నవ్యావిష్కరణల హితంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తున్నాం. సంకల్పం నుంచి ఆలోచన, ఆలోచనల నుంచి నవ్యావిష్కరణలు, నవ్యావిష్కరణల నుంచి నవ భారత్ ఆవిష్కృతమవుతుంది.'' అని అన్నారు.

నెతన్యాహు మాట్లాడుతూ ప్రపంచానికి ఐపాడ్‌లు, ఐప్యాడ్‌ల గురించి తెలుసని మరో ఐ గురించి ప్రపంచం తెలుసుకోవాలని అదే ఐక్రియేట్ అని చెప్పారు. ప్రతి రంగంలోనూ భారత్‌తో ఇజ్రాయెల్ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని వెల్లడించారు. మోదీ భారత్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని ప్రశంసించారు..'జై హింద్, జై భారత్, జై ఇజ్రాయెల్' అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

అంతకుముందు నెతన్యాహుతో కలిసి ప్రధాని మోదీ అహ్మదాబాద్‌లో 8 కి.మీ. రోడ్‌షో నిర్వహించారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి నెతన్యాహు, ఆయన భార్య సారాతో కలిసి మోదీ కారులో బయలుదేరారు. దారి వెంబడి ఏర్పాటు చేసిన 50 వేదికలపై నుంచి వివిధ రాష్ట్రాల కళాకారులు తమ ప్రదర్శనలతో అతిథులకు స్వాగతం పలికారు. రోడ్డు వెంబడి బారులు తీరిన వేల మంది ప్రజలకు మోదీ, నెతన్యాహులు అభివాదం తెలియజేయగా వారు హర్షధ్వానాలతో ప్రతిస్పందించారు. సబర్మతి ఆశ్రమం వద్ద రోడ్‌షో ముగిసింది.

ఆశ్రమంలో గాంధీ నివాసమైన హృదయ్ కుంజ్‌ను నెతన్యాహుకు ప్రధాని చూపించారు. లోపల గాంధీ గదిని, ఆయన ఉపయోగించిన వస్తువులను చూపించారు. గాంధీ ఉపయోగించిన రాట్నాన్ని తిప్పడానికి నెతన్యాహు దంపతులు ప్రయత్నించారు. వారికి ప్రధాని గాలిపటాలను చూపించగా వాటిని కొద్దిసేపు ఎగరవేశారు.

మానవత్వాన్ని ప్రబోధించిన గొప్ప ప్రవక్తల్లో గాంధీ ఒకరని నెతన్యాహు ఈ సందర్భంగా అభివర్ణించారు. సందర్శకుల పుస్తకంలో భార్య సారాతో కలిసి నెతన్యాహు నాలుగు పంక్తుల సందేశాన్ని రాసి సంతకం చేశారు.

మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో ఆతిథ్యం స్వీకరిస్తున్న మూడవ అంతర్జాతీయ నేత నెతన్యాహు. అంతకు ముందు జపాన్ ప్రధాని షింజో అబె, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ గుజరాత్ వచ్చారు.

నిర్లవణీకరణ వాహనాన్ని బహూకరించిన నెతన్యాహు

ఇజ్రాయెల్ సంస్థ అభివృద్ధి చేసిన నీటి నిర్లవణీకరణ పరిజ్ఞానంతో కూడిన వాహనం గాలా-మొబైల్ జీపును నెతన్యాహు.. ప్రధాని మోదీకి బహూకరించారు. అహ్మదాబాద్ జిల్లాలోని బావ్లా పట్టణంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మోదీ నెతన్యాహు సమక్షంలో ఆ వాహనాన్ని బనస్కాంత జిల్లాలోని సూయిగాం ప్రజలకు అంకితం చేశారు. పాక్ సరిహద్దుల్లో ఈ గ్రామం ఉంది. సముద్రపు నీటిని ఈ వాహనంలోని ప్లాంట్ ద్వారా మంచి నీటిగా మార్చడాన్ని ఆ గ్రామం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. సరిహద్దులను రక్షిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లకు, పరిసర గ్రామాల ప్రజలకు ఈ వాహనం ద్వారా స్వచ్ఛమైన నీటిని అందించవచ్చని ప్రధాని మోదీ చెప్పారు. ఈ బహుమతిని అందించినందుకు భారత ప్రజలు నెతన్యాహుకు కృతజ్ఞులై ఉంటారని మోదీ అన్నారు. నెతన్యాహు గురువారం ముంబయిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

మరోవైపు ఇజ్రాయెల్ నుంచి శతఘ్ని విధ్వంసక క్షిపణులను భారత్ కొనుగోలు చేస్తుందని నెతన్యాహును ఉటంకిస్తూ ఇజ్రాయెల్ మీడియా బుధవారం వెల్లడించింది. కొద్ది వారాల క్రితమే ఈ ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకోవడం గమనార్హం. ఒప్పందాన్ని పునరుద్ధరించనుండడం గొప్ప వ్యూహాత్మక విజయంగా అభివర్ణించింది.

ఇక సింగపూర్ బ్యాంకు ఖాతాలపై కన్ను

- అందుబాటులోకి భారతీయుల లావాదేవీల వివరాలు
- ఆ దేశ ప్రభుత్వాన్ని ఒప్పించిన మోదీ సర్కారు

ఈనాడు, దిల్లీ: భారత దేశానికి చెందిన పన్ను ఎగవేతదార్లు స్విస్ బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ము వివరాల వెల్లడిపై స్విట్జర్లాండ్ ప్రభుత్వాన్ని ఒప్పించిన ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా సింగపూర్ బ్యాంకు ఖాతాలపై దృష్టి సారించారు. స్విస్ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న భారతీయుల వివరాలను ఇప్పటికే స్విట్జర్లాండ్ ప్రభుత్వం సేకరిస్తోంది. అదే రీతిలో సింగపూర్ ప్రభుత్వాన్నీ ఒప్పించగలిగారు. భారతీయుల ఖాతాల వివరాలన్నింటినీ ఆదాయపు పన్ను విభాగానికి అప్పగించాలని సింగపూర్ ప్రభుత్వం తన దేశంలోని అన్ని బ్యాంకులను ఆదేశించింది. కేవలం ఖాతాదారుల సమాచారాన్నే కాకుండా, లబ్ధిదారుల వివరాలను కూడా ఇవ్వనుంది. ఒక వేళ భారతీయులెవరైనా సింగపూర్‌లో ఉన్న బ్యాంకు ఖాతాను మూసివేసి, పన్నుల బెడద లేని ఇతర దేశాలకు మళ్లించినా, ఆ సమాచారం కూడా అందజేయనుంది. విదేశాల్లో నల్లధనం అరికట్టడానికి గతంలో కుదిరిన ద్వంద్వ పన్ను నివారణ ఒప్పందం కింద సింగపూర్ ప్రభుత్వం ఈ సమాచారాన్ని ఇవ్వనుంది. బ్యాంకింగ్, పన్నులకు సంబంధించిన వివరాలను ఇచ్చిపుచ్చుకోవాలని ఇరు దేశాలూ అంగీకరించాయి.

వచ్చే ఏడాది నుంచి స్విస్ బ్యాంకుల సమాచారం: స్విస్ బ్యాంకుల నుంచి సమాచారం పొందడంపై 2017 నవంబరులో భారత్-స్విట్జర్లాండ్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీనికి స్వయంచాలిత సమాచార మార్పిడి ఒప్పందమని పేరుపెట్టారు. దీని ప్రకారం స్విస్ బ్యాంకుల్లోని ఖాతాల లావాదేవీల సమాచారం 2019వ సంవత్సరం ప్రథమార్థం నుంచి వెంటవెంటనే అందుతాయి. ఇదే అంశంపై 2016లో అమెరికాతో ఒప్పందం కుదిరింది. ఇండో-యూఎస్ విదేశీ ఖాతాల పన్ను మదింపు చట్టం (ఫారిన్ అకౌంట్ ట్యాక్స్ కాంప్లియెన్స్ యాక్ట్- ఫ్యాక్టా) కింద సమాచారం వస్తోంది. దీని ప్రకారం భారతీయులకు విదేశాల్లో ఉన్న సంపద ద్వారా వచ్చిన ఆదాయంపై పన్ను వేయడానికి అవకాశం కలిగింది.

ప్రతి ఉగ్రవాద సంస్థకూ రాజకీయ శాఖ

- సాయుధ విభాగంతో పాటు దీనిపైనా చర్యలు ఉండాలి
- సైన్యాధిపతి జనరల్ రావత్ వ్యాఖ్య

దిల్లీ: ప్రతి ఉగ్రవాద సంస్థకూ సాయుధ విభాగంతో పాటు, రాజకీయ విభాగం కూడా ఉందని సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. అందువల్ల ఉగ్రవాద సమస్యను పరిష్కరించడానికి ఏకకాలంలో సైనిక, రాజకీయపరమైన చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. బుధవారం ఇక్కడ జరిగిన 'రైసీనా సంభాషణ' (రైసీనా డైలాగ్) పేరుతో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. హింసాత్మక చర్యలకు పాల్పడే ఉగ్రవాద సంస్థల సాయుధ విభాగాలపై కఠిన ఆంక్షలు విధించాల్సి ఉందని అన్నారు. ఉగ్రవాద సంస్థల రాజకీయ విభాగాలు సిద్ధాంతాల ప్రచారం, నిధుల సేకరణ, స్వచ్ఛంద సంస్థల పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని అన్నారు. సాయుధ, రాజకీయ విభాగాలపై ఏకకాలంలో చర్యలు తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

చైనాతో పెద్ద సమస్యలేమీ లేవు

ఈ సదస్సును నిర్వహించిన సంస్థల్లో ఒకటైన అబ్జర్వర్ రీసెర్చి ఫౌండేషన్ (ఓఆర్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఫేస్‌బుక్ లైవ్ కార్యక్రమంలో ప్రశ్నలకు జనరల్ రావత్ సమాధానమిచ్చారు. డోక్లాం ఉదంతం అనంతరం చైనాతో పెద్దగా సమస్యలు లేవని, మునుపటి ఉల్లాసం నెలకొందని అన్నారు. అయితే ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా ఎదుర్కోవడానికి సైన్యం సర్వసిద్ధంగా ఉందని చెప్పారు. 'డోక్లాం సమస్య తలెత్తిన సమయంలో ఉన్న చైనా సైనికుల సంఖ్య ప్రస్తుతం లేదు. తాత్కాలిక ప్రాతిపదకన వారు కొన్ని నిర్మాణ పనులు చేపట్టారు. సైనికులు తిరిగి వెళ్లినా సామగ్రి అక్కడే ఉంది. వారు తిరిగి వస్తారా? లేదా చలికాలం కారణంగా సామగ్రిని తిరిగి తీసుకెళ్లలేకపోయారా? అన్నదానిపై ఎవరైనా ఊహాగానాలు చేయవచ్చు. అయితే మేం కూడా అక్కడే ఉన్నాం. ఒకవేళ తిరిగి వచ్చానా, వారిని ఎదుర్కొంటాం. ప్రస్తుతానికైతే ఎలాంటి తీవ్రమైన సమస్య లేద'ని చెప్పారు.

వారిని ప్రభుత్వ నివాసాల్లో కొనసాగనివ్వటంపై ఏమంటారు?

దిల్లీ: మాజీ రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు తమ పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ప్రభుత్వ నివాసాల్లోనే కొనసాగటంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభిప్రాయాలు ఏమిటో తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మాజీ ముఖ్యమంత్రులు తమకు కేటాయించిన అధికారిక బంగ్లాల్లోనే నివసించేందుకు అనుమతిస్తూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టసవరణను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో న్యాయస్థాన సహాయకుని(అమికస్ క్యూరీ)గా ఉన్న సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణియమ్ సూచనలను జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్.భానుమతిలతో కూడిన ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. దీనిలో భాగంగానే తదుపరి విచారణ జరిగే మార్చి 13వ తేదీలోగా కేంద్ర, రాష్ట్రాల న్యాయాధికారుల అభిప్రాయాలేమిటో తెలుసుకోవాలని భావిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. యూపీ ప్రభుత్వ చట్ట సవరణను సవాల్ చేసిన స్వచ్ఛంద సంస్థ లోక్ ప్రహరి పిటిషన్‌ను చెల్లదని ప్రకటించిన పక్షంలో ఇతర రాష్ట్రాలు తీసుకొచ్చే ఇదే తరహా చట్టసవరణలపైనా పిటిషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే తరహా సవరణలు తీసుకొచ్చే అవకాశం ఉన్నందున కేంద్రం, రాష్ట్రాల అభిప్రాయాలను ముందే తెలుసుకోవటం సముచితమని ధర్మాసనం భావించింది.

ఆధార్‌తో దేశం నిఘా సమాజమవుతుంది

- సుప్రీంకోర్టులో పిటిషనర్ల వాదన

దిల్లీ: ఆధార్ ఒక పెద్ద ఎలక్ట్రానిక్ వల అని, దేశాన్ని నిఘా రాజ్యంగా మార్చేస్తుందని పిటిషనర్లు సుప్రీంకోర్టులో ఆరోపించారు. ఆధార్‌తో వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతోందని అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం తుది విచారణను ప్రారంభించింది. ప్రజా ప్రయోజనాల రీత్యా ఆధార్‌ను తప్పనిసరి చేయకపోతే దుర్మార్గపు సమాజం తయారవదా అని ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోని న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రశ్నించగా సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ స్పందిస్తూ మనల్ని చట్టం పరిపాలిస్తోందని, మరో అసామాన్య అంశాన్ని తీసుకురాలేరని అన్నారు. ఆధార్‌ను తప్పనిసరి చేస్తే అది నిఘా సమాజం అవుతుందని చెప్పారు. ఇందుకు పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయన్నారు. పౌరుల సమాచారానికి రక్షణ లేదన్నారు. పౌరుల హక్కులను ఆధార్ హరించి వేయగలదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా రాజ్యాంగాన్ని ప్రభుత్వ రాజ్యాంగంగా మార్చడానికి చూస్తున్నారని ఆరోపించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ అశోక్ భూషణ్ కూడా సభ్యులుగా ఉన్నారు. మరోవైపు ఆధార్‌ను కొనసాగించాలని కొన్ని ప్రైవేటు సంస్థలు సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశాయి. డిజిటల్ లెండర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన ఈ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు ఇంకా విచారణకు స్వీకరించలేదు.

అది ప్రజల సాధికారతను గుంజుకొనే చర్యే: రాహుల్

దిల్లీ: ఆధార్ సంఖ్యను కలిగి ఉండటాన్ని తప్పనిసరి చేయటం ద్వారా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పౌరుల సాధికారతను గుంజుకునే ఆయుధంగా మలచుకుంటోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆధార్ పథకాన్ని ప్రవేశపెట్టిన యూపీఏ ప్రభుత్వం దానిని పౌరులకు సాధికారతను సమకూర్చే స్వచ్ఛంద ఉపకరణంగా తీర్చిదిద్దగా....ఎన్డీయే ప్రభుత్వ విధానం దానికి పూర్తి విరుద్ధంగా ఉందని రాహుల్ విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందటానికి ఆధార్ సంఖ్య తప్పనిసరి అంటూ నిబంధన విధించటాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోంది.

కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

- మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు
- మోహన్‌బాబుకు 'విశ్వనట సార్వభౌమ' బిరుదు ప్రదానం

రాయదుర్గం, న్యూస్‌టుడే: కాకతీయ రాజులు తెలుగు ప్రజల ఐక్యత, భాష, కళాభివృద్ధికి పాటుపడ్డారని, సుబ్బరామిరెడ్డి తన కళా సామ్రాజ్యాన్ని దేశ వ్యాప్తంగా విస్తరించి కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు చెప్పారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికపై టీఎస్సార్ కాకతీయ లలితకళా పరిషత్ ఆధ్వర్యంలో కాకతీయ కళా వైభవ మహోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు, శాసనసభాపతి మధుసూదనాచారి, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్‌తో పాటు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత, నటుడు డాక్టర్ మోహన్‌బాబుకు 'విశ్వనట సార్వభౌమ' బిరుదును ప్రదానం చేశారు. అనంతరం విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ గ్రామీణ కళాకారులను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభాపతి మధుసూదనాచారి మాట్లాడుతూ కాకతీయులు తవ్వించిన చెరువులు వెయ్యేళ్లపాటు రైతులకు నీటి వనరులుగా మారాయన్నారు. కళలు దైవంతో సమానమని, అందుకే కళాకారులను సన్మానిస్తున్నానని మాజీ రాజ్యసభ సభ్యుడు, టీఎస్సార్ కాకతీయ లలితాకళా పరిషత్ అధినేత సుబ్బరామిరెడ్డి తెలిపారు. అనంతరం దామోదర్‌రెడ్డి, గాయనీలు మధుప్రియ, మంగ్లీ(సత్యవతి), రంగవ్వలకు తెలుగు ప్రతిభ పురస్కారాలను అందచేశారు.



బుధవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో సినీనటుడు మోహన్‌బాబుకు 'విశ్వనట సార్వభౌమ' బిరుదును ప్రదానంచేస్తున్న మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు. చిత్రంలో బాలకృష్ణ, టి.సుబ్బరామిరెడ్డి, తెలంగాణ శాసనసభ సభాపతి మధుసూదనాచారి, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ తదితరులు

మరికొన్నింటిపై పన్నుల తగ్గింపు!

- నేడు జీఎస్టీ మండలి సమావేశం

దిల్లీ: వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మరికొన్నింటిపై పన్ను తగ్గించాలని వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) మండలి భావిస్తోంది. గురువారం నిర్వహించనున్న జీఎస్టీ మండలి 25వ సమావేశంలో ఈ మేరకు చర్చలు జరగనున్నాయి. ఇదేకాకుండా రిటర్నుల దాఖలు, రిజిస్ట్రేషన్ తదితర అంశాలను సులభతరం చేయడంపైనా చర్చలు జరుగుతాయి. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఈ-వే బిల్లులు ప్రవేశపెట్టాలని నిర్ణయించిన తరుణంలో జీఎస్టీనెట్‌వర్క్ సంసిద్ధతపైనా ఈ సమావేశం సమీక్షించనుంది. జీఎస్టీ చట్టానికి సవరణలపైనా చర్చిస్తుంది. 'చట్ట సమీక్ష సంఘం' దాదాపు 16 సిఫార్సులు చేసింది. కనీసం పది రాష్ట్రాల్లో వ్యాపారం చేస్తూ, రూ.500 కోట్లకు మించిన టర్నోవర్ ఉన్న సంస్థలకు కేంద్రీకృత రిజిస్ట్రేషన్ ఉండాలన్నది ఈ సిఫార్సుల్లో ప్రధానమైనది.

రెండు రెట్లు పెరగనున్న ఎన్నికల కమిషనర్ల జీతం

దిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ సహా ముగ్గురు ఎన్నికల కమిషనర్ల జీతం రెండు రెట్లకుపైగా పెరగనుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో సమానంగా వీరి వేతనాలనూ పెంచనున్నారు. సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల జీతాలు పెంచేందుకు సిద్ధంచేసిన బిల్లుకు ఇటీవల లోక్‌సభ పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఈ నెల 29 నుంచి మొదలుకాబోతున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించే అవకాశముంది. అనంతరం దీనిపై రాష్ట్రపతి ఆమోదముద్ర పడితే.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) వేతనం రూ.లక్ష నుంచి రూ.2.80 లక్షలు(నెలకు)కు పెరుగుతుంది. మరోవైపు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల జీతమూ రూ.90,000 నుంచి రూ.2.50 లక్షలకు పెరుగుతుంది. హైకోర్టు న్యాయమూర్తులకు రూ.80,000 నుంచి రూ.2.25 లక్షలకు పెంపు లభిస్తుంది. వీరితోపాటే ముగ్గురు ఎన్నికల కమిషనర్ల వేతనాలూ పెరుగుతాయని న్యాయమంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు తెలిపారు. వీరికి నెలకు రూ.2.50 లక్షల వేతనం లభిస్తుందని పేర్కొన్నారు.



జార్జియాలోని అట్లాంటాలో ఉన్న పీడ్‌మంట్ పార్క్‌లో పేరుకుపోయిన మంచు

అజిత్ దోభాల్ వచ్చింది శాంతిభద్రతల భేటీకే: హోంశాఖ

దిల్లీ: జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోభాల్ సేవలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారంటూ వచ్చిన ఆరోపణలను కేంద్ర హోంమంత్రిత్వశాఖ తోసిపుచ్చింది. ప్రతిరోజు ఉదయం దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన సమీక్ష హోంమంత్రి నివాసంలో జరుగుతుందని, అటువంటి సమావేశానికే ఈనెల 14న కూడా అజిత్ దోభాల్ హాజరయ్యారని వివరించింది. ఇందులో జాతీయ భద్రత విభాగ సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారని తెలిపింది. ఎన్నికలకు సంబంధించి ఈనెల 14న కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారిక నివాసంలో జరిగిన సమావేశంలో దోభాల్ పాల్గొన్నారని, ఈ విషయాన్ని పరిశీలించాలని సోమవారం త్రిపుర సీపీఎం నేతలు ఎన్నికల సంఘాన్ని కోరారు.

రైల్వేలకు అంతర్గత అప్రమత్త వ్యవస్థ

- వచ్చే నెల నుంచి అందుబాటులోకి

ఈనాడు, దిల్లీ: రైళ్లలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా ఓ కొత్త విధానాన్ని భారతీయ రైల్వేస్ ప్రారంభించనుంది. ఈ విధానంలో సంస్థకు చెందిన 13 లక్షల మంది ఉద్యోగులనూ భాగస్వాములను చేయనుంది. సిబ్బంది స్వచ్ఛంద నివేదిక (ఎస్‌వీఆర్) అని దీనికి నామకరణం చేసింది. సంస్థ సిబ్బంది ఎవరైనా సరే తమ దృష్టికి వచ్చిన భద్రతాపరమైన లోపాలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకు గాను ఒక ప్రత్యేక పోర్టల్‌ను ఫిబ్రవరి నుంచి అందుబాటులోకి తీసుకురానుంది. పోర్టల్ ద్వారా సిబ్బంది తెలియజేసే సమాచారాన్ని ఆయా జోన్లలోని ప్రధాన భద్రతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకుంటారు. సమాచారం ఇచ్చే వారికి ఎలాంటి ఇబ్బందిరాకుండా తగిన జాగ్రత్తలూ ఈ వ్యవస్థలో ఉంటాయని ఒక అధికారి వెల్లడించారు. ఉద్యోగులందరూ నిర్భయంగా సమాచారాన్ని అందించవచ్చని తెలిపారు.

నిరీక్షణ గదుల్లో టీవీలు, పానీయాలు

రైలు కోసం గంటల కొద్దీ నిరీక్షణ గదుల్లో వేచి ఉండే ప్రయాణికులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ గదుల్లో టీవీలు ఏర్పాటు చేయటంతో పాటు పానీయాలు, స్నాక్స్ వంటివి ఇచ్చే యంత్రాలనూ ఏర్పాటు చేయనున్నారు. ప్రయోగాత్మకంగా దిల్లీ డివిజన్‌లో ఈ సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. స్నానపు గదులు, మరుగుదొడ్లలో పరిశుభ్రతకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహణను చేపట్టనున్నట్లు ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్ వెల్లడించారు.

సరిహద్దుల్లో సైనికాధికారికి గాయాలు

జమ్ము: సరిహద్దుల్లో పాకిస్థాన్ బలగాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని మళ్లీ ఉల్లంఘించాయి. జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లా చకన్ దా బాగ్ ప్రాంతంలో నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంట మనదేశ సైనిక స్థావరాలపై మంగళవారం సాయంత్రం కాల్పులకు తెగబడ్డాయి. ఈ దాడిని భారత దళాలు సమర్థంగా తిప్పికొట్టాయి. పాక్ బలగాల కాల్పుల్లో మనదేశ సైన్యంలోని కెప్టెన్ స్థాయి అధికారి ఒకరు గాయపడ్డారు.



సుఖోయ్ యుద్ధవిమానంలో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

సుఖోయ్‌లో నిర్మలా సీతారామన్

జోధ్‌పూర్: వైమానిక దళ యుద్ధ విమానం సుఖోయ్-30 ఎంకేఐలో ప్రయాణించిన తొలి మహిళా 'రక్షణ శాఖ మంత్రి'గా నిర్మలా సీతారామన్ బుధవారం చరిత్ర సృష్టించారు. అంతేకాదు ఈ విమానంలో విహరించిన రెండో మహిళా నాయకురాలూ (2009లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ప్రయాణించారు) నిర్మలనే. జీ-సూట్ ధరించి, హెల్మెట్ పెట్టుకొని ఆమె కాక్‌పిట్‌లో పైలట్ వెనుక సీట్లో కూర్చున్నారు. రాజస్థాన్‌లోని పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంలో వెస్టర్న్ సెక్టార్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ విమానం బయలుదేరింది. జోధ్‌పూర్ మీదుగా 8,000 మీటర్ల ఎత్తుల్లో మెరుపు వేగంతో పైలట్ దీన్ని నడిపారు. 45 నిమిషాల ఈ ప్రయాణాన్ని ఎప్పటికీ మరచిపోలేనని నిర్మల చెప్పారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆసియాన్ దేశాల జానపద నృత్యాలు

దిల్లీ: ఈసారి దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ కవాతులో.. భారత్‌తోపాటు కంబోడియా, మలేసియా, థాయిలాండ్ దేశాలకు చెందిన జానపద నృత్యాలు కూడా కనువిందు చేయనున్నాయి. ఆసియాన్ సభ్య దేశాలైన థాయిలాండ్, వియత్నాం, ఇండోనేసియా, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, మయన్మార్, కంబోడియా, లావోస్, బ్రూనై దేశాల నాయకులు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాబోతున్న సంగతి తెలిసిందే. ఆసియాన్‌తో భారత్ 25 ఏళ్ల బంధాన్ని ప్రతిబింబించేలా.. ఆయా దేశాల జానపద నృత్యాలను దిల్లీలోని ఓ పాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థుల బృందం వేడుకలో ప్రదర్శించనున్నట్లు అధికారులు తెలిపారు.

ద.కొరియాకు 30 మంది ఉ.కొరియా క్రీడాకారులు

సియోల్: దక్షిణ కొరియాలో జరిగే శీతకాల ఒలింపిక్స్‌కు.. 230 మంది ఉల్లాసినులు (చీర్‌లీడర్స్), 30 మంది తైక్వాండో క్రీడాకారులతో కూడిన బృందాన్ని ఉత్తర కొరియా పంపనుంది. ఇరు దేశాల అధికారుల మధ్య చర్చల అనంతరం.. ఇందుకు ఉత్తర కొరియా అంగీకారం తెలిపినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. శీతకాల పారాలింపిక్స్‌కు కూడా 150 మందితో కూడిన ఉత్తర కొరియా బృందం రానున్నట్లు తెలిపింది. దక్షిణ కొరియాలోని ప్యోంగ్‌చాంగ్‌లో ఫిబ్రవరి 9 నుంచి 25 వరకు శీతకాల ఒలింపిక్స్.. మార్చి 9 నుంచి 18 వరకు శీతకాల పారాలింపిక్స్ జరుగనున్నాయి.

బ్రిటన్‌లో 'ఒంటరితనం'పై పోరాటానికి మంత్రి

లండన్: ఒంటరితనం కారణంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్న ప్రజల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకుగాను బ్రిటన్ ప్రధాన మంత్రి థెరిసా మే దేశ చరిత్రలోనే తొలిసారిగా ఓ మంత్రిని నియమించారు. ప్రస్తుతం దేశ క్రీడలు, పౌరసమాజం శాఖ మంత్రిగా ఉన్న ట్రేసీ క్రౌచ్‌కు ఈ మేరకు నూతనశాఖ బాధ్యతలు అదనంగా అప్పగించారు. 2016 జూన్‌లో హత్యకు గురైన లేబర్ పార్టీ ఎంపీ జో కాక్స్ జ్ఞాపకార్థం ఈ కొత్త మంత్రి పదవిని సృష్టించినట్లు మే తెలిపారు.

హరియాణాలో శవమై కనిపించిన నిందితుడు

చండీగఢ్: హరియాణాలోని జింద్‌లో 15 ఏళ్ల దళిత బాలికపై చోటుచేసుకున్న దారుణ హత్యాచారానికి సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న యువకుడు(19) శవమై కనిపించడం తాజాగా కలకలం సృష్టించింది. కుళ్లిన్న స్థితిలో ఉన్న ఆ యువకుడి మృతదేహాన్ని జ్యోతిసర్ సమీపంలోని భక్రా కాలువలో మంగళవారం రాత్రి గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. కురుక్షేత్ర జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాలిక మృతదేహం జింద్ జిల్లాలో అర్ధ నగ్న స్థితిలో.. జననాంగాలు దారుణంగా దెబ్బతిని శనివారం కనిపించిన సంగతి తెలిసిందే. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆమె అపహరణ కేసులో నిందితుడిగా ఓ యువకుడి పేరును పోలీసులు చేర్చారు. అతడే ప్రస్తుతం జ్యోతిసర్ సమీపంలో శవమై కనిపించాడు.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన పద్మావత్ నిర్మాతలు

దిల్లీ: సెన్సార్ బోర్డు అనుమతి లభించినా వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు తమ చిత్ర విడుదలను నిషేధించటాన్ని సవాల్‌చేస్తూ 'పద్మావత్' నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చిత్రం విడుదల తేదీ సమీపిస్తున్నందున వెంటనే తమ పిటిషన్‌ను విచారణకు స్వీకరించాలన్న అభ్యర్థనను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. రాజస్థాన్, హరియాణా, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలు శాంతిభద్రతల కారణాలతో వివాదాస్పద 'పద్మావత్' సినిమాను నిషేధిస్తున్నట్లు ప్రకటించాయి.

జమ్ముకశ్మీరులో గడ్డ కట్టించే చలి

దిల్లీ: జమ్ముకశ్మీరు, హిమాచల్ ప్రదేశ్‌లో గడ్డకట్టించే చలి వణికిస్తోంది. ఇక్కడ బుధవారం ఆర్కిటిక్ తరహా వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. కార్గిల్‌లో ఉష్ణోగ్రతలు -19 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. కశ్మీరులోని ఏడు జిల్లాల్లో మంచు తుపానుకు అవకాశం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అనంతనాగ్, కుల్గాం, బుద్గాం, బారాముల్లా, కుప్వారా, బందీపొరా, గండేర్‌బల్ జిల్లాల్లో గురువారం సాయంత్రం వరకు ఈ హెచ్చరికలు అమల్లో ఉంటాయి. లేహ్‌లో -13.6 డిగ్రీలు, శ్రీనగర్‌లో -3.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హిమాచల్ ప్రదేశ్‌లో అతి శీతల పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో -14 నుంచి -20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో మరికొన్ని రోజులు అతిశీతల పరిస్థితులు కొనసాగవచ్చని అధికారులు చెబుతున్నారు. దేశరాజధానిలో కనిష్ఠ ఉష్ణోగ్ర 5.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది.

డోక్లామ్‌లో చైనా పూర్తిస్థాయి సైనిక సముదాయం



దిల్లీ: డోక్లామ్‌లో చైనా పూర్తిస్థాయి సైనిక సముదాయాన్ని నిర్మిస్తోంది. ఉపగ్రహ చిత్రాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. భూటాన్ తనదిగా చెబుతున్న ప్రాంతంలోనే చైనా ఈ నిర్మాణం చేపడుతున్నట్లు ఈ చిత్రాలను బట్టి తెలుస్తోంది. డోక్లామ్‌కు ఉత్తరం వైపు ప్రాంతాన్ని చైనా పూర్తిస్థాయిలో నియంత్రణలోకి తెచ్చుకుందని ఒక వార్తా కథనం వెల్లడిస్తోంది. గత ఏడాది డోక్లామ్ వద్ద భారత్-చైనా బలగాల మధ్య ప్రతిష్టంభన ఏర్పడిన చోటుకు దగ్గర్లోనే చైనా సైన్యం కాంక్రీటు పోస్టులను, ఏడు హెలిప్యాడ్‌లను కొత్త కందకాలను ఏర్పాటు చేసిందని, పలు సాయుధ వాహనాలనూ మోహరించిందని పదవీ విరమణ చేసిన కల్నల్ వినాయక్ భట్ రాసిన కథనంలో పేర్కొన్నారు.



గణతంత్ర దినోత్సవ సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం దిల్లీలో సాధన చేస్తున్న సరిహద్దు భద్రతా దళానికి చెందిన డేర్‌డెవిల్స్ బృందం

పిచ్.. దక్షిణాఫ్రికాలో కాదు, ఉపఖండంలో ఉన్నట్లుంది!

సెంచూరియన్‌లో ఆట మొదలు కాగానే ఆతిథ్య జట్టు ఆటగాళ్ల అభిప్రాయమిది! భారత కెప్టెన్ కూడా దాంతో ఏకీభవించాడు. టీమ్ ఇండియాకు భలే కలిసొచ్చింది అనిపించింది. కానీ షరా మామూలే. ఐదో రోజు ఆట ముగిసే సరికి ఫలితం పాతదే. మళ్లీ దాసోహమే. ఓటమి అంతరం పెరిగిందే తప్ప తగ్గలేదు. చెత్త బ్యాటింగ్‌తో మళ్లీ చిత్తే!

ఏ విభాగంలోనూ సఫారీలతో పోటీపడలేకపోయిన కోహ్లీసేన సూపర్‌స్పోర్ట్ పార్క్‌లో బొక్కబోర్లాపడింది. ముఖ్యంగా దక్షిణాఫ్రికా పేస్, బౌన్స్‌కు బదులివ్వలేక విలవిల్లాడింది. ఆఖరి రోజు 252 పరుగులు చేయాల్సిన భారత్‌లో కనీస పోరాటమే కరవైంది. అరంగేట్ర బౌలర్ లుంగి ఎంగిడి నిప్పులు చెరిగిన వేళ.. ప్రపంచ నంబర్‌వన్ జట్టు లంచ్‌లోపే చాప చుట్టేసింది. ఆతిథ్య బౌలర్ల పదునైన బౌలింగ్‌కు తోడు పేలవ షాట్ సెలక్షనూ భారత్‌ను దెబ్బతీసింది.

ఈ పరాభవంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ భారత్ చేజారింది. అంతే కాదు వరుసగా తొమ్మిది సిరీస్‌లు గెలిచిన కోహ్లీసేన విజయపరంపరకూ కూడా తెరపడింది.



పోరాటం లేదు.. దాసోహమే

- లంచ్‌కు ముందే ముగిసిన భారత్ కథ
- 151కే ఆలౌట్ • చేజారిన సిరీస్
- రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఘనవిజయం

సెంచూరియన్

టీమ్ సెలక్షన్ నుంచి షాట్ సెలక్షన్ వరకు.. పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొనే బలహీనత నుంచి వికెట్ల మధ్య పరుగు వరకు టీమ్ ఇండియాకు అన్నీ సమస్యలే. పిచ్ అంత భయంకరంగా ఏమీ లేకపోయినా టీమ్ ఇండియా మరోసారి చేతులెత్తేసింది. బ్యాట్స్‌మెన్ ఘోర వైఫల్యంతో రెండో టెస్టులో 135 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. యువ పేస్ బౌలర్ లుంగి ఎంగిడి సంచలన బౌలింగ్‌తో టీమ్‌ఇండియాను బెంబేలెత్తించాడు. 287 పరుగుల లక్ష్య ఛేదనలో.. 35/3తో ఐదో రోజు, బుధవారం ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. ఎంగిడి (6/39) ధాటికి 151 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ (47) టాప్ స్కోరర్. ఎంగిడికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 2-0తో తిరుగులేని ఆధిక్యం సంపాదించింది. మూడో టెస్టు ఈ నెల 24న జొహానెస్‌బర్గ్‌లో ఆరంభమవుతుంది.

హడలెత్తించిన ఎంగిడి: ఆఖరి రోజు గెలవాలంటే భారత్ చేయాల్సింది 252. కీలక వికెట్లు పోగా చేతిలో ఉన్నది ఏడు వికెట్లు. విదేశాల్లో రికార్డు, దక్షిణాఫ్రికా పేస్ బలం, బ్యాట్స్‌మెన్ తాజా ఫామ్ నేపథ్యంలో కోహ్లీసేనపై భారీ అంచనాలేమీ లేవు. కానీ కనీస మాత్రమైనా పోరడాకుండా భారత జట్టు తీవ్రంగా నిరాశపరిచింది. కెరీర్‌లో తొలి టెస్టు ఆడుతున్న లుంగి ఎంగిడి ఒంటి చేత్తో భారత్ పతనాన్ని శాసించాడు. ఓవర్‌నైట్ స్కోరు 35/3తో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. ఏ దశలోనూ ప్రతిఘటించలేకపోయింది. పోరాటం లంచయినా దాటలేదు. నాలుగో ఓవర్లోనే మొదలైంది పతనం. అనవసరంగా మూడో పరుగుకు ప్రయత్నించిన చెతేశ్వర్ పుజారా (19) రనౌటై జట్టుకు షాకిచ్చాడు. అంతే, ఆ తర్వాత ఏ దశలో భారత్ పతనం ఆగలేదు. మూడు ఓవర్ల తర్వాత మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ పార్థివ్ (19) కథ కూడా ముగిసింది. రబాడ బంతిని పార్థివ్ పుల్ చేయగా.. డీప్ స్క్వేర్ లెగ్‌లో మోర్కెల్ కళ్లు చెదిరే రీతిలో క్యాచ్ అందుకున్నాడు. హార్దిక్ పాండ్య (6) మరోసారి పేలవ షాట్‌తో వెనుదిరిగాడు. రోహిత్‌తో ఆరో వికెట్‌కు 18 పరుగులు జోడించిన అతడు.. ఎంగిడి బౌన్సర్‌ను స్లిప్ వలయం మీదుగా తరలించబోయి వికెట్‌కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చాడు. పది బంతుల తర్వాత ఎంగిడి బౌలింగ్‌లోనే అశ్విన్ (3) కూడా వికెట్‌కీపర్‌కు చిక్కడంతో భారత్ 87/7తో దారుణమైన స్థితిలో నిలిచింది. ఓటమి ఖరారుకాగా.. స్కోరు కనీసం వందైనా దాటుతుందా అనిపించింది. ఐతే రోహిత్, షమి ఎనిమిదో వికెట్‌కు 54 పరుగులు జోడించి పరాజయాన్ని కాస్త ఆలస్యం చేశారు. లంచ్‌కు ముందు ఆఖరి ఓవర్లో రబాడ (3/47) బౌలింగ్‌లో రోహిత్ నిష్క్రమించాడు. రోహిత్ పుల్ షాట్ ఆడగా.. డీప్ ఫైన్‌లెగ్‌లో డివిలియర్స్ కళ్లు చెదిరే క్యాచ్ అందుకున్నాడు. ఇన్నింగ్స్ ముగిసే అవకాశం ఉండడంతో లంచ్‌ను 15 నిమిషాలు ఆలస్యం చేశారు. ఆ తర్వాత ఎంగిడి వరుసగా తన రెండు ఓవర్లలో షమి (28), బుమ్రా (2)ను ఔట్ చేయడంతో భారత్ తడబాటుకు తెరపడింది.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 335; భారత్ తొలి ఇన్నింగ్స్: 307
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 258; భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబాడ 9; రాహుల్ (సి) మహరాజ్ (బి) ఎంగిడి 4; పుజారా రనౌట్ 19; కోహ్లి ఎల్బీ (బి) ఎంగిడి 5; పార్థివ్ (సి) మోర్కెల్ (బి) రబాడ 19; రోహిత్ శర్మ (సి) డివిలియర్స్ (బి) రబాడ 47; పాండ్య (సి) డికాక్ (బి) ఎంగిడి 6; అశ్విన్ (సి) డికాక్ (బి) ఎంగిడి 3; మహ్మద్ షమి (సి) మోర్కెల్ (బి) ఎంగిడి 28; ఇషాంత్ శర్మ నాటౌట్ 4; బుమ్రా (సి) ఫిలాండర్ (బి) ఎంగిడి 2; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (50.2 ఓవర్లలో ఆలౌట్) 151; **వికెట్ల పతనం:** 1-11, 2-16, 3-26, 4-49, 5-65, 6-83, 7-87, 8-141, 9-145; **బౌలింగ్:** ఫిలాండర్ 10-3-25-0; రబాడ 14-3-47-3; ఎంగిడి 12.2-3-39-6; మోర్కెల్ 8-3-10-0; మహరాజ్ 6-1-26-0

"భారత పర్యటన (2015)లో మేమెంతో ఇబ్బంది పడ్డాం. బాగా అలసిపోయాం. సిరీస్ ముగిశాక కూడా మాపై దాని ప్రభావం త్వరగా పోలేదు. అందుకే మా ఆటగాళ్లు చాలా కసితో ఈ సిరీస్‌కు సిద్ధమయ్యారు. ఆ కసిని ఈ మ్యాచ్‌లో చూడొచ్చు"
– డుప్లెసిస్



0 కోహ్లి సెంచరీని మినహాయిస్తే ఈ సిరీస్‌లో భారత ప్రధాన బ్యాట్స్‌మెన్ ఎవరూ కనీసం అర్ధసెంచరీ కూడా సాధించలేదు.

8 2010 తర్వాత ఆసియా ఆవల వెస్టిండీస్‌ను మినహాయిస్తే భారత్ ఆడిన సిరీస్‌లు. ఒక్క సిరీస్‌లోనూ గెలవలేదు.

1 తొమ్మిది సిరీస్‌ల తర్వాత భారత్‌కు ఇదే తొలి సిరీస్ ఓటమి. భారత్ చివరగా 2014-15 సీజన్‌లో ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ కోల్పోయింది.

పుజారాకు ఏమైంది?

ఆఖరి రోజు ఛేదనలో భారత్ ఏమాత్రం నిలవాలన్నా పుజారా ఆడడం కీలకం. కానీ ఏమైందో తెలియదు కానీ.. అతడు వికెట్ల మధ్య పరుగులో మరోసారి తడబడ్డాడు. ఆత్మహత్యా సదృశమైన రనౌట్‌తో పుజారా కోరుకోని రికార్డును సొంతం చేసుకున్నాడు. ఓ టెస్టు మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ రనౌట్‌ను తొలి భారతీయుడిగా, మొత్తంగా 23వ బ్యాట్స్‌మన్‌గా పుజారా నిలిచాడు. ఉదయం నాలుగో ఓవర్లో జరిగిందా ఘటన. ఫిలాండర్ బంతిని గల్లీలోకి ఆడిన పార్థివ్ పటేల్.. పుజారాతో కలిసి రెండు పరుగులు తీశాడు. ఆ తర్వాత ఇద్దరు మూడో పరుగు కోసం పరుగెత్తారు. ఐతే ఎంగిడి నుంచి బంతిని అందుకున్న డివిలియర్స్.. వికెట్‌కీపర్ డికాక్‌కు త్రోశాడు. పుజారా క్రీజు చేరుకునే లోపు డికాక్ వికెట్లకు కొట్టాడు. దీంతో భారత్ 48/4తో పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. "పుజారా వికెట్ల మధ్య చాలా వేగంగా పరుగెత్తే బ్యాట్స్‌మన్ కాదు. నిజం చెప్పాలంటే అతడు చాలా నెమ్మది" అని వ్యాఖ్యాత మైకెల్ హోల్డింగ్ వ్యాఖ్యానించాడు.

బాధ్యత బ్యాట్స్‌మెన్‌దే



సెంచూరియన్: రెండో టెస్టులో ఓటమికి కారణం బ్యాట్స్‌మెనేని భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి నిందించాడు. పేలవ ఫీల్డింగ్ కూడా కొంప ముంచిందని అన్నాడు. ఆటలో గెలుపు ఓటములు సాధారణమే అయినా ఓడిన తీరు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని చెప్పాడు. మ్యాచ్ అనంతరం వాడి వేడిగా సాగిన విలేకర్ల సమావేశంలో కోహ్లి విలేకర్లతో వాగ్యుద్ధానికి కూడా దిగాడు. "చివరికి ఓ జట్టు ఓడిపోవాలి. ఒక జట్టుగా మేం ఎప్పుడూ విజయం కోసం ప్రయత్నిస్తాం. మనం ఓటమిని అంగీకరించవచ్చు. కానీ ఓడిన తీరును కాదు. మ్యాచ్‌లో మేం మంచి అవకాశాలను చేజార్చుకున్నాం. చాలా వికెట్లు తేలిగ్గా ఇచ్చేశాం. ఎంతో కష్టపడి, మంచి స్థితిలో నిలిచాక ఇలాంటి తప్పిదాలతో మ్యాచ్ మాకు దూరమైంది. రెండు టెస్టుల్లోనూ మేం తప్పులను పునరావృతం చేశాం. ఒక జట్టుగా మాకు ఇది మంచిది కాదు" అని కోహ్లి చెప్పాడు. ఎక్కడ తప్పు జరిగిందనే విషయంలో ఆటగాళ్లు తమను తాము ప్రశ్నించుకోవాలని కోహ్లి అన్నాడు. "ఇలా ఆడేందుకు మేమిక్కడికి రాలేదు. నేనేమీ ఈ వైఫల్యం విషయంలో మెతకగా వ్యవహరించబోను. బ్యాటుతో, బంతితో, ఫీల్డింగ్‌లో జట్టు కోసం మేం 120 శాతం శ్రమిస్తున్నామా అని మమ్మల్ని మేము ప్రశ్నించుకోవాలి" అని చెప్పాడు. "60-70 పరుగుల భాగస్వామ్యాలతో టెస్టు మ్యాచ్‌లు గెలవలేం. వాటిని 100 లేదా 150కి పెంచడానికి ప్రయత్నించాలి" అని కోహ్లి అన్నాడు. రెండో టెస్టుకు భారత్ ధావన్, భువనేశ్వర్‌లను తప్పించిన సంగతి తెలిసిందే. రహానెకు రెండు మ్యాచ్‌ల్లోనూ అవకాశం ఇవ్వకపోవడంపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో భారత్ అత్యుత్తమ తుది జట్టునే బరిలోకి దించిందా అన్న ప్రశ్నకు కోహ్లి ఘాటుగా స్పందించాడు. "మేము ఈ మ్యాచ్ గెలుచుంటే ఇది అత్యుత్తమ 11 అయ్యేదా? ఫలితం ప్రకారం తుది జట్టును నిర్ణయించలేం. అత్యుత్తమ 11 ఏదో మీరే చెప్పండి. ఆ జట్టుతోనే ఆడతాం" అని అన్నాడు. 'ఏదైనా నిర్ణయం ఫలితాన్నివ్వనప్పుడు జనం దానికి వ్యతిరేకంగా మాట్లాడడం సహజం. మేం దానికి అలవాటు పడ్డాం. బయట ఎవరేమనుకుంటున్నారో మేం పట్టించుకోం. భువనేశ్వర్‌ను తప్పించడంపై చాలా మాట్లాడారు. కానీ ఈ మ్యాచ్‌లో షమి మెరుగ్గా రాణించాడు. దాని గురించి ఎవరూ మాట్లాడరు. మేం పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటాం. నిర్ణయానికి కట్టుబడి ఉంటాం" అని అన్నాడు.

సెంచూరియన్‌లో భీకరమైన బౌన్స్ లేదు. ప్రత్యర్థి బౌలింగ్ బెంబేలెత్తించేలానూ లేదు. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ అద్భుతమైన ఫామ్‌లో కూడా లేరు. పైగా ఉపఖండం పరిస్థితులే! సఫారీ గడ్డపై దక్షిణాఫ్రికాను ఓడించడానికి ఇంత కంటే మంచి అవకాశం ఉంటుందా? కేప్‌టౌన్ ఓటమికి బదులు తీర్చుకుని.. సిరీస్‌ను సమం చేయడానికి ఇంతకంటే మంచి వేదిక దొరుకుతుందా?

అయినా చేసిన తప్పే మళ్లీ మళ్లీ చేస్తూ చేజేతులా టెస్టు సిరీస్‌ను కోల్పోయింది టీమ్‌ఇండియా. టెస్టుల్లో నంబర్‌వన్‌గా కొనసాగుతున్న టీమ్‌ఇండియా.. గత రెండు టెస్టుల్లో నంబర్‌వన్‌లా ఆడలేదన్నది సుస్పష్టం!

ఇదా నం.1 ఆట!

ఈనాడు క్రీడావిభాగం

తొలి రెండు టెస్టులు గమనిస్తే రెండు జట్లు కూడా గొప్పగా ఆడినట్లయితే అనిపించలేదు. కోహ్లి వీరోచిత సెంచరీ మినహాయిస్తే ఇటు టీమ్‌ఇండియా.. అటు దక్షిణాఫ్రికా తరఫున అద్భుతం అనదగ్గ ఇన్నింగ్స్ లేవీ లేవు! నాలుగో ఇన్నింగ్స్‌ల్లోనూ నమోదైంది ఒకే ఒక్క శతకం. అది కూడా కోహ్లీదే. ఈలెక్కన సఫారీ గడ్డపైనే మ్యాచ్‌లు జరుగుతున్నా దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ సైతం కేప్‌టౌన్, సెంచూరియన్‌లలో తడబడినట్లే! ఇందులో భారత బౌలర్ల ఘనతను తక్కువ చేయలేం! గతంలో టీమ్‌ఇండియాపై దక్షిణాఫ్రికా ఎన్నో సిరీస్ విజయాలు సాధించినా.. బ్యాట్స్‌మెన్ ఇంత సాధారణంగా ఆడటం మాత్రం ఇదే ప్రథమం! ఇలాంటి సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడం కచ్చితంగా టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్ వైఫల్యమే! ఇక రెండు టెస్టుల్లోనూ బౌలర్లే ఫలితాల్ని శాసించారు. ఫలితాలు ఎలా ఉన్నా.. ఇరుజట్ల బౌలర్లు కాస్త అటు ఇటుగా సమానంగానే సత్తాచాటారు! నిజానికి తొలి టెస్టులో మనోళ్లే మెరుగ్గా.. ప్రభావవంతంగా బౌలింగ్ చేశారు. ఎంగిడి ప్రదర్శనను పక్కనబెడితే సెంచూరియన్‌లోనూ భారత బౌలర్లే మెరుగ్గా ఆడినట్లు! అయినా కూడా సిరీస్ పోయిందంటే కారణంగా బ్యాట్స్‌మెనేనని అనడంలో సందేహం లేదు.

"జట్టు నిర్ణయాల్లో భాగస్వామిగా ఉండే వైస్ కెప్టెన్‌కు తుదిజట్టులో చోటు దక్కకపోవడం ఆమోదయోగ్యం కాదు".. రహానె గురించి బేడీ అన్న మాటలివి! రహానె సమర్థతపై అవగాహన ఉన్నవారెవరూ బేడీ వ్యాఖ్యలతో విభేదించలేరు. మాజీలతో సహా క్రికెట్ విశ్లేషకులు, సగటు అభిమానులు సైతం రహానెకు మద్దతుగా నిలుస్తుంటే టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం అతణ్ని దూరంగా పెడుతుండటం అర్థంకాని విషయమే. ఒక బ్యాట్స్‌మన్‌కు తుదిజట్టులో చోటు కల్పించాలంటూ అన్ని వర్గాల నుంచి ఒత్తిడి రావడం బహుశా ఇదే మొదటిసారి. అయినా కెప్టెన్, కోచ్ అతని పట్ల రెండో అభిప్రాయంతో ఉండటం టీమ్‌ఇండియాకు తీరని నష్టం చేస్తోంది. మిడిలార్డర్‌లో రహానె స్థానంలో తుదిజట్టులోకి ఎంపికవుతున్న రోహిత్‌శర్మ 4 ఇన్నింగ్స్‌ల్లో 19.5 సగటుతో 78 పరుగులు చేశాడు. సెంచూరియన్‌లో రెండో ఇన్నింగ్స్‌లో రోహిత్ స్కోరు (47)ను మినహాయిస్తే.. 3 ఇన్నింగ్స్‌లో అతను చేసిన పరుగులు 31. పోనీ.. అద్భుతమైన బంతులకేమీ ఔటయ్యాడా అంటే అదీలేదు. అలాంటి బ్యాట్స్‌మన్ కోసం మరో నాణ్యమైన టెస్టు ఆటగాడికి మొండిచేయి చూపడం సరైందేనా అన్నది జట్టు మేనేజ్‌మెంట్ ఆలోచించుకోవాలి. పరిమిత ఓవర్ల క్రికెట్లో రోహిత్ అత్యంత గొప్ప ఆటగాడే కావొచ్చు. అతను చేసినన్ని డబుల్ సెంచరీలు ఎవరూ చేయలేకపోవచ్చు. కానీ టెస్టులు భిన్నమైన ఫార్మాట్. ఇందులో రోహిత్‌కు మంచి రికార్డేమీ లేదు. వన్డేల్లో ఫామ్ ఆధారంగా.. రోహిత్‌ను టెస్టుల్లో తుదిజట్టులోకి తీసుకోవడం, అదీ విదేశీ గడ్డపై ఆడించడం సమంజసం కాదేమో!

ఇక రోహిత్ వంకతో మిగతా బ్యాట్స్‌మెన్ వైఫల్యం కప్పిపుచ్చలేం. ఐతే వరుస విజయాలతో టీమ్‌ఇండియాను టెస్టుల్లో నంబర్‌వన్‌గా నిలిపిన బ్యాట్స్‌మెన్‌ను కేవలం ఒకే ఒక్క సిరీస్‌తో తక్కువ చేయడమూ సరి కాదు. కాకపోతే షాట్ల ఎంపిక.. పరిస్థితులను అర్థం చేసుకోకుండా ఆడటం కచ్చితంగా లోపాలే. ఈ విషయంలో మురళీ విజయ్, కేఎల్ రాహుల్ మరింత పరిణతితో ఆడటం అవసరం. టీమ్‌ఇండియా బ్యాటింగ్ గోడ పుజారాది విచిత్రమైన పరిస్థితి. రెండో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పుజారా రనౌటవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. టెస్టుల్లో రనౌటవడమే అరుదు. అలాంటిది వరుస ఇన్నింగ్స్‌ల్లో రనౌటవడం పుజారాపై ఉన్న మంచి అభిప్రాయాన్ని మసక బార్చేదే. కేప్‌టౌన్ సంగతి పక్కనబెడితే సెంచూరియన్ వికెట్ ఉపఖండం పరిస్థితుల్ని తలపించింది. ఈ వికెట్‌పై విరాట్ కోహ్లి అద్భుతంగా ఆడి సెంచరీ చేశాడు. ఐతే కెప్టెన్ సెంచరీ మిగతా బ్యాట్స్‌మెన్‌లో స్ఫూర్తినింపలేకపోయింది. కోహ్లి బ్యాటింగ్‌లో కనిపించిన కసి.. పరుగులు సాధించాలన్న ఆకలి మిగతా వారిలో మచ్చుకైనా అగుపించలేదు. వ్యక్తిగతంగా అందరూ ప్రతిభావంతులే కావొచ్చు. కానీ క్రికెట్ సమష్టి ఆట. తలా ఓ చేయి వేసినప్పుడే ఫలితం వచ్చేది. ఎవరికి వారే అన్నట్లు ఆడితే కేప్‌టౌన్, సెంచూరియన్‌లే పునరావృతమవుతాయి..



పాక్‌తో భారత్ టైటిల్ పోరు


అజ్‌మన్ (యూఏఈ): అంధుల క్రికెట్ ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఫైనల్లో ప్రవేశించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఏడు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. 38.5 ఓవర్లలో 256 పరుగులు చేసింది. దుర్గారావు మూడు వికెట్లు తీయగా.. దీపక్ మలిక్, ప్రకాశ్ రెండేసి వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. గణేశ్‌భాయ్ మధుకర్ (112; 69 బంతుల్లో) సెంచరీ సాధించడంతో లక్ష్యాన్ని భారత్..మూడు వికెట్లే కోల్పోయి ఛేదించింది. గణేశ్‌తో పాటు దీపక్ మలిక్ (53), నరేశ్ (40) విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈనెల 20న షార్జాలో జరిగే తుది సమరంలో భారత్.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఢీకొంటుంది.



క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా..

క్రైస్ట్‌చర్చ్: వెస్టిండీస్ అండర్-19 జట్టు క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించింది. ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ కావాలనే బంతిని అడ్డుకున్నాడని అంపైర్‌కు ఫిర్యాదు చేసి వికెట్ సాధించింది. విండీస్‌తో మ్యాచ్‌లో జీవ్‌షాన్ పీలె ఆడిన బంతి అతని ప్యాడ్లకు తగిలి వికెట్లకు సమీపంగా వెళ్లి ఆగిపోయింది. ఈ బంతిని తీసి వికెట్‌కీపర్ స్టీవార్ట్‌కు అందించాడు పీలె. వెంటనే స్టీవార్ట్ అంపైర్‌కు అప్పీల్ చేయగా.. అంపైర్ మూడో అంపైర్‌కు నివేదించాడు. నిబంధనల ప్రకారం వికెట్ కీపర్ అనుమతి లేనిదే బ్యాట్స్‌మన్ బంతిని తీసి ఇవ్వకూడదు. దీంతో అంపైర్ పీలెను ఔట్‌గా ప్రకటించాడు. విండీస్ క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించిందని మాజీ ఆటగాళ్లు విమర్శించారు. విండీస్ ఇలా ప్రవర్తించడం ఇదే తొలిసారి కాదు. 2016 ప్రపంచకప్‌లో జింబాబ్వే ఆఖరి బ్యాట్స్‌మెన్‌ను మన్కడింగ్ చేసి విజయాన్ని సాధించింది ఆ జట్టు. అప్పట్లోనూ దీనిపై విమర్శలు రేగాయి.


మళ్లీ జట్టులోకి స్టోక్స్!



లండన్: ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్ తిరిగి ఇంగ్లాండ్ జట్టు తరఫున ఆడనున్నాడు. అతడి ఎంపికకకు లైన్ క్లియర్ అయ్యింది. జట్టు ఎంపికలో స్టోక్స్ పేరును పరిగణించాలని నిర్ణయించినట్లు ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. నిరుడు సెప్టెంబరులో పూటుగా తాగి నైట్‌క్లబ్ బయట ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడిన స్టోక్స్‌పై పోలీసు కేసు నమోదైన సంగతి తెలిసిందే.

లంకకు జింబాబ్వే ఝలక్

ఢాకా: జింబాబ్వేకు ఓ అద్భుత విజయం. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా బుధవారం ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 12 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. మొదట మసకద్జ (73), సికిందర్ రజా (81 నాటౌట్) రాణించడంతో జింబాబ్వే 50 ఓవర్లలో 6 వికెట్లకు 290 పరుగులు చేసింది. ఛేదనలో లంక పోరాడినా.. 48.1 ఓవర్లలో 278 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ పెరీరా (80), తిసార పెరీరా (64), మాథ్యూస్ (42) రాణించినా జట్టును గెలిపించలేకపోయారు. చటార (4/33) రాణించాడు.



నాదల్ ముందుకు

- మూడో రౌండ్లో ప్రవేశం
- వోజ్నియాకి, కిర్గియోస్ ముందంజ

మెల్‌బోర్న్: పదిహేడో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురి పెట్టిన స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్.. ఆస్ట్రేలియన్ ఓపెన్లో దూసుకెళ్తున్నాడు. అతను పెద్దగా కష్టపడకుండానే మూడో రౌండ్లో ప్రవేశించాడు. బుధవారం పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో నాదల్ 6-3, 6-4, 7-6 (7-4)తో లియనార్డో మేయర్ (అర్జెంటీనా)ను ఓడించాడు. ఒక్క మూడో సెట్లో మాత్రమే ప్రత్యర్థి నుంచి రఫాకు ప్రతిఘటన ఎదురైంది. ఈ మ్యాచ్‌లో 40 విన్నర్లు కొట్టిన నాదల్.. మూడు సార్లు ప్రత్యర్థి సర్వీసు బ్రేక్ చేశాడు. అయితే మేయర్ 15 ఏస్‌లు సంధించినా.. నాదల్ బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్ల ముందు నిలువలేకపోయాడు. మరోవైపు మూడో సీడ్ దిమిత్రోవ్ (బెలారస్) కొద్దిలో ఓటమిని తప్పించుకున్నాడు. 22 ఏళ్ల ఆస్ట్రేలియా కుర్రాడు మెక్‌డొనాల్డ్ అతనికి ముచ్చెమటలు పట్టించాడు. రెండో రౌండ్లో దిమిత్రోవ్ 4-6, 6-2, 6-4, 0-6, 8-6తో అతికష్టమ్మీద మెక్‌డొనాల్డ్‌ను ఓడించాడు. సోంగా (ఫ్రాన్స్), డొల్గోపొలొవ్ (ఉక్రెయిన్), రుబెలొవ్ (రష్యా) కూడా మూడో రౌండ్లో ప్రవేశించారు.

కార్లోవిచ్ ఘనత: క్రొయేషియా ఏస్‌ల మాస్టర్ ఇవో కార్లోవిచ్ (38 ఏళ్లు) అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్లో మూడో రౌండ్లో చేరిన పెద్ద వయస్కుడిగా అతను నిలిచాడు. 40 ఏళ్ల టోర్నీ చరిత్రలో ఈ దశకు చేరిన పెద్ద వయస్కుడు కార్లోవిచే. రెండో రౌండ్లో కార్లోవిచ్ 7-6 (3), 6-7 (3), 7-5, 4-6, 12-10తో యుచి సుగిట (జపాన్)పై పోరాడి గెలిచాడు.

వోజ్నియాకి, స్వెతొలినా కొద్దిలో..: టైటిల్‌కు పోటీదారులు కరోలినా వోజ్నియాకి (డెన్మార్క్), ఎలినా స్వెతొలినా (ఉక్రెయిన్) కొద్దిలో ఓటమి తప్పించుకున్నారు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో నాలుగో సీడ్ స్వితొలినా 4-6, 6-2, 6-1తో అన్‌సీడెడ్ సినియాకోవా (చెక్ రిపబ్లిక్)ను ఓడించగా. రెండో సీడ్ వోజ్నియాకి 3-6, 6-2, 7-5తో యానా ఫెట్ (క్రొయేషియా)పై చెమటోడ్చి గెలిచింది. వొస్త్రాపెంకో (లాత్వియా), కార్నెట్ (ఫ్రాన్స్), మార్తా కోస్త్యుక్ (ఉక్రెయిన్) కూడా ముందంజ వేశారు. మర్తా అరుదైన ఘనత సాధించింది. రొగౌస్కా (ఆస్ట్రేలియా)ను ఓడించి మూడో రౌండ్ చేరిన ఈ అమ్మాయి.. గత 21 ఏళ్లలో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఈ దశకు అర్హత సాధించిన పిన్న వయస్కురాలిగా నిలిచింది.


మార్తా

స్ఫూర్తిగా పెండ్యాల

● మద్యం ఊసే లేదు ● విగ్రహాల ఏర్పాటుపై నిషేధం

ఈనాడు,అమరావతి - న్యూస్‌టుడే, కంచికచర్ల

కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామం స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ గ్రామంలో ఒక్క విగ్రహం కూడా కనిపించదు. మద్యం దుకాణమూ ఉండదు. గ్రామంలో 4,500 మంది ఓటర్లు ఉండగా జనాభా తొమ్మిదివేలకు పైగా ఉంది. వీరిలో 90 శాతం మంది ముస్లింలు ఉన్నారు. గతంలో రోజుకు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరం వెళ్లి సైకిళ్లపై వ్యాపారం చేసేవారు. ఉల్లిపాయలు, పాత ఇనుము, పండ్ల వ్యాపారాలు చేసేవారు. ఇప్పుడు ఆటోలపై వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడైనా పాత ఇనుము వ్యాపారం చేశారంటే దానికి పెండ్యాలకు సంబంధం ఉంటుంది. సీజనల్‌గా వచ్చే పండ్లను ఆయా ప్రాంతాల నుంచి నేరుగా దిగుమతి చేసుకుని ఈ ప్రాంతంలో వ్యాపారం చేసుకుంటున్నారు. విజయవాడ పండ్ల మార్కెట్‌లో ఎక్కువ బాగం ఉండేది పెండ్యాల వాసులే. ఇక్కడ పూట కూడా గడవని వారు... కోట్లకు పడగెత్తినవారు ఉన్నారు. దుబాయ్, హైదరాబాద్, అహమ్మదాబాద్ తదితర ప్రాంతాలలో స్థిరపడి పెద్ద పెద్ద వ్యాపారాలు చేసుకునే వారుఉన్నారు.

ఇక్కడికే భౌతికకాయాల రాక!: గ్రామానికి చెందిన వారు దూర ప్రాంతాలలో ఉన్నప్పటికీ వారు మరణిస్తే తప్పకుండా ఇక్కడకు తీసుకొచ్చి ఖననం చేస్తారు. ఈ ఆచారం ఆది నుంచి కొనసాగుతూనే ఉంది.

వివాహాల విషయంలోనూ..: తమ బంధువుల పిల్లలనే వివాహం చేసుకోవటం ఇక్కడి ఆనవాయితీ. హైదరాబాదులో రెండు ప్రాంతాల్లో ఉండే కుటుంబాలు ఇక్కడ వారితోనే వివాహ సంబంధాలు పెట్టుకుంటున్నట్లు పెండ్యాల ఎంపీటీసీ సభ్యుడు అల్లీపాషా పేర్కొన్నారు. గ్రామంలో విగ్రహాలు పెట్టకూడదు అనే నియమాన్ని దశాబ్దాల కాలం కిందట వీరే నిర్ణయించుకొని నేటికీ అనుసరిస్తున్నారు. నూరు శాతం సీసీ రోడ్లు ఉన్నాయి.

తాగి వస్తే నిలువుకాళ్లపై నిలబడాల్సిందే..: గ్రామంలో మద్యం దుకాణానికి అవకాశమే లేదు. గ్రామ సరిహద్దుల వరకు ఈ నియమం ఉండేలా నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారు. బయట తాగి వస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. మద్యం తాగి వచ్చిన వారు 24గంటల పాటు మసీదు ముందు నిలబడాలని తీర్మానించి అమలుచేస్తున్నారు.



గ్రామం అంతా ఇలా చక్కటి రోడ్లు...



ఆడపిల్లల్లో నూరుశాతం అక్షరాస్యత

గతంతో పోలిస్తే గ్రామంలో అక్షరాస్యత పెరిగింది. గ్రామంలో ఆడపిల్లలు నూరు శాతం చదువుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారని ప్రధానోపాధ్యాయురాలు 'ఈనాడు' ప్రతినిధితో పేర్కొన్నారు. ఇక్కడ ప్రత్యేకంగా ఉర్దూలో తరగతులు కొనసాగుతున్నాయి.

ఊరికి ఊరే కదులుతుంది: ఏటా మార్చి ప్రాంతంలో చందర్లపాడు మండలం తుర్లపాడు దర్గా వద్ద జరిగే బడే హజరత్ ఉరుసుకి ఊరికి ఊరే కదులుతుంది. ఎడ్ల బండిపైనే అక్కడకు వెళ్లటం ఆచారం. హిందువులకు చెందిన ఎడ్ల బండ్లపైనే ముస్లిం కుటుంబాలు వెళ్లటం ఈ ఉత్సవాలలో ఒక ప్రత్యేకత. నెల రోజుల ముందు నుంచే ఎడ్ల బండ్లను తమ ఇంటికి తీసుకొచ్చి మరమ్మతులు చేసి రంగులు వేసి ముస్తాబు చేస్తారు. ఎడ్లకు కావాల్సిన మేతను తీసుకొచ్చి ఇంటి వద్దనే ఉంచుకుంటారు. ఎడ్ల బండిని రూపాయి కూడా ఆశించకుండా చుట్టుపక్కలకు చెందిన రైతులు ముస్లింలకు ఇస్తారు. ముస్లింలను తమ బండ్లపై ఎక్కించుకుని జాతరకు వెళ్తారు. ఒకేసారి వందల సంఖ్యలో బండ్లు బయలుదేరతాయి. మున్నేటిలో నాలుగైదు గంటల పాటు విశ్రాంతి తీసుకుని అక్కడ నుంచి తుర్లపాడు దర్గా దగ్గరకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. హిందువులతో కలసి జాతరలో పాల్గొంటారు.

ఆహార కల్తీని గుర్తించేందుకు పరీక్షా కేంద్రాలు

● కార్బైడ్‌తో పండ్లు మగ్గబెట్టే వారిపై క్రిమినల్ కేసులు

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ఆదేశం



సీఎస్ దినేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: ఆహార కల్తీ నియంత్రణలో భాగంగా మార్కెట్ యార్డులు, అవసరమైన ఇతర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ ఆదేశించారు. పండ్లను కృత్రిమ పద్ధతిలో పక్వానికి తెచ్చేందుకు క్యాల్షియం కార్బైడ్ వినియోగించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆహార కల్తీపై బుధవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్యంపై కార్బైడ్ ప్రభావాన్ని తెలియజేసేలా పత్రికలు, టీవీ, సామాజిక మాధ్యమాలు, రేడియోల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. తొలి దశలో రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య వివరించారు.

సముద్రంలో ఈతకెళ్లి ముగ్గురి మృతి

కోడూరు, న్యూస్‌టుడే: సముద్రంలో ఈతకెళ్లి ప్రమాదవశాత్తు ముగ్గురు మృత్యువాతపడ్డారు. నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు బీచ్‌లో బుధవారం ఈ ఘటన జరిగింది. మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామానికి చెందిన 19 మంది యువకులు కోడూరు సముద్ర తీరానికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత సముద్రంలో ఈతకెళ్లారు. ఆ సమయంలో ఒక్కసారిగా అలల తాకిడి ఎక్కువ కావడంతో పెనబల్లి యశ్వంత్(26), పెనబల్లి దిలీప్(23), బరిశపు వెంకటేశ్(24) నీళ్లలో మునిగిపోయారు. ఆందోళనకు గురైన స్నేహితులు గాలింపు చేపట్టారు. కొన్ని గంటల తర్వాత ముగ్గురి మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మృతుల్లో యశ్వంత్, దిలీప్ అన్నదమ్ములు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



యాగశాలలో హోమగుండానికి పూర్ణద్రవ్యం సమర్పిస్తున్న ఈవో, అర్చకులు

శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం రుద్రయాగ పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో భరత్‌గుప్తా, ఆలయ ప్రధానార్చకులు, స్థానాచార్యులు ఆలయ యాగశాలలో రుద్రహోమ క్రతువులో భాగంగా పూర్ణహోమ ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. గురువారం రాత్రి శ్రీపార్వతీ సమేత మల్లికార్జునస్వామికి అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవలతో ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు.

తొలిసారి పట్టణ పచ్చదన విధానం

● 2017కి గ్రీన్ బహుమతులకు దరఖాస్తుల ఆహ్వానం

● రాష్ట్ర పచ్చదన, సుందరీకరణ సంస్థ ఎండీ చంద్రమోహన్‌రెడ్డి

● గ్రీన్ ఏపీ మొబైల్‌యాప్ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: దేశంలో తొలిసారిగా పట్టణ పచ్చదన విధానాన్ని తీసుకొస్తున్నట్లు రాష్ట్ర పట్టణ పచ్చదన, సుందరీకరణ సంస్థ ఎండీ చంద్రమోహన్‌రెడ్డి ప్రకటించారు. సిప్(సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టమ్) ఈ విధానాన్ని సిద్ధం చేస్తోందన్నారు. ఫిబ్రవరిలో సదస్సు నిర్వహించి అక్కడ తుది విధానాన్ని ఖరారు చేస్తామన్నారు. బుధవారం ఆయన సంస్థ జనరల్ మేనేజర్లతో కలిసి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. "2017 గ్రీన్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. 1వ విభాగంలో స్థానిక సంస్థలు; 2లో ప్రభుత్వ ఉద్యానవనాలు; 3లో పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలలో పచ్చదనం అభివృద్ధిచేసిన వారు ఉంటారు. 4లో పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు; 5లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల ప్రాంగణం, 6లో అపార్ట్‌మెంట్లు, గేటెడ్‌కమ్యూనిటీ ఉంటాయి. 7లో వ్యక్తులు, ఎన్జీఓలు, 8లో పురాతన, వారసత్వ చెట్లను సంరక్షిస్తున్న బృందాల వారు, వ్యక్తులు ఉంటారు. www.urbangreening.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు తీసుకోవాలి. apurbangreening@gmail.comకు ఫిబ్రవరి 15లోగా దరఖాస్తులను మెయిల్ చేయాలి. లేదా పోస్ట్‌లో మా కార్యాలయానికి పంపాలి. ఇళ్లలో మొక్కల పెంపకానికి ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికి మార్గాలను సూచించడం, ఏ మొక్కలు ఎక్కడ లభిస్తాయి వంటి వివరాలను తెలియజేసేలా గ్రీన్ ఏపీ పేరుతో మొబైల్ యాప్‌ను సిద్ధం చేశాం. ముఖ్యమంత్రి చేతులమీదుగా దీన్ని ప్రారంభించనున్నాం"అని వెల్లడించారు.

విపత్తుల్లో కాపాడే 'ఆపద మిత్ర'

ఈనాడు అమరావతి: ప్రకృతి విపత్తులు సంభవించే ప్రాంతాల్లో ఆపదల్లో ఉన్నవారిని రక్షించే దళాలను సిద్ధం చేస్తున్నారు. విపత్తు సమయంలో సహాయక చర్యలపై స్థానిక యువతకు శిక్షణనివ్వనున్నారు. ఇందులో శిక్షణ పొందిన ప్రతి యువకుడినీ 'ఆపద మిత్ర'గా గుర్తిస్తారు. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తాయి. మొదటగా కృష్ణా జిల్లా నుంచి 200 మందికి శిక్షణ నివ్వనున్నారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఊతం

● నీతి ఆయోగ్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం

● నేటి నుంచి కలెక్టర్ల సదస్సు

ఈనాడు, అమరావతి: కనీస మౌలిక వసతులు, విద్య, జల వనరుల వృద్ధి లాంటి కార్యక్రమాలతో వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు నీతి ఆయోగ్ ద్వారా కేంద్రం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 115 జిల్లాల్ని గుర్తించారు. ఈ జాబితాలో రాష్ట్రం నుంచి విజయనగరం, విశాఖపట్నం, కడప జిల్లాలున్నాయి. ఈ జిల్లాల అభివృద్ధికి ఊతమిచ్చేందుకు నీతి ఆయోగ్‌తో రాష్ట్ర ప్రభుత్వం పరస్పర అవగాహనా ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇందుకు కలెక్టర్ల సమావేశం వేదిక కానుంది. గురువారం నుంచి ముఖ్యమంత్రి నివాసంలో కలెక్టర్ల సదస్సు ప్రారంభమవుతోంది. నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ హాజరవుతారు. కలెక్టర్ల సమావేశంలో 115 వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి దిశగా పరివర్తన చెందేలా చేపడుతున్న కార్యక్రమాలను ప్రత్యేకంగా వివరించనున్నారు.

రెండు రోజులపాటు సాగే కలెక్టర్ల సమావేశంలో తొలి రోజు ప్రాథమిక, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల కల్పన, పట్టణాభివృద్ధి రంగాలకు సంబంధించిన మిషన్లపై చర్చిస్తారు. రెండో రోజు సామాజిక సాధికారత, సేవా రంగాలు, నైపుణ్యాభివృద్ధి మిషన్లు చర్చకు వస్తాయి. జిల్లాలవారీగా ఆర్థికాభివృద్ధి, వృద్ధి రేటు తదితర అంశాలపై ఇప్పటికే ప్రణాళికశాఖ నివేదికలను సిద్ధం చేశారు. లక్ష్యాన్ని అందుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేయనున్నారు.

400 మందితో బందోబస్తు

రాష్ట్ర విభజన తరువాత విజయవాడలోని స్టార్ హోటల్, ఫంక్షన్ హాళ్లలోనే కలెక్టర్ల సమావేశాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈసారి సచివాలయంలో ఏర్పాటు చేయాలని భావించారు. అక్కడ పూర్తి స్థాయిలో సమావేశ మందిరం అందుబాటులోకి రాకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం సమీపంలో ఇటీవల నిర్మించిన గ్రీవెన్స్ హాల్‌ను ఎంపిక చేసుకున్నారు. కరకట్టపై ఈ రెండు రోజులు ట్రాఫిక్‌ను నియంత్రించనున్నారు. 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

గనుల అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు

● కర్ణాటక మంత్రిమండలి తీర్మానం

ఈనాడు, బెంగళూరు: తగిన సాక్ష్యాధారాలు లేవంటూ సీబీఐ వదిలేసిన ఇనుప ఖనిజం గనుల అక్రమ తవ్వకాల కేసుల్ని ప్రత్యేక తనిఖీ బృందంతో దర్యాప్తు చేయించాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన బుధవారం రాత్రి రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించింది. న్యాయశాఖ మంత్రి జయచంద్ర మాధ్యమ ప్రతినిధులకు ఈ వివరాలు వెల్లడించారు. "బెళకెరె, నవ మంగళూరు, కార్వార, మార్గోవా, పణజి తదితర తొమ్మిది ఓడరేవుల నుంచి ఖనిజాన్ని అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేశారు. ఈ కేసుల విచారణను చేపట్టిన కేంద్ర దర్యాప్తు బృందం(సీబీఐ) సాక్ష్యాధారాలు లేవంటూ దర్యాప్తు నుంచి అర్థంతరంగా తప్పుకొంది. లోకాయుక్త న్యాయమూర్తిగా ఉన్నపుడు సంతోష్ హెగ్డే ఈ అక్రమ ఎగుమతులపై సమగ్ర నివేదిక సమర్పించింది. అయినా.. విచారణ నుంచి సీబీఐ తప్పుకోవటం ఆశ్చర్యంగా ఉంది. అందువల్ల ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఖనిజాన్ని అక్రమంగా తవ్వడం, దొంగ రవాణా, విక్రయం, నిల్వచేసిన అందరిపైనా క్రిమినల్ కేసులు నమోదుచేసి వారి ఆస్తుల్నీ స్వాధీనం చేసుకుంటామ"ని మంత్రి పేర్కొన్నారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశానుసారం ఖనిజం అక్రమ తవ్వకాల పరిమాణం 50వేల టన్నుల కంటే ఎక్కువ ఉన్న కేసుల్లో సీబీఐ, అంతకంటే తక్కువున్న వాటిల్లో రాష్ట్రప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం తనిఖీలు జరిపాయి. అవసరాన్ని బట్టి ఇతర రాష్ట్రాలకూ వెళ్లి కేసుల్ని విచారించే అధికారాన్ని ప్రభుత్వం దీనికి ఇచ్చింది. బళ్లారి, తుమకూరు, చిత్రదుర్గ జిల్లాల్లోని గనుల నుంచి సుమారు 500కోట్ల టన్నుల ఇనుప ఖనిజాన్ని గనుల యజమానులు అక్రమంగా వెలికితీసి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలున్నాయని జయచంద్ర పేర్కొన్నారు.

ఉక్కు ఉత్పత్తిలో బ్లాస్ట్‌ఫర్నేస్ నూతన రికార్డు

ఉక్కునగరం(విశాఖపట్నం), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ఉత్పత్తిలో బ్లాస్ట్‌ఫర్నేస్‌లు నూతన రికార్డు నెలకొల్పినట్లు సంబంధిత విభాగం ఉద్యోగులు తెలిపారు. బ్లాస్ట్ ఫర్నేస్-1కు 2014 జులై 31న కేటగిరీ-1 క్యాపిటల్ మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో 3,200 క్యూబిక్ మీటర్ల నుంచి 3800 క్యూబిక్ మీటర్లకు విస్తరణ జరిగింది. అలాగే సామర్థ్యం ఏడాదికి 2 మిలియన్ టన్నుల నుంచి 2.5 మిలియన్ టన్నులకు చేరుకుంది. ఇందులో హైడ్రాలిక్ మడ్‌గన్, డ్రిల్లింగ్ మెషిన్స్, కొత్త బెల్‌లెస్ టాప్ ఛార్జింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. బ్లాస్ట్‌ఫర్నేస్-2కు 2017 అక్టోబరు 23న కేటగిరీ-1 క్యాపిటల్ మరమ్మతులను ఎం అండ్ సీఆర్ విభాగం ఆధ్వర్యంలో పూర్తి చేశారు. దీంతో బుధవారం మొత్తం హాట్‌మెటల్ ఉత్పత్తి 19,028 టన్నులకు చేరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో ఉత్పత్తి జరిగింది. ఎస్ఎంఎస్-1, 2లో మొత్తం ద్రవ ఉక్కు ఉత్పత్తి 120 హీట్లలో 17,232 టన్నులకు చేరింది. ఎస్ఎంఎస్ విభాగం ఒక్క రోజులో ఇదో రికార్డు ఉత్పత్తి అని ఉద్యోగులు పేర్కొంటున్నారు.



బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉక్కు ఉత్పత్తి దృశ్యం

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

మహా తేజం...



మన ఆధ్యాత్మిక గ్రంథాల ప్రకారం మొత్తం 12 మంది సూర్యులు. ఏడాదిలోని ఒక్కో నెలకు ఒక్కో సూర్యుడు ప్రాధాన్యత వహిస్తాడు.

చైత్ర మాసంలో వచ్చే సూర్యుడి పేరు 'ధాత', వైశాఖంలో అర్యముడు, జ్యేష్టం-మిత్రుడు, ఆషాఢం-వరుణుడు, శ్రావణంలో ఇంద్రుడు, భాద్రపదం-వివస్వంతుడు, ఆశ్వయుజం-త్వష్ట, కార్తీకం-విష్ణువు, మార్గశిరం-అంశుమంతుడు, పుష్యం-భగుడు, మాఘం-పూషుడు, ఫాల్గుణం-పర్జన్యుడు.

ఆ నెలల్లో సూర్యుడి తీక్షణతను బట్టి ఆ పేర్లు వచ్చాయని చెబుతారు.

భూమి నుంచి 14.98 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యుని కిరణాల ప్రయాణ వేగం ఒక సెకనుకు 3 లక్షల కిలోమీటర్లు. అవి భూమిని చేరడానికి పట్టే కాలాన్ని 8 నిమిషాలుగా అంచనా కట్టారు ఖగోళ శాస్త్రవేత్తలు. బాల్యంలో హనుమంతుడు సూర్యుణ్ణి పండు అనుకుని తిందామనే ఉద్దేశంతో అక్కడికి ఎగిరి వెళ్లాడట. అందుకోసం ఆయన వెళ్లిన దూరాన్ని 'యుగ సహస్ర యోజన పరాభాను' అని తులసీదాస్ హనుమాన్ చాలీసాలో చెబుతారు. దీన్ని లెక్క కడితే... 'యుగం.. 12000 ఏళ్లు, సహస్రం.. 1000, యోజనం.. 8 మైళ్లు, మైలు... 1.6 కిలోమీటర్లు వెరసి దాదాపు 15 కోట్ల కిలోమీటర్లు. ఇది ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్న 14.98 కోట్ల కిలోమీటర్లకు దాదాపు సరిపోతుంది.

ఈ నెల 24 రథసప్తమి

సూర్యకాంతి ఏడు వర్ణాల కలయిక అని వైజ్ఞానికులు చెబుతుంటే, ఆయన ఏడు గుర్రాలున్న రథం మీద లోక సంచారం చేస్తాడని వేదవాఙ్మయం చెబుతోంది. ఆ ఏడు గుర్రాల పేర్లు గాయత్రి, త్రిష్టుప్పు, అనుష్టుప్పు, జగతి, పంక్తి, బృహతి, ఉష్ణిక్కు... వీటి రూపాలు సప్త వర్ణాలకు సరిపోలుతాయి.

రామరావణ యుద్ధం సమయంలో అలసిపోయిన శ్రీరాముడికి అగస్త్య మహాముని 'ఆదిత్య హృదయం' ఉపదేశించినట్లు రామాయణంలో ఉంది. ఇందులో 30 శ్లోకాలున్నాయి. వీటి స్మరణ వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని చెబుతారు. సూర్యుడి రథానికి ఉన్న ఇరుసు పగలు, రాత్రికి ప్రతీక అని, చక్రాలకున్న ఆరు ఆకులు రుతువులకు, ధ్వజం ధర్మానికి ప్రతీకలని పురాణాల్లో ఉంది. అందుకే సూర్యుడి జన్మదినాన్ని ఆయన పేరుతో కాకుండా రథ సప్తమి అని పిలుస్తారు.

- అయ్యగారి శ్రీనివాసరావు

మకరందం

మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512, ■ makarandam@eenadu.in



అంతా అర చేతుల్లోనే!

భారతీయ ప్రాచీన ఆచార సంప్రదాయాల వెనుక భౌతిక దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక తత్వమూ ఉంటుంది. తన కాళ్ల మీద తాను నిలబడేలా చెయ్యడం, తనలోని పరమాత్మను దర్శింపజేయడమే ఈ ఆచారాల పరమార్థం. మన రుషులు విశాలమైన భావంతో అందరూ బాగుండాలని ఆకాంక్షించి ఈ ఆచారాలను ఏర్పాటు చేశారు. ఉదయం లేవగానే మన చేతులు మనం చూసుకుంటూ చదువుకోవాల్సిన శ్లోకం ఒకటుంది.

కరాగ్రే వసతే లక్ష్మీః
కరమధ్యే సరస్వతీ!
కరమూలే స్థితా గౌరీ
ప్రభాతే కరదర్శనం!!

చేతి వేళ్ల చివర లక్ష్మీదేవి ఉంటుందట. అరచేతి మధ్యలో సరస్వతీదేవి ఉంటుందట. అరచేతి మొదట్లో గౌరీదేవి ఉంటుందట. రెండు చేతులనూ పరికించి చూసినా.. ఎవరూ కనబడరు. మనోనేత్రంతో ఆలోచిస్తే ఈ ముగ్గురమ్మలూ.. మూడు శక్తుల రూపంలో సాక్షాత్కరిస్తారు.

లక్ష్మీదేవి సంపదకు ప్రతీక. కష్టపడితేనే సంపదలు వస్తాయి. పెరుగుతాయి. కష్టపడే శరీర అవయవాల్లో చేతులే ప్రధానం. అందుకే రెండు చేతులా సంపాదిస్తున్నాడు అంటారు. ఆ చేతుల్లో అర చేతులు ప్రధానమైనవి. ఆ అరచేతుల్లో కూడా వేళ్ల కొసలు ఇంకా ముఖ్యం. గుండు సూది పట్టుకోవడం దగ్గరి నుంచి గునపంతో పోటు వెయ్యడం వరకు చేతి వేళ్ల కొసలే ప్రధాన పని చేస్తాయి. ఆ వేళ్ల కొసల్లో లక్ష్మీదేవి ఉందంటే.. కష్టపడితేనే సంపదలు వరిస్తాయని అంతరార్థం.

పూర్వం తాటాకు పుస్తకాలు చేతుల మధ్యలో పట్టుకొని చదివేవారు. ఇప్పటికైనా పెద్ద పెద్ద పుస్తకాలు శ్రద్ధగా చదవాలంటే చేతుల మధ్యలో పుస్తకం పెట్టుకోవాల్సిందే. యంత్రాల తెరలను చూసి చదివిన దాని కంటే కూడా పుస్తకాల్లో చదివినవి బాగా గుర్తుంటాయి. మొత్తం మీద చదువు బాగా రావాలంటే చేతుల మధ్యలో పుస్తకం ఉండాల్సిందే! అందుకే కరమధ్యే సరస్వతీ అన్నారు.

మూడో శక్తి పార్వతీదేవి. ఆవిడ శారీరక శక్తికీ, ఆయుర్దాయానికీ, ఆరోగ్యానికీ ప్రతీక. ఆ శక్తి అరచేతి మూలంలో ఉంటుంది. ఎప్పుడైనా పొరపాటున జారిపడితే.. అరచేతి మూలాల మీదే నిలదొక్కుకుంటాం. తిరిగి లేవాలన్నా.. అరచేతి మూలాల మీదే ఆధారపడతాం. అందుకే కరమూలే స్థితా గౌరీ అన్నారు.

మొత్తం మీద మన ఆరోగ్యం, చదువు, సంపద అన్నీ అరచేతుల మీదే ఆధారపడి ఉన్నాయన్నమాట. అంటే మన అభివృద్ధికి మనమే ప్రధాన కారణం అని తెలుసుకోవాలి. అప్పుడే ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది.

– గరికిపాటి నరసింహారావు, మహాసహస్రావధాని

ధర్మ సందేహం

శనిపై అది అపోహే!



శనికి ప్రదక్షిణలు చేశాక కాళ్లు కడుక్కోవాలా?

– నిరంజన్, వరంగల్

నవగ్రహాలను, శనైశ్చరుణ్ని దర్శించుకున్న తరువాత కాళ్లు కడుక్కోవడం అనేది మంత్ర శాస్త్రంలో లేదు. శనైశ్చరుణ్ని దర్శించుకున్న తర్వాత కాళ్లు కడుక్కోకపోతే ఏదో జరిగిపోతుందని భావించడం సరికాదు. లౌకికంగా వచ్చిన ఆచారం ఇది. శనికి తైలాభిషేకం నిర్వహించినప్పుడు పాదాలకు నూనె అంటుకునే అవకాశం ఉంది. అలాంటి సందర్భంలో పాదాలు కడుక్కోవడం సహజమే. బహుశా ఈ ఆచారం అలా ప్రచారంలోకి వచ్చింది కాబోలు. అంతేకాని, శనిని దర్శించుకున్నందుకు పాద ప్రక్షాళన చేసుకోవాలనే నియమం ఎక్కడా లేదు.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

ఇస్లాం సందేశం

దువా... ఒక వజ్రాయుధం

దువా అంటే వేడుకోవడం, ప్రశ్నించడం, అర్థించడం అని అర్థం. ఇస్లాం పరిభాషలో చెప్పాలంటే మనపై వచ్చిపడిన ఆపదలు, విపత్తుల నుంచి గట్టెక్కించేదే దువా. ఇది ఆరాధనలకు ఆయువులాంటిది. అల్లాహ్‌ను వేడుకోవడం, అల్లాహ్‌ను అర్థించడం దైవారాధనకు నిదర్శనం. దేవుడి సముఖంలో అసహాయతను, దాస్యభావాన్ని వ్యక్తం చేయడం కూడా ఆరాధనే! మనం ఎక్కడున్నా, ఏ రోజైనా, ఏ సమయంలో అయినా దువా చేసుకోవచ్చు. దాసుడికి, దైవానికి మధ్య బంధం దువాతోనే పటిష్టమవుతుంది.

'దువా' వేడుకోలు విశ్వాసి చేతిలో వజ్రాయుధం వంటిది. అన్ని మార్గాలు మూసుకుపోయినప్పుడు, అన్ని ఆధారాలు కోల్పోయినప్పుడు, అన్ని ఆశలు అడుగంటిపోయినప్పుడు దువా రక్షణగా నిలుస్తుంది. ఏ కార్యం తలపెట్టినా ప్రణాళిక ప్రకారం చేపట్టాలి. శక్తియుక్తులన్నీ లక్ష్యసాధనకు ధారపోయాలి. ఆపై దైవాన్ని సహాయం అర్థించాలి. మనం అనుకున్న లక్ష్యాలు, ఆశయాలు సిద్ధించాలంటే ప్రయత్నం, ప్రణాళికలు మాత్రమే సరిపోవు. దువా కూడా అవసరమే. మహాప్రవక్త (స) జీవితం ఈ విషయాన్నే తెలియజేస్తుంది. బద్ర్ సంగ్రామంలో గెలుపు కోసం ప్రవక్త (స) చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసి, వనరులన్నీ సమకూర్చుకొని తర్వాత దువా చేశారు. ఆయన అర్థించిన ప్రతిసారీ.. దైవం జవాబు పలికాడు. ఒకసారి ముగ్గురు మిత్రులు కలిసి ఒక గుహలో తలదాచుకున్నారు. అనుకోకుండా పర్వతం పైనుంచి ఒక పెద్ద బండరాయి జారి గుహ ముఖద్వారానికి అడ్డుగా పడింది.



బయటకు వచ్చే మార్గం లేదు. అప్పుడు ఆ ముగ్గురూ తమ జీవితాలలో చేసుకున్న పుణ్యకార్యాలను సాక్షిగా ఉంచి దువా చేశారు. అల్లాహ్ వాటిని స్వీకరించాడు. వారికి మార్గం కల్పించాడు. మనం కూడా మన జీవితంలో నిత్యం పుణ్యకార్యాలను చేస్తూ.. అల్లాహ్‌ను వేడుకుందాం. నిజమైన ముస్లిమ్‌కు దువాలను మించిన ఆయుధం లేదన్నది తిరుగులేని వాస్తవం.

– ఖైరున్నీసాబేగం

సన్మార్గమనేది మనిషి జీవన ధనం. సన్మార్గంలో నడిచే వాడికి ధనధాన్యాలు లేకున్నా.. సమస్త సంపదలూ ఉన్నట్టే. సన్మార్గం, సజ్జన సాంగత్యం, ఉత్తమ సంస్కారాలే అసలైన సంపదలు. ఈ గుణాలు ఉన్నవారు కష్టాలు ఎదురైనా విచలితులు కారు. చివరికి విజేతలుగా నిలుస్తారు.

- గౌతమ బుద్ధుడు



ఆరు ప్రశ్నలు...

అనంత కోటి సమాధానాలు!



ప్రశ్నకు ఉన్నంత బలం మరిదేనికీ లేదు.

ప్రశ్న ఉదయిస్తే సమాధానం దొరికేదాకా శక్తినంతా కూడదీసుకుని ప్రయత్నిస్తూనే ఉంటాడు మనిషి. ఇక్కడ కూడా ఓ మనవడు తన తాతను ఓ ఆరు ప్రశ్నలడిగాడు. అడగడానికి ముందు ఆ మనవడు ప్రపంచాన్ని చాలా వరకు గమనించాడు. అలా గమనించేటప్పుడు ఆయన మనసులో చొరబడ్డవే ఆ ఆరూ. జీవితంలో తాను విన్నవీ, కన్నవీ, సంపూర్ణంగా తన అనుభవంలోకి వచ్చినవీ గుదిగుచ్చి సాధికారికంగా ఆ ఆరు ప్రశ్నలకు సమాధానంగా చెప్పాడా తాత. ఆ సంభాషణ సారాంశమే అనంత అక్షర నిధులుగా భక్తులు భావించే విష్ణు సహస్ర నామాలు. ఈ వెయ్యీ మామూలు పేర్లు కావు. మహర్షులు జ్ఞాన సమాధిలో ఉన్నప్పుడు చెప్పినవేనని భావిస్తారు. వేద ప్రామాణ్యంలో ఉపనిషత్తులకుండే గౌరవం వీటికి ఉంటుంది. ఆ ప్రశ్నలడిగిన మనవడే ధర్మరాజు. ఆ మహామృతాన్ని సర్వ మానవాళికి పంచిన తాత పేరే భీష్ముడు. చదివినా, విన్నా జీవితానికి ఓ దోవ దొరికేస్తుందని భీష్మాచార్యుడు చెబుతారు. అంత నిక్కచ్చిగా చెప్పడం వెనక భీష్మాచార్యుడి సుదీర్ఘ జీవనయాన అనుభవ సారమంతా ఇమిడి ఉంది.

అంపశయ్యపై ఉన్న భీష్ముడు అనేక జీవిత సత్యాలను, ధర్మాధర్మ విచక్షణ పద్ధతులను ధర్మరాజుకు వివరించాడు. ఈ క్రమంలో అసలు సిసలైన జ్ఞాన సారాన్ని తెలుసుకోవాలనుకున్న ధర్మరాజు భీష్మాచార్యుడిని ఈ ప్రశ్నలడిగాడు. వ్యాసమహాభారతంలో విష్ణు సహస్రనామ స్తోత్రం పూర్వ పీఠికలో ఉన్న రెండు శ్లోకాల్లో ఇవి మనకు కనిపిస్తాయి.

"కిమేకం దైవతంలోకే కిం వాప్యేకం పరాయణమ్
స్తువన్తః కం కమర్చన్తః ప్రాప్నుయు ర్మానవాశ్శుభం"

ఈ శ్లోకంలో నాలుగు ప్రశ్నలు కనిపిస్తాయి. ఈ లోకంలో ఉన్న ఏకైక దేవుడెవరు? మనుషులు పొందదగిన ఏకైక మహోన్నత స్థానమేది? ఏ దేవుడిని స్తుతించడం వల్ల మనిషి సర్వ శుభాలను పొందుతున్నాడు? ఏ దేవుడిని పూజించడం వల్ల శుభాలు కలుగుతాయి?

వీటికి అదనంగా మరో రెండు ప్రశ్నలు మరో శ్లోకంలో కనిపిస్తాయి.

"కోధర్మః సర్వధర్మాణాం భవతః పరమోమతః
కింజపన్ ముచ్యతేజంతుః జన్మ సంసార బంధనాత్"

అన్ని ధర్మాలకంటే ఉత్తమమైన మహాధర్మం ఏది? దేన్ని జపిస్తే మనుషులు సర్వ కర్మ బంధాల నుంచి విముక్తి చెందుతారు? అనే ఆరు ప్రశ్నలను విన్న భీష్మాచార్యుడు సమాధానాలు చెప్పడం ప్రారంభించాడు. ఆ సమాధానాల్లో దేవదేవుడు ధర్మరక్షణ కోసం అవతరించిన విశేషాలన్నీ కనిపిస్తాయి. ఆ నామాల్లో భక్తుడు కేవలం భక్తితో స్వామిని స్మరించడమే కాకుండా, తనకు తాను ఆపాదించుకోదగ్గ మార్గదర్శక సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయి. విష్ణు సహస్రనామావళి తొలి శ్లోకంలోనే ఒక విశ్వమానవ సమైక్యతా సూచన కనిపిస్తుంది.

విష్ణుసహస్ర నామశ్లోకాలను అర్థసహితంగా తెలుసుకుంటే తోటి మనిషిలో తాను పూజించే ఆ దేవుడిని చూడగలిగిన శక్తి సంక్రమిస్తుంది. తనలోనూ, ఎదుటి వారిలోనూ ఉన్నది ఒకటే పరమాత్మ అని తెలుసుకోగలిగినప్పుడు అందరినీ ప్రేమించడం, పూజించడం అలవాటవుతుంది. కక్షలు, కార్పణ్యాలు దగ్గరకు రావు. ఈ నామాలను పారాయణ చేసేటప్పుడు కేవలం ఉచ్చరించడమే కాదు మనస్ఫూర్తిగా ఆ లక్షణాలను అలవాటు చేసుకోగలిగితే సమాజమంతా సంస్కారవంతమవుతుంది.

'విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్య భవత్ప్రభుః
భూతకృద్భూతభృద్భావో భూతాత్మాభూత భావనః'

విశ్వాకారుడు...దేవదేవుడు ప్రపంచమంతా వ్యాపించి ఉన్నవాడు ఆయనే. భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలకు ప్రభువు ఆయనే. అచ్చంగా సత్యస్వరూపుడే ఆయన. ప్రత్యేకించి ఈ నామాల్లో సామాజిక సందేశానికి అనుగుణంగా అనేక క్రియా విశేషాలు మనకు కనిపిస్తాయి. 923వ నామం 'ఉత్తారణః' నుంచి 931వ నామం 'పరవస్థితః' దాకా ఉన్న వాటిని గమనిస్తే ప్రతి మనిషీ అన్వయించుకోదగ్గ అంశాలున్నాయి.

25న భీష్మాష్టమి

'ఉత్తారణో దుష్కృతిహా పుణ్యోదుఃస్వప్న నాశనః
వీరహా రక్షణః సంతో జీవనః పర్యవస్థితః'

వీటిలో ఉత్తారణః అనే నామాన్ని విశ్లేషిస్తే ఆర్తితో కొలిచే వారిని ఉద్ధరించేవాడని అర్థం. ఆర్తభక్తి ఏ జీవిలో ఉన్నా సరే విష్ణువు ఉద్ధరించి తీరుతాడంటుంది ఈ నామం. గజేంద్రమోక్షం ఘట్టంలో గజేంద్రుడు నీవే తప్ప 'ఇతఃపరంబెరుంగ' అని తనను తాను భగవంతుడికి సమర్పించుకుని రక్షించమన్నాడు. భక్తిలో గర్వాహంకారాలు ఉండకూడదు. సర్వశరణాగతి, ఆర్తి ఉండాలని ఈ ఘట్టం చెబుతుంది. 'దుష్కృతిహా' అనే నామానికి అర్థం పాపాలను, దుర్మార్గాన్ని నశింపజేసేవాడని అర్థం. 'పుణ్యం' అనే నామాన్ని తరచి చూసినా గొప్ప సందేశమే కనిపిస్తుంది. ఈ నామానికి అర్థం పుణ్యకార్యాలకు ప్రేరేపించేవాడని, పుణ్యస్వరూపుడు అని... పుణ్యకార్యాలంటే సర్వమానవాళికీ మేలు చేసే పనులే. 'దుస్స్వప్న నాశనః' అనేది మరో నామం. మనిషిలో భయం ఏర్పడినా తాను బలహీనుడిని అనే భావం కలిగినప్పుడు అలాంటి భావనలే కలలుగా వచ్చి కలతపెడతాయి. వాటిని జయించాలి. భగవంతుడి స్మరిస్తూ పట్టుదలతో బలం పుంజుకోవాలి.

భారతీయ సనాతన సంప్రదాయంలో భగవద్గీతకున్న విలువ, శక్తి అందరికీ తెలిసిందే. మానవాళికి కర్తవ్యాన్ని బోధించిన మహోన్నత ఘట్టం భగవద్గీత. అంతకంటే మహా శక్తిమంతమైంది విష్ణు సహస్ర నామావళి అని ఆదిశంకరాచార్యులు కూడా చెప్పారు. ఈ స్తోత్రాలకు మానవాళిని చైతన్యపరిచే దివ్యశక్తి ఉందన్నారాయన. ధర్మరాజు అడిగిన ఆరు ప్రశ్నలకూ భీష్ముడు ఇచ్చిన సమాధానం మనిషి జీవితానికి సన్మార్గదర్శిగా నిలిచింది.

– యల్లాప్రగడ మల్లికార్జునరావు

క్రీస్తువాణి

ఏది గొప్ప విందు?



ఒక పెద్దాయనకు తన జీవితంలో ఎన్నో శుభాలు కలిగాయి. తన ఆనందాన్ని సన్నిహితులతో పంచుకోవాలని ఒక విందు ఏర్పాటు చేశాడు. స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులను విందుకు ఆహ్వానించాడు. రుచికరమైన వంటలు చేయించాడు. విందు జరిగే వేదికను అందంగా అలంకరణ చేయించాడు. విందుకు వస్తున్న అతిథులకు స్వయంగా స్వాగతం పలకాలని ఎదురుచూస్తున్నాడు. సమయం మించిపోతున్నా.. ఒక్క అతిథీ రాలేదు. వంటకాలు రుచి కోల్పోతాయని ఆ పెద్దాయనకు ఆందోళన కలిగింది. 'అతిథులు ఎందుకు రాలేదో..' వాకబు చేశాడు. వారంతా ఒక ప్రముఖుడి ఇంట్లో విందుకు వెళ్లారని తెలిసింది. వెంటనే ఆ పెద్దాయన తన కొడుకులను పిలిచాడు. 'మీరు వీధిలోకి వెళ్లి యాచకులను, దివ్యాంగులను, శ్రమించలేని వృద్ధులను తీసుకురండి' అని అన్నాడు. మరుక్షణంలో విందు జరిగే ప్రాంగణమంతా నిండిపోయింది. అంతా తృప్తిగా భోజనం చేశారు. పెద్దాయనకు చాలా ఆనందం కలిగింది. తన ఇంట్లో మరో శుభం జరిగిందని సంతోషించాడు.

ఇలాంటి కథే.. క్రీస్తు ప్రభువు తన శిష్యులకు చెప్పాడు. "మీరు విందుకు అతిథులను ఆహ్వానించేటప్పుడు.. మీ స్నేహితులను, బంధువులను పిలవద్దు. ఆ క్రమంలో వాళ్లు తిరిగి మిమ్మల్ని విందుకు పిలుస్తారు. అలాకాకుండా.. ఏమీ లేనివారిని, పేదలను, వికలాంగులను పిలిస్తే.. వారు తిరిగి మిమ్మల్ని పిలవరు. ఏ ఉపకారం ఆశించకుండా.. సహాయం చేసేవారే గొప్పవారు. వారికే దేవుని రాజ్యంలో ప్రవేశం" అని ఉపదేశించాడు. ఆకలితో అలమటించే వారికి భోజనం పెట్టడం ఎంత గొప్ప విందో.. మాటల్లో చెప్పలేం.

– ఎమ్. సుగుణరావు

ఈనాడు సినిమా

కొత్త రుచులు కోరినన్ని!

ఎంత రుచిగా ఉన్నా రోజూ ఒకే రకమైన వంట అంటే పెదవి విరిచేస్తాం. సినిమా అంతే! ఒకే రకమైన దినుసులతో కూడిన సినిమా వంటకమంటే... ఎంత బాగున్నా ప్రేక్షకుడికి మొహం మొత్తేయడం ఖాయం. ఎప్పుడూ అవే కథలా? అనేస్తాడు. ఎప్పటికప్పుడు కొత్త తరహా కథలు తెరకెక్కుతుంటేనే సినిమాలపై ఆసక్తి ఏర్పడుతుంది. మన చిత్రసీమ ఆ విషయాన్ని అంతగా పట్టించుకొనేది కాదు. ఒక సినిమా విజయం సాధించిందంటే అవే కొలతలో మరో పది చిత్రాలు పట్టాలెక్కేవి. మూస ధోరణిలో సినిమాలు తీయడంలో తెలుగు చిత్రసీమ ముందు వరసలో ఉండేది. కానీ ఈమధ్య పంథా మారింది. తెలుగు దర్శకులు కొత్త రకమైన కథలతో సినిమాలు చేస్తున్నారు. దాంతో ప్రేక్షకులు కొత్త రుచుల్ని మనసారా ఆస్వాదిస్తున్నారు.



బాలకృష్ణ

నాగార్జున

ప్రభాస్

మహేష్‌బాబు

అల్లు అర్జున్

రామ్‌చరణ్

నాగచైతన్య

నిత్యమేనన్

కీర్తి సురేష్



కొత్త రకమైన సినిమా అంటే అదో సాహసోపేతమైన విషయంగా భావించేవాళ్లు దర్శకనిర్మాతలు. మన ప్రేక్షకుడు ఆదరిస్తాడో లేదో అనే సందేహాలు వాళ్లని వెంటాడేవి. దాంతో ఎందుకొచ్చిన తంటా అంటూ అలవాటైన ఫార్ములాతోనే సినిమాలు తీసేవాళ్లు. ప్రేక్షకులూ 'మన సినిమాల నుంచి ఇంతకంటే ఏం ఆశించగలం' అన్నట్టుగా వాటినే చూసేవాళ్లు. దాంతో ఏ సినిమా చూసినా అదే హీరోయిజం, అదే యాక్షన్, అదే కథ. తారలు మారేవాళ్లంతే. అలాంటి చిత్రసీమలో ఒక్కసారిగా ఊహించని మార్పు. కొత్త రకమైన కథలతో విరివిగా సినిమాలు. వాటికి అదే స్థాయిలో ప్రేక్షకాదరణ. అలా గతేడాది తెలుగు చిత్రసీమ వెలిగిపోయింది. చిరంజీవి 150వ సినిమాగా తన మార్క్ సందేశంతో వాణిజ్య చిత్రం 'ఖైదీ నంబర్ 150' చేస్తే, బాలకృష్ణ వందో చిత్రంగా చరిత్రాత్మక కథతో 'గౌతమీపుత్ర శాతకర్ణి' చేశారు. వెంకటేష్ 'గురు' రూపంలో ఓ స్పోర్ట్స్ డ్రామా కథని చేస్తే, నాగార్జున 'ఓం నమో వేంకటేశాయ', 'రాజుగారి గది 2' చేశారు. ఒకటి భక్తి ప్రధానమైన చిత్రమైతే, మరొకటి కామెడీ హారర్ సినిమా.

సీనియర్లే అంత వైవిధ్యంగా ప్రయాణం చేస్తే, ఇక యువ కథానాయకుల జోరు మామూలుగా ఉంటుందా? అందుకే పొలిటికల్ థ్రిల్లర్లు, ప్రేమకథలు, కుటుంబ కథా చిత్రాలు, యాక్షన్ డ్రామా కథలు, యుద్ధ నేపథ్యమున్న చిత్రాలు, చారిత్రాత్మకం, రొమాంటిక్ కామెడీ కథలు, థ్రిల్లర్లు... ఇలా రకరకాల సినిమాలు వచ్చాయి. 'బాహుబలి: ది కన్‌క్లూజన్', 'అర్జున్‌రెడ్డి', 'ఫిదా', 'నిన్ను కోరి', 'శతమానం భవతి', 'నేనే రాజు నేనే మంత్రి', 'గరుడవేగ', 'మెంటల్ మదిలో', 'ఒక్కక్షణం'... ఇలా వైవిధ్యమైన చిత్రాల జాబితాలో పలు సినిమాలు కనిపిస్తాయి. గతేడాది అందిన విజయాల్ని స్ఫూర్తిగా తీసుకొన్న చిత్రసీమ ఈసారీ అదే పంథాలో ప్రయాణం చేస్తోంది. సెట్స్‌పై ఉన్న పలు చిత్రాలు కొత్త రుచులపై ఆశలు రేకెత్తిస్తున్నాయి.

ప్రేక్షకులు తొందరగా కనెక్ట్ అయ్యే విషయాల్లో రాజకీయం ఒకటి. ఆ నేపథ్యంలో ఆకట్టుకొనేలా కథలు రాసుకోవాలి కానీ... విజయాలు అందుకొనే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. మహేష్‌బాబు ఈ ఏడాది రాజకీయ నేపథ్యంతో కూడిన ఓ చిత్రం చేస్తున్నారు. అదే 'భరత్ అను నేను'. ఇందులో మహేష్ ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. దర్శకుడు కొరటాల శివ వాణిజ్యాంశాలకి తోడు సందేశాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు చిత్రవర్గాలు చెబుతున్నాయి. 'దూకుడు'లో మహేష్‌బాబు కాసేపు ఎమ్మెల్యేగా కనిపించి అలరించడంతో పాటు.. ఆ పాత్రలోనే చక్కటి వినోదాన్ని పంచారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో రాజకీయ నేపథ్యంతో కూడిన 'భరత్ అను నేను'లో నటిస్తుండడంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. కల్యాణ్ రామ్ కూడా 'ఎమ్.ఎల్.ఎ'గా సందడి చేయబోతున్నాడు. 'మంచి లక్షణాలున్న అబ్బాయ్...' అని ఉపశీర్షిక ఉన్నప్పటికీ ఇది రాజకీయంతో కూడిన వినోదాత్మక చిత్రం. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్‌లో కల్యాణ్‌రామ్ రాజకీయ నాయకుడి తరహాలో ఖద్దరు దుస్తులతో ప్రచారం చేస్తూ కనిపించారు.

హిందీలో జీవిత కథలతో వచ్చిన చిత్రాలు చక్కటి ఆదరణ పొందుతుంటాయి. ఈ ఏడాది తెలుగులోనూ ఆ తరహా చిత్రాల జోరు కనిపించబోతోంది. ఎన్టీఆర్ జీవితకథతో ఆయన వారసుడు బాలకృష్ణ ప్రధాన పాత్రధారిగా ఓ చిత్రం చేస్తున్నారు. తేజ దర్శకత్వం వహిస్తున్న ఆ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లబోతోంది. రామ్‌గోపాల్ వర్మ కూడా ఎన్టీఆర్ జీవితంపై ఓ చిత్రం చేస్తానంటున్నారు. అలాగే ప్రముఖ నటి సావిత్రి జీవితం ఆధారంగా 'మహానటి' తెరకెక్కుతోంది. కీర్తి సురేష్, సమంత ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ జీవితకథని సుధీర్‌బాబు కథానాయకుడిగా ప్రవీణ్ సత్తారు తెరకెక్కించబోతున్నారు. చిరంజీవి నటిస్తున్న 'సైరా నరసింహారెడ్డి' చిత్రానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితమే స్ఫూర్తి. అయితే ఈ చిత్రాన్ని ఓ చారిత్రాత్మక గాథగా తెరకెక్కిస్తున్నారు. ఈ కథలన్నీ ప్రేక్షకుల్ని ఊరిస్తున్నాయి. రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రంగస్థలం' కూడా కొత్త రుచిని పంచబోతోందని ఆ సినిమా వర్గాలు చెబుతున్నాయి. 1985 నేపథ్యంలో సాగే ఓ పల్లెటూరి కథతో సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. చిట్టిబాబుగా రామ్‌చరణ్ లుక్కే కొత్తదనాన్ని పంచుతోంది. అనుష్క 'భాగమతి'గా సరికొత్త పాత్రలో అలరించనుంది.

హాలీవుడ్‌లో రూపుదిద్దుకొనే బాండ్ సినిమాల్ని చూసి మురిసిపోతుంటాం. ప్రభాస్ 'సాహో'తో తెలుగులోనే ఆ అనుభూతిని పంచబోతున్నారు. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న 'సాహో' ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. అత్యున్నత సాంకేతికతతో రూపొందుతున్న ఆ చిత్ర కథ, నేపథ్యంపై ప్రేక్షకులు ఆసక్తిగా చర్చించుకొంటున్నారు. కచ్చితంగా కొత్త అనుభూతిని పంచే చిత్రంగా భావిస్తున్నారంతా. అల్లు అర్జున్ మిలటరీ నేపథ్యంలో 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చేస్తున్నారు. ఎక్కువగా మాస్ కథల్లోనే నటిస్తున్న ఆయన ఈసారి తన గెటప్‌ని మార్చి ఓ సైనికుడి అవతారమెత్తారు. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాకి సంబంధించిన టీజర్ ఇటీవలే విడుదలైంది. అందులో బన్నీ కనిపించిన విధానం కొత్తగా ఉంది. రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్ కథని చేస్తున్నారు నాగార్జున. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య చేస్తున్న 'సవ్యసాచి' కథ గురించీ ఆసక్తికరంగా చర్చ నడుస్తోంది. తన ఆధీనంలో లేని ఓ చేయి కథతో ఆ చిత్రం తెరకెక్కుతోంది. నాని స్వయంగా నిర్మాతగా మారి 'అ!' చిత్రం చేస్తున్నారు. నాని ఓ చేపగా, రవితేజ ఓ చెట్టుగా సందడి చేయనున్న ఆ చిత్రంలో నిత్యమేనన్, కాజల్, ఇషా రెబ్బా ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. ఇప్పటిదాకా చూడని ఓ కొత్త రకమైన చిత్రమని కచ్చితంగా చెబుతా అంటున్నారు నాని. ఇలా కథానాయకులు, దర్శకులు కొత్త కథలతోనే ప్రయాణం చేయడానికి ఆసక్తి చూపుతుండడం మంచి పరిణామం. యువ దర్శకుల ఆలోచనల ప్రభావం పరిశ్రమపై స్పష్టంగా కనిపిస్తోందని, ఆ ప్రభావంతోనే కొత్త కథలు విరివిగా వెలుగులోకి వస్తున్నాయనేది సినీ పండితుల అభిప్రాయం.

ప్లాఫ్‌లు గర్వపడేలా చేశాయి!



శ్రుతిహాసన్

శ్రుతి హాసన్... పుట్టింది, పెరిగింది సినిమాల్లోనే. ఇప్పుడు జీవిస్తున్నది సినిమాలతోనే. కానీ సినిమా తన జీవితాన్ని ఏ విధంగానూ ప్రభావితం చేయలేదు అంటోంది శ్రుతి హాసన్. "సినిమా అనేది ఓ కళ మాత్రమే. ఆ కళ అంటే నాకు ఇష్టం కాబట్టి సినిమాల్లో నటిస్తున్నాను. అంతే కానీ నా జీవితాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. కమల్‌హాసన్ కూతురిగా ఎప్పుడూ బతకలేదు. నేనూ ఓ సాధారణ అమ్మాయిలానే ఉండేదాన్ని. నాకు స్నేహితులు, సరదాలు అన్నీ ఉండేవి. నటన నా వ్యక్తిగత జీవితానికి ఎప్పుడూ అడ్డు రాలేదు"అని చెప్పింది శ్రుతి. ఈ భామకు విజయాలతో పాటు పరాజయాలు దక్కాయి. "పరాజయాల్ని నేను ఎప్పుడూ పట్టించుకోలేదు. ఫ్లాఫ్ సినిమాలు కూడా గర్వపడేలా చేశాయి. సినిమా ఫ్లాఫ్ అయినా నా పాత్రకు మంచి పేరే వచ్చింది. సినిమా పరాజయానికి నేను ఒక్కదాన్నే కారణం కాదు. బోలెడన్ని కారణాలుంటాయ"ని చెప్పింది శ్రుతిహాసన్.

నిజమని నమ్ముతుంది!



మంచు లక్ష్మి

మంచు లక్ష్మి ప్రధాన పాత్రధారిగా నటిస్తున్న చిత్రం 'వైఫ్ ఆఫ్ రామ్'. విజయ్ యలకంటి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకి 'వైఫ్ ఆఫ్ రామ్' అనే పేరును ఖరారు చేశారు. అబద్ధాలని నిజమని నమ్మే మహిళ పాత్రలో మంచు లక్ష్మి నటిస్తున్నారు. "మానవ సంబంధాలకి పెద్దపీట వేస్తూ తెరకెక్కించిన చిత్రమిది. రాజమౌళి దగ్గర 'ఈగ', 'బాహుబలి: ది బిగినింగ్' చిత్రాలకి సహాయ దర్శకుడిగా పని చేసిన విజయ్ యలకంటి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇందులో మంచు లక్ష్మి పాత్ర భిన్నంగా, సహజంగా సాగుతుంది" అన్నారు. సామ్రాట్‌రెడ్డి, ఆదర్శ్ బాలకృష్ణ, శ్రీకాంత్ అయ్యర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

మన సంతోషాన్ని పది మందితో పంచుకుంటేే బాగుంటుంది. కానీ బాధల్ని పంచి బాధ పెట్టకూడదు!

చిత్రం: శతమానం భవతి - పంపినవారు: జాటోత్ రంగి బాయి నాయక్, ధర్మపురం, జనగామ

ఆ ప్రశ్నలు హీరోల్నీ ఎందుకు అడగరు!

సోనమ్‌కపూర్‌కు వ్యక్తిగత విషయాలు పంచుకోవడం అస్సలు నచ్చదు. వ్యక్తిగత జీవితం గురించి ఏది అడిగినా కాస్త రుసరుసలాడుతూనే సమాధానమిస్తుంది. ఆనంద్ ఆహుజాతో వేసవిలో ఆమె పెళ్లి దాదాపు ఖాయమని బాలీవుడ్ సమాచారం. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో సోనమ్ వద్ద పెళ్లి ప్రస్తావన తీసుకొస్తే... "బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌లు ఈ ప్రశ్నను ఎదుర్కోవడం తప్పడం లేదు. అయినా ఇదే ప్రశ్నను రణ్‌బీర్‌కపూర్, రణ్‌వీర్ సింగ్ లాంటి వాళ్లను ఎందుకు అడగరు? అయినా నా పెళ్లి ప్రస్తావన తెస్తే నాతో పాటు ఇంకొకరికి గురించీ మాట్లాడాల్సి వస్తుంది. ఇంకొకరి వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడే హక్కు నాకు లేదు" అని చెప్పింది. హీరోయిన్‌ల జీవితం పెళ్లికి ముందు, పెళ్లికి తర్వాత అని విభజించేలా ఉంటుంది. పెళ్లి అయ్యాకా అవకాశాలు తగ్గుతాయి. ఇక తల్లి అయితే చాలామంది సినిమాలకు స్వస్తి చెప్పేసిన సందర్భాలే ఎక్కువ. రాణీ ముఖర్జీ, కరీనాకపూర్, ఐశ్వర్యరాయ్ లాంటి కొద్దిమందే తల్లయ్యాకానూ నాజూగ్గా మెరిపిస్తున్నారు. ఈ విషయమై సోనమ్ స్పందించింది. "పెళ్లైనా అగ్ర హీరోలుగా కొనసాగుతున్న వాళ్లని కూడా 'పెళ్లయ్యాకా మీకు అవకాశాలు ఎలా ఉన్నాయి? తండ్రయ్యాకా మళ్లీ ఎప్పుడు రీ ఎంట్రీ ఇస్తారు?'.. ఇలాంటి ప్రశ్నలు అడిగితే బాగుంటుంది. వాళ్లని ఎవరూ అడగరు. ఆ ధోరణి మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పెళ్లి తర్వాత కూడా వెండితెరపై తమదైన ముద్ర వేసిన నాయికలు మనకు ఎంతోమంది ఉన్నారు. కొంత మంది దర్శకనిర్మాతల నుంచీ పెళ్లయిన నాయికలకు మంచి ప్రోత్సాహం లభిస్తుంది. ఇలా ఆలోచించే వాళ్ల సంఖ్య పెరిగితే నాయికలకు కలిసొచ్చే కాలమే"అని చెప్పింది సోనమ్ కపూర్.



సోనమ్ కపూర్


పాత్ర కోసం అలా చేయడం తప్పలేదు



ఆశిష్ రాజ్

"నిజ జీవితంలో సిగరెట్ తాగని నేను ఈ సినిమా కోసం పొగతాగాల్సి వచ్చింద"న్నారు ఆశిష్ రాజ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇగో'. సుబ్రహ్మణ్యం ఆర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఆశిష్ రాజ్ విలేకర్లతో మాట్లాడుతూ "ఈ చిత్రంలో అమలాపురం అబ్బాయి గోపి పాత్రని పోషించా. ఇందుగా సిమ్రన్ నటించింది. మాలోని అహం మా ప్రేమకి విఘాతం కలిగిస్తుంది. దాంతో ఇందుకు దూరంగా పట్నం వెళిపోతాను. అక్కడ దురలవాట్లకి బానిసలైనవారిని చూసి చలించిపోతాను. వారిలో మార్పును తీసుకురావడానికి గోపీ పాత్రలో నేను ఏం చేశాను? మా ప్రేమని ఎలా నిలబెట్టుకోగలిగాను అనే అంశాలు సినిమాలో ఆసక్తికరం. ఈ ప్రేమకథని అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించారు. పాటలే కాదు సినిమా కూడా ఆద్యంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. సాయి కార్తిక్ సంగీతం సినిమాకి ప్రాణం. కథానుగుణమైన పాత్రలను రావు రమేష్, పోసాని, పృథ్వీ, దీక్షాపంత్, అజయ్, శంకర్ పోషించారు. నా తొలి సినిమా 'ఆకతాయి'లో ప్రత్యేకగీతం ఉంది. ఈ రెండో సినిమాలోనూ ఉంది. ప్రత్యేక గీతంలో ఖైరాదత్ ఆడిపాడింది. నేనూ ఖైరాతో కలిసి స్టెప్పులేశాను. మాస్ ప్రేక్షకుల్ని అన్ని అంశాలున్న చిత్రమిద"ని చెప్పాడు. తన తర్వాత చిత్రాల గురించి మాట్లాడుతూ "నేను నటుడిగా ఎదగాలని నా మేనమామలు రెండు సినిమాలు తీశారు. నా మూడో సినిమాని బయటి నిర్మాతలతో చేస్తాను. అందుకు సంబంధించిన కథాచర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఆ వివరాలను వెల్లడిస్తాను"అని చెప్పాడు ఆశిష్.


గుండు వెనుక కథ!



అక్షయ్‌కుమార్

కథ నచ్చాలే కానీ ఎలాంటి పాత్రలో నటించేందుకైనా సిద్ధంగా ఉంటాడు బాలీవుడ్ కథానాయకుడు అక్షయ్‌కుమార్. ఈ నెల 25న విడుదలకానున్న తన తాజా చిత్రం 'ప్యాడ్ మ్యాన్' ప్రచారంలో తీరికలేకుండా గడిపేస్తున్నాడు అక్షయ్. ఈ ప్రచారంలో భాగంగా ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ్‌ను చూసి ప్రేక్షకులు అవాక్కయ్యారు. దీనికి కారణం ఆయన గుండుతో దర్శనమివ్వడమే. అక్షయ్ ఆరోగ్యం సరిగా లేక ఆయన తలకు శస్త్రచికిత్స జరిగిందంటూ పుకార్లు వచ్చాయి. ఎట్టకేలకు అక్షయ్ తన గుండు గురించి స్పష్టత ఇచ్చాడు. ఇదంతా తన తదుపరి కొత్త చిత్రం 'కేసరి' కోసమని చెప్పాడు అక్షయ్. ఈ కొత్త కథలో భాగంగా సినిమా మొత్తం అక్షయ్ భారీ తలపాగా ధరించాల్సి ఉందట.. దీనివల్ల జుట్టు ఉంటే చెమటతో తలంతా చిరాకుగా ఉండటంతో పాటు నటించేటప్పుడు ఇబ్బందిగా ఉంటుందని భావించి గుండు చేయించుకున్నానని చెప్పాడు అక్షయ్. ఇది ఆయన గుండు వెనుక రహస్యం.

స్కెచ్ దేనికోసం?



సోఫియా

రవి చావలి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సూపర్ స్కెచ్'. బలరామ్ మక్కల నిర్మాత. నర్సింగ్, ఇంద్ర, సమీర్ దత్త, కార్తీక్, చక్రి మాగంటి, అనిక, సుభాంగీ, సోఫియా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "హత్యోదంతం నేపథ్యంలో సాగే చిత్రమిది. ఒక పోలీసు అధికారి, ఒక విదేశీ అమ్మాయి, నలుగురు నేరస్థుల చుట్టూ తిరుగుతుంది. సన్నివేశాలన్నీ ఊహించని సంఘటనలతో ఉత్కంఠ భరితంగా సాగుతాయి. ఈ కథలో ఎవరు ఎందుకోసం స్కెచ్ వేశారన్నది తెరపైనే చూడాలి. చిత్రీకరణ పూర్తయింది. వచ్చే నెలాఖరున కానీ, మార్చిలో కానీ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. సంగీతం: కార్తీక్ కొడకండ్ల, సమర్పణ: ఎరోస్ సినిమా.

ఫ్రిజ్‌లో జీన్స్



కాలేజీకి వెళ్లే ప్రతి అమ్మాయి ఇప్పుడు జీన్స్‌నే సౌకర్యంగా భావిస్తోంది. కుర్తీ, టీషర్ట్, చొక్కా ఇలా దేనిమీదకైనా చక్కగా నప్పే జీన్స్ ఎక్కువ కాలం మన్నాలంటే...

- జీన్స్ వేసుకున్న ప్రతిసారీ ఉతికేస్తున్నారా? వద్దు. కాసేపు గాలికి ఆరనిచ్చి మడతబెట్టేయండి. ఇలా రెండు మూడు సార్లు చేశాక ఉతకండి. ఎన్నాళ్లయినా కొత్తగా కనిపిస్తుంది.
- జీన్స్‌ని ఎక్కువ కాలం భద్రపరచాల్సి వస్తే తప్పనిసరిగా దాన్ని ప్లాస్టిక్ కవరులో ఉంచి కాసేపు ఫ్రిజ్‌లో పెట్టి ఆ తరువాత ఇస్త్రీచేయాలి. ముడతలు పడవు. ఎక్కువ కాలం మన్నుతుంది.
- జీన్స్‌ను నానబెడుతుంటే చన్నీళ్లు వాడాలి. అందులో కొద్దిగా ఉప్పు, చెంచా నిమ్మరసం కలపాలి. ఇలా చేస్తే రంగు పోకుండా ఉంటుంది. అలాగే ఉతుకుతున్నప్పుడు బరువుగా ఉందని నేలకేసి బాదడం సరికాదు. మురికిపోయినా రంగు త్వరగా పోవచ్చు. నాణ్యతా తగ్గుతుంది. కాబట్టి చేత్తో ఉతకడానికే ప్రాధాన్యం ఇవ్వాలి.
- జీన్స్ ఎలాంటిదయినా కొత్తగా కనిపించాలంటే... ఉతికాక ఫ్యాబ్రిక్ కండిషనర్‌ని ఉపయోగించడం తప్పనిసరి.

అప్పుడు హాయిగా నవ్వేద్దాం



ఏదయినా పని కాకపోతే వెంటనే కుంగిపోతాం. ఆత్మవిశ్వాసం కూడా తగ్గిపోతుంది. అలాగని బాధపడితే ప్రయోజనం ఏముంటుందీ... అందుకే మళ్లీ ఆత్మవిశ్వాసంతో, ధైర్యంతో ఏ పనయినా చేయడానికి ప్రయత్నిద్దాం. అదెలా సాధ్యమవుతుందంటే...

- దుస్తులతో ప్రారంభిద్దాం. బాగా బాధగా ఉన్నప్పుడు మీకు ఇష్టమైన, బాగా నప్పే, సౌకర్యంగా ఉన్న దుస్తులు వేసుకోవాలి. ఇవాళ బాగున్నావు అనే ప్రశంస మీలో తెలియకుండానే ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.
- వీలైనంతవరకూ నవ్వుతూ ఉండాలి. అలాంటి వాతావరణాన్ని కల్పించుకోండి. ఈ చిన్న పని మిమ్మల్ని ఉల్లాసంగా మారుస్తుంది. మీ మనసులో ఏదైనా బాధ ఉన్నా... దూదిపింజలా ఎగిరిపోతుంది.
- ఏ పనిలో అయితే మీరు విఫలమయ్యారో, ఆ కారణాన్ని కూలంకషంగా పరిశీలించాలి. ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే, సరిదిద్దుకోవచ్చు. అప్పుడే విజయం సాధించగలుగుతారు.
- ఆందోళనా, ఒత్తిడి వంటివి కూడా కుంగిపోయేలా చేస్తాయి. అందుకే వీటికి దూరంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఇష్టమైన పుస్తకం చదవడం, నచ్చిన సినిమా చూడటం లేదా స్నేహితులను కలవడం వంటివి చేస్తుంటే అవి దూరమవుతాయి.
- ప్రతికూల ఆలోచనలను దూరంగా ఉంచి, సానుకూలత పెంచుకోవాలి. ఇందుకోసం శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి. ప్రతీరోజూ వ్యాయామానికి సమయాన్ని కేటాయించుకోవాలి. పోషకాహారాన్ని తీసుకోవాలి. దీంతో నిత్యం ఉల్లాసంగా ఉంటారు. ఆత్మనూన్యత కూడా కొంతవరకూ తగ్గుతుంది. అంతేకాదు, ఒకసారి పని విఫలమైనా తిరిగి ఉత్సాహంగా ప్రయత్నం చేయాలనే ఆలోచన మీదవుతుంది.

వద్దు... వద్దు... వద్దు...
సింధుజ ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ తీసుకుంటానన్నా... చదువుకుంటూనే వ్యాపారం చేస్తానన్నా... ఇంట్లోవాళ్ల నుంచి వచ్చిన సమాధానం ఇదే. కట్‌చేస్తే...
ఇప్పుడామె యంగ్‌ట్రెండ్జ్ పేరుతో రూపొందిస్తున్న దుస్తులు ఆన్‌లైన్లో హాట్‌కేకులే. విద్యార్థిదశలోనే నచ్చిన రంగాన్ని ఎంచుకుంది. అనుకున్నది సాధించింది. చదువు పూర్తయ్యేలోపే వ్యాపారవేత్తగా మారింది. ఆ పై.. కోట్ల రూపాయల టర్నోవరును సాధించింది. ఈ ప్రయాణంలో తాను ఎదుర్కొన్న కష్టాలను వసుంధరతో ప్రత్యేకంగా పంచుకుంది..



ఫ్లిప్‌కార్ట్ మెచ్చింది.. అవార్డు ఇచ్చింది!

'మాది హైదరాబాదే. ఇంటర్ వరకూ ఇక్కడే చదువుకున్నా. అమ్మానాన్నలిద్దరూ బ్యాంకు ఉద్యోగులు. నాకు మొదటినుంచీ ఫ్యాషన్ రంగం అంటే ఇష్టం. దాన్నే కెరీర్‌గా ఎంచుకోవాలనుకున్నా. ఇంటర్ అయ్యాక అదే చెప్తే అమ్మావాళ్ల నుంచి వెంటనే వచ్చిన సమాధానం 'వద్దు' అనే. కారణం మా ఇంట్లో ఇప్పటివరకూ ఫ్యాషన్ రంగంలోకి వెళ్లిన వారు లేకపోవడం.. దాని భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియకపోవడం. ఒప్పించే ప్రయత్నం చేశాకే సరేనన్నారు. వాళ్లు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే ఆలస్యం.. ఫ్యాషన్‌డిజైనింగ్‌పై ఇంకాస్త అవగాహన పెంచుకున్నా. నిఫ్ట్ ప్రవేశ పరీక్ష రాశా. సీటొచ్చింది. అదీ చెన్నైలో. ఉత్సాహంగా వెళ్లిపోయా. రెండేళ్లు ఇట్టే గడిచిపోయాయి. మూడో ఏడాది సెమిస్టర్‌లో భాగంగా నేను డిజైన్ చేసిన రకరకాల టీషర్టులు స్నేహితులకు తెగ నచ్చాయి. దాంతో మా కాలేజీ సహా ఇతర కాలేజీల్లో ఫెస్టివల్స్, మరికొన్ని సందర్భాలకు డిజైన్ చేసి ఇచ్చేదాన్ని. మరో ఏడాది గడిచేసరికి నా డిజైన్లు బాగున్నాయంటూ విద్యార్థుల నుంచి ప్రశంసలు. చదువుతున్నప్పుడే నేను వేసిన పదివేల డిజైన్లు విద్యార్థులకు నచ్చాయి. అప్పుడే ఏదో ఒకటి చేయాలని అనిపించింది.

నా వల్ల కాదన్నారు...

అప్పటివరకూ టీషర్టులపై ఏవో ఒక డిజైన్లు వేసిన నేను నాదైన లోగోతో చేయాలనుకున్నా. ఎప్పటిలానే అమ్మావాళ్లు 'నీకంత అనుభవం లేదు. నీ వల్ల కాదు..అనేశారు. నేను ఎప్పటిలానే ప్రయత్నిస్తేనే కదా.. అనుభవం వస్తుందని ఒప్పించే ప్రయత్నం చేశా. సరే అన్నారు. మేం ప్రాజెక్ట్‌లో భాగంగా తమిళనాడులోని తిరుప్పూరు వెళ్లేవాళ్లం. అక్కడ టీషర్టు తయారీకి ఉపయోగించే వస్త్రం బాగుంటుంది. దాంతోనే ప్రారంభించాలనుకున్నా. కాలేజీల్లో, బయటా ఎవరు ఎలాంటి టీషర్టుల్ని ఉపయోగిస్తున్నారనేది ఎప్పటికప్పుడు గమనించడం మొదలు పెట్టా. ఏడో సెమిస్టర్‌లో ఉన్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా ఈ డిజైన్‌ని మరింతగా విస్తరింపజేయాలనుకున్నా. అలా 'యంగ్ ట్రెండ్జ్' బ్రాండ్ ప్రారంభమైంది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ద్వారా అమ్మకాలు మొదలు పెట్టా. నేను తయారుచేసేది కేవలం టీషర్టులే. అయితే అమ్మాయిలూ, అబ్బాయిల అభిరుచులకు తగినట్లుగా రూపొందిస్తాను.





సలహాలు ఇచ్చేవారు కాదు...

ఆన్‌లైన్ ద్వారా నేనందుకున్న మొట్టమొదటి ఆదాయం నాలుగువందల రూపాయలు. దాంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆ తరువాత రోజుకి పది టీషర్టుల్ని అమ్మేదాన్ని. కొత్తవి డిజైను చేస్తున్నప్పుడల్లా మార్కెట్‌ని పరిశీలించడం, సరసమైన ధర, ట్రెండీ డిజైన్లు ప్రయత్నించడంతో యువతను ఇవి ఎక్కువగా ఆకట్టుకున్నాయి. నా చదువు పూర్తయింది. ఇంట్లో ఎవరికీ ఈ వ్యాపారంపై అవగాహన లేదు. దాంతో నాకు సలహాలిచ్చేవారే లేరు. చేసిన పొరపాట్లు మరోసారి చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటూ యంగ్ ట్రెండ్జ్‌ను అభివృద్ధి చేయడానికి కష్టపడేదాన్ని. నా స్నేహితుడు ప్రవీణ్ ఎన్నో సలహాలిచ్చేవాడు. అతనూ నిఫ్ట్ విద్యార్థి కాబట్టి.. ఒకరి ఆలోచనల్ని మరొకరం పంచుకునేవాళ్లం. ఈ రెండేళ్లలో పది లక్షల రూపాయల్లోపు పెట్టుబడి పెట్టాం. ఖర్చులకు లేకపోతే, ఓ ఉద్యోగంలో చేరాను. కొన్నినెలలు చేశాను. అయితే డిజైనింగ్‌కు సమయం సరిపోయేది కాదు. అందుకే ఉద్యోగం మానేసి , పూర్తిగా దీనిపైనే దృష్టి పెట్టా. చాలా కష్టపడ్డా. పగలూ, రాత్రి నిద్రపోయేదాన్ని కాదు. డిజైన్లపై పరిశోధన చేసేదాన్ని. విద్యార్థులతో మాట్లాడేదాన్ని. వాళ్ల ఆసక్తి తెలుసుకుంటూనే నేనయితే ఫలానా డిజైను కొంటానా లేదా అని ఆలోచించేదాన్ని. నాణ్యమైన వస్త్రం ఉండేలా చూసుకున్నా. ఇవన్నీ నాకు గుర్తింపు తెచ్చాయి. మగవాళ్లకి చేసే టీషర్ట్‌లకి బాగా గిరాకీ ఉండేది. ఇప్పటివరకూ నేను చేసిన వాటిల్లో ఓం డిజైను నాకు బాగా పేరు తెచ్చింది. ఫ్లిప్‌కార్ట్ ద్వారా కిందటి ఏడాది చివరి అమ్మకాల్లో మా బ్రాండ్ మొదటిస్థానంలో నిలిచింది. అయిదు రోజుల్లో పాతికవేల టీషర్టులు అమ్ముడు పోవడమే కాకుండా, ఒకే రోజులో 10వేల ఆర్డర్లు వచ్చాయి. దీంతో ఫ్లిప్‌కార్ట్ గత డిసెంబరులో అత్యధిక అమ్మకం చేసిన బ్రాండ్ వ్యవస్థాపకురాలిగా నాకు అవార్డు కూడా ఇచ్చింది.

మూడువేల డిజైన్లున్నాయి...

ప్రస్తుతం 'యంగ్ ట్రెండ్జ్'కు సంబంధించి మూడువేల డిజైన్ల క్యాటలాగ్ ఆన్‌లైన్లో ఉంది. ఇప్పుడు మరికొన్ని కొత్తవి అందుబాటులోకి తేవాలనుకుంటున్నా. బయోవాష్‌కు అనుగుణంగా ఉండే వస్త్రాన్నే ఎంచుకుంటున్నా. మా టీషర్టుల ధర 400 నుంచి 600 రూపాయల వరకు ఉంటుంది. వీటన్నింటినీ తయారుచేయడానికి ప్రత్యేకంగా యూనిట్ ఉంది. యాభై మందికి పైగా సిబ్బంది ఉన్నారు. ఇందులో అమ్మాయిల సంఖ్యే ఎక్కువ. కేవలం చెన్నై మాత్రమే కాదు.. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, హరియాణా, పశ్చిమ బంగాలోని వేర్‌హౌసుల్లో మా సంస్థ దుస్తులను ఎప్పటికప్పుడు 30వేలకు పైగా నిల్వ ఉండేలా చూసుకుంటాను. ముందు వద్దు అన్న మా అమ్మానాన్నలే ఇప్పుడు నన్ను చూసి గర్వపడుతున్నారు. ప్రస్తుతం రీటైల్‌లో అమ్మకాలను ప్రారంభించాలంటూ పెద్దపెద్ద దుకాణాల నుంచి పిలుపు వస్తోంది. త్వరలో దానిని కూడా ప్రారంభిస్తా. నేను రూపొందించే డిజైన్లు యువత అభిరుచికి అద్దం పట్టేలా ఉండాలనుకుంటా. అందుకే అలాంటివాటికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా.

– సీహెచ్. వసుంధరా దేవి

కాలికి పట్టీలా... చేతికి వంకీలా





చేతులకు అరవంకీలూ, బాజూబంద్‌లూ, కాళ్లకు పట్టీలు.. ఇవన్నీ సంప్రదాయాన్ని రెట్టింపు చేసేవే. మరి... కాస్త ఆధునికంగా తయారైనప్పుడు... ఇవే వేసుకోవాలా అంటే అవసరం లేదు. అలాంటప్పుడు వాటి స్థానాన్ని భర్తీ చేస్తాయా చేతి, కాళ్ల కఫ్‌లు..!!







బంగారం-వెండి

17న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,050	31,170	31,100	30,700
ఆర్నమెంట్	29,060	29,100	28,850	28,500
వెండి (కిలో)	40,100	40,200	40,400	40,200
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,080	30,070	30,790	30,680
ఆర్నమెంట్	28,560	28,400	28,790	28,690
వెండి (కిలో)	40,600	40,000	39,700	39,450
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,990	30,850	-------	-------
ఆర్నమెంట్	28,820	28,690	2,879	2,882 గ్రా
వెండి (కిలో)	40,500	39,900	42.40	42.40 గ్రా

నజరానా

లెదర్ బ్యాగులు పాతబడినట్లు అనిపిస్తే... కొద్దిగా బేబీ ఆయిల్‌తో తుడిచి చూడండి. కొత్తవాటిలా మారతాయి.

గోరింటాకు ఎంతకీ పోవడంలేదా?

గోరింటాకు లేకుండా చాలా వేడుకలు ఊహించలేం. అరచేతిలో ఎర్రగా పండే అందమైన డిజైన్లు చూడ్డానికి రెండుకళ్లూ చాలవు. అయితే కొన్ని రోజులయ్యాక ఈ రంగు క్రమంగా పోయి.. పెచ్చులు అతుక్కున్నట్లుగా కనిపిస్తుంది. అలాంటప్పుడు ఆ రంగును తొలగించాలంటే ఏం చేయాలో చూడండి.

నిమ్మరసం: ఇది సహజ బ్లీచ్‌లా పనిచేస్తుంది. నిమ్మరసాన్ని చేతులూ, కాళ్లపై రాసుకోవాలి. అదయ్యాక కొన్ని నిమిషాలపాటు నిమ్మతొక్కతో బాగా రుద్దాలి. ఆ తరువాత గోరువెచ్చటి నీటితో కడిగేస్తే సరి. అలాగే అర బకెట్ గోరువెచ్చటి నీళ్లలో అయిదారు చెంచాల నిమ్మరసం వేసి చేతులూ, కాళ్లను అందులో కాసేపు పెడితే చాలు. ఇలా రోజులో రెండుసార్లు చేస్తే మీ గోరింటాకు నెమ్మదిగా పోతుంది.



టూత్‌పేస్ట్: దీంతోనూ గోరింటాకును తొలగించొచ్చు. మొదట అరచేతులకు టూత్‌పేస్ట్ రాసి ఆరనివ్వాలి. ఆ తరువాత బాగా రుద్ది కాటన్ వస్త్రంతో తుడిచేయాలి. చివరగా గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. ఇలా చేసిన తరువాత మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి. రోజువిడిచి రోజు ఇలా చేస్తే కొంత ఫలితం కనిపిస్తుంది.

హ్యాండ్ వాష్: యాంటీ బ్యాక్టీరియల్ వాష్‌తో రోజులో మూడునాలుగుసార్లు చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల మీ చేతికి ఉండే గోరింటాకు నెమ్మదిగా పోతుంది. అయితే దీనివల్ల చేతులు పొడిబారొచ్చు. అందుకే శుభ్రం చేసుకున్న వెంటనే మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

ఉప్పు: అర టబ్బు గోరువెచ్చటి నీటిలో అరకప్పు ఉప్పు వేయాలి. ఇందులో మీ చేతుల్ని ముంచి పదినిమిషాలయ్యాక తీసేయాలి. ఇలా రోజు విడిచి రోజు చేయాలి.

పిల్లలకు మాటలు రావా... మేం నేర్పిస్తాం!

ఆమె ఒకప్పుడు సాధారణ గృహిణి. కానీ వినికిడిలోపంతో పుట్టిన పాపలో మార్పు తెచ్చేందుకు శిక్షకురాలిగా మారింది. ఆ విజయం ఆమెలో ఆత్మవిశ్వాసం పెంచింది. ఇప్పుడామె మరెందరో అలాంటి పిల్లల్నీ మార్చే ప్రయత్నం చేస్తోంది. కర్నూలుజిల్లా నంద్యాలకు చెందిన రేణుకాదేవి విజయగాథ ఇది.





పెళ్లై, పాప పుట్టేవరకూ రేణుక సాధారణ గృహిణే. పాప లక్ష్మీలిఖితకు మూడేళ్లు వచ్చాక గానీ వినికిడి లోపం ఉన్నట్లు గుర్తించలేకపోయారా దంపతులు. వైద్యులకు చూపిస్తే సమస్యను నిర్ధరించి ఇంకా ఆలస్యం చేస్తే మాటలు రావని చెప్పారు. దాంతో ఆసుపత్రుల చుట్టూ తిరిగింది. చివరకు హైదరాబాద్‌లో చూపిస్తే వినికిడి లోపం వందశాతం ఉందని చెప్పారు. వాళ్ల సూచనలతో అక్కడే పని చేస్తోన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హియరింగ్ హ్యాండీకాప్స్ (ఎన్ఐహెచ్‌హెచ్)ని సంప్రదిస్తే కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్స చేయించాలని సలహా ఇచ్చారు. కానీ దాని ఖర్చు ఏడున్నర లక్షల రూపాయలు. ఆ స్థోమత లేక వినికిడి యంత్రం, స్పీచ్ థెరపీతో సరిపెట్టేశారు. ఆ తరువాత..

అవార్డులు వచ్చాయి...

'కేవలం మా అమ్మాయి వైద్యం కోసమే రెండేళ్లపాటు హైదరాబాద్‌లో విడిగా ఉన్నా. బీఏ చదివిన నేను ఆ రెండేళ్లలో ఎఫ్‌సీహెచ్ఐ (ఫౌండేషన్ కోర్సు ఫర్ హియరింగ్ ఇంపెయిర్డ్) ఆరునెలల కోర్సు పూర్తిచేశా. మా అమ్మాయి సొంతంగా రాసేలా, చదివేలా చేశా. వైద్యుల సలహాతో కూచిపూడీ నేర్పించా. నా హావభావాలతో నృత్యం నేర్చుకోగలిగింది. ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. బహుమతులు వచ్చాయి. బాలరత్న పురస్కారాన్నీ అందుకుంది. కోర్సయ్యాక సాధారణ బడిలోనే చేర్పించాం. నేనూ, మా వారు స్పెషల్ ఎడ్యుకేషన్ ఫర్ డిజేబుల్డ్ చిల్డ్రన్ అంశంగా బీఈడీ పూర్తిచేశాం. అదయ్యాక పాపకు కాక్లియర్ శస్త్రచికిత్స చేయించాం. అలా చేయించుకున్న వారితో తప్పనిసరిగా తల్లి ఓ ఏడాది వెంట ఉండి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. దానికీ వెళ్లా. ఇప్పుడు మా పాప పది, ఇంటరు పూర్తి చేయడమే కాదు, ఎంసెట్ రాసి బీటెక్ మూడో ఏడాది చదువుతోంది' అని చెబుతుంది రేణుకాదేవి.

బడి ఏర్పాటు...

తమలా మరే తల్లిదండ్రులూ బాధపడకూడదని అలాంటి పిల్లల కోసం ఏడేళ్ల క్రితం ప్రత్యేకంగా చైతన్య ప్రీస్కూల్‌ని ఏర్పాటు చేసింది రేణుకాదేవి. వినికిడి లోపం ఉన్న పిల్లలకు రెండేళ్లపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారక్కడ. మార్పు వచ్చిన పిల్లలు తరువాత సాధారణ బడికి వెళ్లొచ్చు. ఇప్పటివరకూ 35 మంది పిల్లల్లో మార్పు తెచ్చారు. 'ఇలాంటి పిల్లలకు దాతల సాయంతో వినికిడి యంత్రాలు కొనిస్తున్నాం. మా వారు పినాకపాణి సహకారం వల్లే ఇదంతా చేయగలిగానేమో. ఇకపైనా వీలైనంతమందికి ఉచితంగా శిక్షణ ఇవ్వాలన్నదే నా ఆలోచన..' అని వివరిస్తుంది రేణుక.

- గడ్డం శ్రీనివాస్ గౌడ్, కర్నూలు డెస్కు.

ఆసనాన్ని బట్టీ.. మ్యాట్!

రంగూ, డిజైను చూసి యోగామ్యాట్ కొంటున్నారా... వాటితో పాటే మరికొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా దాన్ని ఎంచుకునేముందు ఈ నాలుగు విషయాలను గుర్తుంచుకోవాలి.



- సాధారణంగా పీవీసీ, రబ్బరు, జనపనార, ఫోమ్‌తో చేసిన మ్యాట్లు ఎక్కువగా దొరుకుతాయి. మన శరీరతత్వం, బరువూ, యోగా రకాన్ని బట్టి వీటిని ఎంచుకోవాలి. కొంతమందికి ఆసనాలు వేసేటప్పుడు ఎక్కువగా చెమట పడుతుంది. అలాంటి వాళ్లు ప్లాస్టిక్ రకాలను ఎంచుకుంటే పట్టు ఉండదు. అందుకే కాస్త గరుకుగా ఉండే రకాన్ని ఎంచుకోవాలి.
- యోగా మ్యాట్‌లు సాధారణంగా మూడు రకాల మందంతో ఉంటాయి. కాస్త పల్చగా, మందంగా లేదా మరీ మందంగా ఉంటాయి. బాగా మందంగా ఉన్నవాటిని చుట్టి తీసుకెళ్లడం కష్టమే. కాబట్టి కాస్త మందంగా ఉన్నదాన్ని కొనుక్కోవడం మంచిది. ఇంట్లోనే ఆసనాలు వేసేవారయితే కాస్త పల్చగా ఉన్నది ఎంచుకున్నా మంచిదే. అయితే శీర్షాసనం లాంటివి వేస్తుంటే బాగా మందంగా ఉన్నవి ఎంచుకోవడమే మంచిది.
- ఆసనాలు వేస్తున్నప్పుడు మన చేతులకు కాస్త పట్టు అవసరం. అలా కాకుండా జారిపోయే గుణం ఉన్న మ్యాట్ అయితే ఆసనాలు వేయడం కష్టమవుతుంది. అందుకే ఫోమ్, జ్యూట్, రబ్బరు, కాటన్ మ్యాట్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- పవర్‌యోగా చేస్తుంటే శరీరాన్ని ఎక్కువగా సాగదీయాల్సి ఉంటుంది. కాబట్టి పట్టు కోసం కాస్త గరుకు రకాలను వాడాలి. కాస్త సులభతరమైన ఆసనాలు చేస్తుంటే పీవీసీ, ఫోమ్ రకాలను ఎంపిక చేసుకున్నా చాలు.
- మనకు తెలీకుండానే లేత రంగులు, చిన్న చిన్న డిజైన్లున్న మ్యాట్‌లు మన మనసుమీద ప్రభావం చూపుతాయట. అది మనం యోగా చేసే తీరును మెరుగుపరుస్తుంది కూడా. కాబట్టి మనకు ఇష్టమైన రంగూ, డిజైను ఉన్నదాన్ని కొనుక్కోవడమే మంచిది.
- రకం ఏదయినా ఎప్పటికప్పుడు దాన్ని తుడిచి, కాసేపు ఎండలో ఉంచితే సరిపోతుంది. క్రిములు పోతాయి.



ఒకప్పుడు భారీ, మధ్యతరహా వ్యాపార పరిశ్రమలు, సంస్థలు మాత్రమే కామర్స్, అకౌంటింగ్ నిపుణుల సేవలు ఉపయోగించుకునేవి. కానీ ఇటీవలి ఆర్థిక సంస్కరణల ప్రభావంతో చిన్న వ్యాపార సంస్థలు, పరిశ్రమల్లోనూ ఈ నిపుణుల సేవలు అవసరమవుతున్నాయి. ఈ పరిణామాలు సీఏ/ సీఎంఏ వంటి కామర్స్ కోర్సులపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కామర్స్ కోర్సులపై ఉన్న అపోహలూ, వాస్తవాలూ తెలుసుకుందాం!

కొలువుల కోర్స్ కామర్స్!



» ఈ కోర్సులు చాలా కష్టంగా ఉంటాయంటారు. ఇదెంత వరకూ వాస్తవం?

జ: చాలామంది సీఏ/ సీఎంఏ చాలా కష్టమనీ, అందుకే ఎక్కువమంది చదవలేకపోతున్నారనీ అపోహ పడుతుంటారు. నిర్దిష్ట ప్రణాళిక, మంచి మార్గదర్శకత్వం, లక్ష్యాన్ని సాధించాలనే తపన ఉంటే ఎలాంటివారైనా ఈ కోర్సులు చదవొచ్చు. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించవచ్చు. ఈ కోర్సుల్లో అర్హత మార్కులు సాధిస్తే చాలు. ర్యాంకుల అవసరం ఉండదు. పది, ఇంటర్ వరకు సాధారణంగా చదివి సీఏ/ సీఎంఏలను మొదటి ప్రయత్నంలోనే పూర్తిచేయడమే కాకుండా అఖిల భారత స్థాయి ర్యాంకులు కూడా సాధించినవారు ఇటీవలి కాలంలో చాలామంది ఉన్నారు.

» విదేశాల్లో ఉపాధి ఎలా ఉంది?

జ: సీఏ పూర్తిచేసినవారికి ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధి దొరుకుతుంది. అమెరికా, ఆస్ట్రేలియా, ప్రత్యేకించి గల్ఫ్ దేశాల్లో భారత సీఏలకు అత్యుత్తమ ఉద్యోగ అవకాశాలున్నాయి.

» తెలుగు రాష్ట్రాల్లో ఎంతమంది ఈ కోర్సులు చదువుతున్నారు?

జ: దక్షిణ భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో కామర్స్ విద్యార్థులున్న రాష్ట్రాలు- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సీఏ చదువుతున్నవారు లక్ష మంది వరకూ ఉంటారని అంచనా. ఎంఈసీ, బీకాం వంటి ఇతర కామర్స్ విద్యార్థులు మరో లక్షమంది ఉండవచ్చు.



MSN మోహన్
మాస్టర్‌మైండ్స్

» ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయా?

జ: సీఏ/ సీఎంఏ, ఇతర కోర్సులు చదివినవారికి ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమలు, ఆడిట్ శాఖలు, ప్రభుత్వానికి చెందిన బ్యాంకులు, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖలు, ప్రణాళిక సంఘాలు, తయారీ రంగాల్లోనూ ఉపాధి దొరుకుతుంది. బీపీసీఎల్, ఎన్‌టీపీసీ, స్టీల్‌ప్లాంట్, ఓఎన్‌జీసీ, బీహెచ్‌ఈఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లోనూ విస్తృత అవకాశాలున్నాయి.

» సీఏ/ సీఎంఏ పూర్తిచేయడానికి చాలాకాలం పడుతుందా?

జ: ఈ కోర్సులు చదవడానికి చాలాకాలం పడుతుందనేది అపోహ మాత్రమే. పదోతరగతి/ ఇంటర్ తరువాత సీఏ/సీఎంఏ కోర్సుల్లోకి ప్రవేశించే వీలును ఆయా సంస్థలు కల్పించాయి. ప్రత్యేకించి కామర్స్ కోర్సులకు మాత్రమే శిక్షణ ఇచ్చే సంస్థలు ఇప్పుడు చాలా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో సీఏ/ సీఎంఏ పూర్తిచేయడానికి పదోతరగతి తరువాత సుమారు ఆరు సంవత్సరాలు, ఇంటర్ తరువాత నాలుగున్నర సంవత్సరాలు పడుతుంది. సీఏ పరీక్షలు ఏటా రెండుసార్లు జరుగుతాయి కాబట్టి ఒక పరీక్షలో విఫలమైనా మరో ఆరు నెలల్లో ఆ పరీక్ష రాయవచ్చు. అంటే రెండుసార్లు ఫెయిలైనా కూడా సీఏ కోర్సును అయిదున్నర ఏళ్ళలోనే పూర్తిచేసుకోవచ్చు.

» ఈ కోర్సులతోపాటు ఇతర కోర్సులు చదవవచ్చా?

జ: సీఏ అనేది దూరవిద్యా విధానం కాబట్టి సీఏతోపాటు రెగ్యులర్ విధానంలో బీకాం కూడా సమాంతరంగా చదవవచ్చు. సీఏ చదివేవారిలో చాలామంది సీఎంఏ/ సీఎస్/ బీకాం/బీఎంలను సమాంతరంగా చదువుతుంటారు. ఒకవేళ సీఏ/ సీఎంఏలను మధ్యలో ఆపేసినప్పటికీ ఇబ్బంది ఉండదు. సమాంతరంగా చదివే డిగ్రీ పూర్తిచేసి ఎంబీఏ, ఎంకాం వంటి పీజీ కోర్సులు చేసి ఉద్యోగంలో స్థిరపడవచ్చు.

సీఏతోపాటుగా సీఎంఏ లేదా డిగ్రీ కోర్సులు చదవడం మంచిది. వీటిలో ఉండే సిలబస్ దాదాపు ఒకేలా ఉంటుంది. ప్రత్యేకించి శ్రమించాల్సిన అవసరం లేదు. సీఏకు సిద్ధమవుతున్నపుడు ఎలాంటి సన్నద్ధత లేకుండానే సీఎంఏ, బీకాం పరీక్షలు రాయవచ్చు.

» ఉత్తీర్ణతా శాతం తక్కువగా ఉంటుందంటున్నారు నిజమేనా?

జ: సీఏ/ సీఎంఏ కోర్సుల్లో ఉత్తీర్ణతా శాతం మిగతా కోర్సుల్లోలాగే ఉంటుంది. చాలామంది ఈ కోర్సుల్లో 1 లేదా 2 మాత్రమే ఉత్తీర్ణతా శాతం ఉంటుందని భావిస్తుంటారు. కానీ అది అవాస్తవం. దీనికి నిదర్శనం ఫలితాల్లో నమోదైన ఉత్తీర్ణతా శాతమే.

సీఏ: జులై 2017లో ప్రకటించిన సీఏ-సీపీటీ (సీఏ కోర్సులోని మొదటి దశ) ఫలితాల్లో 40.52%, అలాగే సీఏ ఫైనల్‌లో (సీఏ కోర్సులోని చివరి దశ) గ్రూప్-1లో 13.82%, గ్రూప్-2లో 16.2%, రెండు గ్రూపులు ఒకేసారి రాసి ఏదో ఒక గ్రూపులో ఉత్తీర్ణత పొందినవారు 22.98% ఉన్నారు. ఫిబ్రవరి 2017లో ప్రకటించిన సీఏ ఐపీసీసీ (సీఏ కోర్సులోని రెండో దశ) ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం గ్రూప్-1లో 19.27%, గ్రూప్-2 లో 30.10%, రెండు గ్రూపుల్లో కలిపి 32.53%గా నమోదయ్యాయి.



సీఎంఏ: ఆగస్టు 2017 ఫలితాల్లో సీఎంఏ ఇంటర్‌లో 32%, సీఎంఏ ఫైనల్‌లో 25% వరకూ ఉత్తీర్ణతా శాతం నమోదైంది. దీన్ని బట్టే కామర్స్ కోర్సుల్లో ఉత్తీర్ణతా శాతం తక్కువ కాదని అర్థం చేసుకోవచ్చు.

సీఏ/ సీఎంఏ కోర్సుల్లో పరీక్షలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహిస్తారు. సంవత్సరంలో రెండుసార్లుగా జరిగే పరీక్షల ఉత్తీర్ణతా శాతాన్ని కలిపిచూస్తే ఇంతకన్నా మెరుగ్గానే ఉంటుంది. ఒక విద్యార్థికి పరీక్షలో వ్యతిరేక ఫలితాలు వస్తే వెంటనే మరో ఆరు నెలల్లో మళ్లీ పరీక్షరాసి ఉత్తీర్ణత సాధించవచ్చు. సీఏ/ సీఎంఏ కోర్సుల్లోని వివిధ దశల్లోని రెండు గ్రూపులు ఒకేసారి చదివి ఉత్తీర్ణత సాధించలేనివారు ఒక్కో గ్రూపు కూడా చదువుకునే వీలుంది.

» ఉద్యోగావకాశాల పరిధి పరిమితులున్నాయా?

జ: సీఏ/ సీఎంఏ చదివినవారికి ఒకప్పటితో పోలిస్తే అవకాశాలు నాలుగింతలు పెరిగాయని చెప్పవచ్చు. బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, వాణిజ్య పన్నులు, తయారీ సంస్థలు, ఆడిట్ సంస్థలు ఇలా అన్ని రంగాల్లో అవకాశాలున్నాయి. నోట్లరద్దు, జీఎస్‌టీ వంటి నూతన సంస్కరణలతో కామర్స్ ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు విస్తృతమయ్యాయి. చాలా కంపెనీలూ, వ్యాపార సముదాయాల్లో అకౌంటెంట్ల కొరత విపరీతంగా ఉంది. సాధారణ అకౌంటెంట్లకే ఇంత గిరాకీ ఉంటే సీఏ, సీఎంఏలకు ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటన ప్రకారం కేంద్ర ప్రభుత్వం త్వరలో నూతన ఆదాయపు పన్ను చట్టాన్ని తీసుకురానుంది. దీనివల్ల కూడా సీఏలకు ఉద్యోగావకాశాలు పెరగనున్నాయి. సీఏ/ సీఎంఏ పూర్తి చేసినవారు ఉద్యోగాలకు వెళ్లకపోయినా, అసలు ఉద్యోగమే రాలేదనుకున్నా వారే సొంతంగా ప్రాక్టీసు మొదలుపెట్టుకొని రాణించవచ్చు. సీఏ పూర్తిచేసినవారు బ్యాంకు ఆడిట్ల రూపంలోనూ డబ్బు సంపాదించే అవకాశముంది.

Buying a lemon అంటే ఏమిటో..!

చౌక వస్తువులు కొనే అలవాటు కొందరికి ఉంటుంది. సాధారణంగా అవి లోపాలతో ఉండి, సరిగా పని చేయకుండా సతాయిస్తుంటాయి. ఇలా లోపాలతో ఉన్నదాన్ని కొనడం గురించి ఇంగ్లిష్‌లో ఆసక్తికరమైన వ్యక్తీకరణ ఉంది. అదేమిటో తెలుసుకుందామా?

PHRASAL VERBS

1. Buying a lemon – the original form: to buy a lemon = buy something defective (లోపాలతో ఉన్నదాన్ని కొనడం).

a) **Sagar:** The TV he bought is not functioning well. He has been cheated (వాడు కొన్న టీవీ సరిగా పనిచేయడం లేదు. వాడు మోసపోయాడు).

Dayakar: He always goes for cheap things. In the process he often buys lemon (వాడెప్పుడూ చవక వస్తువులను కొంటాడు. అలా చేసే క్రమంలో ఎక్కువగా లోపాలతో ఉన్న వాటినే కొంటాడు).



ఎం. సురేశన్

b) **Sukumar:** Prabhakar is very good at buying the right thing. He never gets cheated (సరైన వస్తువును కొనడంలో ప్రభాకర్ చాలా గట్టి. ఎప్పుడూ మోసపోడు).

Venkat: That is true. He never buys a lemon. Unless he studies a thing, he does not buy it (అది నిజం. అతనెప్పుడూ లోపాలున్న వస్తువులను కొనడు. అతను ఒక వస్తువును బాగా పరీక్షిస్తేగానీ కొనడు).

2. To get back at somebody = to take revenge on somebody (ఒకరిమీద పగ తీర్చుకోవడం).

a) **Sudheer:** Santharam, much against his name is very vengeful. He does not rest until he takes revenge against those that cheat him (శాంతారాంది వాడి పేరుకు వ్యతిరేకంగా చాలా కక్ష సాధింపు స్వభావం. వాడిని మోసం చేసినవాడి మీద కక్ష సాధించనిదే ఊరుకోడు).

Sethuram: That is true. He does not rest until he gets back at the person who does harm to him (అది నిజమే. వాడికి కీడు చేసినవాడు ఎవరైనా ఉంటే, పగ సాధించేదాకా విశ్రాంతి పొందడు).

b) **Ganesh:** Vinai is often generous. He very often excuses people who cheat him (వినయ్ చాలా ఉదారుడు. తనను మోసం చేసిన వారెవరినైనా క్షమించేస్తాడు).

Mani: That is true. He does not bother about getting back at somebody, who cheats or harms him (అది నిజమే. తనను మోసం చేసే ఇతరులమీద పగ తీర్చుకోవడం గురించి పెద్దగా పట్టించుకోడు).



3. To play something down = To make something appear less important (ఏదైనా పెద్ద విషయాన్ని తక్కువ చేసి మాట్లాడటం).

a) **Priya:** Why does Latha make the affair appear less important than it is? (ఆ విషయానికి అంత తక్కువ ప్రాముఖ్యం ఇచ్చి మాట్లాడుతుందేమిటి లత?)

Prathibha: She is always like that. She does not care what happens to her. She plays down everything (తనెప్పుడూ అంతే. తనకేం జరుగుతోందో పెద్దగా పట్టించుకోదు. దేనైనా చిన్న విషయంగానే చూస్తుంది).

b) **Abhimanyu:** Srisanth makes mountains of a mole hill, even if the issue is not important (శ్రీశాంత్ ప్రతి చిన్న విషయాన్ని ఎక్కువ చేసి మాట్లాడుతాడు, దానికంత ప్రాముఖ్యం లేకపోయినా).

Sahadev: He is always like that. He always plays down even very important issues (అతనెప్పుడూ అంతే. ముఖ్యమైన విషయాన్ని కూడా తక్కువ చేసి మాట్లాడతాడు).

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్ఎండీసీ

హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దేశవ్యాప్తంగా వివిధ యూనిట్లు, ప్రాజెక్టులు, ఆఫీసుల్లోని ఖాళీల భర్తీకి ప్రకటనలు విడుదల చేసింది.
పోస్టు: మెయింటెనెన్స్ అసిస్టెంట్ ట్రైనీ, జూనియర్ ఆఫీసర్ ట్రైనీ, ఎగ్జిక్యూటివ్ క్యాడర్ తదితర పోస్టులు **ఖాళీలు:** 256
అర్హత: పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా తదితరాలు.
ఎంపిక: రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్/ జాబ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేది: ప్రకటన అనుసరించి
వెబ్‌సైట్: https://www.nmdc.co.in/

ఇస్రో - నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్

హైదరాబాద్‌లోని ఇస్రోకి చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: సైంటిస్ట్/ ఇంజినీర్, సైంటిఫిక్ అసిస్టెంట్. **ఖాళీలు:** 38
అర్హత: బీఎస్సీ/ ఎంఎస్సీ/ ఎంఈ/ ఎంటెక్/ పీహెచ్‌డీ.
దరఖాస్తు: ఆన్‌లైన్.
చివరితేది: 05.02.2018.
వెబ్‌సైట్: https://nrsc.gov.in/

హెచ్‌పీసీఎల్, ముంబయి

పోస్టులు: ఇంజినీర్ (ఆఫీసర్). **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్, సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్. **అర్హత:** 60 శాతం మార్కులతో ఇంజినీరింగ్ డిగ్రీ/ గేట్ స్కోరు. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 12.02.2018.
వెబ్‌సైట్: http://hindustanpetroleum.com/

ప్రవేశాలు

టాటా మెమోరియల్ సెంటర్

ముంబయిలోని టాటా మెమోరియల్ సెంటర్ - అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్ పీహెచ్‌డీ ప్రోగ్రాములో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు: పీహెచ్‌డీ ప్రోగ్రామ్ - జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్
విభాగాలు: లైఫ్ సైన్సెస్. **అర్హత:** మాస్టర్స్ డిగ్రీ. **దరఖాస్తు:** ఆన్‌లైన్.
చివరితేది: 20.04.2018 **వెబ్‌సైట్:** http://www.actrec.gov.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

అకడమిక్స్.. అనుభవం.. స్కోరు!

జాతీయస్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే క్యాట్ ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. ఈ స్కోరును అన్ని ఐఐఎంలు ఆధారంగా తీసుకుంటున్నప్పటికీ అవి అనుసరించే ప్రవేశ ప్రక్రియలు వేర్వేరుగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆ సంస్థలు నిర్దేశించుకున్న వెయిటేజీలు, ఇతర ప్రాతిపదికల వివరాలపై ర్యాంకర్లకు అవగాహన ఉండాలి. ఈ విధానాల్లో ఏటా కొద్దిపాటి మార్పులు జరుగుతుంటాయి.

దేశంలోని 20 ఐఐఎంలలో ఆరు సంస్థలను 'పాతవి'గా (ఐఐఎం- అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా, లఖ్‌నవూ, ఇండోర్, కోజికోడ్) పరిగణిస్తారు. ఐఐఎం-షిల్లాంగ్ 2008లో స్థాపితమైంది. దీంతోపాటు కాశీపూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, తిరుచ్చి, ఉదయ్‌పూర్‌లను కొత్తవిగా లెక్కిస్తారు. 2015-16లో మరో 7 ఐఐఎం (అమృత్‌సర్, బోధ్‌గయా, జమ్మూ, నాగ్‌పూర్, సంబల్‌పూర్, సిర్‌మవర్, విశాఖపట్నం)లను స్థాపించారు. 2018-20 విద్యాసంవత్సరం ప్రవేశాలను బట్టి.. ఇంటర్వ్యూ షార్ట్‌లిస్టు, తుది ఎంపికల్లో క్యాట్ వెయిటేజీ ఎలా ఉందో పరిశీలిద్దాం.

9 ఐఐఎంలు (షిల్లాంగ్, కాశీపూర్, రోహ్‌తక్, రాంచీ, రాయ్‌పూర్, ఉదయ్‌పూర్, బోధ్‌గయా, అమృత్‌సర్, సంబల్‌పూర్) ఇంటర్వ్యూ షార్ట్‌లిస్టులో 100% వెయిటేజిని క్యాట్ స్కోరుకు ఇస్తాయి.

2 ఐఐఎంలు(కోల్‌కతా, లఖ్‌నవూ)క్యాట్ స్కోరుకు 50% నుంచి 55% వెయిటేజిని ఇస్తాయి.



రామ్‌నాథ్ కనకదండి
కోర్స్ డైరెక్టర్, T.I.M.E

అయితే ఐఐఎం- బెంగళూరు, ఇండోర్, నాగ్‌పూర్, విశాఖపట్నం మాత్రం క్యాట్ స్కోరు కంటే అకడమిక్స్‌కూ, పని అనుభవానికీ ఎక్కువ వెయిటేజిని ఇస్తాయి. ఇదంతా పరిశీలిస్తే తెలిసేది ఏమిటంటే- 17 ఐఐఎంలలో 11 క్యాట్‌కు 70+ శాతం వెయిటేజి ఇస్తుండగా వాటిలో 9 ఐఐఎంలు క్యాట్ స్కోరును మాత్రమే సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకుని, ఇంటర్వ్యూ ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ చేస్తున్నాయి. అంటే- వాస్తవానికి ఎన్నో ఐఐఎంలలో క్యాట్ ప్రాధాన్యం పెరిగిందని కచ్చితంగా చెప్పవచ్చు.

కానీ, క్యాట్‌లో మంచి స్కోరు వచ్చి కూడా ఐఐఎంల నుంచి పిలుపురాని విద్యార్థుల అనుభవాలు కొన్ని అలాంటి అపోహలకు దారితీశాయి. ఓవరాల్ పర్సంటైల్ అత్యధికంగా వచ్చినా, సెక్షనల్ కటాఫ్‌లో విఫలం కాకూడదని లేదు. క్యాట్ స్కోరు- ఓవరాల్, సెక్షనల్, అకడమిక్ ప్రతిభ, వర్క్ అనుభవం, రిజర్వేషన్ కేటగిరీ.. ఇవన్నీ కలిసి సీటును ఖరారు చేస్తాయి. పైగా వివిధ ఐఐఎంలకు వివిధ సెలక్షన్ ప్రాతిపదికలుంటాయి. సారాంశం చెప్పాలంటే-



క్యాట్ అడ్మిషన్స్

నిర్దిష్టమైన కొన్ని ఐఐఎంలలో చేరాలంటే మంచి అకడమిక్స్/ వర్క్ అనుభవం లేకుండా సాధ్యం కాదు. కానీ చాలా ఐఐఎంలలో సీటు రావాలంటే గొప్ప అకడమిక్స్/ వర్క్ అనుభవం లేకపోయినా క్యాట్ స్కోరు అధికంగా ఉంటే సరిపోతుంది (జనరల్ కేటగిరీ 95-96 పర్సంటైల్; నాన్ ఇంజినీరింగ్ దీనికంటే తక్కువ).

» కనీస అకడమిక్ అర్హత

ఐఐఎంలలో ప్రవేశానికి సంబంధించి మరో అదనపు ప్రాతిపదిక- 'మినిమం అకడమిక్ ఎలిజిబిలిటీ'. చాలా ఐఐఎంలు అభ్యర్థికి గ్రాడ్యుయేషన్లో కనీసం 50% మార్కులు ఆశిస్తున్నాయి. కొన్ని అయితే ఇంకా ఎక్కువశాతం ఉండాలని నిర్దేశిస్తున్నాయి. కొన్ని ఐఐఎంలు అభ్యర్థి టెన్త్, ఇంటర్మీడియట్ మార్కులను కూడా గమనించి ప్రవేశార్హతను నిర్ణయిస్తున్నాయి. ఉదాహరణకు- ఐఐఎం- షిల్లాంగ్ టెన్త్, ఇంటర్‌ల్లో 80%, ఐఐఎం- కోజికోడ్ 60% మార్కులు జనరల్ కేటగిరీ అభ్యర్థులకు ఉండాలని నిర్దేశించుకున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మాత్రం మార్కులు తెచ్చుకోవడం సాధారణమైపోయింది కదా!

అకడమిక్స్+వర్క్ అనుభవం వెయిటేజీ

షిల్లాంగ్ ఐఐఎం	0%
కోల్‌కతా, కోజికోడ్, అమృత్‌సర్, బోధ్‌గయ ఐఐఎంలు	5-8%
అహ్మదాబాద్, లఖ్‌నవూ, కాశీపూర్, ఉదయ్‌పూర్, సంబల్‌పూర్ ఐఐఎంలు	10-15%
ఇండోర్, రాంచీ, రాయ్‌పూర్ ఐఐఎంలు-	20-26%
బెంగళూరు, రోహ్‌తక్, విశాఖపట్నం ఐఐఎంలు	35%
నాగ్‌పూర్ ఐఐఎం	40%

విద్యార్థి ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ అయితే అతడి తుది ఎంపికను ప్రభావితం చేసేవి- క్యాట్ స్కోరు, గ్రూప్ డిస్కషన్/ ఎస్సే/ పర్సనల్ ఇంటర్వ్యూ ప్రదర్శన. ఇవన్నీ సన్నద్ధతతో మెరుగుపరచుకోగలిగినవే.

ఇప్పుడేం చేయాలి?

'క్యాట్' తరువాతి దశలు- గ్రూప్ డిస్కషన్/ రిటన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనాలిటీ టెస్ట్.. వీటన్నింటిలో ప్రతిభ చూపితేనే ఆశించిన విద్యాసంస్థలో ప్రవేశం దక్కేది. బీ స్కూళ్ల నుంచి సమాచారం అందుకున్న క్యాట్ అభ్యర్థులు తరువాతి దశలకు సంసిద్ధం కావాలి. అకడమిక్స్, వర్క్ అనుభవం కంటే ఈ దశల్లో చూపే ప్రతిభకే వెయిటేజీ అధికమని గ్రహించాలి.

ఇంటర్వ్యూలో జనరల్ అవేర్‌నెస్, వర్క్ అనుభవం (ఉంటే)పై గ్రాడ్యుయేషన్ సబ్జెక్టులపై ప్రశ్నలుంటాయి. అభ్యర్థి ఇంకా తన బలాలూ, బలహీనతలూ, కెరియర్ లక్ష్యం, విజయాలు, హాబీలపై స్వీయ విశ్లేషణ చేసుకోవటం ముఖ్యం.